www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శుక్రవారం | 20-6-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 65 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, బహుళ పక్షం తిథి: నవమి ఉ.9.50 తదుపరి దశమి, నక్షత్రం: రేవతి రా.9.45 తదుపరి అశ్విని, వర్జ్యం: ఉ.10.31-12.00, దుర్ముహూర్తం: ఉ.8.21-9.14, మ.12.42-1.35, అమృతఘడియలు: రా.7.30-9.00, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 5.45, సూర్యాస్తమయం: 6.48 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అపూర్వ యోగా సంగమం
యోగాతో జీవన విధానం-ఆరోగ్యకర ఆనందానికి సాధనం

రూ.14,000 కోట్లతో హైదరాబాద్ విమానాశ్రయం విస్తరణ!

కొత్తగా మరో టెర్మినల్, రన్‌వే ఏర్పాటు
2029 సెప్టెంబరు నాటికి విస్తరణ పూర్తి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్, శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని (ఆర్‌జీఐఏ) పెద్దఎత్తున విస్తరించాలని ఎయిర్‌పోర్టు నిర్వహణ సంస్థ జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీహెచ్ఐఏఎల్) భావిస్తోంది. ఇందుకోసం వచ్చే మూడేళ్ల కాలంలో దాదాపు రూ.14,000 కోట్లు ఖర్చు చేయనున్నట్లు జీహెచ్ఐఏఎల్ ఒక అంతర్గత డాక్యుమెంట్‌లో పేర్కొంది. ఈ విస్తరణలో భాగంగా ప్రస్తుత టెర్మినల్‌ను విస్తరించటంతో పాటు కొత్తగా మరో టెర్మినల్‌ను రన్‌వేను అభివృద్ధి చేయాలని యోచిస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27)లో ఈ పనులు ప్రారంభించి 2029 సెప్టెంబరు నాటికి ఈ విస్తరణ పనులు పూర్తి చేయాలని జీహెచ్ఐఏఎల్ భావిస్తోంది.

ఎందుకంటే?

ఏటా 3.4 కోట్ల మంది ప్రయాణికులు, గంటకు 42 విమానాలు రాకపోకలు సాగించేందుకు వీలుగా జీఎంఆర్ గ్రూప్ శంషాబాద్ ఎయిర్‌పోర్టును నిర్మించింది. 2017-18లో 1.83 కోట్లుగా ఉన్న ప్రయాణికుల సంఖ్య ఏటా 7.1 శాతం వృద్ధి రేటుతో గత ఆర్థిక సంవత్సరం 2.95 కోట్లకు చేరింది. రాకపోకలు సాగించే విమానాల సంఖ్యా గంటకు 36కు చేరింది. అంటే ఎయిర్‌పోర్టు త్వరలోనే గరిష్ఠ సామర్థ్యానికి చేరువవుతోంది. దీంతో వెంటనే విమానాశ్రయం సామర్థ్యాన్ని విస్తరించాల్సిన అవసరం ఏర్పడింది. దీంతో ప్రస్తుత టెర్మినల్ ప్రయాణికుల వార్షిక సామర్థ్యాన్ని 3.4 కోట్ల నుంచి 4.7 కోట్లకు విస్తరించడంతో పాటు కొత్తగా 2 కోట్ల మంది ప్రయాణికులు, 46 నుంచి 47 విమానాలు రాకపోకలు సాగించేలా ఇంకో టెర్మినల్, 3,800 మీటర్ల పొడవైన రన్‌వే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏర్పడింది.

అత్యాధునిక సౌకర్యాలు

ఈ విస్తరణ, ఆధునీకరణను అధునాతన సదుపాయాలతో పూర్తి చేయాలని జీహెచ్ఐఏఎల్ భావిస్తోంది. కొత్తగా ఏర్పాటు చేసే రన్‌వేలో క్యాటగిరి-1 ఇన్‌స్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్, అధునాతన నావిగేషన్ పరికరాలను ఏర్పాటు చేయనుంది. దీంతో రన్‌వే సరిగా కనిపించకపోయినా పైలెట్లు విమానాలను సురక్షితంగా ల్యాండింగ్ చేయగలుగుతారు.



మొత్తం 9.17 లక్షలకు చేరిక
అమెరికాలో గంటకు 1,000 మంది
యూబీఎస్ 'గ్లోబల్ వెల్త్' నివేదిక వెల్లడి

గత ఏడాది భారత్‌లో కొత్తగా 39,000 మిలియనీర్లు

న్యూఢిల్లీ: ప్రపంచంలో ఆర్థిక వ్యత్యాసాలు రోజురోజుకీ పెరిగి పోతున్నాయి. ఇదే సమయంలో డాలర్ మిలియనీర్ల (10 లక్షల డాలర్లు) సంఖ్యా పెరిగి పోతోంది. గత ఏడాది మన దేశంలో కొత్తగా 39,000 మంది ఈ జాబితాలో చేరారు. దీంతో మన దేశంలో డాలర్ మిలియనీర్ల సంఖ్య 9.17 లక్షలకు చేరింది. అయితే చైనాలో ఉన్న 63 లక్షల మిలియనీర్లతో పోలిస్తే మన దేశంలో ఉన్న మిలియనీర్ల సంఖ్య తక్కువే. 2023తో పోలిస్తే భారత్‌లో మిలియనీర్ల సంఖ్య 4.4 శాతం పెరిగింది. స్విట్జర్లాండ్‌కు చెందిన ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ యూబీఎస్ తన తాజా 'గ్లోబల్ వెల్త్' నివేదికలో ఈ విషయం వెల్లడించింది. రష్యా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా దేశాలతో పోల్చినా మన దేశంలోనే డాలర్ మిలియనీర్ల సంఖ్య ఎక్కువ.

నివేదిక ఇతర ముఖ్యాంశాలు

- 2024 నాటికి 119 లక్షల కోట్ల డాలర్లకు చేరిన ప్రపంచ మిలియనీర్ల ఆస్తుల విలువ
- గత ఏడాది అమెరికాలో గంటకు 1,000 మంది చొప్పున ఏడాదిలో 3.79 లక్షల మంది కొత్త మిలియనీర్లు
- ప్రపంచ మిలియనీర్లలో 40 శాతం మంది అమెరికన్లు
- మిలియనీర్ల పెరుగుదలలో టర్కీ, యూఏఈ, రష్యా తర్వాత భారత్‌కు నాలుగో స్థానం.
- ఆర్థిక అసమానతలు ఎక్కువగా ఉన్న 56 దేశాల్లో భారత్‌కు ఎనిమిదో స్థానం
- భారత్‌లోని మొత్తం ఆస్తుల్లో ఫైనాన్షియల్ (ఆర్థిక) ఆస్తుల వాటా 20 శాతం మాత్రమే
- వచ్చే పాతికేళ్లలో ఒక తరం నుంచి మరో తరానికి 83 లక్షల కోట్ల డాలర్ల ఆస్తుల బదిలీ. ఈ విషయంలో అమెరికాకు అగ్రస్థానం. భారత్‌కు ఏడో స్థానం
- గత ఏడాది ప్రపంచవ్యాప్తంగా ప్రైవేట్ వ్యక్తుల ఆస్తులు సగటున 4.6 శాతం చొప్పున పెరిగితే అమెరికాలో 11 శాతం చొప్పున పెరుగుదల.

63 ఫ్లోర్లతో మెగా లగ్జరీ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్

హైదరాబాద్‌లో ది కాస్‌కేడ్స్ నియోపోలిస్

జీహెచ్ఆర్ లక్ష్మీ అర్బన్‌బ్లాక్స్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జీహెచ్ఆర్ ఇన్‌ఫ్రా, లక్ష్మీ ఇన్‌ఫ్రా, అర్బన్ బ్లాక్స్ రియల్టీ జాయింట్ వెంచర్ సంస్థ.. జీహెచ్ఆర్ లక్ష్మీ అర్బన్‌బ్లాక్స్ ఇన్‌ఫ్రా.. హైదరాబాద్, కోకాపేట్‌లో ది కాస్‌కేడ్స్ నియోపోలిస్ పేరుతో మెగా లగ్జరీ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. నియోపోలిస్‌లో 7.34 ఎకరాల విస్తీర్ణంలో 63 ఫ్లోర్లతో కూడిన ఐదు టవర్లు, మొత్తం 1,189.. 3 బీహెచ్‌కే, 4 బీహెచ్‌కే అపార్ట్‌మెంట్లతో ఈ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు సంస్థ డెసిగ్నేటెడ్ భాగస్వామి కర్తీశ్ రెడ్డి వెల్లడించారు. రూ.3,169 కోట్లతో అభివృద్ధి చేస్తున్న ఈ ప్రాజెక్ట్ 2030 నాటికి పూర్తిగా అందుబాటులోకి రానుందన్నారు. 2,560 చదరపు అడుగుల నుంచి 4,825 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ ఫ్లాట్స్ అందుబాటులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు. కాగా ఈ ప్రాజెక్ట్‌కు ఎస్‌బీఐ రూ.900 కోట్ల నిధులను సమకూర్చిందని సంస్థ డెసిగ్నేటెడ్ భాగస్వాములు లక్ష్మీ నారాయణ, శరత్ వెల్లడించారు.

- ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్ తయారీదారు ఓబెన్ ఎలక్ట్రిక్ సిరీస్-ఏ ఫండింగ్‌లో భాగంగా మొత్తం రూ.100 కోట్లు సమీకరించింది. ఇందులో భాగంగా జనవరి నెలలో రూ.50 కోట్లు సమీకరించగా మే నెలలో మరో రూ.50 కోట్ల నిధులను సేకరించింది. హీలియోస్ హోల్డింగ్స్, శారద ఫ్యామిలీ ఆఫీస్, కే ఫ్యామిలీ నుంచి ఈ మొత్తాలను సమీకరించింది. తాజా నిధులతో కంపెనీ ఇప్పటి వరకు సమీకరించిన నిధులు రూ.200 కోట్లకు చేరాయి.
- టెక్స్‌టైల్ రంగంలో నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు గాను జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎన్ఎస్‌డీసీ)తో వెల్‌స్పన్ లివింగ్ లిమిటెడ్ ఒప్పందం కుదుర్చుకుంది. రూ.425 కోట్లతో ఈ కార్యక్రమాన్ని చేపట్టనుంది. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సంయుక్తంగా సర్టిఫికెట్ జారీ చేయనున్నాయి. వెల్‌స్పన్ తన టెక్స్‌టైల్ యూనిట్లలో వీరికి ఉపాధి అవకాశాలు కల్పించనుంది.

మార్కెట్లో మూడో రోజూ నష్టాలే..

ముంబై: భారత స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడో రోజు నష్టపోయాయి. గురువారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 82.79 పాయింట్లు కోల్పోయి 81,361.87 వద్దకు జారుకోగా.. నిఫ్టీ 18.80 పాయింట్ల నష్టంతో 24,793.25 వద్ద ముగిసింది. ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య యుద్ధం రోజురోజుకూ తీవ్రతరమవుతుండటం, తత్ఫలితంగా ముడిచమురు ధరలు ఎగబాకుతున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు అమ్మకాలను కొనసాగించడం ఇందుకు కారణమైంది. ప్రధాన కంపెనీలతో పోలిస్తే చిన్న, మధ్య స్థాయి షేర్లలో అమ్మకాల ఒత్తిడి అధికమైంది. దాంతో బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 1.77 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.64 శాతం క్షీణించాయి.

సాయి లైఫ్‌సైన్సెస్‌లో 6% వాటా విక్రయం

హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్ట్ డ్రగ్ రీసెర్చ్, మాన్యుఫాక్చరింగ్ కంపెనీ సాయి లైఫ్ సైన్సెస్ లిమిటెడ్‌లో అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ టీపీజీ ఏషియా వాటా తగ్గించుకోనుంది. సాయి లైఫ్‌లో 6 శాతం వాటాకు సమానమైన 1.25 కోట్ల షేర్లను టీపీజీ ఏషియా బ్లాక్ డీల్స్ ద్వారా ఓపెన్ మార్కెట్లో విక్రయానికి పెట్టినట్లు తెలిసింది. షేరు కనీస ధరను రూ.710గా నిర్ణయించినట్లుగా సమాచారం. కంపెనీ ప్రస్తుత మార్కెట్ ధర కంటే 2.5 శాతం తక్కువ ఇది. తద్వారా టీపీజీ ఏషియాకు రూ.885 కోట్ల వరకు సమకూరనుంది. సాయి లైఫ్ సైన్సెస్‌లో టీపీజీ ఏషియా ప్రస్తుతం 24.73 శాతం వాటా కలిగి ఉంది. బీఎస్ఈలో సాయి లైఫ్ షేరు గురువారం 1.26 శాతం క్షీణించి రూ.729.20 వద్ద ముగిసింది.

25న హెచ్‌డీబీ ఫైనాన్షియల్ ఐపీఓ

ప్రైమరీ మార్కెట్లో వచ్చేవారం పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)ల సందడి పెరగనుంది. మూడు కంపెనీలు ఐపీఓల ద్వారా రూ.15,000 కోట్ల వరకు నిధులు సమీకరించేందుకు సిద్ధమయ్యాయి. అందులో సింహభాగం హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్‌దే. ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అనుబంధ విభాగమైన హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఐపీఓ ఈ నెల 25న (బుధవారం) ప్రారంభమై 27న (శుక్రవారం) ముగియనుంది. పబ్లిక్ ఇష్యూ ద్వారా కంపెనీ రూ.12,500 కోట్లు సమీకరించనుంది. కాగా వచ్చే వారం పబ్లిక్ ఇష్యూల జాబితాలో ముంబైకి చెందిన రియల్ ఎస్టేట్ కంపెనీ కల్పతరు లిమిటెడ్ సహా ఎల్లెన్‌బ్యారీ ఇండస్ట్రియల్ గ్యాసెస్ కూడా ఉన్నాయి. కల్పతరు ఐపీఓ ఈ నెల 24న (మంగళవారం) ప్రారంభమై 26న (గురువారం) ముగియనుంది. ఐపీఓ ద్వారా రూ.1,590 కోట్లు సమీకరించనున్న ఈ కంపెనీ ఒక్కో షేరు ధరను రూ.387-414గా నిర్ణయించింది. ఎల్లెన్‌బ్యారీ గ్యాసెస్ ఐపీఓ కూడా 24న మొదలై 26న ముగియనుంది. షేరు ధరను రూ.380-400గా నిర్ణయించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

20వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	540
వరంగల్	517	గోదావరి	520
చిత్తూరు	583	విశాఖపట్నం	565
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	93	విజయవాడ	99
వరంగల్	93	గుంటూరు	104
కరీంనగర్	93	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	93	చిత్తూరు	95
కర్నూలు	93	నెల్లూరు	100
విశాఖపట్నం	89	అనంతపురం	100
గోదావరి	99		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,080 ▲	92,650 ▲	1,22,000 ▲
విజయవాడ	1,00,200 ▲	94,000 ▼	1,12,000 ▲
విశాఖపట్నం	1,02,330 ▼	92,650 ▲	1,22,000 ▲
రాజమండ్రి	1,01,070 ▲	92,650 ▲	1,11,400 ▼
ప్రొద్దుటూరు	98,000 ▼	90,160 ▼	1,07,500 ▼
ముంబై	99,261 ▼	90 ,923 ▼	1,07,383 ▼

స్విస్ బ్యాంకుల్లో పెరిగిన భారత నిధులు

2024 నాటికి రూ.37,600 కోట్లు

న్యూఢిల్లీ/జ్యూరిచ్: స్విస్ బ్యాంకుల్లో మన దేశ నిధులు పెరుగుతున్నాయి. గత ఏడాది చివరికి ఇవి 350 కోట్ల స్విస్ ఫ్రాంక్స్‌కు (సుమారు రూ.37,600 కోట్లు) చేరాయి. 2023తో పోలిస్తే ఇది మూడింతలు ఎక్కువ. అయిన మన దేశ ఘరానా పెద్దలు స్విస్ బ్యాంకుల్లో భద్రంగా దాచుకున్న సొమ్ములను ఇందులో కలపలేదు. అది ఎంత మొత్తం ఉంటుందనే విషయాన్నీ స్విట్జర్లాండ్ కేంద్ర బ్యాంక్ అయిన స్విస్ నేషనల్ బ్యాంక్ వెల్లడించలేదు. అలాగే ఎన్ఆర్ఐలు, ఇతరులు ఇంకో దేశం నుంచి జమ చేసిన మొత్తాన్ని కూడా ఇందులో కలపలేదు. మన దేశానికి చెందిన ఆర్థిక సంస్థలు, కంపెనీలు తమ స్థానిక శాఖల ద్వారా జమ చేసిన మొత్తాన్ని మాత్రమే ప్రస్తుతానికి స్విస్ బ్యాంక్ వెల్లడించింది. ప్రస్తుతం ఉన్న రూ.37,600 కోట్లలో దాదాపు పదో వంతు (సుమారు రూ.3,675 కోట్లు) భారత కంపెనీల ఖాతాదారుల ఖాతాల్లో ఉంది. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 11 శాతం ఎక్కువ.

అమెజాన్ రూ.2,000 కోట్ల పెట్టుబడి

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా కార్యకలాపాల విస్తరణ, కస్టమర్ సేవల పెంపుపై ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ ఈ ఏడాది రూ.2,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. కొత్త ప్రాంతాలకు కార్యకలాపాలు విస్తరించడంతో పాటు ఇప్పటికే పని చేస్తున్న ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రాలను మరింత ఆధునీకరించడానికి కూడా ఈ పెట్టుబడులు సహాయకారి అవుతాయి. దీనివల్ల ఆధునిక టెక్నాలజీలు, ఇన్నోవేషన్ సహాయంతో కస్టమర్లకు మరింత విశ్వసనీయంగా, వేగంగా సేవలందించగలుగుతామని పేర్కొంది.

మధ్యాహ్నం 3.30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో..

గిల్ సేనకు కఠిన సవాల్

సంధి దశలో టీమిండియా
నేటి నుంచి ఇంగ్లండ్‌తో తొలి టెస్టు


గిల్


బెన్ స్టోక్స్

లీడ్స్: పాతికేళ్ల కొత్త కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సారథ్యంలో టీమిండియా తొలిసారిగా సుదీర్ఘ ఫార్మాట్‌లో ఆడబోతోంది. క్రీడాభిమానులు ఆత్రుతగా ఎదురుచూస్తున్న ఐదు టెస్టుల అండర్సన్-టెండూల్కర్ సిరీస్ శుక్రవారం నుంచే ఆరంభం కాబోంది. అలాగే ఇందులో భాగంగా జరిగే తొలి టెస్టుకు హెడింగ్లీ వేదిక కానుంది. అయితే దశాబ్దాలుగా జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించిన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, స్పిన్నర్ అశ్విన్ లేకుండానే భారత జట్టు ఇప్పుడు బరిలోకి దిగాల్సిన పరిస్థితి. అదికూడా అత్యంత కఠిన పరిస్థితులు ఎదురయ్యే ఇంగ్లండ్ గడ్డపై కావడం గమనార్హం. ప్రస్తుతం సంధిదశలో ఉన్న జట్టును కోచ్ గంభీర్ సహకారంతో కెప్టెన్ గిల్ ఎలా ముందుకు తీసుకెళ్లగలడన్న ఆసక్తి నెలకొంది. గత 93 ఏళ్లుగా ఇక్కడ పర్యటిస్తున్నా.. కేవలం మూడు సార్లు (1971, 1986, 2007) మాత్రమే భారత జట్టు సిరీస్‌ను సాధించిందంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇక హెడింగ్లీలో భారత జట్టు ఏడుసార్లు ఆడితే ఓ మ్యాచ్ డ్రా చేసుకుని కేవలం రెండింట్లోనే నెగ్గింది.

బ్యాటింగ్ ప్రభావమెంత?

ఇంగ్లండ్ పిచ్‌లపై భారత బ్యాటర్లు ఏమేరకు ప్రభావం చూపగలరనే సందేహం నెలకొంది. ఓపెనర్ జైస్వాల్ ఇక్కడ మొదటిసారి ఆడబోతున్నాడు. ఇక అతడికి జతగా రాహుల్ దిగే అవకాశముంది. సాయి సుదర్శన్‌కు అరంగేట్రం చాన్సిస్తే వన్‌డౌన్‌లో రావచ్చు. ఇక కీలక నాలుగో నెంబర్‌లో కెప్టెన్ గిల్ ఖాయమే. ఆ తర్వాత పంత్, కరుణ్ నాయర్ దిగవచ్చు. అయితే ఇంగ్లండ్‌లో గిల్ 3 టెస్టులు ఆడి కేవలం 88 పరుగులే చేశాడు. గత పర్యటనలో రాహుల్, పంత్ శతకాలు సాధించారు. అలాగే బౌలింగ్ విభాగంలో పేసర్ బుమ్రాపైనే అధికంగా ఆధారపడింది. సిరాజ్, ప్రసిద్ధ్ ఇతర పేసర్లుగా బరిలోకి దిగనున్నారు. ఒకే స్పిన్నర్‌ను తీసుకుంటే అది జడేజానే అవుతాడు. ఇక ఆల్‌రౌండర్ కోటాలో నితీశ్‌కుమార్ కంటే శార్దూల్ ఠాకూర్‌కే చాన్సులున్నాయి.

జో రూట్ అండగా..

అండర్సన్, స్టువర్ట్ బ్రాడ్ లేని ఇంగ్లండ్ బౌలింగ్ దళం కాస్త బలహీనంగానే కనిపిస్తోంది. పేసర్లు వోక్స్, కార్స్, టంగ్, స్పిన్నర్ బషీర్ భారత బ్యాటర్లను ఏమేరకు నిలువరించగలరో చూడాలి. అయితే బ్యాటింగ్ విభాగం మాత్రం పటిష్ఠంగానే ఉంది. 36 శతకాలు, 13వేలకు పైగా టెస్టు పరుగులు సాధించిన జో రూట్ జట్టుకు కొండంత అండగా చెప్పవచ్చు. వన్‌డౌన్‌లో రానున్న ఒల్లీ పోప్ జింబాబ్వేపై 170 రన్స్‌తో ఫామ్ కనబర్చాడు. క్రాలే, డకెట్ శుభారంభం అందిస్తే రూట్, బ్రూక్, స్టోక్స్, స్మిత్‌లతో కూడిన మిడిలార్డర్ భారీ స్కోరు అందించే అవకాశం ఉంది. 8వ స్థానంలో వచ్చే వోక్స్ ఖాతాలో ఓ సెంచరీ ఉంది.

తుది జట్లు

భారత్ (అంచనా): రాహుల్, జైస్వాల్, సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషభ్ పంత్, కరుణ్ నాయర్, జడేజా, శార్దూల్, బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ క్రిష్ణ.

ఇంగ్లండ్: జాక్ క్రాలే, బెన్ డకెట్, ఒల్లీ పోప్, జో రూట్, హ్యారీ బ్రూక్, బెన్ స్టోక్స్ (కెప్టెన్), జేమీ స్మిత్, క్రిస్ వోక్స్, బ్రైడన్ కార్స్, జోష్ టోంగ్, షోయబ్ బషీర్.


తమ పేరిట జరుగనున్న సిరీస్ ట్రోఫీతో అండర్సన్-సచిన్

భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగిన అన్ని ఫార్మాట్ల మ్యాచ్‌ల్లో కలిపి ఎక్కువ రన్స్ సాధించిన ఆటగాడిగా నిలిచేందుకు జో రూట్ మరో 179 పరుగులు సాధిస్తే చాలు. ప్రస్తుతం విరాట్ (4036) టాప్‌లో, సచిన్ (3990) రెండో స్థానంలో ఉన్నారు. అలాగే ఇరు జట్ల మధ్య జరిగిన టెస్టుల్లో ఎక్కువ హాఫ్ సెంచరీలు గవాస్కర్ (16) పేరిట ఉన్నాయి. రూట్ మరో ఆరు అర్ధసెంచరీలు సాధిస్తే ఈ రికార్డు కూడా బ్రేక్ అవుతుంది.

పిచ్, వాతావరణం

లీడ్స్‌లో శుక్రవారం 29 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండనుంది. దీనికి తోడు పిచ్‌పై 8 మి.మీ మేర పచ్చిక ఉండడంతో ఆరంభంలో వికెట్ సీమర్లకు అనుకూలించనుంది. అయితే సమయం గడిచేకొద్దీ పిచ్ పొడిబారి బ్యాటింగ్‌కు సులువుగా మారుతుంది. దీంతో బ్యాటర్లు ఓపిగ్గా నిలిస్తే భారీ స్కోర్లు ఖాయమే. ఆకాశం మబ్బులతో కూడి ఉన్నా వర్షం పడే అవకాశం లేదు.

ఆ విజయం ఐపీఎల్‌కంటే పెద్దది

'ఐపీఎల్ ప్రతీ ఏడాది వస్తుంటుంది. అలాగే ప్రతీ సీజన్‌లోనూ గెలిచే అవకాశాలుంటాయి. కానీ ఆసీస్, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, కివీస్‌లలో ఆడి టెస్టు సిరీస్ గెలవడం ఐపీఎల్‌కన్నా మిన్న. ఇక టెస్టు జట్టుకు నాయకత్వం వహించడాన్ని అతిపెద్ద గౌరవంగా భావిస్తున్నాను. అలాగే ఈ ఫార్మాట్‌లో ఎన్ని పరుగులు సాధించినా 20 వికెట్లు తీయలేకపోతే గెలుపు సాధ్యం కాదు. మా బౌలర్ల లక్ష్యం కూడా అదే'

\- గిల్


బుమ్రాకు భయపడం..

'బుమ్రా అద్భుత బౌలర్. కచ్చితంగా తను ప్రమాదకారే. కానీ మేం కేవలం ఒక్క బౌలర్‌పై దృష్టి సారించి ముందుకెళ్లలేం. అంతర్జాతీయ క్రికెట్‌లో భయమనేది ఉండదు. అతడొక్కడే సిరీస్‌ను గెలిపిస్తాడని భావించలేం. సమష్టి ప్రదర్శన వల్లే విజయం వరిస్తుంది. అలాగే విరాట్, రోహిత్, అశ్విన్ లేని భారత జట్టును మేమేమీ తేలిగ్గా తీసుకోవడం లేదు' - స్టోక్స్

శుభ్‌మన్‌కు సమయమివ్వాలి

సచిన్ టెండూల్కర్

న్యూఢిల్లీ: సంధి దశలో ఉన్న భారత జట్టుకు సారథ్యం వహిస్తున్న శుభ్‌మన్ గిల్‌కు తగినంత సమయం, సహకారం అందిస్తే విజయాలను అందుకోగలడని సచిన్ టెండూల్కర్ అన్నాడు. డ్రెస్సింగ్ రూమ్ బయట నుంచి వచ్చే వ్యాఖ్యల్ని పట్టించుకోకుండా.. తన దైన వ్యూహంతో సాగాలని కొత్త కెప్టెన్‌కు మాస్టర్ సలహా ఇచ్చాడు. ఇక, ఇంగ్లండ్ పరిస్థితులకు తగ్గట్టుగా బ్యాటర్లు తమ ఆటతీరును మార్చుకోవాలని సూచించాడు. లీడ్స్ వికెట్ సంక్లిష్టమైనదని సచిన్ అభిప్రాయపడ్డాడు. పిచ్ పొడిబారి ఉండడంతో తుది జట్టులో ఇద్దరు స్పిన్నర్లకు చోటుదక్కే అవకాశం ఉందన్నాడు. జడేజాతోపాటు సుందర్ లేదా కుల్దీప్‌ను తీసుకోవచ్చన్నాడు.



అన్నీ సవాళ్లే..: ఇంగ్లండ్ పరిస్థితులు కెప్టెన్ గిల్‌కు సవాళ్లు విసురుతాయని భారత మాజీ కెప్టెన్ రవిశాస్త్రి అన్నాడు. ఇక్కడ విజయాలు సాధించాలంటే ఓర్పు, నేర్పు అవసరమని చెప్పాడు. ఈ పర్యటనతో గిల్ ఎంతో కొంత అనుభవం గడిస్తాడన్నాడు. కాగా, గొప్ప నాయకుడిగా ఎదిగే లక్షణాలు గిల్‌లో ఉన్నాయని భారత మాజీ కోచ్ గ్యారీ కిర్‌స్టెన్ చెప్పాడు. అంతర్జాతీయ వేదికపై సత్తాచాటడానికి అతడు సిద్ధంగా ఉన్నట్టు తాను భావిస్తున్నానన్నాడు.

నిస్సాంక భారీ శతకం... శ్రీలంక 368/4

గాలె: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఆతిథ్య శ్రీలంక జట్టు దీటుగా బదులిస్తోంది. ఓపెనర్ పథుమ్ నిస్సాంక (187) భారీ శతకం సాధించగా, మూడో రోజు గురువారం ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో లంక 368/4 పరుగులతో నిలిచింది. చాందిమల్ (54)తో కలిసి రెండో వికెట్‌కు నిస్సాంక 157 పరుగులు జోడించాడు. కెరీర్‌లో ఆఖరి టెస్టు ఆడుతున్న ఏంజెలో మాథ్యూస్ (39) ఫర్వాలేదనిపించగా.. క్రీజులో కమిందు మెండిస్ (37 బ్యాటింగ్), ధనంజయ (17 బ్యాటింగ్) ఉన్నారు. అంతకుముందు బంగ్లా మొదటి ఇన్నింగ్స్‌లో 495 పరుగులకు ఆలౌటైంది. ఫెర్నాండోకు నాలుగు.. రత్నాయకె, థరిండులకు మూడేసి వికెట్లు దక్కాయి.

ఆడని వాళ్ల నిధులు వెనక్కివ్వండి!

సాయ్ ఆదేశం

న్యూఢిల్లీ: సహేతుకమైన కారణాలు లేకుండా పలు అంతర్జాతీయ పోటీల్లో దేశం తరఫున ప్రాతినిధ్యం వహించకుండా తప్పుకుంటున్న క్రీడాకారులకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) షాకిచ్చింది. కేంద్ర క్రీడా శాఖ అమలు చేసే వివిధ పథకాల కింద వారికిచ్చిన నిధులను వెనక్కి తీసుకోవాలని జాతీయ టెన్నిస్ సంఘాన్ని సాయ్ ఆదేశించింది. 'తీసుకున్న నిధులకు క్రీడాకారులు జవాబుదారీగా ఉండాలి. దేశం తరఫున ఆడేందుకు తొలి ప్రాధాన్యత ఇవ్వాల'ని సాయ్ పేర్కొంది. టాప్స్‌తో పాటు కొత్తగా టీఏజీజీ (టార్గెట్ ఆసియా గేమ్స్ గ్రూప్)ను సాయ్ ఏర్పాటు చేసింది. భారత టెన్నిస్ ప్లేయర్లలో యుకీ భాంబ్రీ, శశికుమార్ ముకుంద్, సుమిత్ నగల్ గత ఏడాది నుంచి పలు అంతర్జాతీయ టోర్నీల నుంచి వైదొలగడం తెలిసిందే.

స్పోర్ట్స్

సీజన్ తొలి టైటిల్‌పై

నీరజ్ గురి

అర్ధరాత్రి 1.10 నుంచి

నేడు పారిస్ డైమండ్ లీగ్



పారిస్: ఇటీవలే 90 మీటర్ల మార్క్‌ను అందుకున్న భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ఇప్పుడికసీజన్ తొలి టైటిల్‌పై దృష్టి సారించాడు. ఈక్రమంలో శుక్రవారం జరిగే పారిస్ డైమండ్ లీగ్‌లో విజేతగా నిలవాలని పట్టుదలగా ఉన్నాడు. కానీ జర్మనీ దిగ్గజం జులియన్ వెబర్, రెండుసార్లు వరల్డ్ చాంపియన్ అండర్సన్ పీటర్స్ (గ్రెనడా) నుంచి చోప్రాకు తీవ్ర పోటీ ఎదురు కానుంది. పారిస్ డైమండ్ లీగ్ బరిలో దిగుతున్న ఏడుగురు త్రోయర్లలో ఐదుగురు 90 మీ. మార్క్‌ను చేరుకున్న వారే కావడం గమనార్హం. ఈ లీగ్ 'వాండా డైమండ్ లీగ్' యూ ట్యూబ్ చానెల్‌లో ప్రత్యక్ష ప్రసారమవుతుంది.

స్వర్ణాల వేటలో షణ్ముఖి, గణేశ్

● ఆసియా కప్ స్టేజ్-2 ఆర్చరీ

సింగపూర్: ఆసియా కప్ స్టేజ్-2లో ఆంధ్రప్రదేశ్ ఆర్చర్లు అదరగొడుతున్నారు. విజయవాడకు చెందిన షణ్ముఖి నాగసాయి బుద్దె మరో రెండు పతకాలు ఖరారు చేసుకోగా.. నాయుడుపేట ఆర్చర్ గణేశ్ మణిరత్నం తిరుమూరు టీమ్ స్వర్ణ పోరుకు చేరుకొంది. గురువారం మొత్తంగా ఐదు టీమ్ ఈవెంట్లలో భారత జూనియర్ ఆర్చర్లు ఫైనల్స్‌కు చేరుకొన్నారు. మహిళల కాంపౌండ్ టీమ్ సెమీస్‌లో షణ్ముఖి, తేజల్, తనిక్షతో కూడిన భారత జట్టు 230-229తో నాలుగో సీడ్ కజకిస్థాన్‌పై గెలిచింది. కాంపౌండ్ మిక్స్‌డ్‌లో షణ్ముఖి-కుశాల్ జంట 155-154తో ఇండోనేసియా జంట నురిసా డియాన్ అష్రఫ్-ప్రిమా విష్ణు వర్దానపై నెగ్గి ఫైనల్‌కు చేరుకొంది. కాంపౌండ్ పురుషుల టీమ్ సెమీస్‌లో కుశాల్ దలాల్, గణేశ్ తిరుమూరు, మిహిర్ అపార్‌ల త్రయం షూటా‌ఫ్‌లో ఆస్ట్రేలియాపై నెగ్గింది. విష్ణు చౌదరి, పరాజ్ హుడా, జుయెల్ సర్కార్‌లతో కూడిన పురుషుల రికర్వ్ టీమ్ 5-1తో బంగ్లాదేశ్‌ను ఓడించింది. స్వర్ణ పోరులో జపాన్‌తో భారత్ తలపడనుంది. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ సెమీస్‌లో వైష్ణవి పవార్-విష్ణు చౌదరి జంట 5-3తో సింగపూర్ జోడీపై గెలిచింది.

జెమీమాను రిటైన్ చేసుకున్న బ్రిస్బేన్

మెల్‌బోర్న్ : మహిళల బిగ్‌బాష్ లీగ్ (డబ్ల్యూబీబీఎల్) 11వ సీజన్‌కు సంబంధించి క్రికెటర్ల ఎంపిక గురువారం ముగిసింది. భారత్‌నుంచి మొత్తం 15 మంది క్రికెటర్లు బరిలో నిలవగా..కేవలం జెమీమా రోడ్రిగ్స్ మాత్రమే ఎంపికైంది. బ్రిస్బేన్ హీట్ ఆమెను రిటైన్ చేసుకుంది. మొత్తం ఎనిమిది ఫ్రాంచైజీలు 23 మంది అంతర్జాతీయ క్రీడాకారిణులను ఎంపిక చేసుకున్నాయి.



www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

విదేశీ విద్యార్థులకు
మళ్లీ వీసాలు
2
ప్రక్రియ పునఃప్రారంభిస్తున్నామన్న అమెరికా
సోషల్ ఖాతాలను అన్‌లాక్ చేయాలని షరతు

51 మంది అమరావతి రైతులపై
కేసుల ఉపసంహరణ
14

శుక్రవారం | 20-6-2025 | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

వైసీపీ అభ్యర్థులకు లిక్కర్ కిక్కు

ఓట్లాటకు కోట్లు

43 అసెంబ్లీ, 4 ఎంపీ స్థానాలకు వందల కోట్లు

డబ్బు తరలింపు 'రూట్' కనుక్కున్న సిట్
8 మంది పాత్రపై సాంకేతిక ఆధారాలు సేకరణ
రాజ్ కసిరెడ్డి ఆదేశాలు.. ఇతరుల ఆచరణ
'హెడ్' కుమారుడి నుంచి రాజ్ తోడల్లుడి దాకా!
కేసు నమోదు కాగానే ఒక్కొక్కరు విదేశాలకు జంప్
పది రోజుల కిందటే దుబాయ్‌కి వెళ్లిన ప్రద్యుమ్న
కేంద్ర సహకారంతో వారిని రప్పించే ప్రయత్నాలు



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

సొంత సరుకు! సర్కారీ షాపులు! కమీషన్లు ఇచ్చిన వారికే ఆర్డర్లు! వేలకోట్ల ముడుపులు! వాటితో ఓట్లు కొని... మళ్లీ అధికారంలోకి రావాలనే 'బిగ్ ప్లాన్'! కానీ... డామిట్ కథ అడ్డం తిరిగింది. మద్యం ముడుపుల సొమ్ములు తరలించారు కానీ... అధికారం మాత్రం దక్కలేదు! 2024 ఎన్నికల్లో ఐదు ఉమ్మడి జిల్లాల్లోని 43 అసెంబ్లీ స్థానాలు, నాలుగు పార్లమెంటు స్థానాల్లోని వైసీపీ అభ్యర్థులకు వందల కోట్ల రూపాయల నగదు ట్రక్కులు, కార్లలో తరలించినట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) గుర్తించింది. దీనికి సంబంధించిన సాంకేతిక ఆధారాలు సైతం సేకరించింది. హైదరాబాద్ నుంచి విజయవాడ, తాడేపల్లి, ఒంగోలు, తిరుపతికి చేరిన రూటింగ్‌తో పాటు... తరలింపులో కీలక పాత్ర పోషించిన వారినీ గుర్తించింది. తిరుపతికి చెందిన ఒక హెడ్ కానిస్టేబుల్ కుమారుడు, శ్రీకాళహస్తికి చెందిన ఆయన మిత్రుడు, లిక్కర్ స్కామ్‌లో ప్రధాన సూత్రధారి రాజ్ కసిరెడ్డి తోడల్లుడు, ఆయన సోదరుడు, ఒంగోలుకు చెందిన రియల్టర్, కాఫీ షాపులో పనిచేసి లిక్కర్ కంపెనీకి అన్నీ తానై వ్యవహరించిన యువకుడు.. ఇలా మొత్తం ఎనిమిది మంది పాత్రపై పక్కా ఆధారాలు సేకరించింది. వారి ఆచూకీ కోసం

మిగతా 14వ పేజీలో...

ఆలీబాబా 40 దొంగల మాదిరిగా జగన్ తీరు

దొంగతనం చేసింది తానేనని దొంగ ఒప్పుకొంటాడా?
ఫోన్ ట్యాపింగ్ ద్వారా నాపై నిఘా పెట్టారు
ఇది నా వ్యక్తిగత స్వేచ్ఛను ఉల్లంఘించడమే
12
ట్యాప్ అయిన నా ఆడియో వైవీ దగ్గర ఉంది
ఆయన మా ఇంట్లో దాన్ని నాకు వినిపించారు
ఆయన్ను విచారించి నిజాలు నిగ్గు తేల్చాలి
'సత్తెనపల్లి' పర్యటనలో ఇద్దరి మృతికి బాధ్యులెవరు?
మోదీ దత్తపుత్రుడనా జగన్ బలప్రదర్శనల్ని అడ్డుకోవట్లేదు
ప్రతిపక్ష హోదా దక్కని వైసీపీ వారికి ఆంక్షలు వర్తించవా?
బీజేపీతో వైసీపీకి అక్రమ పొత్తు: షర్మిల




రప్పా రప్పా నరుకుతానంటే
మంచిదే కదా!

టీడీపీ నుంచి మారి మన అభిమానస్తుడయ్యాడు.. టీడీపీ వాళ్ల తల నరుకుతానంటున్నాడు
'పుష్ప' సినిమా డైలాగ్ చెప్పినా తప్పేనా!.. మనం ఏ ప్రపంచంలో ఉన్నాం సామీ!
'నరుకుడు భాష'కు జగన్ సమర్థన.. పదేపదే అదే చెప్పించుకుని, చెప్పి ఆనందం
13



షర్మిల ఫోన్ ట్యాప్ చేశారేమో!
అయినా పొరుగు రాష్ట్రం సంగతి నాకెలా తెలుస్తుంది: జగన్
12



సినిమాల్లోలాగా బయటా చంపేస్తారా?

రప్పా రప్పా నరుకుతా.. అనడం సినిమా డైలాగ్ అట!

అందులో తప్పేముందని జగన్ అంటున్నారు.. ఇలాంటి మానసిక స్థితి ఉన్న వారితోనే ముప్పు

వీరి నుంచి రాష్ట్రాన్ని ప్రజలే కాపాడుకోవాలి
రౌడీయిజం, హింసను ప్రేరేపించేలా జగన్ యాత్రలు
కొట్టండి.. నరకండి.. చంపండి.. వార్ డిక్లేర్.. వంటి నినాదాలను సమాజం అంగీకరించదు
బెట్టింగ్ ప్రాణానికి ఉన్న విలువ.. వైసీపీ చేతుల్లో చనిపోయినవారికి లేదా?

జగన్ తీరుపై సీఎం చంద్రబాబు ఫైర్

"రప్పా రప్పా నరుకుతా.. అనేది సినిమా డైలాగ్ అని జగన్ చెబుతున్నారు. సినిమా డైలాగులు చెప్పడం కూడా తప్పేనా అని ప్రశ్నిస్తున్నారు. సినిమాల్లో మనుషులను చంపేస్తారు. అలాగని నిజజీవితంలోనూ చంపేస్తారా.? చంపేసి తప్పేంటని అంటారా..? రేప్ చేసినా తప్పు లేదు.. బాబాయ్‌ని చంపేసినా తప్పులేదనే వారికి ఏం చెప్పాలి?" అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహించారు.

అమరావతి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): జగన్‌లాంటి మానసిక స్థితి ఉన్న వ్యక్తులతోనే ముప్పు అని, వారి నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. ఆయన గురువారమిక్కడ విలేకరులతో మాట్లాడుతూ జగన్ తీరుపై మండిపడ్డారు. రౌడీయిజం, హింసను ప్రేరేపించేలా జగన్ పరామర్శ యాత్రలు ఉన్నాయన్నారు. ప్రపంచం గర్వించేలా నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగా డేను పక్కదారి పట్టించేలా రాష్ట్రంలో అలజడుల సృష్టికి వైసీపీ నేతలు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. "జగన్ పరామర్శల పేరుతో రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యను సృష్టిస్తున్నారు. ఇష్టానుసారంగా భయోత్పాతం సృష్టిస్తామంటే కుదరదు. అలాంటి వారి పట్ల చట్టం తన పని తాను చేసుకుపోతుంది. ఒకప్పుడు నేరగాళ్లను కలవాలంటే రాజకీయ నాయకులు

మిగతా 13వ పేజీలో...

మనం మనం కొట్టుకుంటే
లాభమేంటి?

తెలంగాణ కానీ, ఆంధ్రా కానీ
అంతా తెలుగువారే
గొడవ పడటమంటే ప్రజల్ని మోసం చేయడమే
సముద్రంలో కలిసే నీటివాడకంపై వివాదమేంటి?
కాళేశ్వరం కట్టుకున్నప్పుడు నేను అడ్డుచెప్పలేదు
ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో పరిష్కరించుకుందాం
చట్టబద్ధత కావాలంటే కేంద్రం వద్ద కూర్చుందామని చెబుతున్నా
బనకచర్ల ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబు

గోదావరిలో చాలా నీళ్లు ఉన్నాయి. ఎవరి ఓపికను బట్టి వారు వాడుకోవచ్చు. 3 వేల టీఎంసీల నీరు ఏటా సముద్రంలో కలుస్తోంది. తెలంగాణ ఎంత వాడుకున్నా 100 టీఎంసీలు వాడుకోగలదు. మనం ఎంత వాడుకున్నా మరో 100 టీఎంసీలు వాడుకోగలం. దీనిపై రాద్ధాంతం ఎందుకు?
– సీఎం చంద్రబాబు

13

ఉద్యమ స్ఫూర్తితో యోగాంధ్ర

భారతీయ వారసత్వ సంపద యోగా.. ప్రజల జీవితంలో భాగస్వామ్యం చేస్తాం
ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో శిక్షణ.. యోగాంధ్రలో 22 రికార్డులు బ్రేక్ చేస్తున్నాం
అందులో 2 గిన్నిస్ రికార్డులు.. రేపు రాష్ట్రంలో 2 కోట్ల మందికి పైగా యోగాసనాలు.. దేశంలోని 7 లక్షల ప్రాంతాల్లో యోగాంధ్ర లైవ్: సీఎం



జస్టిస్ వర్మ ఇంటి ప్రాంగణంలో..
నోట్ల కట్టలు నిజమే

కనీసం 10 మంది ప్రత్యక్ష సాక్షులు చెప్పారు
జడ్జి ఇంట్లో ఎవరో నోట్లకట్టలు పెట్టడం అసాధ్యం
జస్టిస్ వర్మ దుర్వర్తన నిజమేనని రుజువైంది
64 పేజీల నివేదికలో త్రిసభ్య కమిటీ వెల్లడి

2



మోదీ, మునీర్ వల్లే యుద్ధం ఆగింది!

వారిద్దరూ చాలా తెలివైన వ్యక్తులు
ఆపకుంటే భారత్-పాకిస్థాన్ ఘర్షణ అణుయుద్ధానికి దారి తీసి ఉండేది
వారిద్దరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నా
ఇరాన్ గురించి పాక్‌కు తెలుసు: ట్రంప్
వైట్‌హౌస్‌లో మునీర్‌కు విందు ఇచ్చిన అమెరికా అధ్యక్షుడు
ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలంటూ మునీర్ డిమాండ్!



ఇరాన్ దాడితో ఇజ్రాయెల్‌లోని సొరొకా ఆస్పత్రి నుంచి వెలువడుతున్న పొగలు



ఇజ్రాయెల్ క్షిపణుల దెబ్బకు పూర్తిగా ధ్వంసమైన ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ ప్రధాన కార్యాలయం

భీకర యుద్ధం..!

ఇజ్రాయెల్ ఆస్పత్రి, స్టాక్ ఎక్స్ఛేంజ్ భవనంపై ఇరాన్ క్షిపణులు
టెల్‌అవీవ్ శివార్లలో నష్టం.. ఒక్కరోజే 200 మందికి పైగా క్షతగాత్రులు
ఇరాన్‌లోని అరాక్ భారజల ప్లాంట్‌పై ఇజ్రాయెల్ దాడులు
నటాంజ్ అణుకేంద్రంపైనా.. ఇరాన్ క్రిప్టో కరెన్సీ ఎక్స్ఛేంజ్‌పై సైబర్ దాడి
రూ. 785 కోట్లను కొల్లగొట్టిన ఇజ్రాయెల్ హ్యాకర్లు
మిల్లీమీటర్ దూరంలో అణు విధ్వంసం.. రష్యా హెచ్చరిక
ఇరాన్ దాడి భయంతో పశ్చిమాసియాలో అమెరికా వెనక్కి: రాయిటర్స్
టెహ్రాన్ నుంచి భారత్‌కు 110 మంది విద్యార్థులు

టెల్‌అవీవ్/టెహ్రాన్/న్యూఢిల్లీ, జూన్ 19: ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం భీకరంగా మారుతోంది. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం కడపటి వార్తలందేవరకు ఇరు దేశాల్లో యుద్ధ నష్టాలతో బీభత్సం కనిపించింది. ఇజ్రాయెల్‌లోని మౌలిక సదుపాయాలే టార్గెట్‌గా ఇరాన్.. అణు కార్యక్రమాలు, క్షిపణి యూనిట్లే లక్ష్యంగా ఇజ్రాయెల్ పరస్పరం క్షిపణి దాడులు జరిపాయి. ఇరాన్ జరిపిన దాడుల్లో ఇజ్రాయెల్‌లోని బీర్షెబాలో ఉన్న అతిపెద్ద(వెయ్యి పడకలు) ఆస్పత్రి సొరొకా

మిగతా 2వ పేజీలో...



ఇరాన్‌లోని టెహ్రాన్ నుంచి సురక్షితంగా తిరిగొచ్చిన భారతీయ విద్యార్థిని

తోతాపురి కిలో రూ.ఐదే!

ప్రభుత్వం ఆదేశించినా దక్కని మద్దతు ధర
రూ.12 ఇవ్వలేమంటున్న ఫ్యాక్టరీలు
పెరిగిన దిగుబడి, తగ్గిన డిమాండే కారణం
ఇప్పటికే ఫ్యాక్టరీల్లో మగ్గుతున్న 40 వేల టన్నుల పల్ప్



పర్మిట్లు లేక రోడ్లపైనే ఉన్న మామిడికాయల లోడు వాహనాలు.. (ఇన్‌సెట్‌లో) చిత్తూరు సమీప సీకేపల్లెలో కాయల్ని చెట్టునే వదిలేసిన రైతు

చిత్తూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): తోతాపురి రకం మామిడి కాయలకు కిలోకు రూ.4 సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దాంతో కలిపి కిలో రూ.12 మద్దతు ధర రైతులకు అందాలని స్పష్టంచేసింది. అయినా ఫ్యాక్టరీ యాజమాన్యాలు కిలో రూ.5కు మించి కొనడం లేదు. అధికారులు ఎంతగా ప్రయత్నించినా రైతులకు మద్దతు ధర ఇప్పించలేకపోతున్నారు. పొరుగున ఉన్న తమిళనాడులోని కృష్ణగిరిలో కిలో రూ.4కే కాయలు లభిస్తున్నప్పుడు ఇక్కడ రూ.8 ఎందుకివ్వాలని ఫ్యాక్టరీలు ప్రశ్నిస్తున్నాయి. 'మా అవసరాన్ని బట్టి కాయలు కొంటాం. కచ్చితంగా ఈ ధరకే కొనాలంటే ఎలా?' అని అంటున్నాయి. చాలా ఫ్యాక్టరీలు కిలోకు రూ.5 మాత్రమే

మిగతా 9వ పేజీలో...

ఐదేళ్లలో జరగని అభివృద్ధి
ఏడాదిలోనే చేశాం

వచ్చే నాలుగేళ్లలో రెట్టింపు చేస్తాం
అభివృద్ధికి కేరాఫ్‌గా ఆంధ్రప్రదేశ్
రాష్ట్రానికి కేంద్రం సంపూర్ణ సహకారం
స్వర్ణాంధ్ర-2047 దిశగా అడుగులు
గ్రామ స్వరాజ్యానికి ముందడుగు
ప్రజలకు ప్రగతి నివేదిక సమర్పించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



2

పరిమిత ఎత్తు
దాటితే కూల్చివేతే!

ఎయిర్‌పోర్టుల సమీపంలోని భవనాలు నిబంధనలకు లోబడి ఉండాలి
2
ఇప్పటికే ఉన్న నిర్మాణాలకు పరిహారం
కేంద్రం ముసాయిదా నిబంధనలు

అభివృద్ధి వికేంద్రీకరణే లక్ష్యం

వెనుకబడ్డ ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే అదనపు ప్రోత్సాహకాలు
12
స్థానికులకే ఉద్యోగ అవకాశాలు దక్కాలి
ఎస్ఐపీబీ సమావేశంలో సీఎం చంద్రబాబు
28,546 కోట్ల పెట్టుబడులకు ఆమోదం

ఐదేళ్లలో జరగని అభివృద్ధి

ఏడాదిలోనే చేశాం

- వచ్చే నాలుగేళ్లలో రెట్టింపు చేస్తాం.. అభివృద్ధికి కేరాఫ్‌గా ఏపీ
- రాష్ట్రానికి కేంద్రం సంపూర్ణ సహకారం
- ప్రజలకు ప్రగతి నివేదిక సమర్పించిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో జరగని అభివృద్ధిని ఏడాదిలోనే చేసి చూపిస్తూ, ప్రజల్లోనే కాకుండా పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని నింపడానికి కృషి చేశామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని, సుపరిపాలనను చూసి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారాలు అందిస్తోందన్నారు. దీంతో రాష్ట్రం అన్ని రంగాల్లో సమష్టి అభివృద్ధి సాధిస్తూ స్వర్ణాంధ్ర-2047 సాధించే దిశగా అడుగులు వేస్తోందన్నారు. ఉపముఖ్యమంత్రిగా, వివిధ శాఖలకు మంత్రిగా బాధ్యతలు స్వీకరించి ఏడాది గడిచిన సందర్భంగా పవన్ కల్యాణ్ సుపరిపాలనకు ఏడాది పేరుతో 20 పేజీల సమగ్ర అభివృద్ధి నివేదిక 2024-25ను గురువారం విడుదల చేశారు. 'ప్రగతి, పారదర్శకత, సుస్థిరత, జవాబుదారీతనం, గ్రామ స్వరాజ్యానికి ముందడుగు.. హరితాంధ్ర సాధనకై మరో అడుగు' అంటూ ప్రజలకు నివేదిక సమర్పించారు. గత సంవత్సరం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయానికి అండగా నిలబడి, రాష్ట్రాన్ని బానిస సంకెళ్ల నుంచి విముక్తి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. రాజకీయాల్లో, ప్రభుత్వంలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని నిరంతరం పరితపించే తాను చేపట్టిన శాఖల ద్వారా ఏడాదిలో చేసిన అభివృద్ధి, సాధించిన విజయాలను ప్రజలందరి ముందు ఉంచడం నైతిక బాధ్యతగా భావిస్తున్నానని పవన్ నివేదికలో పేర్కొన్నారు.

ఏడాదిలో ఎంతో అభివృద్ధి

ఏడాదిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను నివేదికలో వెల్లడించారు. 1,312 కి.మీ మేర 449 బీటీ రోడ్లు, రూ.649 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా వివిధ పనులకు రూ.589 కోట్లు కేటాయించారు. గిరిజన ప్రాంతాలకు రోడ్ల నిర్మాణంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీరాజ్ రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. ఉపాధి నిధులతో 4 వేల కి.మీ సిమెంట్ రోడ్ల నిర్మాణం, గ్రామాలను కలిపేలా 276 కి.మీ. బీటీ రోడ్ల నిర్మాణం, 78 వేల నీటి కుంటలు, 22,500 గోకులాల షెడ్ల నిర్మాణం, 15 వేల పశువుల నీటి తొట్టెల నిర్మాణం చేపట్టారు. 1877 నివాస ప్రాంతాలకు తొలిసారిగా రహదారి సౌకర్యం కల్పించారు. 1137 గిరిజన గ్రామాలకు రహదారుల సమస్యను పరిష్కరించారు. వారికి డోలీ వెతలు చెరిపేసి, అభివృద్ధిని చేరువ చేస్తూ విద్య, వైద్య, ఉపాధి సౌకర్యాలు పొందే అవకాశం కల్పించారు.

పిఠాపురంలో అభివృద్ధి..

పిఠాపురం ఎమ్మెల్యేగా ఏడాది కాలంలో రికార్డు స్థాయిలో రూ.308 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు నియోజకవర్గంలో చేపట్టినట్లు వివరించారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ ద్వారా జల్‌జీవన్ మిషన్ కింద చేపట్టబోయే పనుల వివరాలను వెల్లడించారు.

బనకచర్లను అడ్డుకోండి

- జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు టీ సీఎం రేవంత్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న గోదావరి- బనకచర్ల ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టును తిరస్కరించాలని కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టు విషయంలో గోదావరి జల వివాదాల ట్రైబ్యునల్ - 1980 (జీడబ్ల్యూడీటీ), ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం - 2014కు విరుద్ధంగా ఏపీ సర్కారు వ్యవహరిస్తోందని తెలిపారు. ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్, ఆ శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీతోపాటు ఇతర ఉన్నతాధికారులతో రేవంత్, ఉత్తమ్ గురువారం సమావేశమయ్యారు. బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతుల విషయంలో కేంద్ర ఆర్థిక, పర్యావరణ శాఖలు వ్యవహరిస్తున్న తీరుతో తెలంగాణ ప్రజలు, రైతుల్లో ఆందోళనలు నెలకొన్నాయని చెప్పారు. గోదావరి వరద జలాల ఆధారంగా బనకచర్ల ప్రాజెక్టును ప్రతిపాదిస్తున్నామని ఏపీ చెబుతోందని, కానీ, జీడబ్ల్యూడీటీ - 1980లో వరద, మిగులు జలాల ప్రస్తావనే లేదని వివరించారు. పునర్విభజన చట్టం ప్రకారం ఏ రాష్ట్రంలోనైనా కొత్తగా ప్రాజెక్టును కట్టాలనుకుంటే తొలుత ఆ నదీ యాజమాన్య బోర్డు, సీడబ్ల్యూసీ, అపెక్స్ కౌన్సిల్‌లో చర్చించి అనుమతి పొందాలని, కానీ, ఏపీ వీటన్నింటినీ ఉల్లంఘిస్తోందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఏ నిబంధనలూ పాటించకుండా.. వరద జలాల ఆధారంగా ప్రాజెక్టు చేపడుతున్నామని చెప్పడం తీవ్ర అభ్యంతరకరమని తెలిపారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, జల్‌శక్తి శాఖ తక్షణమే జోక్యం చేసుకొని బనకచర్లను అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు.

లాసెట్‌లో అమ్మాయిల హవా

- 3 విభాగాల్లో వారే టాప్... 98% మంది అభ్యర్థుల ఉత్తీర్ణత

అమరావతి, తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): లా కోర్సుల్లో ప్రవేశాలకు రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 5వ తేదీన నిర్వహించిన ఏపీ లాసెట్-2025 ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. ఫలితాలను పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ వెన్నం ఉమ, ఏపీ లాసెట్ కన్వీనర్ సీతాకుమారి విడుదల చేశారు. అన్ని లా కోర్సుల ఫలితాల్లో అమ్మాయిలే పైచేయి సాధించినట్టు సీతాకుమారి చెప్పారు. మూడు కోర్సులకు మొత్తం 27,253 మంది దరఖాస్తు చేసుకోగా 21,251 మంది పరీక్షలు రాశారు. వీరిలో 20,826 (98 శాతం) అర్హత సాధించారు. మూడేళ్ల లా కోర్సుకు పరీక్ష రాసిన ఇద్దరు ట్రాన్స్‌జెండర్లూ ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలను ఏపీ లాసెట్ వెబ్‌సైట్‌లో చూడవచ్చు. లాసెట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి లోకేశ్ 'ఎక్స్'లో అభినందనలు తెలిపారు.

మూడు విభాగాల్లో టాప్-10 ర్యాంకర్లు:

- పీజీలాసెట్- బైసాని హరితశ్రీ (బాపట్ల జిల్లా అద్దంకి), వై.లోకేశ్వరి (కడప), కె.ప్రశాంత్ (ఒంగోలు), జి.శ్రావ్య, షేక్ రమీజ్ రాజా, ఎం.వి జయ మణికంఠ, సీహెచ్ ధ్యానేష్ నాయుడు, ఎస్.రామకృష్ణ, బి.శ్రీరామ్, ఆర్.దుర్గా ప్రవీణ్.
- ఎల్ఎల్‌బీ, మూడేళ్లు- వేముల వెంకటశివ సాయి భార్గవి (అనకాపల్లి), ఎం.రామ్‌తేజ్ వర్మ (విశాఖపట్నం), పి.సత్య అంజనాదేవి (ఏలూరు), వి.రమేష్, బి.శరత్‌చంద్ర, డి.మాధవరావు, ఐడీవీ సూర్య సత్య మహేంద్ర, ఎండీ సాయికృష్ణ, ఎస్.కిరణ్‌కుమార్, పి.హరీష్.
- ఎల్ఎల్‌బీ, ఐదేళ్లు- పల్లపు గిరీష్మ (అన్నమయ్య జిల్లా), ఎస్.భావన (తిరుపతి), బి.సూర్యతేజ (నరసారావుపేట), ఎన్.ఉదయచంద్ర, ఎం.రమేష్, యు.వెంకటరమణ, ఇ.లహరి, సయ్యద్ అఫ్సానా జబాన్, ఎ.యశశ్వి, మహ్మద్ ఇంతియాజ్.

విదేశీ విద్యార్థులకు మళ్లీ అమెరికా వీసాలు

వాషింగ్టన్, జూన్ 19: గత నెలలో నిలిపివేసిన విదేశీ విద్యార్థుల వీసా దరఖాస్తు ప్రక్రియను పునఃప్రారంభిస్తున్నట్లు అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రకటించింది. అయితే ప్రభుత్వ పరిశీలన కోసం వారి సోషల్ మీడియా ఖాతాలను అన్‌లాక్ చేసి ఉంచాలని షరతు విధించింది. ఆ సోషల్ మీడియా ఖాతాల్లో అమెరికాకు, తమ ప్రభుత్వానికి, సంస్కృతికి, సంస్థలకు వ్యతిరేకంగా ఏమైనా పోస్టులు ఉంటే వాటిని కాన్సులర్ అధికారులు పరిశీలిస్తారని స్టేట్ డిపార్ట్‌మెంట్ వెల్లడించింది.

పరిమిత ఎత్తు దాటితే కూల్చివేతే!

- ఎయిర్‌పోర్టుల సమీపంలోని భవనాలు నిబంధనలకు లోబడి ఉండాలి.. కేంద్రం ముసాయిదా రూల్స్ జారీ

న్యూఢిల్లీ, జూన్ 19: ఎయిర్‌పోర్టుల చుట్టూ విమాన కార్యకలాపాలకు అంతరాయం కలిగించే భవనాలు, చెట్లు వంటి అడ్డంకుల నియంత్రణ, తొలగింపుపై కేంద్రప్రభుత్వం ముసాయిదా నియమాలను జారీచేసింది. భారతీయ వాయుయాన్ అధినియం-2024 కింద ఈ 'ది డ్రాఫ్ట్ ఎయిర్‌క్రాఫ్ట్ రూల్స్ (భవనాలు, చెట్ల వల్ల కలిగే అడ్డంకులను కూల్చివేయడం)'ను విడుదల చేసింది. వీటిపై 21రోజులపాటు ప్రజల అభిప్రాయాల సేకరించనుంది. ఎయిర్‌క్రాఫ్ట్ రూల్స్-1994 స్థానంలో కొత్త నియమాలను తీసుకురావాలనే ఉద్దేశంతో కేంద్రం తాజా ప్రతిపాదనలు చేసింది. ప్రభుత్వ నోటిఫికేషన్లలో పేర్కొన్న ఎత్తు సంబంధిత పరిమితులను ఉల్లంఘించిన నిర్మాణంపై అయినా డీజీసీఏ చర్యలు తీసుకొనే అధికారాన్ని కొత్త నిబంధనలు కల్పిస్తున్నాయి.

మోదీ, మునీర్‌ల వల్లే

యుద్ధం ఆగింది!



భారత్, పాక్‌లతో అమెరికా వాణిజ్య ఒప్పందాలపై కసరత్తు జరుపుతున్నాం

- ప్రస్తుత పరిస్థితుల పట్ల మునీర్ నా అభిప్రాయాలతో ఏకీభవించారు: ట్రంప్
- లాడెన్‌కు పాక్ ఆశ్రయం ఇచ్చిన విషయం అమెరికన్లు మర్చిపోవద్దు
- కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ హెచ్చరిక

న్యూయార్క్/ఇస్లామాబాద్, జూన్ 19: భారత్-పాకిస్థాన్‌ల మధ్య గత నెలలో జరిగిన యుద్ధాన్ని తానే ఆపానంటూ పదే పదే చెప్పుకున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా మాట మార్చారు. భారత్, పాకిస్థాన్‌లకు చెందిన ఇద్దరు చాలా తెలివైన నాయకుల వల్లనే ఆ యుద్ధం నిలిచిందని, లేకపోతే అది అణుయుద్ధంగా మారి ఉండేదని తెలిపారు. ప్రధాని మోదీ, పాక్ సైన్యాధిపతి అసిమ్ మునీర్‌లను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌లో అసిమ్ మునీర్‌కు విందు ఇచ్చిన అనంతరం ట్రంప్ మీడియాతో మాట్లాడారు. 'భారత్‌తో యుద్ధాన్ని కొనసాగించకుండా ముగించినందుకు కృతజ్ఞతలు చెప్పటం కోసమే అసిమ్ మునీర్‌ను వైట్‌హౌస్‌కు విందుకు ఆహ్వానించాను. భారత ప్రధాని నరేంద్రమోదీకి కూడా కృతజ్ఞతలు తెలుపుతున్నా. భారత్, పాక్.. రెండూ పెద్ద దేశాలు. అణ్వాయుధ దేశాలు. యుద్ధం కొనసాగి ఉంటే అణుయుద్ధానికి దారి తీసే ప్రమాదం ఉండేది. కానీ, ఇద్దరు చాలా తెలివైన వ్యక్తులు దానిని నివారించారు. అది నాకు ఎంతో సంతోషం కలిగించింది. ఇరు దేశాలతోనూ అమెరికా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోనుంది. దీనికోసం కసరత్తు జరుగుతోంది' అని పేర్కొన్నారు. మరోవైపు, ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా తలెత్తిన పరిస్థితుపై అసిమ్ మునీర్‌తో చర్చించానని ట్రంప్ వెల్లడించారు. ఇరాన్ గురించి పాకిస్థాన్‌కు చాలా దేశాల కంటే ఎక్కువగానే తెలుసని, (ఇరాన్ పట్ల) వారేమీ సంతృప్తిగా లేరని, ఇజ్రాయెల్ పట్ల వ్యతిరేకతతోనూ లేరన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న పరిస్థితులపై మునీర్ తనతో ఏకీభవించారని తెలిపారు. కాగా, ఇరాన్ మీద అమెరికా కూడా దాడికి దిగబోతోందనీ.. దాంట్లో భాగంగా పాక్‌లోని సైనిక స్థావరాలను ఉపయోగించుకోవటానికే మునీర్‌తో ట్రంప్ సమావేశమయ్యారన్న విశ్లేషణలు వెలువడ్డాయి. ట్రంప్‌తో మునీర్ భేటీపై పాక్ సైన్యం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇరుదేశాలకూ దీర్ఘకాలికంగా పరస్పర ప్రయోజనం కలిగించే వాణిజ్య భాగస్వామ్య ఒప్పందానికి ట్రంప్ ఆసక్తి చూపారని ఆ ప్రకటన వెల్లడించింది. వాణిజ్యం, ఆర్థికాభివృద్ధి, గనులు, ఖనిజాలు, కృత్రిమమేధ, విద్యుత్తు, క్రిప్టోకరెన్సీ కొత్త టెక్నాలజీలు తదితర రంగాల్లో పాకిస్థాన్-అమెరికా సహకారాన్ని మరింత బలోపేతం చేయటమే లక్ష్యంగా చర్చలు జరిగాయని పేర్కొంది. కాగా, భారత్-పాకిస్థాన్ మధ్య అణుయుద్ధం తలెత్తకుండా ట్రంప్ అడ్డుకున్నారని, ఆయనకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని అసిమ్ మునీర్ పేర్కొన్నట్లుగా వార్తలు వెలువడ్డాయి. అమెరికా అధ్యక్షుడు ఒక దేశ సైన్యాధిపతికి వైట్‌హౌస్‌లో విందు ఇవ్వటం చాలా అరుదు. గతంలో పాక్ సైన్యాధిపతులు అయూబ్‌ఖాన్, జియాఉల్‌హక్, పర్వేజ్‌ముషారఫ్ ఈ తరహా ఆహ్వానాలు అందుకున్నప్పటికీ.. వారు ఆయా సమయాల్లో పాక్ సైన్యాధిపతిగానేగాక ఆ దేశ అధ్యక్షులుగా కూడా ఉన్నారు.

సోషల్ మీడియాలో మీమ్‌లు

వైట్‌హౌస్‌లో ట్రంప్-మునీర్ భేటీపై సోషల్ మీడియాలో పలు మీమ్‌లు వెలువడ్డాయి. 'బిర్యానీతో ప్రపంచ శాంతికి యత్నం' అంటూ వీరిద్దరి ఫొటోలు షేర్ చేస్తూ కొందరు కామెంట్ పెట్టారు. 'సమయం వచ్చినప్పుడు ఇరాన్‌కు పాకిస్థాన్ వెన్నుపోటు పొడిచేలా ప్రేరేపించే లక్ష్యంతోనే మునీర్‌కు ట్రంప్ ఫ్రీ లంచ్ ఇచ్చాడు' అంటూ మరికొందరు ఎద్దేవా చేశారు. త్రీ ఇడియట్స్, రిష్తే తదితర సినిమాల్లోని వీడియో క్లిప్‌లను ఎడిట్ చేస్తూ మరికొందరు కామెంట్లు పెట్టారు. కాగా, మునీర్‌తో ట్రంప్ భేటీని ప్రస్తావిస్తూ.. కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్.. అమెరికా చరిత్రలోనే అతిపెద్ద ఉగ్రదాడికి సూత్రధారి అయిన బిన్‌లాడెన్‌ను చివరి వరకూ పాకిస్థాన్ తమ దేశంలోనే దాచి పెట్టిందన్న విషయాన్ని అమెరికన్లు మర్చిపోవద్దని హెచ్చరించారు.

లోకం తీరు



హోర్ముజ్ జలసంధిని మూసేస్తాం

- మరోమారు హెచ్చరించిన ఇరాన్
- మూసేస్తే భారత్‌కూ చిక్కులు
- పెట్రో ధరలు పెరిగే అవకాశం

టెహ్రాన్, జూన్ 19: ఇజ్రాయెల్‌తో యుద్ధ వేళ ప్రపంచ చమురు సరఫరాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిని మూసేసే ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని ఇరాన్ మరోసారి బెదిరించింది. ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ కోర్ సీనియర్ కమాండర్, ఎంపీ సర్దార్ ఇస్మాయిల్ కౌసరి దీన్ని ధ్రువీకరించారు. ఇజ్రాయెల్-అమెరికా తమపై దాడి చేస్తే ఈ జలసంధిని మూసివేస్తామని ఇరాన్ గతంలోనే హెచ్చరించింది. తాజాగా ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరడంతో ఇరాన్ అన్నంత పనీ చేస్తుందా అనే ఆందోళన వ్యక్తమవుతోంది. అరేబియా సముద్రంలో ఒమన్‌కు చెందిన ముసాండం ద్వీపకల్పం-ఇరాన్ మధ్య ఉన్న ఇరుకైన ఈ జలసంధిలో ఓ చోట వెడల్పు కేవలం 33 కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. చమురు ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న ఇరాక్, సౌదీ అరేబియా, ఇరాన్, యూఏఈ, ఒమన్ దేశాల నౌకలు రాకపోకలు సాగించేది హోర్ముజ్ జలసంధి గుండానే. ఆయా దేశాల నుంచి చైనా, భారత్, జపాన్, కొరియా దేశాల చమురు, ఎల్ఎన్‌జీ దిగుమతులకు ఇదే ప్రధాన ఆధారం. ప్రపంచవ్యాప్తంగా నిత్యం వినియోగించే చమురులో 20%, సహజవాయువులో 25% పర్షియన్ గల్ఫ్ నుంచి ఈ జలసంధి గుండానే ప్రయాణిస్తుంది. ఈ నేపథ్యంలో హోర్ముజ్ జలసంధిని మూసివేస్తే భారత్‌కు కూడా తిప్పలు తప్పవు. ఎందుకంటే మన ముడి చమురు అవసరాల్లో 90 శాతం, గ్యాస్ అవసరాల్లో 50 శాతానికి దిగుమతులే దిక్కు. మన చమురు దిగుమతుల్లో ఇరాక్, సౌదీ అరేబియా, కువైట్, యూఏఈల వాటా సగం వరకు ఉంటుంది. ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మూసివేస్తే ఈ సరఫరాలకు తీవ్ర విఘాతం తప్పదు. పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగే అవకాశం ఉంది.

ఇంగ్లిష్ మాట్లాడేవారు సిగ్గుపడే రోజొస్తుంది

- స్థానిక భాషలతోనే భారతీయ సంస్కృతికి గుర్తింపు: అమిత్‌షా

న్యూఢిల్లీ, జూన్ 19: ఆంగ్ల భాష మాట్లాడేవారు సిగ్గుపడే రోజు వస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ఆ భాష వలసవాద బానిసత్వానికి చిహ్నమని తెలిపారు. కొన్నాళ్లకు ప్రజలే దానిని తిరస్కరిస్తారని కూడా వ్యాఖ్యానించారు. స్థానిక భాషలతోనే భారతీయ సంస్కృతి, వారసత్వాలకు గుర్తింపు అని.. విదేశీ భాషల స్థానాన్ని అవి ఆక్రమించాలని ఆకాంక్షించారు. హిందీని బలవంతంగా రుద్దడాన్ని, నూతన విద్యావిధానం (ఎన్ఈపీ)లో త్రిభాషా సూత్రాన్ని (స్థానిక భాష, ఆంగ్లం, హిందీ) తమిళనాడులోని డీఎంకే సహా కొన్ని ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. గురువారం ఢిల్లీలో ఐఏఎస్ అధికారి అశుతోష్ అగ్నిహోత్రి రచించిన 'మై బూంద్ హూ.. ఖుద్ సాగర్ హూ(నేను నీటి బిందువునే కాదు.. సముద్రాన్ని కూడా)' అనే పుస్తకాన్ని అమిత్‌షా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్థానిక భారతీయ భాషలు దేశం గుర్తింపునకు కీలకమన్నారు. ఆంగ్లం మాట్లాడేవారు త్వరలోనే సిగ్గుపడే పరిస్థితి వస్తుందని.. అలాంటి సమాజం రావడం ఎంతో దూరంలో లేదని తెలిపారు. ఆంగ్లం వలసవాద బానిసత్వానికి చిహ్నమని ప్రపంచవ్యాప్తంగా అందరూ భావించి దానిని తిరస్కరిస్తారని జోస్యం చెప్పారు. మన దేశాన్ని, సంస్కృతిని, చరిత్రను, మతాన్ని అర్థం చేసుకోవడానికి ఏ విదేశీ భాషా చాలదన్నారు. అసమగ్ర విదేశీ భాషలతో 'సంపూర్ణ భారతం' అనే భావనను ఊహించలేమని ఆయన చెప్పారు.

క్యూఎస్ ర్యాంకుల్లో భారత్ వర్సిటీల జోరు

- జాబితాలో 54 విద్యాసంస్థలతో రికార్డు

న్యూఢిల్లీ, జూన్ 19: ప్రపంచ యూనివర్సిటీల ర్యాంకింగ్స్‌లో మన దేశ విద్యాసంస్థలు సత్తాచాటాయి. గ్లోబల్ స్థాయి విద్యాసంస్థలకు దీటుగా నిలిచాయి. తాజాగా విడుదలైన క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్-2026 జాబితాలో రికార్డు స్థాయిలో 54 మన విద్యాసంస్థలు స్థానం సంపాదించాయి. ఈ జాబితాలో ఎక్కువ విద్యాసంస్థలు ఉన్న దేశాల్లో భారత్ నాలుగో స్థానంలో నిలవడం విశేషం. మన కంటే ముందు 192 సంస్థలతో అమెరికా, 90 ఇన్‌స్టిట్యూట్స్‌తో యూకే, 72 సంస్థలతో మెయిన్‌ల్యాండ్ చైనా ఉన్నాయి. గత ఏడాది 46 భారత విద్యాసంస్థలకు ఈ జాబితాలో చోటు దక్కింది. వీటిలో సుమారు సగం ఇన్‌స్టిట్యూట్‌లు ఈ ఏడాది తమ స్థానాలను మెరుగుపర్చుకున్నాయి. కొత్తగా ఎక్కువ వర్సిటీలకు స్థానం దక్కిన దేశాల్లో ఈ ఏడాది భారత్ ముందు వరసలో ఉంది. ఇక మన దేశ సంస్థల్లో ఐఐటీ ఢిల్లీ రెండేళ్ల క్రితం కంటే 70 స్థానాలు మెరుగుపర్చుకుని 123వ స్థానం సాధించింది. ఐఐటీ బాంబే మాత్రం గత ఏడాది 118వ ర్యాంకు నుంచి.. ఈసారి 129వ స్థానానికి పడిపోయింది. ఐఐటీ మద్రాస్ 47 స్థానాలు ఎగబాకి 180వ స్థానం పొందింది. ఢిల్లీ యూనివర్సిటీ 328వ ర్యాంకును నిలబెట్టుకుంది. జేఎన్‌యూ తన ర్యాంకును మెరుగుపర్చుకుని 558వ స్థానం పొందింది. హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ ఓవరాల్ ర్యాంకింగ్‌లో 801-850 మధ్య నిలిచ్చింది. సైటేషన్స్ పర్ ఫ్యాకల్టీ విభాగంలో 335 స్థానాన్ని దక్కించుకుంది. క్యూఎస్ ర్యాంకుల పట్ల ప్రధాని మోదీ ఎక్స్‌లో స్పందిస్తూ.. దేశంలో విద్యారంగానికి ఇదో గొప్ప శుభవార్త అని చెప్పారు.

జస్టిస్ వర్మ ఇంటి వద్ద నోట్ల కట్టలు నిజమే

- 10 మంది ప్రత్యక్ష సాక్షులు చెప్పారు
- ఆ స్టోర్ రూమ్‌పై నియంత్రణ జస్టిస్ వర్మ, ఆయన కుటుంబసభ్యులకే ఉంది
- డబ్బు గురించి రాయొద్దని ఫైర్ సిబ్బందిని జడ్జి వ్యక్తిగత కార్యదర్శి ఆదేశించారు
- త్రిసభ్య కమిటీ 64 పేజీల నివేదిక



న్యూఢిల్లీ, జూన్ 19: జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంటి ప్రాంగణంలోని స్టోర్ రూమ్‌లో పెద్ద మొత్తంలో నోట్లకట్టలు ఉన్నది నిజమేనని.. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి నియమించిన త్రిసభ్య కమిటీ తేల్చింది. కాలిన నోట్ల కట్టలు దొరికిన ఆ స్టోర్ రూమ్.. జస్టిస్ వర్మ, ఆయన కుటుంబసభ్యుల పరోక్ష/ప్రత్యక్ష పర్యవేక్షణలోనే ఉండేదని... అనుమతి లేకుండా ఆ గదిలోకి బయటివ్యక్తులు రావడానికి అవకాశం లేదని స్పష్టం చేసింది. ఈ ఏడాది మార్చి 14న రాత్రి ప్రమాదం జరిగితే.. 15వ తేదీ తెల్లవారుజామున ఆ గదిలోంచి సగం కాలిన నోట్లను తొలగించారనడానికి ఆధారాలున్నాయని పేర్కొంది. మంటలు ఆర్పేవారికి ఆరోజు కనిపించినవి చిన్న నోట్లు కావని, ఆ సొమ్ము చిన్నమొత్తం కాదని.. జస్టిస్ వర్మ లేదా ఆయన కుటుంబసభ్యుల ప్రత్యక్ష, పరోక్ష అంగీకారం లేకుండా ఆ గదిలో ఎవరూ పెట్టలేరని తెలిపింది. ఆయన్ను విధుల నుంచి తొలగించడానికి అవసరమైన అన్ని ఆధారాలూ ఉన్నాయని పేర్కొంది. ప్రస్తుతం అలహాబాద్ హైకోర్టు జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న జస్టిస్ యశ్వంత్‌వర్మ.. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న సమయంలో.. ఈ ఏడాది మార్చి 14న ఆయన నివాస ప్రాంగణంలోని ఒక స్టోర్‌రూమ్‌లో అగ్నిప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఆ గదిలో కాలన నోట్ల కట్టల తాలూకూ ఫొటోలు అప్పట్లో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. దీనిపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం కావడంతో.. ముగ్గురు సిటింగ్ జడ్జిలతో సుప్రీం సీజే విచారణ బృందాన్ని ఏర్పాటు చేశారు. విచారణలో భాగంగా ఈ ప్యానెల్.. 55 మంది సాక్షులను ప్రశ్నించింది. జస్టిస్ వర్మ వాంగ్మూలాన్ని నమోదు చేసింది. విచారణలో తేలిన అంశాలతో 64 పేజీల నివేదికను ఈ ఏడాది మే 4వ తేదీనే సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి సమర్పించింది. అందులోని పలు అంశాలు ఇప్పటిదాకా బయటకు వచ్చాయి. ఇప్పుడు పూర్తిస్థాయి నివేదిక ప్రజాబాహుళ్యానికి అందుబాటులోకి వచ్చింది.

నివేదికలో ఏముందంటే..

కనీసం 10 మంది సాక్షులు ఆ గదిలో సగం కాలిన నోట్లను తాము చూసినట్టు తెలిపినట్టు కమిటీ తన నివేదికలో వెల్లడించింది. "నేను లోపలికి వెళ్లగానే.. గదిలో కుడివైపు, ఎదురుగా పెద్ద ఎత్తున రూ.500 నోట్ల కట్టలు నేల మీద పడిఉన్నాయి. అంత పెద్ద ఎత్తున నోట్ల కట్టలు నేలపై పడి ఉండడం చూసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను. అలా చూడ్డం నా జీవితంలోనే అదే మొదటిసారి" అని ఒక సాక్షి చెప్పిన వివరాలను నివేదికలో పొందుపరిచింది. అలాగే.. ప్రమాదస్థలిని శుభ్రం చేయడం, ఆధారాలను ధ్వంసం చేయడంలో జస్టిస్ వర్మ వ్యక్తిగత కార్యదర్శి రాజేందర్ సింగ్ కార్కి, ఆయన కుమార్తె దియా వర్మ పాత్ర పైనా త్రిసభ్య కమిటీ విచారణ జరిపింది. గదిలో ఉన్న కరెన్సీ నోట్ల గురించి రిపోర్టులో రాయొద్దని రాజేందర్ సింగ్ కార్కి తమతో చెప్పినట్టు.. మంటలు ఆర్పడానికి వెళ్లిన అగ్నిమాపక శాఖ సిబ్బంది త్రిసభ్య కమిటీకి వెల్లడించారు. ఒకవేళ ఇది తనపై పన్నిన కుట్రగా జస్టిస్ వర్మ భావించి ఉంటే.. ఆయన వెంటనే పోలీసులను సంప్రదించి ఫిర్యాదు ఎందుకు చేయలేదని, ఢిల్లీ హైకోర్టు సీజే దృష్టికిగానీ, సీజేఐ దృష్టికిగానీ ఎందుకు తేలేదని ప్రశ్నించింది. ఐదుగురు సెక్యూరిటీ గార్డులు నిరంతరం కాపలా కాసే సిట్టింగ్ జడ్జి ఇంటి ప్రాంగణంలోని స్టోర్ రూమ్‌లో ఎవరో వచ్చి నోట్ల కట్టలు పెట్టడం అసాధ్యమని స్పష్టం చేసింది.

ఆ వ్యాఖ్యలు అగ్నిమాపక శాఖ అధికారివే..

మంటలు ఆర్పడానికి వెళ్లిన అగ్నిమాపక సిబ్బంది అక్కడ తీసిన వీడియోలో.. 'మహాత్మాగాంధీ మే ఆగ్ లగ్‌రహాహై (మహాత్ముడి బొమ్మ ఉన్న నోట్లు కాలిపోతున్నాయని దీని భావం)' అనే వ్యాఖ్యలు వినిపించాయని, ఆ వ్యాఖ్యలు చేసింది ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ స్టేషన్ ఆఫీసర్ మనోజ్ మెహ్లావత్ అని కమిటీ తన నివేదికలో తెలిపింది. ఈ కేసులో.. అందుబాటులో ఉన్న ప్రత్యక్ష, ఎలక్ట్రానిక్ ఆధారాలను బట్టి.. జస్టిస్ వర్మపై ఆరోపణలకు తగు ఆధారాలు ఉన్నట్టు విశ్వసిస్తున్నామని.. ఆయన దుర్వర్తన రుజువైందని పేర్కొంది. ఆయన్ను విధుల నుంచి తొలగించే ప్రక్రియ చేపట్టేందుకు ఈ ఆధారాలు సరిపోతాయని పేర్కొంది.

నాది కాదు..

తన నివాసప్రాంగణంలోని స్టోర్ రూమ్‌లో తగలబడ్డ నోట్ల కట్టలు వెలుగుచూసినప్పటికీ.. వాటితో తనకు ఏ సంబంధమూ లేదని జస్టిస్ వర్మ దీనిపై విచారణ జరిపిన త్రిసభ్య ప్యానెల్‌కు తెలిపారు. స్టోర్ రూమ్‌లోకి నోట్ల కట్టలు ఎలా వచ్చాయి? మార్చి 15 తెల్లవారుజామున ఆ గదిలోంచి సగం కాలిన నోట్లను ఎవరు తీశారు? అంటూ త్రిసభ్య కమిటీ అడిగిన ప్రశ్నలకు జస్టిస్ వర్మ 101 పేజీల సమాధానం ఇచ్చారు. స్టోర్ రూమ్‌లో ఉన్నట్టుగా చెబుతున్న నగదు అక్కడికి రావడంలో తన పాత్ర ఏమీ లేదని పేర్కొన్నారు. అక్కడున్న సీసీ కెమెరాలు పనిచేయకపోతే అది తన తప్పు కాదన్నారు. నిజానికి ఆ కెమెరాలు ప్రమాదానికి ముందు బాగానే పనిచేశాయని.. పోలీసులు వాటిని తీసే క్రమంలో పాడై ఉంటాయని పేర్కొన్నారు. అయితే, ఆయన వాదనను త్రిసభ్య కమిటీ తోసిపుచ్చింది. పోలీసులు దాన్ని స్వాధీనం చేసుకునేలోపు ఆ డేటాను భద్రపరించేందుకు తగిన సమయం జస్టిస్ వర్మకు ఉందని స్పష్టం చేసింది.

(మొదటిపేజీ తరువాయి)

భీకర యుద్ధం..!

దెబ్బతింది. బుధవారం ఈ ఆస్పత్రిలోని ఒక భాగం(సర్జికల్ బ్లాక్)లో ఉన్న రోగులను ఇజ్రాయెల్ ప్రభుత్వం వేరే బ్లాకుకు తరలించింది. సరిగ్గా ఖాళీ చేసిన బ్లాక్‌పై ఇరాన్ క్షిపణులు పడ్డట్లు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) వెల్లడించింది. ఈ ఆస్పత్రిలో 45 మంది గాయాలపాలవ్వగా.. వేర్వేరు ప్రాంతాల్లో గురువారం జరిగిన దాడుల్లో క్షతగాత్రుల సంఖ్య 200లకు పైగా ఉన్నట్లు వివరించింది. ఆస్పత్రి సమీపంలోని ఓ పాఠశాల, టెల్‌అవీవ్‌లోని ఇజ్రాయెల్ స్టాక్ ఎక్స్‌చేంజ్ భవనంపైనా ఇరాన్ దాడులు జరిగాయి. జనావాసాలను ఇరాన్ టార్గెట్‌గా చేసుకోవడంతో.. ఇజ్రాయెల్ ప్రతిదాడి చేపట్టింది. అరాక్ భారజల రియాక్టర్ ప్రాంగణంలో పనిచేసే కార్మికులు, పరిసరాల్లో ఉండే పౌరులు వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలంటూ పర్షియా భాషలో ఐడీఎఫ్ హెచ్చరికలు జారీ చేసింది. గంట తర్వాత ఇజ్రాయెల్ వైమానిక దళం భారజల రియాక్టర్‌పై విరుచుకుపడింది.

టెల్‌అవీవ్‌కు భారీ నష్టం

బుధవారం అర్ధరాత్రి నుంచి ఇరాన్ జరిపిన క్షిపణి దాడుల్లో టెల్‌అవీవ్‌కు భారీ నష్టం జరిగింది. "గురువారం ఉదయం వరకు ఇరాన్ 30 బాలిస్టిక్ క్షిపణులు, 17 యూఏవీలను ప్రయోగించింది. వాటిల్లో ఒక క్షిపణి క్లస్టర్‌బాంబులను జారవిడిచింది. టెల్‌అవీవ్‌లోని జనావాసాలనే ఇరాన్ టార్గెట్‌గా చేసుకుంటోంది. ఈ భూమ్మీద బతకడానికి ఖమేనీ ఏమాత్రం అర్హుడు కాడు" అని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్ వ్యాఖ్యానించారు. జనావాసాలు, ఆస్పత్రులను టార్గెట్‌గా చేసుకుంటూ.. ఇరాన్ యుద్ధ నేరాలకు పాల్పడుతోందంటూ మండిపడ్డారు. ఇరాన్ క్షిపణులు గుష్‌డాన్, నెగెవ్, రామత్‌గాన్, హోలోన్, టెల్‌అవీవ్ ప్రాంతాలను తాకినట్లు ఐడీఎఫ్ తెలిపింది. "సోరోకా ఆస్పత్రి, స్టాక్ ఎక్స్‌చేంజ్ భవనాలకు భారీ నష్టం సంభవించింది. టెల్‌అవీవ్, రామత్‌గన్, హోలోన్‌లో జనావాసాలు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. ఈ యుద్ధంలో ఇప్పటి వరకు 5 వేల మంది నిరాశ్రయులయ్యారు. క్షతగాత్రుల సంఖ్య 650కి పెరిగింది" అని వివరించింది.



ఇరాన్ క్షిపణి దాడులతో టెల్‌అవీవ్‌లో ధ్వంసమైన భవనాలు

టెహ్రాన్‌పై భీకర దాడులు

యుద్ధం ఏడోరోజైన గురువారం ఇరాన్‌లో అరాక్‌లోని భారజల రియాక్టర్ కేంద్రాన్ని, మధ్య, పశ్చిమ టెహ్రాన్‌లలోని ఆయుధ డిపోలు, క్షిపణి లాంచర్లు, ఇతర సైనిక లక్ష్యాలను ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ తెలిపింది. కరాజ్‌లో వైమానిక స్థావరాలపైనా దాడులు జరిగినట్లు ఇరాన్ మీడియా వెల్లడించింది. ఇక ఇజ్రాయెల్ అనుకూల హ్యాకర్ల బృందం 'ప్రిడేటరీ స్పారో' ఇరాన్‌లోని అతిపెద్ద క్రిప్టో కరెన్సీ ఎక్స్‌చేంజ్ 'నోబిటెక్స్'పై పంజా విసిరి.. రూ.785 కోట్లను కొల్లగొట్టింది. కాగా ఇరాన్‌లో 639 మంది మరణించారని, 1,329 మంది క్షతగాత్రులయ్యారని మానవ హక్కుల సంఘాలు వెల్లడించాయి. ఇరాన్‌లో మూడో రోజూ ఇంటర్నెట్ పనిచేయలేదు. యుద్ధాన్ని కవర్ చేస్తున్న జర్నలిస్టులు సైతం వెబ్ ఎడిషన్లకు అప్‌డేట్స్ ఇవ్వలేకపోయారని తెలుస్తోంది.

బుషెహర్‌లో దాడులను ఆపండి: రష్యా

ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంలో సైనికపరంగా జోక్యం చేసుకోవద్దని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను రష్యా డిమాండ్ చేసింది. ఇరాన్-ఇజ్రాయెల్ నడుమ మధ్యవర్తిత్వానికి తాను సిద్ధంగా ఉన్నానని పుతిన్ పేర్కొన్నారు. అయితే ట్రంప్ దీనిపై స్పందిస్తూ.. ముందు రష్యా, ఉక్రెయిన్‌తో మధ్యవర్తిత్వం జరుపుకోవాలని.. తర్వాత దీని గురించి ఆలోచిద్దామని పుతిన్‌కు చెప్పినట్లు పేర్కొన్నారు. ఇక ఇరాన్‌పై తమ మిలటరీ దాడికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యక్తిగతంగా ఆమోదం తెలిపారు. అయితే.. తుది ఉత్తర్వులను ఇంకా విడుదల చేయాల్సి ఉంది. కాగా.. బుషెహర్‌లోని ఇరాన్ అణు విద్యుత్తు కేంద్రంలో రష్యా నిపుణులు, కార్మికులు పనిచేస్తున్నారని, అక్కడ దాడులు వద్దని ఇజ్రాయెల్‌ను రష్యా డిమాండ్ చేసింది. మరోవైపు ఇరాన్ దాడి చేయవచ్చన్న అంచనాల నేపథ్యంలో అమెరికా పశ్చిమాసియాలోని తన బేస్‌లను ఇతర ప్రాంతాలకు తరలిస్తోందంటూ రాయిటర్స్ వార్తాసంస్థ ఓ కథనాన్ని ప్రచురించింది. కాగా, ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్‌కు చెందిన 18 మంది ఏజెంట్లను అరెస్టు చేసినట్లు ఇరాన్ ప్రకటించింది.

టెహ్రాన్ నుంచి భారత్‌కు చేరిన విద్యార్థులు

ఇరాన్‌లో 10వేల మందిదాకా భారత విద్యార్థులు ఉండగా తొలివిడతలో 'ఆపరేషన్ సింధూ'లో భాగంగా 110 మంది భారత్ చేరుకున్నారు. ఇరాన్ నుంచి రోడ్డు మార్గంలో ఆర్మేనియాకు అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి చేరుకున్నారు. "గగనతలం లో క్షిపణుల వర్షం.. సైరన్ల మోత.. బాంబు పేలుళ్లు..! కళ్ల ముందే దారుణాలు జరిగాయి" అని విద్యార్థులు పేర్కొన్నారు.

బెయిల్ ఇవ్వండి

హైకోర్టును ఆశ్రయించిన పీఎస్ఆర్, మధుసూదన్

అమరావతి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష మూల్యాంకనంలో అక్రమాలు, నిధుల దుర్వినియోగం కేసులో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ క్యామ్ సైన్ సంస్థ డైరెక్టర్ మధుసూదన్(ఏ2) వేసిన పిటిషన్ గురువారం హైకోర్టులో విచారణకు వచ్చింది. కేసుకి సంబంధించి పూర్తి వివరాలు తమ ముందు ఉంచాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. విచారణను ఈనెల 25కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. మరోవైపు ఇదే కేసులో నిందితుడిగా ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు(ఏ1) బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ హైకోర్టులో తాజాగా మరో పిటిషన్ దాఖలు చేశారు. అయితే వ్యాజ్యానికి నంబరు ఇచ్చేందుకు రిజిస్ట్రీ నిరాకరించారు. దీంతో ఈ వ్యవహారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు ముందుకు వచ్చింది. న్యాయమూర్తి స్పందిస్తూ... 'అనారోగ్య కారణాలతో ట్రయల్ కోర్టు రెండు వారాల పాటు మధ్యంతర బెయిల్ ఇచ్చింది. ఆ గడువు ముగియకుండా బెయిల్ పిటిషన్ ఎలా దాఖలు చేస్తారు?' అని ప్రశ్నించారు. పీఎస్ఆర్ తరఫు న్యాయవాది అభయ్ సిద్ధాంత్ వాదనలు వినిపిస్తూ... 'పిటిషనర్‌కు బైపాస్ సర్జరీ అవసరమని వైద్యులు సూచించారు. మధ్యంతర బెయిల్ గడువు 27తో ముగుస్తుంది. ఈ నేపథ్యంలోనే అత్యవసరంగా బెయిల్ పిటిషన్ దాఖలు చేశాం' అని వివరించారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ పీఎస్ఆర్ వేసిన పిటిషన్‌కు నంబరు కేటాయించాలని రిజిస్ట్రీని ఆదేశించారు. ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష మూల్యాంకనంలో అక్రమాలకు పాల్పడడంతోపాటు నిధుల దుర్వినియోగం చేశారని పేర్కొంటూ విజయవాడ సూర్యారావుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు(ఏ1), మధుసూదన్(ఏ2)ను పోలీసులు నిందితులుగా చేర్చిన విషయం తెలిసిందే.

కృష్ణంరాజుపై కేసు వివరాలు సమర్పించండి

▸ తుళ్లూరు పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): అమరావతిపై జర్నలిస్టు వీవీఆర్ కృష్ణంరాజు చేసిన అనుచిత వ్యాఖ్యల కేసుకు సంబంధించి పూర్తి వివరాలు తమ ముందు ఉంచాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. కేసు తదుపరి విచారణను ఈ నెల 25కి వాయిదా వేసింది. గురువారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ కృష్ణంరాజు వేసిన పిటిషన్ హైకోర్టులో విచారణకు వచ్చింది. కృష్ణంరాజు తరఫు న్యాయవాది డీఎస్ఎన్వీ ప్రసాద్‌బాబు చెప్పిన వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి విచారణను వాయిదా వేశారు.

సోషల్ పోస్టుల కేసులో కౌంటర్ వేయండి

▸ హోం శాఖకు హైకోర్టు ఆదేశం

అమరావతి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అనుచిత, అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్లలో వరుస కేసులు నమోదు చేయడాన్ని సవాల్ చేస్తూ వైసీపీ సానుభూతిపరుడు పందరబోయిన తిరుమల కృష్ణ దాఖలు చేసిన పిటిషన్ గురువారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని హోం శాఖ ముఖ్యకార్యదర్శి, డీజీపీని ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే నెల 17కి వాయిదా వేసింది. గురువారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు.

బనకచర్లపై ఏకపక్ష నిర్ణయం సరికాదు: రామకృష్ణ

అమరావతి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): 'బనకచర్ల ప్రాజెక్టుపై ఏకపక్ష నిర్ణయం సరికాదు. ఈ ప్రాజెక్టుపై చర్చించడానికి అఖిలపక్ష నాయకులతోపాటు జలవనరుల నిపుణులు, రైతు సంఘ నాయకులతో తక్షణమే సమావేశం ఏర్పాటు చేయాలి' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం విజయవాడలోని దాసరి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ ప్రాజెక్టు గురించి చంద్రబాబు రాష్ట్రంలోని అన్ని పార్టీలతో ఎందుకు చర్చించడం లేదు? అని రామకృష్ణ ప్రశ్నించారు.

కసిరెడ్డి బెయిల్ పిటిషన్ విచారణ వాయిదా

విజయవాడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో రిమాండ్ ఖైదీలుగా ఉన్న కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, పైలా దిలీప్ బెయిల్ పిటిషన్లపై విచారణను ఏసీబీ కోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది. మరో నిందితుడు చాణక్య బెయిల్ పిటిషన్‌పై ఆయన న్యాయవాది సుందరం వాదనలు వినిపించడానికి సమయం కావాలని కోరడంతో విచారణను ఈనెల 23కు న్యాయాధికారి పి.భాస్కరరావు వాయిదా వేశారు. ఈ మూడు బెయిల్ పిటిషన్లపై కోర్టులో గురువారం విచారణ జరిగింది.

సచివాలయ కార్యకలాపాల సమీక్షకు కమిటీ

అమరావతి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సచివాలయంలో ఫైల్స్ నిర్వహణలో వేగం, జవాబుదారీతనం, పారదర్శకత, సత్వర నిర్ణయాలు తీసుకునేందుకు ప్రభుత్వం సరికొత్త బిజినెస్ రూల్స్ సిద్ధం చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా గురువారం ఎనిమిది మంది సీనియర్ ఐఏఎస్ అధికారులతో ప్రత్యేక కమిటీని నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీకి సాధారణ పరిపాలన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. ఆయనతో పాటు ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి, జీఏడీ ప్రధాన కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శి, పీఆర్ అండ్ ఆర్డీ, మున్సిపల్ శాఖల ముఖ్య కార్యదర్శులను సభ్యులుగా.. క్యాబినెట్ డిప్యూటీ సెక్రటరీని కన్వీనర్‌గా నియమించారు. కమిటీ 15 రోజుల్లోగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

23న 'సుపరిపాలన-తొలి అడుగు' సభ

అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ఈనెల 23వ తేదీన అమరావతి సచివాలయం వద్ద 'సుపరిపాలన-తొలి అడుగు' పేరుతో సభ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సీఎస్ విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. అధికారులు, సిబ్బంది హాజరు కావాలని పేర్కొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయండి

▸ ఆరోగ్య మంత్రి సత్యకుమార్ పిలుపు

అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): యోగాకు మరింత ప్రాచుర్యం కల్పించడంతో పాటు రాష్ట్ర ప్రజల ఆరోగ్య ప్రయోజనాల దృష్ట్యా ఒక యజ్ఞంలా చేపట్టిన 'యోగాంధ్ర' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ కోరారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన జారీచేశారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

ఆరోగ్యశాఖలో పలువురు డీడీలు బదిలీ

అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య శాఖలో సాధారణ బదిలీల్లో భాగంగా పలువురు సీనియర్ డిప్యూటీ డైరెక్టర్లను బదిలీ చేశారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో కొన్నేళ్లుగా సీఏవోగా విధులు నిర్వహిస్తున్న ఎం.గణపతిరావును స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఎస్ఏసీఎస్)కి డీడీగా పంపారు. ఎన్‌హెచ్ఎం సీఏవో పోస్టుకు డి.ప్రకాశరావును నియమించారు. డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌లో డీడీగా పనిచేస్తున్న వి.వి.శేషారెడ్డిని ఎన్‌హెచ్ఎంలోని అర్బన్ హెల్త్ మిషన్ స్టేట్ నోడల్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు.

ఎమ్మెల్యే కిడారి, సోమల

హంతకులు వీళ్లే

▸ గాజర్ల రవి, అరుణపై 150 కేసులు, 20 లక్షల రివార్డు

▸ పాపికొండలు అడవుల్లో మూడు నెలలుగా మకాం

▸ మృతిని ధ్రువీకరించిన అల్లూరి జిల్లా ఎస్పీ బర్దార్

విశాలాక్షి నగర్ (విశాఖపట్నం), రంపచోడవరం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేంద్ర కమిటీ సభ్యుడు గాజర్ల రవి అలియాస్ ఉదయ్, ఏవోబీ కమిటీ సీనియర్ నాయకురాలు వెంకటరవి చైతన్య అలియాస్ అరుణ, కమిటీ మెంబరు అంజూ అలియాస్ మాసే మృతి చెందినట్టు ఎస్పీ అమిత్ బర్దార్ ధ్రువీకరించారు. 2018లో అప్పటి అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమల హత్య ఘటనలో వీరు పాల్గొన్నారని తెలిపారు. కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వు కార్యాలయంలో గురువారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. బుధవారం ఉదయం మారేడుమిల్లి అడవుల్లో ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన కాల్పుల్లోనే వీరు మరణించారన్నారు. అల్లూరి జిల్లాలో గాజర్ల రవిపై సుమారు 150కి పైగా కేసులు, ఇరవై లక్షల రూపాయల రివార్డు ఉందన్నారు. అరుణపై సుమారు 150కి పైగా కేసులు, ఇరవై లక్షల రూపాయల రివార్డు ఉన్నట్టు చెప్పారు. అంజూపై 22 కేసులు, లక్ష రూపాయల రివార్డు ఉన్నట్టు వివరించారు.



అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్

శేషరాయి కాల్పుల్లో తప్పించుకుని..

అల్లూరి జిల్లా శేషరాయి అడవుల్లోను, మంప అడవుల్లోను జరిగిన ఎన్‌కౌంటర్ల నుంచి ఇటీవల రవి, అరుణ త్రుటిలో తప్పించుకున్నారని ఎస్పీ తెలిపారు. మూడు నెలలుగా అల్లూరి జిల్లాలో తిరుగుతున్నారని పేర్కొన్నారు. పాపికొండలు అభయారణ్యంలో రంపచోడవరం, దేవీపట్నం, మారేడుమిల్లి సరిహద్దుల్లో వీరి కదలికలు ఎక్కువగా ఉండేవన్నారు. ఈ ప్రాంతంలోనే బుధవారం ఎన్‌కౌంటర్ జరిగిందని, లొంగిపోవాలని ఎంత చెప్పినా వినకపోవడంతోనే కాల్పులు జరపాల్సి వచ్చిందని వివరించారు. ఉద్యమం నుంచి బయటకు వచ్చి లొంగిపోయే వారికి హానీ తలపెట్టమని, అన్ని సహకారాలు అందిస్తామని ఎస్పీ తెలిపారు.

బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్‌తో మంత్రి లోకేశ్ భేటీ

▸ విద్యలో ఏఐ టూల్స్ వినియోగంపై చర్చ

▸ నైపుణ్య శిక్షణలో సహకారానికి ఒప్పందం

న్యూఢిల్లీ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నైపుణ్య శిక్షణ అంశాలు, గ్లోబల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్(జీఐజీజీ) స్థాపనకు సహకారంపై ఏపీ ప్రభుత్వం, టోనీ బ్లెయిర్ ఇనిస్టిట్యూట్ మధ్య గురువారం ఒప్పందం కుదిరింది. ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్(టీబీఐ) వ్యవస్థాపకుడు, బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్‌తో రాష్ట్ర మంత్రి లోకేశ్ గురువారం తాజ్ ప్యాలెస్‌లో భేటీ అయ్యారు. రాష్ట్రంలో అమలుచేస్తున్న నైపుణ్యాభివృద్ధి అజెండా, నైపుణ్య గణన, దేశం వెలుపల యువతకు ఉపాధి తదితర అంశాల్లో టీబీఐ సాంకేతిక మద్దతుపై చర్చించారు. ఆగస్టులో విశాఖలో జరగబోయే రాష్ట్రాల విద్యామంత్రుల సదస్సుకు టీబీఐ భాగస్వామిగా ఉంటుందని బ్లెయిర్ హామీ ఇచ్చారు. గతేడాది జూలైలో టోనీ బ్లెయిర్‌ను లోకేశ్ ముంబైలో కలిశారు. ఏపీ ప్రభుత్వ కార్యకలాపాలు, విద్యావ్యవస్థలో ఏఐ టూల్స్‌ను ఉపయోగించడానికి టీబీఐ ద్వారా సహకరించేందుకు బ్లెయిర్ అప్పుడు అంగీకరించారు. విద్యారంగంలో అధునాతన సాంకేతికతను అమలుచేయడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడానికి ఏపీ విద్యాశాఖ, టీబీఐ మధ్య గతేడాది డిసెంబర్‌లో ఒప్పందం కుదిరింది. ఆ ఒప్పందంలో భాగంగా టీబీఐ విజయవాడలో తమ ఎంబెడెడ్ బృందాన్ని మోహరించి రెండు ప్రధాన అంశాలపై దృష్టి సారించి అభివృద్ధి చేస్తోంది. అందులో ఒకటి ఏపీ ఉన్నత విద్యలో సంస్కరణలు కాగా, రెండోది జీఐజీజీ స్థాపన. ఏపీ విద్యాశాఖ, టీబీఐ మధ్య ఒప్పందం తర్వాత ఏ మేరకు పురోగతి సాధించారనే అంశంపై గురువారం భేటీలో ఇరువురు నేతలు సుదీర్ఘంగా సమీక్షించారు. సమావేశంలో ఏపీభవన్ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్, విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్, బ్లెయిర్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



లోకేశ్, టోనీ బ్లెయిర్ సమక్షంలో ఒప్పందంపై సంతకాలు చేస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మునీర్ ముచ్చట్లు

పాకిస్థాన్ సైన్యాధ్యక్షుడు ఆసీమ్ మునీర్‌కు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఎర్రతివాచీ పరిచి, కడుపునిండా భోజనం పెట్టడం, మనకు సరే, పాకిస్థాన్ మేధావులకు సైతం ఆశ్చర్యం కలిగించింది. ఈ భేటీకోసమే ట్రంప్ తన జీ7 పర్యటనను హడావుడిగా ముగించుకొని శ్వేతసౌధానికి పరుగులు తీశారు. మునీర్–ట్రంప్ భేటీకి ముందే మోదీ–ట్రంప్ టెలిఫోన్ సంభాషణ జరిగి, ఇంతకాలమూ తన మనసులో ఉన్న, గట్టిగా అనాలనుకుంటున్న మాటని మోదీ ట్రంప్‌కు చెప్పేశారు. ఇటీవలి భారత్–పాక్ ఘర్షణలను తానే ఆపానని, వాణిజ్యాయుధాన్ని ప్రయోగించి ఈ రెండు అణ్వస్త్రదేశాలను దారికితెచ్చానని ట్రంప్ ఇప్పటికి ఓ పదిసార్లయినా చెప్పుకొని ఉంటారు. ఆదిలో ఆయన మాటని కాదనలేకపోయినా, ఆయన అదేపనిగా అంటూంటే, అందులో ఉన్న మహాప్రమాదాన్ని మనం త్వరితంగానే గుర్తించాం. నర్మగర్భంగానో, పరోక్షంగానో కాదనడంతో ఆరంభించి, ఎవరూ మధ్యవర్తిత్వం వహించాల్సిన అవసరం లేదన్న మాట ఆఖరుకు గట్టిగా అనడం మొదలెట్టాం. పహల్గాం ప్రతీకారంలో భాగంగా మనం పాక్‌కు సింధుజలాలను కాదంటే, పాకిస్థాన్ సిమ్లా ఒప్పందాన్నే కాలదన్ని, మధ్యవర్తులు చొచ్చుకువచ్చేందుకు దారులు తెరిచిన విషయం తెలిసిందే. దాడులు ఆపమంటూ పాకిస్థాన్ కాళ్ళావేళ్ళాపడిందని మనం చెప్పుకుంటూవుంటే, కాదుకాదు ట్రంప్ ఆదేశాలమేరకే కాల్పుల విరమణ జరిగిందని పాకిస్థాన్ సైన్యాధ్యక్షుడు గట్టిగా చెప్పి, ఏకంగా నోబెల్‌శాంతినే ఇవ్వాలంటున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, వీరిరువురి భేటీకి ముందే కాల్పుల విరమణతో అమెరికాకు సంబంధం లేదని మోదీ గట్టిగా చెప్పారు. అయినా కూడా, అప్పట్లో తానే నిప్పులమీద నీళ్ళుపోశానంటూ ట్రంప్ పాతపాటే పాడారు. అంతేకాదు, పాక్ సేనానినీ, భారత ప్రధానినీ సమం చేస్తూ, ఇద్దరూ గొప్పవారేనని కీర్తిస్తూ, రెండు దేశాలనూ ఒకేగాటన కట్టేయడం మరో విషాదం.

నరేంద్రమోదీ ఆప్తమిత్రుడైన అమెరికా అధ్యక్షుడు, పాకిస్థాన్ సర్వసైన్యాధ్యక్షుడిని భోజనానికి పిలవడం మీద విపక్ష కాంగ్రెస్ విరుచుకుపడుతోంది. తన వ్యాఖ్యలతో పహల్గాం ఉగ్రదాడిని ప్రోత్సహించడమే కాక, అనంతరం ఆ దాడికి సంబంధించి అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని శ్వేతసౌధానికి పిలిచి గౌరవించడం మన దౌత్యవిధానం వైఫల్యమని కాంగ్రెస్ అంటోంది. కశ్మీర్‌లో తృతీయపక్షం జోక్యాన్ని అనుమతించబోమని ట్రంప్‌కు మోదీ గట్టిగా చెప్పారన్న విదేశాంగశాఖ వివరణను కూడా కాంగ్రెస్ తీసిపారేస్తోంది. భ్రమలు పక్కనబెట్టి వాస్తవికంగా వ్యవహరించాలని హితవు చెబుతోంది. గతంలో అమెరికా అధ్యక్షులు పాక్ సైన్యాధ్యక్షులతో భేటీలు జరిపిన సందర్భాలు లేకపోలేదు. అయితే, ఫీల్డ్‌మార్షల్ అయూబ్‌ఖాన్, జనరల్ జియా ఉల్‌హక్, జనరల్ పర్వేజ్ ముషార్రఫ్ శ్వేతసౌధంలో విందు అందుకొనేటప్పటికే పాక్‌లో తిరుగుబాటు చేసి పాలకులుగా అవతరించినవారు. కానీ, ఇప్పుడు పాకిస్థాన్‌లో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం ఉన్నది, అధ్యక్ష ప్రధానులతో సహా ఒక రాజ్యాంగబద్ధ వ్యవస్థ ఉన్నది. అయినా కూడా, షరీఫ్‌లూ భుట్టోలను పక్కకు నెట్టి నేరుగా మునీర్‌తో ట్రంప్ ముచ్చటాడటాన్ని బట్టి పాక్‌ను ఏలుతున్నది సైన్యమేననీ, అక్కడ ఉన్నది అనధికార నియంతృత్వమేనని మరోమారు స్పష్టంగా తెలిసొచ్చింది. తక్కువ ర్యాంకుతో త్వరలో రిటైరు కావాల్సి ఉన్న మునీర్‌ను, ఇమ్రాన్‌ఖాన్ మీద అతడికి ఉన్న అమితమైన ద్వేషమే అర్హతగా షరీఫ్ సోదరులు సైన్యాధ్యక్షుడిని చేస్తే, పహల్గాం ఉగ్రఘాతుకానికి జవాబుగా భారత్ నిర్వహించిన ప్రతీకార దాడులతో అతడు ఏకంగా ఫీల్డ్‌మార్షల్ అయ్యాడు, పాకిస్థాన్ రక్షకుడుగా అవతరించి, ప్రపంచ వ్యవహారాలు చక్కబెడుతున్నాడు.

ఒక గంటలో ముగియాల్సిన ట్రంప్–మునీర్ భేటీ రెండుగంటలు సాగిందట. తమపై అణుబాంబు వేస్తే, ఇజ్రాయెల్ మీద పాకిస్తాన్ అణుబాంబు వేస్తుందని వ్యాఖ్యానించిన ఇరాన్‌ను ఈ భేటీ నివ్వెరపరిచింది. ఇరాన్‌మీద ఇజ్రాయెల్ దాడులు ఆరంభించిన మరుక్షణంలోనే మునీర్ ఎంతో ఆగ్రహంగా, ఇస్లామిక్ దేశాలన్నీ ఒక్కటిగా నిలిచి ఇరాన్‌ను కాపాడుకోవాలనీ, లేదంటే ఇలా ఒక్కోదేశమూ నాశనమైపోతూనే ఉంటుందని హెచ్చరించారు. అటువంటి మునీర్ ఇప్పుడు ట్రంప్‌తో భేటీ అయిన నేపథ్యంలో, పాక్ భూ, గగనతలాలను వాడుకొని తమను దెబ్బతీసే ప్రయత్నం జరగదన్న ఆశాభావాన్ని ఇరాన్ వ్యక్తంచేస్తోంది. ఇరాన్‌తో యుద్ధం చేస్తానో చెయ్యనో చెప్పలేనని అంటూనే అమెరికా అధ్యక్షుడు యుద్ధానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు.


విషం.. విషాదం.. గుణపాఠం!

పాకిస్థాన్ నుంచి ఏం నేర్చుకోగలం? ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ప్రశ్నే అసంబద్ధంగా అనిపిస్తుంది! పహల్గాం దారుణం.. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్ వ్యతిరేక ఉద్వేగాల్లో ఊగిపోవటమే ఎక్కువ కనపడుతోంది. ఉద్వేగాల్లో ఊగిపోతున్నప్పుడు తార్కిక ఆలోచన మందగిస్తుంది. గతం–వర్తమానం మధ్య సంబంధాలను పట్టించుకోలేం. దీర్ఘకాలిక దృష్టితో వ్యవహారాలను చూడలేం. నిలకడగా విషయాల లోతుల్లోకి వెళ్లలేం. ఇవన్నీ అవగాహనకు అడ్డంకులుగా నిలిచే మాట నిజమే! ఈ లోటుపాట్లు ఉన్నా ఉద్వేగభరిత వాతావరణం వాస్తవాల తీరంవైపు వెళ్లేందుకూ కొంత తోడ్పడుతుంది. దేశాల చరిత్రల నుంచి గుణపాఠాలు నేర్చుకునేలా చేస్తుంది. నియంతృత్వ రాజ్యం కిరాతకాల నుంచీ మతతత్వ ఉన్మాదాల నుంచీ, మైనారిటీల దారుణ అణచివేతల నుంచీ దూరంగా ఉండామనుకుంటే పాకిస్థాన్ నుంచి మనం నేర్చుకునేది చాలానే ఉంటుంది.

మతం ఏదైనా కావచ్చు. దాన్ని రాజకీయ ప్రయోజనాలకూ, ప్రభుత్వ విధానాలకూ ఆధారం చేసుకుంటే జరిగే నష్టం భారీగా ఉంటుంది. మెజారిటీ మతోన్మాదంతో పౌరహక్కులు హరించుకుపోతాయి. మతంలో మంచి చెడులు ఉన్నాయని చెప్పటమే జాతి వ్యతిరేకత అయిపోతుంది. మతాన్ని వ్యతిరేకించటం దేశద్రోహంగా మారిపోతుంది. లౌకిక వాదం విదేశీ సిద్ధాంతంగా ముద్రపడుతుంది. పాశ్చాత్య వైపరీత్యంగా సామ్యవాద దృక్పథంపై వ్యతిరేక ప్రచారం జరుగుతుంది. స్వేచ్ఛా ఆలోచనలకూ, ప్రయోగాలకూ సంకెళ్లు పడతాయి. మొత్తంగా దేశమే ఆలోచనలపరంగా అధోగతి వైపుగా అడుగులు వేస్తుంది. మానవ మేధే సంకుచితమైపోతుంది. ఈ విపరిణామాలన్నిటికీ పాకిస్థాన్ ఎలా రంగస్థలంగా మారిపోయిందో వివరిస్తూ ఆ దేశానికే చెందిన ప్రముఖ పరిశోధకురాలు ఫరానాజ్ ఇస్పాహానీ అద్భుతమైన పుస్తకం రాశారు. పాకిస్థాన్ అంటే పవిత్ర భూమి అనే అర్థమూ ఉంది. అట్లాంటి పవిత్రభూమిని మరింత పవిత్రంగా మారుస్తామనే లక్ష్యంతో మతతత్వవాదులు ఒడికట్టిన దారుణాలను 'ప్యూరిఫయింగ్ ద ల్యాండ్ ఆఫ్ ద ప్యూర్'లో లోతుగా విశ్లేషించారు. అమెరికాలోనూ నివసించి ఆ తర్వాత పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ తరఫున ఒక దఫా నేషనల్ అసెంబ్లీకి ఫరానాజ్ ఎన్నికయ్యారు. అయినా తాను ఒకనాడు ప్రాతినిధ్యం వహించిన పార్టీ తప్పిదాలనూ, వైఫల్యాలనూ, పరిమితులనూ నిశితంగా విమర్శించారు.

ఇస్లామిక్ తీవ్రవాదానికి అల్పసంఖ్యాక వర్గాలు.. పాక్‌లోలాగా భారీగా బలి అవ్వటం ఎక్కడా జరగలేదు. 1947 నాటి భారత నాయకత్వం పాకిస్థాన్ ఒక రాజ్యంగా మనుగడ సాగిస్తుందని భావించలేదు. ఎప్పటికైనా అది భారత్‌లో మళ్లీ కలవక తప్పదనే ప్రకటనలు అప్పుడు చాలా వెలువడ్డాయి. వాటికి భిన్నంగా పాకిస్థాన్ ఇప్పటికీ ఒక రాజ్యంగా కొనసాగుతూ ఉండొచ్చు. కానీ ప్రజాస్వామ్యయుగంలో ఆధునిక విలువలపరంగా పాకిస్థాన్ విఫల దేశంగానే మిగిలిపోయింది. ఆధిపత్య వర్గాలు మతాన్ని ఆయుధంగా చేసుకుని అధికారాన్ని నిలుపుకొనే ప్రయత్నాల్లో ఆలోచనలూ, ప్రవర్తనలూ ఎంతటి విషతుల్యంగా మారిపోతాయనటానికి పాకిస్థాన్‌ను ఉదాహరణగా చెప్పుకొన్నా ఆ ప్రమాదం భారత్‌కు పూర్తిగా లేదనీ భరోసా ఇచ్చుకోలేం. మతంకోణంతో ఆలోచించటం ఇటీవల కాలంలో పెరిగిపోతోందని ఎన్నో అధ్యయనాలు చెబుతున్నాయి. పాఠశాలలూ, కళాశాలల బోధనల్లో ఏకపక్ష చరిత్రలూ, వక్రీకరణలూ పెరిగిపోతున్నాయి. హిందూ–ముస్లిం సంస్కృతులూ పరస్పర విరుద్ధమైనవేనంటూ వ్యాఖ్యానాలూ, రెండిటి మధ్యా వెయ్యేళ్లకు పైగా సంఘర్షణలూ సాగుతున్నాయంటూ సూత్రీకరణలూ వెల్లువెత్తుతున్నాయి. హిందూ సంస్కృతికి అందరూ లోబడి మసలాలనే వాదనలూ బలపడుతున్నాయి.

మతాలు మనుషులకు కొత్తకాదు. భిన్న దేవతారాధనలూ కొత్తకాదు. ఒక మత ఆధిపత్యానికి పెద్దపీట



> ప్రత్యేక దేశంగా పాకిస్థాన్ ఏర్పాటు ఖాయమని తెలిపోయిన తర్వాత జిన్నా ద్విజాతి సిద్ధాంతం గురించి మాట్లాడలేదు. పాకిస్థాన్ రాజ్యాంగ సభలో 1947 ఆగస్టు 11న చేసిన ఉపన్యాసంలో మతానికి, రాజ్యానికి సంబంధంలేదని స్పష్టంగా వ్యాఖ్యానించారు. కుల, మత, జాతుల ఆధారంగా పాక్ ప్రభుత్వ వ్యవహారాలు ఉండవనీ ప్రతి పౌరుడికీ తాననుకున్న రీతిలో గుడికి, మసీదుకు, చర్చికి వెళ్లే స్వేచ్ఛ ఉందనీ చెప్పారు. నవీన పాకిస్థాన్‌లో హిందువు హిందువుగా ఉండడనీ, ముస్లిం ముస్లింగా ఉండడనీ, క్రిస్టియన్ క్రిస్టియన్‌గా ఉండడనీ, ప్రతి వ్యక్తీ పౌరుడుగా మాత్రమే గుర్తింపు పొందుతాడనీ మతం వ్యక్తిగత విశ్వాసానికి మాత్రమే పరిమితమవుతుందనీ ఘనంగా చెప్పారు.

వేసే మతతత్వాలు మాత్రం కొత్తవైనవి. రాజకీయాలు, అధికార తాపత్రయాలు లేకుండా మతతత్వాలు ఊపిరి పోసుకోలేవు. అవి లేనిదే వాటిని ఆచరణలో పెట్టే శక్తులు వ్యవస్థీకృతంగా వ్యవహరించలేవు. 1949లో ప్రకటించిన రాజ్యాంగ లక్ష్యాల తీర్మానంతోనే పాకిస్థాన్‌లో మతతత్వ రాజకీయాలకు పునాది పడింది. ఇస్లామిక్ రాజ్యాన్ని ఏర్పాటుచేయటమే రాజ్యాంగ రచన లక్ష్యంగా ఆ తీర్మానం పేర్కొంది. దాన్ని పాక్ రాజ్యాంగ సభ ఆమోదించింది. పాకిస్థాన్ ఏర్పాటుకు కీలక సూత్రధారి అయిన జిన్నా అప్పటికే మరణించారు. జిన్నా బతికి ఉంటే దాన్ని ఆమోదించేవారా? వ్యతిరేకించేవారా? అన్న విషయంపై ఇప్పటికీ ఏకాభిప్రాయం లేదు. హిందువులూ ముస్లింలూ రెండు విభిన్న జాతులకు చెందుతారనే సిద్ధాంత ప్రచారంతో పాకిస్థాన్ ఏర్పాటు కోసం జిన్నా రాజకీయ వ్యూహాలకు పదునుపెట్టటం తీవ్ర మత విభజన పరమైన ఆలోచనలకు దారితీసింది. అందులో సందేహం లేదు. కానీ ప్రత్యేక దేశంగా పాకిస్థాన్ ఏర్పాటు ఖాయమని తెలిపోయిన తర్వాత జిన్నా ద్విజాతి సిద్ధాంతం గురించి మాట్లాడలేదు. పాకిస్థాన్ రాజ్యాంగ సభలో 1947 ఆగస్టు 11న చేసిన ఉపన్యాసంలో మతానికి, రాజ్యానికి సంబంధంలేదని స్పష్టంగా వ్యాఖ్యానించారు. కుల, మత, జాతుల ఆధారంగా పాక్ ప్రభుత్వ వ్యవహారాలు ఉండవనీ ప్రతి పౌరుడికీ తాననుకున్న రీతిలో గుడికి, మసీదుకు, చర్చికి వెళ్లే స్వేచ్ఛ ఉందనీ చెప్పారు. నవీన పాకిస్థాన్‌లో హిందువు హిందువుగా ఉండడనీ, ముస్లిం ముస్లింగా ఉండడనీ, క్రిస్టియన్ క్రిస్టియన్‌గా ఉండడనీ, ప్రతి వ్యక్తీ పౌరుడుగా మాత్రమే గుర్తింపు పొందుతాడనీ మతం వ్యక్తిగత విశ్వాసానికి మాత్రమే పరిమితమవుతుందనీ ఘనంగా చెప్పారు. అందుకు అనుగుణంగా గవర్నరు జనరల్‌గా ఉండగా కొన్ని నిర్ణయాలూ తీసుకున్నారు. హిందువైన జోగేంద్రనాథ్ మండల్‌ను న్యాయశాఖ మంత్రిగా నియమించారు. అహ్మదీయ శాఖకు చెందిన జఫరుల్లా ఖాన్‌కు తొలి విదేశాంగ మంత్రిగా బాధ్యతలు అప్పగించారు. మత రాజ్యం గురించి మాట్లాడటాన్నీ గర్హించారు. అలాగే పదవుల్లో మైనారిటీ షియాలకూ సముచిత ప్రాధాన్యం ఇచ్చారు. చాలామంది అనుకున్నట్లుగా జిన్నా ఇస్లాంలోని ప్రధాన సున్నీ శాఖకు చెందినవారు కాదు. ఆయన షియా ముస్లిం. విషాదం ఏమిటంటే తర్వాతి కాలంలో షియాల ఊచకోత పాక్‌లో సర్వసాధారణమైంది. అలాగే అహ్మదీయులను ముస్లింలుగా పరిగణించకూడదంటూ రాజ్యాంగ సవరణనే తీసుకొచ్చారు.


■ రాహుల్ కుమార్

మతతత్వ ఆలోచనలు అధికారాన్ని సాధించటానికీ, నిలబెట్టుకోటానికీ అవసరమైనప్పుడు చరిత్ర వక్రీకరణ సర్వసాధారణంగా జరుగుతుంది. జిన్నా రాజ్యాంగ సభలో చేసిన ఆ ఉపన్యాసాన్ని పలు విధాలుగా తొక్కిపట్టి, సాధారణ ప్రజలకు దాన్ని చేరకుండా చేయటమే ఇందుకు నిదర్శనం. పాక్ తొలి ప్రధాని లియాఖత్ అలీ ఖాన్ దానికి పూనుకున్నారు. ద్విజాతి సిద్ధాంతాన్ని తిరస్కరించేలా జిన్నా ప్రసంగం ఉండటం పాకిస్థాన్ మనుగడకే ప్రమాదంగా పరిగణించారు. అందుకే దానికి పూర్తి విరుద్ధంగా రాజ్యాంగ లక్ష్యాల తీర్మానాన్ని రూపొందించారు. పవిత్ర ఖురాన్‌లోని బోధనలకు అనుగుణంగా వ్యక్తిగత, సామాజిక జీవితాన్ని తీర్చిదిద్దుకునేలా ముస్లింలకు తోడ్పటమే రాజ్యాంగ లక్ష్యమని పేర్కొన్నారు. రాజ్యాన్ని ఇస్లామిక్ పరిభాషలో నిర్వచించటంతోనే తర్వాతి కాలంలో మతపరమైన చట్టాలకు అడుగులు పడ్డాయి. మతాల వారీగా ప్రత్యేక నియోజకవర్గాలను ఏర్పరచారు. అన్ని మతాలకు చెందిన పౌరులు ఉమ్మడి ప్రజాప్రతినిధులను ఎన్నుకునే అవకాశం లేకుండా చేశారు. రాజ్యాంగ లక్ష్యాల తీర్మానం ఆమోదం పొందిన వెంటనే ముస్లిం మతగురువులు రంగంలోకి దిగి 22 సూత్రాల ప్రణాళికను ప్రకటించి షరియా చట్టాన్ని అమలుపరచటమే ప్రభుత్వ ధ్యేయం కావాలని డిమాండు చేశారు. ముస్లిం పురుషుడు మాత్రమే దేశాధినేత కావాలని స్పష్టం చేశారు. ముస్లింలతో సమానంగా ముస్లిమేతరులకు హక్కులు ఉండకూడదనీ వాదించారు. మతగురువుల డిమాండ్లలో చాలా వాటిని ఆమోదిస్తూ 1956లో రాజ్యాంగాన్ని తయారుచేయటంతోనే పాక్ గతితప్పింది ముస్లిమేతరులను రాజ్యాధినేతగా అర్హత లేకుండా నిబంధనను పొందుపరచారు. ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ పాకిస్థాన్‌గా దేశాన్ని పేర్కొన్నారు. తర్వాతి కాలంలో రాజ్యాంగాలను రద్దు చేయటం, పునరుద్ధరించటం చేసినా అంతకంతకూ మతతత్వ ప్రకరణలను పెంచారే కానీ తగ్గించలేదు. జియా ఉల్ హక్ కాలంలో రాజ్యాంగం, చట్టాలు పూర్తిగా మతతత్వంతో నిండిపోయాయి. ఎన్నికల ద్వారా ఎన్ని ప్రభుత్వాలు ఏర్పడినా వాటిని తొలగించలేకపోయారు. దైవదూషణ చట్టాలతో లక్షలాది మందిని ఖైదుచేశారు. మైనారిటీ వర్గాలను లక్ష్యంగా చేసుకుని ఎంతటి బీభత్సాన్ని, ఎంతటి మానవ హక్కుల హననానికి పాల్పడ్డారో ఫరానాజ్ తన పుస్తకంలో కళ్లకు కట్టినట్లు వర్ణించారు. ప్రభుత్వాల వెన్నుదన్నుతో, ప్రధాన పార్టీల పూనకాలతో మతతత్వం పేట్రేగితే మాటలో, చేతలో, చేతనలో ఎంత అమానవీయతా ఎంత క్రూరత్వమూ ప్రబలిపోతుందో వర్ణించలేం.

దేశ విభజన నాటికి ఉమ్మడి పాకిస్థాన్‌లో 23 శాతం ముస్లిమేతరులు ఉండేవారు. ఇప్పటి పాకిస్థాన్‌లో వాళ్ల సంఖ్య 3 శాతానికి పడిపోయింది. ముస్లింమేతరుల్లో ప్రధానంగా హిందువులు ఒకనాటి తూర్పు పాకిస్థాన్‌లో

> ప్రజాస్వామ్యయుగంలో ఆధునిక విలువలపరంగా పాకిస్థాన్ విఫల దేశంగానే మిగిలిపోయింది. ఆధిపత్య వర్గాలు మతాన్ని ఆయుధంగా చేసుకుని అధికారాన్ని నిలుపుకొనే ప్రయత్నాల్లో ఆలోచనలూ, ప్రవర్తనలూ ఎంతటి విషతుల్యంగా మారిపోతాయనటానికి పాకిస్థాన్‌ను ఉదాహరణగా చెప్పుకొన్నా ఆ ప్రమాదం భారత్‌కు పూర్తిగా లేదనీ భరోసా ఇచ్చుకోలేం.

(బంగ్లాదేశ్) అధికంగా (20శాతం) ఉండేవారు. 1961 నాటికి వారి శాతం 12 శాతానికి పడిపోయింది. అభద్రతా భావంతో, దాడులతో తల్లడిల్లి భారత్‌కు వలసలు రావటం వల్లే అది జరిగింది. జిన్నా ఏరికోరి నియమించిన న్యాయశాఖ మంత్రి జోగేంద్రనాథ్ మండల్ కూడా భారత్‌కు తరలిరాక తప్పలేదు. పాక్ సైన్యం బంగ్లాదేశ్‌లో (1971) పాల్పడిన ఊచకోతలతో లక్షలమంది హిందువులు శాశ్వతంగా భారత్‌కు వచ్చారు. పాక్ ముస్లింల్లో షియా వర్గం సంఖ్య 20 నుంచి 25 శాతం వరకూ ఉంటుంది. అహ్మదీయుల జనాభా ఒక శాతానికి పరిమితమైంది. అహ్మదీయులను తమని తాము ముస్లింలమని చెప్పుకొంటే దాన్ని శిక్షార్హం చేశారు. వారి చూపునీ, చేష్టనీ, మాటనీ దైవదూషణగా పరిగణించేలా చట్టాలను చేశారు. 1990ల తర్వాత అఫ్ఘనిస్థాన్ నుంచి తిరిగొచ్చిన మత తీవ్రవాదులు ఆధునిక ఆయుధాలతో మైనారిటీల ప్రాణాలు తీయటం సాధారణ చర్యలుగా మారిపోయాయి. 2009–2015 మధ్య 1659 మంది షియాలను అలాగే చంపివేశారు. అహ్మదీయులను సమర్థించిన న్యాయవాదులను, నిర్దోషులుగా ప్రకటించిన న్యాయమూర్తులను కాల్చిచంపటంతో కోర్టులు కూడా హడలెత్తిపోయాయి. అసియాబీబీ అనే అహ్మదీయ నిరక్ష్యరాస్య మహిళను దైవదూషణ చట్టం కింద అకారణంగా ఖైదుచేస్తే పరామర్శించటానికి వెళ్లిన పంజాబ్ గవర్నర్‌ను కాల్చిచంపటం అంతర్జాతీయంగా సంచలనమైనా పరిస్థితిలో మార్పురాలేదు. మతవాదులను సంతృప్తిపరచటానికి ఆధునిక ప్రజాస్వామిక సిద్ధాంతాలను పణంగా పెట్టటంతో, సమన్యాయపాలనకు తిలోదకాలు ఇవ్వటంతో మైనారిటీలు బలిపశువులు అయ్యారు. మైనారిటీలను నిరంతరం అభద్రతతో ఉంచి, వారి ప్రతిచర్యనూ అనుమానంతో చూసి, రాజ్య విధేయతను అనుక్షణం నిరూపించుకోమని శీలపరీక్షలు కోరి హింసకు పాల్పడటం వల్లే పాక్ చరిత్ర రక్తసిక్తం అయింది. భారత్ ఉపఖండ విషాదం, బీభత్సం అదే!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

ప్రైవేట్ ఈవీలను ప్రోత్సహించాలా?

వ్యక్తిగత విద్యుత్ వాహనాల ప్రాముఖ్యత ఏమిటి? టెస్లాలు, బివైడిలు వాతావరణ క్లిష్ట సమస్యను తీర్చగలుగుతాయా? ఇదొక సులభమైన ప్రశ్న కాదు. సమాధానం సులువుగా చెప్పగలిగేదీకాదు. అయినప్పటికీ మానవాళిని శీఘ్రగతిన వాతావరణ విపత్తుకు చేరువచేస్తున్న హరిత గృహ వాయు (జీహెచ్‌జీ) ఉద్గారాలను నిరోధించేందుకు మరింత బృహత్తర కృషి చేయవలసి ఉన్న దృష్ట్యా ఆ ప్రశ్నను లోతుగా తర్కించడం చాలా ముఖ్యం.

విద్యుత్ వాహనాలు (ఈవీ) ఎందుకు? పారిశ్రామిక యుగం తొలినాటి సంపన్న దేశాలు శిలాజ ఇంధనాల వినియోగాన్ని శీఘ్రగతిన పూర్తిగా తగ్గించుకోవల్సిన అగత్యమేర్పడింది. శిలాజ ఇంధనాలతో నడిచే Internal combustion (ఐసీ) ఇంజిన్ వాహనాల వినియోగాన్ని వదిలివేసేందుకు విద్యుత్ వాహనాలు దోహదం చేస్తాయని ఆ దేశాలు విశ్వసిస్తున్నాయి. రవాణా రంగంలో ఈవీల వాడకం ఇతోధికంగా పెరిగితే కాలుష్య కారక వాయు ఉద్గారాలు తగ్గిపోతాయని సంపన్న పారిశ్రామిక దేశాలు భావిస్తున్నాయి. అటువంటి పరివర్తన సుగమమయ్యేందుకు ఆ దేశాలు ఇప్పటికే నిర్దిష్ట లక్ష్యాలను నిర్దేశించుకున్నాయి. 2030 నాటికి సమోదయ్యే కొత్త కార్లలో 80 శాతం తప్పనిసరిగా కాలుష్యకారక వాయువులను ఏ మాత్రం ఉద్గారించనివై ఉండాలని యూరోపియన్ దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. వీటి సంఖ్య 2035 నాటికి నూటికి నూరు శాతానికి పెరగాలని కూడా ఆ దేశాలు నిర్దేశించుకున్నాయి. అమెరికాలో కూడా 2030 నాటికి నమోదయ్యే కొత్త కార్లలో 50 శాతం తప్పనిసరిగా విద్యుత్ వాహనాలై ఉండి తీరాలని మాజీ అధ్యక్షుడు జోబైడెన్ ప్రభుత్వం ఆదేశించింది. రవాణారంగాన్ని డీ కార్బనైజ్ (హరిత గృహ వాయువుల ఉద్గారాలను, ముఖ్యంగా కార్బన్ డయాక్సైడ్‌ను తగ్గించి అంతిమంగా వాతావరణం నుంచి పూర్తిగా తొలగించే ప్రక్రియ) చేసేందుకు విద్యుత్ వాహనాలను వినియోగించడమనేది ఈ సంపన్న పాశ్చాత్య దేశాల లక్ష్యం. ఐసీ ఇంజిన్ల వాహనాలను క్రమంగా తొలగించివేసినప్పుడు మాత్రమే ఆ లక్ష్య పరిపూర్తి సాధ్యమవుతుంది.


■ సునీతా నారాయణ్

మట్టివాసన

మూడు దశాబ్దాలుగా యూరోపియన్ దేశాల రవాణా రంగంలో జీహెచ్‌జీ ఉద్గారాలు బాగా పెరిగిపోయాయి. రవాణా రంగం నుంచి వెలువడుతున్న మొత్తం ఉద్గారాలలో 60 శాతం ప్రైవేట్ కార్ల నుంచే సంభవిస్తున్నాయి. ఈ వాస్తవం దృష్ట్యానే రవాణా రంగాన్ని డీ కార్బొనైజ్ చేసేందుకు ఆ దేశాలు నిర్ణయించుకున్నాయి. రవాణా రంగంలో ఆవశ్యక మార్పును సాధించేందుకు యూరోపియన్ దేశాలు ప్రైవేట్ కారు యజమానులకు సబ్సిడీలు సమకూరుస్తాయా? లేక ఆ డబ్బును రవాణా రంగాన్ని డీ కార్బొనైజ్ చేసేందుకు, సొంత వాహనాలకు బదులు ప్రజా రవాణా వ్యవస్థలను వినియోగించుకునేలా ప్రజలకు వెసులుబాటు కల్పించేందుకు ఉపయోగిస్తాయా? సంపన్న దేశాలు ఆ రెండూ చేయగలవు. చేస్తాయి కూడా.



> మనం నిర్దిష్ట కాల పరిమితిలో కాలుష్య కారకాలను ఉద్గారించని వాహనాలకు మారాలి. ఐసీ ఇంజిన్ల వాహనాలను సంపూర్ణంగా వదిలివేయాలి. ఈ విషయమై ఒక కచ్చితమైన విధాన నిర్ణయం తీసుకుని కఠినంగా అమలుపరచాలి. అప్పుడు మాత్రమే ప్రైవేట్ ఈవీల వల్ల సత్ఫలితాలు సాధ్యమవుతాయి. విద్యుత్ వాహనాల వినియోగాన్ని గణనీయంగా పెంచినంతమాత్రాన వాయు కాలుష్య నియంత్రణకు గానీ, వాతావరణ మార్పు నిరోధానికి గానీ దోహదం జరగదు.

అభివృద్ధి చెందుతున్న దేశాల విషయంలో ఈ ప్రశ్నలకు చాలా ప్రాసంగికత ఉన్నది. ఎందుకంటే మన ప్రభుత్వాలు ఆ రెండిటిలో ఏదో ఒకటి మాత్రమే చేయగలవు. ఇప్పటికే ప్రైవేట్ డీజిల్, పెట్రోల్ కార్లకు సబ్సిడీలు సమకూరుస్తున్నాయి. దీని వల్ల ప్రభుత్వ ఖజానాపై పెద్ద ఆర్థిక భారం పడుతోంది. ముఖ్యమైన విషయమేమిటంటే ఈ సబ్సిడీలు ప్రత్యక్షంగా కనపడవు. అవి ఎక్కడా చర్చింపబడవు. కారు యజమానులు చెల్లించే రోడ్ పన్నునే తీసుకోండి. బస్సు ప్రయాణీకులు ఒకొక్కరు చెల్లించే పన్ను కంటే కారు ఉన్న ఆసాములు చెల్లించే పన్ను చాలా తక్కువ. రోడ్లపై 90 శాతం కంటే ఎక్కువ చోటును చిన్న కారులే ఆక్రమించుకుంటాయి. కార్లు సుగమంగా సాగేందుకు నున్నని రోడ్లు, ఫ్లైఓవర్లు, దైనందిన రాకపోకలకు అవసరమైన ఇతర సదుపాయాల నిర్మాణానికి అవసరమయ్యే ఖర్చునూ పరిగణనలోకి తీసుకుంటే ప్రైవేట్ కారు యజమానులకు భారీ సబ్సిడీ సమకూరుతుందనేది స్పష్టం. డీ కార్బొనైజేషన్, వాయు కాలుష్యం తగ్గింపు అనే మన లక్ష్యాల పరిపూర్తికి మన రోడ్లపై ప్రైవేట్ వాహనాల సంఖ్యను ఇతోధికంగా తగ్గించవలసి ఉంటుంది; అదే సమయంలో వాహనాల కంటే ప్రజలకు ప్రాధాన్యమిచ్చే రవాణా పద్ధతుల (నగరాలలోని రవాణా వ్యవస్థలను ప్రైవేట్ వాహనాలకు అనుగుణంగా కాకుండా ప్రజల అవసరాలకు సానుకూలంగా రూపొందించడం)కు మనం మారాలి. ఇది తప్పనిసరి.

ఇందుకు మనం ఏమి చెయ్యాలి? నిర్దిష్ట కాలపరిమితిలో కాలుష్య కారకాలను ఉద్గారించని వాహనాలకు మారాలి. ఐసీ ఇంజిన్ల వాహనాలను సంపూర్ణంగా వదిలివేయాలి. ఈ విషయమై ఒక కచ్చితమైన విధాన నిర్ణయం తీసుకుని కఠినంగా అమలుపరచాలి. అప్పుడు మాత్రమే ప్రైవేట్ ఈవీల వల్ల సత్ఫలితాలు సాధ్యమవుతాయి. కేవలం విద్యుత్ వాహనాల వినియోగాన్ని గణనీయంగా పెంచినంత మాత్రాన వాయు కాలుష్యం నియంత్రణకు గానీ, వాతావరణ మార్పు నిరోధానికి గానీ దోహదం జరగదు. శుభకరమైన విషయమేమిటంటే విద్యుత్ వాహనాల విషయంలో భారత ప్రభుత్వ విధానం వాటి పట్ల పూర్తి అనుకూలత చూపడం లేదు. ప్రజా రవాణా వ్యవస్థల్లో విద్యుత్ బస్సులు ఉపయోగించేందుకు, అనుబంధ రవాణా సేవల్లో ఆటోలు మొదలైన వాహనాల విద్యుదీకరణకు సబ్సిడీలు సమకూరుస్తున్నది.

అయితే ఇది మాత్రమే సరిపోదు. ఆటోలు, టాక్సీలు, బస్సులు మొదలైనవి నిర్ణీత కాలపరిమితిలో విద్యుదీకరణ అయితీరాలనే లక్ష్యాన్ని నిర్దేశించి తీరాలి. కొత్త వాహనాల రిజిస్ట్రేషన్‌కే గాక, కాలం చెల్లిన వాహనాల తొలగింపునకు కూడా ఒక కచ్చితమైన కాలపరిమితిని నిర్దేశించాలి. పార్కింగ్ చార్జీలు, ప్రజా రవాణాకు మరిన్ని ప్రోత్సాహకాల కల్పన మొదలైన చర్యల ద్వారా ప్రైవేట్ వాహనాల వినియోగాన్ని నియంత్రించాలి. ప్రైవేట్ కార్ల స్థానంలో నడక, సైక్లింగ్, బస్సులు, ట్రాములు, మెట్రోలను ప్రోత్సహించని పక్షంలో మన లక్ష్యాలను సాధించుకోలేము. మన విద్యుదీకరణ అజెండా మొబిలిటీ ట్రాన్స్‌ఫర్మేషన్ అజెండా (మరింత స్థిరమైన, సమర్థమైన, సాంకేతికంగా అభివృద్ధి చెందిన రవాణా వ్యవస్థల దిశగా పరివర్తన)నే. అంతకు ఏమీ తక్కువ కాదు.

(సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

యుద్ధంతో సర్వనాశనం

ఏ చట్టాలకు లోబడి ఉండాల్సిన అవసరం లేని ఒక విధ్వంసకర రూపం యుద్ధం. విచ్చలవిడిగా ఒకరినొకరు చంపుకోవడం, ఆస్తులను ధ్వంసం చేసుకోవడం, ఎవరు ఎక్కువ ఈ విధంగా చేస్తే, వారే గెలిచినట్లు సంబరపడతారు. ఓడినవారే కాదు, గెలిచినవారు కూడా ఎన్నో ప్రాణాలు, సంపదను కోల్పోతారు. కానీ, అంతిమ గెలుపు తమదే అన్నట్లు సంబరాలు చేసుకుంటారు. వారు చేసిన విధ్వంసం ఎలా ఉంటుందో ఒకసారి పరిశీలిద్దాం. ప్రస్తుత ఉక్రెయిన్ రాజధాని కీవ్, సోవియట్ యూనియన్‌లో ఉన్నప్పుడు, అద్భుతమైన కట్టడాలతో ప్రపంచ పర్యాటక కేంద్రం. యుద్ధం చేసిన ఏ దేశమైనా, యుద్ధానంతరం అభివృద్ధి పనులు, ఆలోచనలు కనుమరుగై, యుద్ధం కారణంగా జరిగిన నష్టాన్ని సరిచేసుకోవడంలో ఉండిపోతాయి. అంటే.. కొన్ని దశాబ్దాలపాటు నష్ట నివారణకే పరిమితమవుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు ఆకలిచావులకు గురైనా ఆశ్చర్యం లేదు.

మూడేళ్లకు పైగా జరుగుతున్న ఉక్రెయిన్–రష్యా యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియదు. కొత్తగా మొదలైన ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధం భీకరంగా సాగుతూ, ప్రపంచాన్ని భయపెడుతోంది. సంప్రదాయ యుద్ధాలకు కాలం చెల్లింది, దౌత్యపరమైన పద్ధతిలోనే దేశాల మధ్య వివాదాలు తీర్చుకునే కొత్త సంప్రదాయం మొదలైందని అందరూ భావిస్తున్న నేపథ్యంలో ఈ యుద్ధాలు జరుగుతుండడం బాధాకరం. ప్రపంచాన్ని భయానికి గురి చేస్తున్నది అణు బాంబులు. ఇవి ప్రపంచంలో కేవలం 9 దేశాలలోనే ఉన్నా, వాటని వినియోగిస్తే, భూమండలాన్ని వందసార్లు పూర్తిగా ధ్వంసం చేయవచ్చు. మరో భయం కలిగించే విషయం... ఉత్తర కొరియా, పాకిస్థాన్ వంటి ఉన్మాదుల వద్ద అణ్వాయుధాలు ఉండడం. ఇరాన్ వాటికి తోడు కాకుండా ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించింది. ఇజ్రాయెల్–పాలస్తీనా మధ్య జరుగుతున్నది యుద్ధంలా కాకుండా, హమాస్ తీవ్రవాద సంస్థను నిర్మూలించడానికి చేస్తున్న దాడులుగా ప్రపంచ దేశాలు భావిస్తున్నాయి. ఈ ప్రయత్నంలో ఇజ్రాయెల్, పాలస్తీనా ప్రజల పట్ల అమానవీయంగా ప్రవర్తిస్తోంది. భారత్–పాకిస్తాన్ మధ్య దాడులు మూడు రోజులకే ముగియడం సంతోషించదగ్గ విషయం. అవి కొనసాగితే ఇరు దేశాలూ ఎంతో కొంత నష్టపోయేవి. ఈ యుద్ధాలు త్వరగా ముగిసి, ప్రజలు సుఖంగా జీవించే రోజులు రావాలని ఆశిద్దాం.

– మాదివాడ రామబ్రహ్మం, జన విజ్ఞాన వేదిక

ప్రాచ్య–పాశ్చాత్య వారధి ప్రాచీన పర్షియా

పర్షియన్ చరిత్ర, సంస్కృతి ప్రపంచపు అత్యంత ప్రాచీనమైన, ప్రభావవంతమైన నాగరికతలలో ఒకటిగా చరిత్రలో నిలిచింది. పర్షియన్లు అంటే నేటి ఇరాన్ దేశ ప్రజలు. ఇరాన్ భౌగోళికంగా మధ్య ప్రాచ్యంలో ఉన్నా, చరిత్రపరంగా ఇది ప్రాచ్య, పాశ్చాత్య దేశాల మధ్య వాణిజ్యం, సంస్కృతి, తత్వవాదం, మతపర సహనానికి ప్రాతినిధ్యం వహించిన గొప్ప నాగరికతగా విలసిల్లింది.

పర్షియా చరిత్ర క్రీ.పూ. 6వ శతాబ్దంలో సైరస్ మహారాజు ఆధ్వర్యంలో అఖేమెనిడ్ సామ్రాజ్య స్థాపనతో ప్రారంభమైంది. సైరస్ ధర్మపరుడు, న్యాయవాది, మానవహక్కుల పితామహుడిగా గుర్తింపు పొందాడు. అతని పాలనలో ధార్మిక స్వేచ్ఛ, ప్రజా సంక్షేమం వంటి విలువలకు ప్రాధాన్యం లభించింది. దరియస్, జెర్క్సెస్ వంటి రాజుల పాలనలో సామ్రాజ్యం మరింత విస్తరించి గ్రీకు, ఈజిప్ట్, భారత్ వరకు వ్యాపించింది. ఈశాన్య యూరోప్ వరకు విస్తరించిన ఈ సామ్రాజ్యం పరిపాలనా, న్యాయ, కౌశలాల పరంగా ప్రబలమైనదిగా చరిత్ర గుర్తించింది. పర్సెపోలిస్ వంటి నగరాలు శిల్పకళకు నిదర్శనంగా నిలిచాయి. పర్షియన్లు జొరాస్ట్రియన్ మతాన్ని అనుసరించేవారు. ఇది మంచి, చెడు మధ్య ధార్మిక యుద్ధాన్ని బోధించే తత్వవాద మతం.



క్రీ.శ. 651లో సాసానియన్ సామ్రాజ్యం అరబ్బు ముస్లిం ఖలీఫా చేతిలో ఓడిపోయింది. ఇస్లాం పర్షియాలోకి ప్రవేశించడానికి ఈ ఓటమి మార్గం వేసింది. తరువాతి శతాబ్దాల్లో పర్షియన్ ప్రజలు ప్రధానంగా ఇస్లాం మతాన్ని స్వీకరించారు. ఇస్లామీయ ధర్మశాస్త్రాల్లోని కరుణ, సమానత్వం, విద్యాభివృద్ధి, జ్ఞానప్రధానం వంటి అంశాలు పర్షియన్ తత్వవాదంతో కలిసి ఒక నూతన మానవతావాద సంస్కృతిని నిర్మించాయి. ఈ యుగంలో ఇబ్ను సినా, అల్–ఘజాలి, అల్–రాజీ వంటి గొప్ప తత్వవేత్తలు వైద్యం, తత్వం, మతం, న్యాయ రంగాల్లో అసాధారణ ప్రగతి సాధించారు. వారి రచనలు యూరోప్ దేశాల్లోకి ప్రవేశించి పునరుజ్జీవన యుగానికి దారితీశాయి. మత స్వేచ్ఛకు గౌరవం ఇచ్చే విధంగా జొరాస్ట్రియన్లు... క్రైస్తవులు, యూదులకు 'ధిమ్మీ' హోదా ఇచ్చి రక్షణ కల్పించారు.


1979లో సంభవించిన ఇస్లామిక్ విప్లవం ఆధునిక ఇరాన్ చరిత్రలో ఒక కీలక మలుపు. షా మహమ్మద్ రేజా పాలనను కూలదోసి, అయతుల్లా ఖోమేనీ నేతృత్వంలో దేశం ఇస్లామిక్ థియోక్రసీగా మారింది. అంటే, రాజ్యాధికారం పూర్తిగా మత నాయకుల చేతుల్లోకి వెళ్లింది. ఈ విప్లవం తరువాత రాజ్యాంగం, న్యాయవ్యవస్థ, విద్యావ్యవస్థ, మహిళల హక్కులు... అన్నీ షరియత్ చట్టాల ఆధారంగా మతపరమైన పరిపాలనలోకి వెళ్లాయి. మత నియమాలు చట్టబద్ధంగా మారాయి. మహిళల దుస్తులపై, యువత జీవనశైలిపై, సాంస్కృతిక కార్యక్రమాలపై గట్టి నియంత్రణలు వచ్చాయి. ఇరాన్–ఇరాక్ యుద్ధం (1980–1988)లో జిహాద్, షహీద్ వంటి మతపరమైన భావోద్వేగాలు అధికమయ్యాయి. సాంస్కృతిక పోలీసు వ్యవస్థ ద్వారా ప్రజలపై మత నియమాలను బలవంతంగా అమలుచేయటం ప్రారంభమైంది. 'మతం ప్రమాదంలో ఉంది' అనే ప్రచారంతో మత మౌలికవాదాన్ని నెమ్మదిగా బలపరిచారు.

ప్రాచీన పర్షియా శాస్త్రీయ దృక్పథాన్ని, మానవతా విలువలను ప్రపంచానికి పరిచయం చేసింది. అయితే, ఆధునిక ఇరాన్ మత మౌఢ్యంలో చిక్కుకొని అభివృద్ధిలో వెనుకబడింది. ఇది కేవలం ఆ దేశానికే సమస్య కాదు, ప్రపంచ శాంతికి, మత సామరస్యానికి కూడా ముప్పుగా మారింది. పశ్చిమ దేశాలు ఒకప్పుడు ఈజిప్ట్, మెసపటోమియా, పర్షియన్ నాగరికత నుంచి ప్రేరణ పొందాయి. కానీ ఆ సౌందర్య సంస్కృతులే నేడు మత వైషమ్యం, అంతర్గత ఘర్షణల వల్ల తమ గొప్పతనాన్ని కోల్పోయాయి.

పాశ్చాత్య సామ్రాజ్యవాద దేశాలయిన బ్రిటన్, ఫ్రాన్స్, స్పెయిన్, పోర్చుగల్, తరువాత అమెరికా ప్రపంచవ్యాప్తంగా నెరపిన వలస పాలనలతో స్థానిక సంస్కృతులు, భాషలు, సంప్రదాయాలు ధ్వంసమయ్యాయి. పశ్చిమ దేశాలు తమ ఆర్థిక స్వార్థం కోసం ప్రపంచంలోని అనేక జాతుల మధ్య దేశాల మధ్య వైరుధ్యాలు సృష్టించి నేటికీ యుద్ధాలు సాగిస్తున్నాయి. దానికి కొనసాగింపుగానే నేటి 'ఇరాన్–ఇజ్రాయెల్' యుద్ధాన్ని మనం చూడవచ్చు. ఇజ్రాయెల్ అనేది పశ్చిమ దేశాలు ఆడిస్తున్న పాత్రగానే మనం గుర్తించాలి. ప్రపంచ శాంతి కోసం మానవ మనుగడ కోసం ప్రతి దేశం కట్టుబడి ఉండేదాకా ప్రజలు పోరాడాలి.

నేడు భారతదేశం లాంటి దేశాలు, చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకుని, మతసహనం, శాస్త్రీయ దృక్పథం, తత్వవాదం, ఐక్యత వంటి విలువలను పరిరక్షించాలి. మతపరమైన విభజనలకి బలవకుండా, ప్రపంచ శాంతి కోసం నిలబడి, మానవ వికాసానికి దోహదపడే విధంగా అభివృద్ధి చెందాలి. మన చరిత్రను గౌరవించాలి. ఇతర సంస్కృతుల ఘనతను అర్థం చేసుకోవాలి. తద్వారా మన దేశాన్ని సమున్నత నాగరికత విలువల సమాజంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేయాలి.

● లెనిన్ కోగంటి
కార్మిక నాయకులు, టిఎస్‌టియుసి



ఇక పునరావృతం కానివ్వం

'ఆసుపత్రిలో అష్టకష్టాలు'పై స్పందించిన జీజీహెచ్ సూపరింటెండెంట్ ఏవీ రావు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విజయవాడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ఆసుపత్రికి వచ్చే రోగులకు ఇకపై ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని జీజీహెచ్ సూపరింటెండెంట్ ఏ.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన 'ఆసుపత్రిలో అష్టకష్టాలు' కథనంపై ఆయన స్పందించారు. పాడైన స్ట్రెచర్, వీల్‌చైర్లు తీసుకెళ్లి కొత్తవి ఇచ్చేలా టెండర్లు ఆహ్వానించామని ఆయన తెలిపారు. మరమ్మతులు చేయడానికి వీలున్న స్ట్రెచర్, వీల్‌చైర్లను వాడుకలోకి తీసుకొస్తామని చెప్పారు. ఆసుపత్రిలో ఎఫ్ఎన్‌వో, ఎంఎన్‌వో సిబ్బంది కొరత ఎక్కువగా ఉందని తెలిపారు. ఈ కొరత వల్లే యాక్సిడెంట్, ట్రామా రోగులను ఐసీయూ, వార్డులకు తీసుకెళ్లే ప్రక్రియలో సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. ఎఫ్ఎన్‌వో, ఎంఎన్‌వోలను భర్తీ చేయాలని ఇప్పటికే ప్రభుత్వాన్ని కోరామని, వీల్‌చైర్, ఫర్నీచర్ సమకూర్చడానికి ఇప్పటికే చర్యలు తీసుకున్నామని తెలిపారు.

లాసెట్‌లో తంగిరాల సౌమ్యకు ర్యాంక్

- 739వ ర్యాంక్ సాధించిన నందిగామ ఎమ్మెల్యే
- 120 మార్కులకు 95 మార్కులు
- పలువురి అభినందనలు

నందిగామ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ఏపీ లాసెట్ ఫలితాల్లో ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య 739వ ర్యాంక్ సాధించారు. 120 మార్కులకు 95 మార్కులు సాధించిన ఆమె 739 ర్యాంక్‌లో నిలిచారు. ఇంజనీరింగ్ పట్టభద్రురాలైన సౌమ్య న్యాయశాస్త్రంపై ఆసక్తితో లాసెట్‌కు హాజరయ్యారు. ఆమె తండ్రి దివంగత ఎమ్మెల్యే తంగిరాల ప్రభాకరరావు సుదీర్ఘకాలం న్యాయవాద వృత్తిలో కొనసాగారు. నందిగామ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయన స్ఫూర్తితోనే సౌమ్య న్యాయశాస్త్రం చదివేందుకు నిర్ణయించుకున్నారు. మంచి ర్యాంక్ సాధించిన సౌమ్యకు పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. చిన్నతనం నుంచి తన తండ్రిని చూస్తూ న్యాయవాద వృత్తిపై ఆసక్తి పెంచుకున్నట్లు సౌమ్య చెప్పారు. చట్టాల పట్ల అవగాహన ఉంటే పాలనలో కూడా ప్రజలకు సరైన సేవలందించగలుతానన్నారు. భారత రాజ్యాంగం, చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాల్సి ఉందన్నారు.



న్యాయదేవతకు నిఘా కళ్లు

న్యాయస్థానాల సముదాయంలో సీసీ కెమెరాల ఏర్పాటు

కొత్త భవనం చుట్టూ 20 కెమెరాలు అమర్చిన పోలీసులు

దొంగతనాలు, కొట్లాటలకు చెక్ పెట్టేందుకే..



- న్యాయస్థానంలో ఇద్దరు న్యాయవాదుల మధ్య వాగ్వాదం జరిగింది. అక్కడితో ఆగకుండా ఇద్దరు కోర్టు హాల్ నుంచి బయటకొచ్చి నువ్వెంత అంటే నువ్వెంత అనుకున్నారు. దీనిపై ఇద్దరూ పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు.
- ఓ వ్యక్తి వాయిదా నిమిత్తం కోర్టుకు వచ్చాడు. కోర్టు ప్రాంగణంలో వాహనాలను నిలిపే ప్రదేశంలో బైక్ పెట్టుకున్నాడు. వాయిదా పూర్తయ్యాక వచ్చి చూసుకునే సరికి అక్కడ వాహనం కనిపించలేదు. ఇది నెలరోజుల క్రితం జరిగిన ఘటన.

కొన్ని నెలలుగా నగరంలోని న్యాయస్థానాల సముదా యంలో జరుగుతున్న పరిణామాలివి. ఇలా వస్తున్న కేసులతో పోలీసులకు తలనొప్పి కడుతోంది. దీంతో న్యాయస్థానాల ప్రాంగణం చుట్టూ నిఘానేత్రాలను ఏర్పాటు చేశారు.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : 'సేఫ్ సిటీ' ప్రాజెక్టులో భాగంగా పోలీసులు దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే నిత్యం న్యాయవాదులు, కక్షిదారులతో రద్దీగా ఉండే న్యాయస్థానాల ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మిగతా 6లో..

బఫర్ ఆఫర్

పరిటాల మైనింగ్ ఏరియాలో అధికారిక లే అవుట్లా?

- బఫర్ జోన్‌లో అనుమతులిచ్చేసిన సీఆర్‌డీఏ అధికారులు
- 500 మీటర్ల పరిధి వరకు అనుమతి ఇవ్వకూడదనేది నిబంధన
- స్టోన్ క్వారీ పేలుళ్లతో ఏర్పడే కాలుష్యం కారణంగానే..
- ఇక్కడ ఇళ్లు నిర్మించుకుంటే ప్రమాదకర పరిస్థితులే..
- అయినా అనుమతులిచ్చిన సీఆర్డీఏపై విమర్శలు

పరిటాల ఇండస్ట్రియల్-మైనింగ్ ఏరియా బఫర్ జోన్ పరిధిలో రెసిడెన్షియల్ లే అవుట్లకు సీఆర్‌డీఏ అనుమతులు ఇవ్వటం వివాదాస్పదంగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఎలా ఇస్తారనే ప్రశ్నలు వస్తున్నాయి. ప్లానింగ్ విభాగంలోని అవినీతి అధికారులు కొందరు కాసులకు కక్కుర్తి పడి ఇలా అనుమతులు ఇచ్చారా.. అనే అనుమానాలు కలుగుతున్నాయి.



పరిటాలలో బఫర్ జోన్‌లో ఉన్న అధికారిక లే అవుట్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఓవైపు రాజధాని అమరావతి నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. ఈ పనులకు కంకర అంతా పరిటాల నుంచే తీసుకెళ్లేందుకు కాంట్రాక్టు సంస్థలు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. ఇలాంటి తరుణంలో పరిటాలలోని బఫర్ జోన్ పరిధిలో రెసిడెన్షియల్ లే అవుట్లకు సీఆర్‌డీఏ అధికారులు అనుమతులు ఇవ్వడం వివాదాస్పదమవుతోంది.

అదంతా క్రషింగ్ ఏరియా

పరిటాలలో ఉన్న మెటల్స్ కారణంగా దశాబ్దాల కిందటే ఇక్కడ స్టోన్ క్రషింగ్, ఇండస్ట్రియల్స్‌కు అనుమతులు ఇచ్చారు. కాగా, సర్వే నెంబర్ 801లో 1,300 ఎకరాల రెవెన్యూ భూముల్లో మెటల్, గ్రావెల్ క్వారీలకు అధికారికంగా అనుమతులు ఇచ్చారు. ఇదే ప్రాంతంలో పలు యూనిట్లు కూడా ఏర్పాటయ్యాయి. అప్పట్లో కాలుష్య నియంత్రణ మండలి నుంచి తీసుకున్న అనుమతుల మేరకు ఈ యూనిట్లను ఏర్పాటు చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన క్రషింగ్ యూనిట్ల ద్వారా రోడ్డు, బిల్డింగ్ మెటల్‌ను తయారుచేసి ఎగుమతి చేస్తున్నారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, నరసరావుపేట, ఉమ్మడి గోదావరి జిల్లాలకు ఇక్కడి నుంచే బిల్డింగ్, రోడ్డు మెటల్ పెద్ద ఎత్తున ఎగుమతి అవుతోంది. ప్రస్తుతం రాజధాని అమరావతి నిర్మాణ పనుల నేపథ్యంలో అవసరాలకు అనుగుణంగా బిల్డింగ్ మెటల్ అంతా ఇక్కడి నుంచే వెళ్లనుంది.

నివాసయోగ్యమేనా?

ఇప్పటికే బఫర్ జోన్ వెలుపల ఉన్న రైతులు తమ పొలాల్లోకి దుమ్ము ధూళి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటపుడు బఫర్ జోన్ పరిధిలో నివాస లే అవుట్లకు అనుమతులు ఇస్తే కాలుష్యం బారిన పడే ప్రమాదం ఉంది. ఇక్కడ నివసిస్తున్న వారు మిగతా 6లో..

బఫర్ జోన్ నిబంధనలు మరిచారా?

మైనింగ్ జోన్లకు సంబంధించి ప్రభుత్వం 153 జీవోను విడుదల చేసింది. దీనిప్రకారం క్వారీలు, స్టోన్ క్వారీయింగ్‌ను నిర్వహించటానికి ఆయా వనరులు ఉన్న ప్రదేశం జనావాసాలతో సంబంధం లేకుండా ఉండాలి. ఆ తర్వాతే వాటిని మైనింగ్ జోన్‌లోకి తీసుకురావాలి. ఈ మైనింగ్ జోన్ చుట్టూ బఫర్ జోన్ ఉంటుంది. పరిటాల గ్రామంలోని సర్వే నెంబర్ 801లో మైనింగ్ బఫర్ జోన్ పరిధి ప్రస్తుతం 500 మీటర్ల వరకు ఉంది. ఈ పరిధిలో ఎలాంటి రెసిడెన్షియల్ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకూడదు. దీనిపై గతంలో ఇక్కడి నిర్వాహకులంతా కలిసి బఫర్ జోన్ నిడివి 800 మీటర్ల పరిధి వరకు పెంచాలని డిమాండ్ చేశారు. సీఆర్‌డీఏ అధికారులకు కూడా స్టోన్ యూనిట్స్ నిర్వాహకులు లేఖలు రాశారు. ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకుంటే తప్ప ఈ వివాదానికి చెక్ పడే అవకాశం లేదు.

అమరావతిలో ప్రపంచ, ఆసియా బ్యాంకుల బృందం పర్యటన

- ఓరియెంటేషన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో పాల్గొన్న బృందం
- రాజధానికి సంబంధించిన అనేక అంశాలపై చర్చ

8



ప్రజల భాగస్వామ్యంతో.. నీరు-మీరు

- రేపు జిల్లావ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు
- గ్రామాల్లో నీటి బడ్జెట్‌పై ప్రత్యేక ప్రణాళిక
- నీటి పొదుపు, పునర్వినియోగం, ఇంకుడు గుంతల ప్రోత్సాహం
- పంచాయతీ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నీటిని సద్వినియోగం చేసుకోవటంతో పాటు నీటి వృథాను అరికట్టడం, పునర్వినియోగ పద్ధతులను అవలంబించడం, నీటి వనరులను పెంపొందించుకోవటం కోసం ప్రజా భాగస్వామ్యంలో 'నీరు-మీరు' కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ఈనెల 21 శనివారం 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యానికి శ్రీకారం చుట్టాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాలు జారీ చేశారు. జిల్లా పంచాయతీ అధికారుల నేతృత్వంలో గ్రామగ్రామాన ఈ కార్యక్రమం జరుగుతుంది. ప్రతి గ్రామంలో నీటి వనరులకు సంబంధించిన అధ్యయనంతో పాటు నీటి లభ్యత ఎలా ఉందన్న అంశాలను వివరిస్తారు. గ్రామ అవసరాలకు మించి నీటి వనరులను పెంచుకునేలా తగిన ప్రణాళికలు తయారు మిగతా 6లో..

ఆంధ్రజ్యోతి చొరవ.. దివ్యాంగ విద్యార్థికి దారి

ఫలించనున్న బొంబాయి ఐఐటీ కల

- దివ్యాంగుల కోటాలో ఆల్ ఇండియా మూడో ర్యాంక్
- అనివార్య కారణలతో సీటు లభించని పరిస్థితి
- ఆంధ్రజ్యోతి చొరవతో స్పందించిన ఇంటర్ డైరెక్టర్ కృతిశుక్లా
- న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో ఆనందంలో విద్యార్థి



విద్యార్థి సత్యసాయి, తండ్రి కృష్ణమూర్తి

ఐఐటీ బొంబాయిలో సీటు సాధించడమే ఆ విద్యార్థి కల. వైకల్యం ఉన్నప్పటికీ ఆ దిశగా ఎంతో కష్టపడి ప్రయత్నించి, సాధించాడు. కానీ, చివరి నిమిషంలో ఆ కలను చెరిపేసింది ఓ ప్రభుత్వ నిబంధన. అయినప్పటికీ పట్టు వదల్లేదు. ఆశ కోల్పోలేదు. తండ్రి, ఆత్మీయుల సహాయంతో, ఆంధ్రజ్యోతి సహకారంతో ప్రయత్నించాడు. ఆ ప్రయత్నమే అతని ఆశయానికి దారి చూపింది.

విజయవాడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ మెయిన్స్‌లో దివ్యాంగుల కోటాలో సత్యసాయి శబరీష్ ఆల్ ఇండియాలో మూడో ర్యాంకు సాధించాడు. అన్నీ అనుకున్నట్టే ఐఐటీ బొంబాయిలో సీటు ఖాయమనుకునే సమయంలో జోసా కౌన్సెలింగ్ నిబంధన ఆ విద్యార్థిని ఒక్కసారిగా వెనక్కి లాగేసింది. రాష్ట్రస్థాయిలో ఇంటర్మీడియెట్ బోర్డు దివ్యాంగ విద్యార్థులకు ఒక్కో సంవత్సరానికి ఐదు సబ్జెక్టుల చొప్పున రెండేళ్లకు పది సబ్జెక్టులు ఇస్తుంది. ఒక్కో సంవత్సరానికి కనీసం నాలుగు సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధిస్తే ఆ విద్యా సంవత్సరం పూర్తయినట్టే. అలాగే, దివ్యాంగులకు రెండు లాంగ్వేజ్ సబ్జెక్టుల్లో ఒక లాంగ్వేజ్‌కు మినహాయింపు ఇచ్చేవారు. అంటే ఏదైనా ఒక లాంగ్వేజ్ రాస్తే సరిపోతుంది. కానీ, ఈ విధానాన్ని 2024 సంవత్సరానికి మాత్రమే వర్తించేలా మిగతా 6లో..

6

ఆశ వదిలేసిన సమయంలో ఆదుకున్నారు

మా అబ్బాయి బొంబాయి ఐఐటీలో సీటు వస్తుందనే నమ్మకం కోల్పోయాం. ఉదయం నుంచి కలవని అధికారి, తిరగని కార్యాలయం లేదు. చివరి ప్రయత్నంగా 'ఆంధ్రజ్యోతి' కార్యాలయాన్ని సంప్రదించాం. వారి సూచనలు, సలహాలతో ఇంటర్మీడియెట్ బోర్డు డైరెక్టర్ కృతిశుక్లాను సంప్రదించాం. ఆమె ముఖ్యమైన కార్యక్రమంలో ఉన్నప్పటికీ ఓపికతో మా సమస్యను తెలుసుకున్నారు. పాత జీవోను పునరుద్ధరించి సీటు వచ్చేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆశలు వదిలేసుకున్న సమయంలో సమస్యకు వెంటనే పరిష్కారం చూపిన ఆంధ్రజ్యోతికి, కృతిశుక్లాకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

\- కృష్ణమూర్తి, విద్యార్థి తండ్రి

పాత భవనంలో పడక కష్టాలు



- పాత జీజీహెచ్‌లో కొత్తభవనం పూర్తి చేయాలంటూ విన్నపాలు
- మరో రెండంతస్తులు పెంచితే సౌలభ్యం
- రక్త పరీక్షలు, స్కానింగ్‌కు వేరే భవనానికి వెళ్లాల్సిన పరిస్థితి

8

భవన వ్యర్థాలను డంప్ చేస్తే కఠిన చర్యలు

- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ హెచ్చరిక
- 'నదిలో అడ్డుకట్ట' కథనానికి స్పందన

6





పాత కాపులకు బై బై.. యువతకు హాయ్ హాయ్

సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసే క్రమంలో తెలుగుదేశం పార్టీ కీలక ప్రక్రియ చేపట్టింది. ముందు నుంచీ యువనేత లోకేశ్ చెప్పుకొస్తున్న ప్రకారం పార్టీ పదవులను అప్పగించేందుకు కొన్ని నియమ నిబంధనలు విధిస్తూ బుక్‌లెట్ విడుదల చేసింది. ఇప్పటికే నియోజకవర్గాలకు సంస్థాగత పదవుల పంపిణీ కోసం త్రీమెన్ కమిటీని ఏర్పాటు చేసింది. వీరితో పాటు మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి పదవుల పంపిణీ ప్రక్రియ ప్రారంభించింది. ఈ విషయంలో బూత్, యూనిట్, క్లస్టర్ సభ్యుల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

(నందిగామ/జగ్గయ్యపేట-ఆంధ్రజ్యోతి)

- యువనేత నారా లోకేశ్ నూతన నిబంధనలు
- సంస్థగత ఎన్నికలకు భిన్నంగా విధి విధానాలు
- పార్టీ పదవుల్లో కొత్త వారికి అవకాశం
- ఆశావహుల్లో హర్షాతిరేకాలు

మండల పార్టీ అధ్యక్ష పదవుల ఎంపికకు సమావేశాలు నిర్వహించి ఆయా మండలాలలోని గ్రామ పార్టీల అధ్యక్షులు, కార్యదర్శులతో పాటు సమావేశానికి హాజరైన పార్టీ నేతల అభిప్రాయాలు సేకరించిన నివేదిక ఆధారంగా పార్టీ అధ్యక్ష, కార్యదర్శుల ఎంపిక నిర్వహించే విధంగా విధి విధానాలు రూపకల్పన చేశారు. ముఖ్యంగా మూడు పర్యాయాలు లేక ఆరేళ్ల పాటు పార్టీ పదవుల్లో ఉన్న వారిస్థానంలో కొత్త వారికి అవకాశం ఇవ్వాలని పార్టీ పెద్దలు నిర్ణయించారు. అది కూడా కార్యకర్తల అభీష్టం మేరకే జరగాల్సి ఉంది. ఇప్పటి వరకూ జరిగిన సంస్థాగత ఎన్నికలకు భిన్నంగా ఈ విధివిధానాలు ఉన్నాయి. ఇప్పటి వరకూ సమావేశాలు నిర్వహించి అధినాయకులు తమ ఆలోచన మేర ఒక వ్యక్తిని ప్రతిపాదించడం, ఇష్టం ఉన్నా లేకున్నా నాయకులు, కార్యకర్తలు చపట్లు కొట్టి ఆ ప్రతిపాదనను ఆమోదించడం జరుగుతోంది. పదవిపై ఆశ ఉన్నా ఆశావహులు పెదవి విప్ప లేని స్థితి కొనసాగుతూ వస్తున్నది. అలా ఎన్నిక కాబడిన చాలామంది రెండు దశాబ్దాల పాటు మండల, గ్రామ పార్టీ అధ్యక్ష పదవులు చేపట్టిన దాఖలాలు ఉన్నాయి. ఈ విధానాలకు స్వస్తి చెప్పి పార్టీ ఏ ఒక్కరిదీ కాదని, పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరికీ హక్కు, బాధ్యత ఉంటుందని ఈ బుక్‌లెట్‌లోని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. కార్యకర్తకు బలం, గౌరవం అందించడమే ముఖ్య ఉద్దేశ్యంగా ఈ నిబంధనలు తీసుకున్నట్టు అందరూ భావిస్తున్నారు.

నందిగామ నియోజకవర్గంలో గణనీయ మార్పులు

నందిగామ నియోజకవర్గంలో ఇప్పటికే గ్రామ, మండల, పట్టణ పార్టీ అధ్యక్షుల ఎన్నికలు పూర్తయ్యాయి. ముందు నుంచీ యువనేత చెబుతున్నప్పటికీ పాతవారినే కొనసాగిస్తూ నియామకం చేపట్టారు. ఈక్రమంలో కంచికచర్ల మండల అధ్యక్షుడిగా ఎన్నికైన కోగంటి బాబు సుమారు 15 ఏళ్లుగా పదవిలో కొనసాగుతున్నారు. చందర్లపాడు మండల అధ్యక్షుడు మేకల సుధాకర్ 11 ఏళ్ల నుంచి పదవిలో కొనసాగుతున్నారు. వీరులపాడు మండల అధ్యక్షుడు కొర్లకుంట శ్రీనివాసరావు ఆరేళ్లుగా ఆ పదవిలో ఉన్నారు. వీరితో పాటు కంచికచర్ల పట్టణ అధ్యక్షుడిగా ఉన్న వేమా వెంకట్రావు సుదర్ఘ కాలంగా పదవిలో కొనసాగుతున్నారు. పార్టీ కొత్త నిబంధనల ప్రకారం వీరంతా పదవుల నుంచి తప్పుకోక తప్పని పరిస్థితి. నందిగామ పట్టణ, మండల అధ్యక్షులు చివరిదశకు చేరుకున్నారు. పట్టణ అధ్యక్షుడు ఏచూరి రామకృష్ణ, కార్యదర్శి కాసర్ల లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షుడు వీరంకి వీరస్వామిలు ఐదేళ్లుగా పదవుల్లో కొనసాగుతున్నారు. నిబంధనల ప్రకారం వీరికి మరో మారు కొనసాగే అవకాశం ఉంది.

జగ్గయ్యపేట నియోజకవర్గంలో..

జగ్గయ్యపేట పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికైన మేకా వెంకటేశ్వర్లు పదేళ్లుగా పదవిలో కొనసాగుతున్నారు. మండల అధ్యక్షుడు కట్టా నరసింహారావు 12 సంవత్సరాలుగా పదవిలో ఉన్నారు. వత్సవాయి మండల అధ్యక్షుడు ఆరేళ్లు పూర్తి చేసుకొని ఏడో సంవత్సరంలో కొనసాగుతుండగా, పెనుగంచిప్రోలు మండల అధ్యక్షుడిగా చింతల సీతారామయ్య రెండు దశాబ్దాలుగా పదవిలో కొనసాగుతున్నారు. ఏళ్ల తరబడి పదవులు వీడకుండా ఉన్న వీరిపై పార్టీ శ్రేణుల్లో ఒకింత అసంతృప్తి కూడా ఉంది. వీరంతా ఆరుపదుల వయస్సు దాటిన వారే. దీంతో కొత్త తరం పార్టీ నాయకులు, కార్యకర్తలు వారితో కలిసి నడవలేక పోతున్నారు. సంస్థాగత ఎన్నికలకు ముందే యువనేత లోకేశ్ ఈ ప్రతిపాదన మౌఖికంగా ప్రకటించినా ఎమ్మెల్యేలు సాంప్రదాయాన్ని వీడకుండా పాతవారినే కొనసాగించారు.

ఉత్కంఠగా యువ నాయకత్వం..

పార్టీ పదవి ఒక్కసారి దక్కితే చాలు శాశ్వతంగా వారే కొనసాగుతున్నారు. నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో ఇరవై ఏళ్లకు పైబడి పదవుల్లో కొనసాగినవారున్నారు. చివరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు వారిని పేరుతో కంటే మండల ప్రెసిడెంట్, టౌన్ ప్రెసిడెంట్ అని పిలిచేంతగా వారు ఆ పదవులు పట్టుకొని కొనసాగారు. మొత్తం మీద యువనేత నిర్ణయంతో పార్టీలో కొత్త వ్యక్తులు, యువతరానికి పగ్గాలు అందనున్నాయి. ఇప్పటికే ఆయా పదవులకు ఆశావహులు ఉన్నప్పటికీ ఎమ్మెల్యేల ఆలోచనలకు ఎదురు చెప్పలేక మిన్నకుండి పోయారు. ఇప్పుడు అవకాశం అంది రావడంతో ఆశావహులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కలెక్టర్ లక్ష్మీశ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

దుర్గమ్మ సేవలో కలెక్టర్ దంపతులు

ఇంద్రకీలాద్రి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి, దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను గురువారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలను అందజేసి అమ్మవారి దర్శనం కల్పించారు. దర్శనానంతరం వారికి వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు, అర్చకులు వారికి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

దేవదాయ కమిషనర్‌ను కలిసిన ఈవో



ఇంద్రకీలాద్రి: దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్‌ను దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో దుర్గగుడి ఈవో వీకే శీనానాయక్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. దేవస్థానం అభివృద్ధి పనులు, ఆషాడమాస ఉత్సవాలు, భక్తుల అభిప్రాయ సేకరణ ద్వారా సంతృప్తిస్థాయి వివరాలు తదితరాలపై కమిషనర్‌కు ఈవో శీనానాయక్ వివరించారు.



చంద్రబాబును కలిసి వివరిస్తున్నయోగాసనా స్పోర్ట్స్ ప్రతినిధులు

సీఎంను కలిసిన యోగాసన స్పోర్ట్స్ ప్రతినిధులు

పటమట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ గౌరవాధ్యక్షులు గొట్టిపాటి రామకృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో యోగాసన స్పోర్ట్స్ ప్రతినిధులు వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ప్రతి ఏడాది యోగాసన పోటీలు, ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణపై సీఎంతో చర్చించారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్ పొందిన అథ్లెట్స్ యోగా మాస్టర్లు, కోచ్‌లు యోగాంధ్రాలో వారు పొల్గొన్న వివరాలను సీఎంకు వివరించగా సీఎం ప్రత్యేకంగా అభినందించినట్టు గొట్టిపాటి తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షురాలు రాధిక, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి రాజేశ్వరి, జాయింట్ సెక్రటరీ తేజలు పాల్గొన్నారు.

రెండో పీఆర్సీ విడుదల చేయండి

- సహకార సంఘ ఉద్యోగుల వినతి



తిరువూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు 2019-2024 రెండో పీఆర్సీని వెంటనే విడుదల చేయాలని కోరుతూ, పీఏసీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం చీఫ్ సెక్రటరీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ, సహకార సంఘాల ఉద్యోగుల రెండో వేతన సవరణ పెండింగ్‌లో ఉన్నప్పటికీ, నేటికీ సరైన నిర్ణయం తీసుకోలేదన్నారు. రెండో పీఆర్సీ వేతన బకాయిలు వెంటనే అందజేయాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చినట్టు వివరించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లినేని రఘురామ్, కోశాధికారి కొండలశర్మ, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ నరసింహారావులు పాల్గొన్నారు.



రామలింగేశ్వరనగర్‌లో నదీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పట్టాభి

భవన వ్యర్థాలను డంప్ చేస్తే కఠిన చర్యలు

పటమట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నదీ ప్రవాహానికి ఆటంకం కలిగిస్తూ పర్యావరణానికి నష్టం చేకూర్చేలా భవన నిర్మాణ వ్యర్థాలను అక్రమంగా డంప్‌చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. 'నదిలో అడ్డుకట్ట' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి ఆయన స్పందించి గురువారం రామలింగేశ్వర్‌నగర్ ప్రాంతాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. డంపింగ్ విధానాన్ని అడ్డుకోకుండా అలసత్వం ప్రదర్శించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. త్వరలో నగరంలోని బిల్డర్స్ అసోసియేషన్‌తో సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా విజయవాడలో ఆగిపోయిన కనస్ట్రక్షన్ డిమోలేషన్ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్ త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. నగరంలో ఎవరైనా అక్రమంగా భవన నిర్మాణ వ్యర్థాలను నదీ పరివాహక ప్రాంతాల్లో డంప్ చేస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు భారీగా అపరాధ రుసుం విధించేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈఈ సామ్రాజ్యం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, డీఎంహెచ్‌వో గోపాల నాయక్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించకుంటే

25 నుంచి ఆమరణ దీక్ష

- ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్

ధర్నాచౌక్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత 44 రోజులుగా 13 వేల మంది మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం ఇంతవరకు స్పందించకపోడం దారుణమని ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నేతలు ధ్వజమెత్తారు. గత ప్రభుత్వహయాంలో తమకు జరిగిన అన్యాయమే కూటమి ప్రభుత్వంలోనూ జరుగుతుందని విమర్శించారు. నేటినుంచి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈనెల 20న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసలు, 21న ప్రజాప్రతినిధుల ఇళ్లకు వెళ్లి వారికి తమ బాధలు వివరిస్తామని, 24న 13 వేల మంది కార్మికుల కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన చేస్తామన్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే 25 నుంచి అమరణ దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ధర్నాచౌక్‌లో జరుగుతున్న ధర్నాలో గురువారం పాల్గొన్న నేతలు మాట్లాడారు. ఈ నెల 2న మున్సిపల్‌శాఖ మంత్రిని కలిసి పరిస్థితి వివరించగా సీఎంతో కలిపిస్తానని హామీఇచ్చి ఇంతరకు తమను పట్టించుకోలేదని మండిపడ్డారు. రూ.13 వేల జీతాలతో కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. యూనియన్ నేతలు జయపాల్, పిట్ట మహేష్‌బాబు, సీహెచ్. సాంబశివరావు, బొడ్డు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిఘా కళ్లు

(5వ పేజీ తరువాయి)

నూతనంగా ఎనిమిది అంతస్థులతో నిర్మించిన న్యాయస్థానాల సముదాయం చుట్టూ 20 సీసీ కెమెరాలు అమర్చారు. సూర్యారావుపేట పోలీస్ స్టేషన్ సిబ్బంది ఈ కెమెరాల బాధ్యతలను చూస్తున్నారు. ఇదికాకుండా న్యాయస్థానంలోకి ప్రవేశించడానికి వీలుగా ఉన్న మూడు మార్గాల్లో మరో ఐదు సీసీ కెమెరాలను అమరుస్తున్నారు. కొత్త భవనం చుట్టూ మాత్రమే కాకుండా భవనంలోకి ప్రవేశించి లిఫ్టులు ఎక్కే మార్గంలోనూ నిఘానేత్రాలు అమరుస్తున్నారు.

చీమ చిటుక్కుమన్నా తెలిసేలా..

న్యాయస్థానాల సముదాయంలో ఏర్పాటుచేస్తున్న సీసీ కెమెరాలు నూతన సాంకేతిక పరిజ్ఞానం కలిగినవి. వ్యక్తుల రాకపోకలను తెలుసుకునేలా, వారి సంభాషణలు సైతం వినే సాంకేతికత ఉన్న కెమెరాలను అమరుస్తున్నారు. దీనిలో ఆడియో, వీడియో స్పష్టంగా తెలుస్తుంది. ఈ కెమెరాలను ఎంజీ రోడ్డులోని ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేస్తున్నారు. దీంతోపాటు కోర్టు ప్రాంగణంలో ఏం జరుగుతుందో ప్రత్యక్షంగా పోలీస్ కమిషనర్, సూర్యారావుపేట ఇన్‌స్పెక్టర్ వీక్షించే అవకాశం ఉంటుంది. ఇందుకోసం ప్రతి కెమెరాలో సిమ్‌కార్డును అమరుస్తున్నారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు ఫుటేజీని ఆ సిమ్‌కార్డు ద్వారా పోలీసులు తీసుకోవచ్చు.

వివాదాలకు చెక్ పెట్టేలా..

ఇప్పటివరకు కోర్టుకు వచ్చిన నలుగురు కక్షిదారుల వాహనాలు దొంగతనానికి గురయ్యాయి. న్యాయవాదుల మధ్య జరిగిన వివాదాలకు సంబంధించి ఎనిమిది ఫిర్యాదులు సూర్యారావుపేట పోలీసులకు అందాయి. ప్రస్తుతం మద్యం కుంభకోణానికి సంబంధించిన కేసు ఏసీబీ కోర్టు విచారణలో ఉంది. ఈ కేసులో ఇంకా సిట్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. రాబోయే రోజుల్లో ఇంకెన్ని అరెస్టులు ఉంటాయో చెప్పలేని పరిస్థితి. మరోవైపు వైసీపీకి చెందిన నాయకులు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మాజీ ఐఏఎస్ ధనంజయ్‌రెడ్డి, పి.కృష్ణమోహన్‌రెడ్డి వంటి వారంతా జిల్లా జైల్లో ఉన్నారు. రిమాండ్ పొడిగింపు ఉన్న ప్రతిసారీ వారిని జైలు నుంచి కోర్టుకు తీసుకొస్తున్నారు. ఆ సమయంలో వారి కుటుంబ సభ్యులే కాకుండా వైసీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా కోర్టు వద్దకు వస్తున్నారు. వ్యాన్ దిగిన దగ్గర నుంచి ఎస్కార్ట్ సిబ్బందిని తోసుకుంటూ వారిని కలవడానికి తాపత్రయ పడుతున్నారు. ఈ నేపథ్యంలో కోర్టు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు తెలుస్తోంది.

నీరు-మీరు

(5వ పేజీ తరువాయి)

చేసుకోవడమే ఈ కార్యక్రమంలో ప్రధానమైన అంశం.

కీలకమైన కార్యక్రమాలు

భూగర్భ జలాల నీటిమట్టాన్ని గణనీయంగా మెరుగుపరిచే చర్యలపైనా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఎడాపెడా బోర్‌వెల్స్ ఏర్పాటు చేయటం, పరిమితికి మించి భూమి లోతుకు తవ్వడం వంటి వాటిపై నియంత్రణ విధించటంతో పాటు ప్రజల సహకారంతో వాల్టా చట్టాన్ని సమర్థంగా అమలు జరిగేలా కృషి చేస్తారు. ఒకసారి వినియోగించిన నీటిని తిరిగి వినియోగించుకునేందుకు తగిన ప్రక్రియను అభివృద్ధి చేసుకోవడం కూడా ఇందులో ప్రధానమైనదే. అలాగే, గ్రామాల పరిధిలోని వర్షపు నీటి వనరులను శుభ్రం చేయటానికి ప్రత్యేక డ్రైవ్స్ నిర్వహించనున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, వసతి గృహాల దగ్గర నిర్మించిన నీటినిల్వ వ్యవస్థలను బాగు చేయడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు, కమ్యూనిటీ హాళ్ల దగ్గర కొత్తగా వర్షపునీటి నిల్వ నిర్మాణాలు చేపట్టడానికి చర్యలు తీసుకుంటారు. చేతి పంపులు, పబ్లిక్ ట్యాప్‌లు, ప్రైవేట్ ట్యాప్‌లు, బోర్‌వెల్స్ వంటి వాటి దగ్గర ఇంకుడు గుంతలతో కూడిన ప్లాట్‌ఫాంలు నిర్మించాలనే అంశాన్ని కూడా ఈ కార్యక్రమంలో చేరుస్తున్నారు. ఓవర్‌హెడ్ రిజర్వాయర్ల దగ్గర నీటిని సంరక్షించటానికి ఇంకుడు గుంతలు నిర్మించాలని ఆదేశించారు. పైపులైన్ లీకేజీలను అరికట్టడం, పబ్లిక్, ప్రైవేట్ ట్యాప్‌లు ఆఫ్‌లో ఉంచేలా చర్యలు తీసుకోవటం చేస్తారు. వ్యక్తిగత, కుటుంబ, వ్యాపార, వాణిజ్య, వ్యవసాయ క్షేత్రాల్లో నీటి వాడకాన్ని అవసరం మేరకు వినియోగించడం, నీటివృథాను అరికట్టడం అనే అంశాలపైనా ప్రచారం చేస్తారు.

దివ్యాంగ విద్యార్థికి దారి

(5వ పేజీ తరువాయి)

అప్పట్లో జీవో విడుదల చేశారు. మొత్తం నాలుగు సబ్జెక్టుల మార్కులను సరాసరి చేసి, ఐదో సబ్జెక్టును కూడా కలిపేవారు. కానీ, ఈ జీవో 2024 విద్యా సంవత్సరానికి మాత్రమే అమలు చేసినట్లు తెలిసింది. అదే నిబంధన ఉందనే అభిప్రాయంతో సాయి శబరీష్ ఈ ఏడాది అదే మాదిరిగా ఇంటర్ పరీక్షలు రాశాడు. కానీ, ఈ ఏడాది ఆ నిబంధన లేదని తెలుసుకుని, బొంబాయి ఐఐటీలో సీటు సాధించడం కష్టమని తెలుసుకున్న సాయి శబరీష్ తన తండ్రి సహాయంతో అన్ని ప్రయత్నాలు చేశారు. చివరి ప్రయత్నంగా 'ఆంధ్రజ్యోతి'ని సంప్రదించారు. 'ఆంధ్రజ్యోతి' విషయాన్ని ఇంటర్మీడియెట్ బోర్డు డైరెక్టర్ కృతి శుక్లాకు తెలపగా, ఆమె వెంటనే స్పందించారు. యోగాంధ్ర కార్యక్రమంలో ఉన్నప్పటికీ మెసేజ్ ద్వారా సదరు విద్యార్థి పరిస్థితిని అడిగి తెలుసుకుని వెంటనే పాత జీవోను పునరుద్ధరించేలా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, చెన్నుబోయిన చిట్టిబాబు తదితరులు

అవగాహనతో సికిల్ సెల్ నియంత్రణ

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

ఇబ్రహీంపట్నం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ అవగాహనతోనే సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిని నియంత్రించవచ్చని, దీనిపై జూన్ 19 నుంచి పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ చెప్పారు. 'ప్రపంచ సికిల్ సెల్ దినం' సందర్భంగా జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కొండపల్లి గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో సికిల్ సెల్ వ్యాధి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆయన ప్రజా ప్రతినిధులు ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన మిషన్‌లో భాగంగా వ్యాధికి సంబంధించి వివిధ వర్గాల్లో పెద్దఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. రాబోవుతరాలకు వ్యాధి వ్యాపించకుండా నిరోధించాలంటే సరైన అవగాహన ముఖ్యమన్నారు. కార్యక్రమంలో కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాసరావు, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డీటీడబ్ల్యూవో విజయశాంతి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ మాధవి, వైద్యాధికారులు పద్మావతి, విజయకుమార్, నోడల్ అధికారి డాక్టర్ నవీనా, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

మాదకద్రవ్య రహిత సమాజం లక్ష్యం

కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రభుత్వం కృషిచేస్తోందని, ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. గురువారం కలెక్టర్ లక్ష్మీశ, ఆకర్ష ఫౌండేషన్, హెల్త్‌కేర్, నవజీవన్ బాల భవన్ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్టీఆర్ జిల్లాను మాదక ద్రవ్య రహిత జిల్లాగా మార్చేందుకు జిల్లా అధికార యంత్రాంగం తీసుకొంటున్న చర్యలకు స్వచ్ఛంద సంస్థలు కూడా తోడైతే మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. ప్రతి విద్యాసంస్థలోనూ ఈగల్ క్లబ్స్‌తో పాటు క్యాంపస్ అంబాసిడర్లను నియమించడం జరుగుతోందన్నారు. జూలై నుంచి ఆర్నెల్ల పాటు ర్యాలీలు, వాకథాన్‌లు, సదస్సులు నిర్వహించనున్నట్టు తెలిపారు. సమావేశంలో డాక్టర్ శంకర్ (ఆకర్ష ఫౌండేషన్)తో పాటు హెల్త్‌కేర్ ఎన్జీఓ, నవజీవన్ బాలభవన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పండుగలా యోగా..

కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను పండుగలా నిర్వహించేలా ఏర్పాట్లు చేసి సిద్ధం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ఈ నెల 21వ తేదీ శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లావ్యాప్తంగా నిర్వహించే యోగాపై గురువారం కలెక్టరేట్ నుంచి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. జిల్లాలోని 605 గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో సుమారు 9 లక్షల మంది యోగా వేడుకలో పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఇందుకు అవసరమయ్యే ఎల్‌ఈడీ స్క్రీన్‌లు, ల్యాప్‌టాప్‌లు, ఇంటర్‌నె ట్ సౌకర్యాలను కల్పించాలన్నారు. జిల్లాస్థాయి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. వీడియో కాన్ఫరెన్సులో డీపీఓ పి.లావణ్యకుమారి, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి పాల్గొన్నారు.

రాజధానిలో డీఆర్‌టీఏ కోర్టు ఏర్పాటు చేయాలి

- సీఎం చంద్రబాబుకు బెజవాడ బార్ న్యాయవాదుల వినతి

విజయవాడ లీగల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : రాజధానిలో డీఆర్‌టీఏ కోర్టు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదులు గురువారం సీఎం చంద్రబాబును ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆర్థికంగా వెనుకబడిన న్యాయవాదులకు పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని, తెలంగాణా న్యాయవాదులకు ప్రభుత్వం కల్పించిన ఇన్సూరెన్సును ఏపీ న్యాయవాదులకు కూడా కల్పించాలని కోరారు. జూనియర్ న్యాయవాదులకు లా నేస్తం అమలుకు తీసుకొంటున్న చర్యలకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించి వాటి అమలుకు చర్యలు తీసుకొంటానని హామీ ఇచ్చినట్లు న్యాయవాదులు తెలిపారు. బెజవాడ బార్ అధ్యక్ష, కార్యదర్శులు ఏకే బాషా, కేవీ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

వీలైనంత త్వరగా పదోన్నతులు

- ఎన్ఎంయుఏ, ఈయూలతో ఈడీ చర్చలు

బస్‌స్టేషన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులకు వీలైనంత త్వరగా పదోన్నతులు కల్పిస్తామని గుర్తింపు సంఘాలైన నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయుఏ), ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ)ల ప్రతినిధులతో పరిపాలనా విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవివర్మ గురువారం జరిపిన చర్చల సందర్భంగా తెలియజేశారు. ఈ చర్చలలో తీసుకున్న నిర్ణయాలపై ఎన్ఎంయుఏ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. మొత్తం 11 అంశాలపై చర్చలు జరిగాయని తెలిపారు. ఆర్థికేతర అంశాలకు సంబంధించి ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేయటం వల్ల పదోన్నతులలో జాప్యం జరిగిందని ఈడీ తెలిపారన్నారు. సంబంధిత ఫైల్ అడ్వకేట్ జనరల్ ఆమోదం పొంది ప్రస్తుతం చీఫ్ సెక్రటరీ వద్ద ఉందని పేర్కొన్నారు. జూలైలో మరోసారి సమావేశం ఏర్పాటు చేసి ప్రధానమైన సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని చెప్పారు. ఈ సమావేశంలో ఆర్టీసీ అధికారులతో పాటు ఎన్ఎంయూఏ రాష్ట్ర అధ్యక్షుడు రమణారెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీనివాసరాజు, నాయకులు ఎ.సూర్యచంద్రరావు, ఎన్.వి.రమణ, కోశాధికారి పి.వి.వి.మోహన్, సంయుక్త కార్యదర్శి రాజేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రైతు సాధికార సంస్థలో 'ఈకో నెస్ట్' క్రెష్ సెంటర్

అమరావతి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): గుంటూరులోని రైతు సాధికార సంస్థ ప్రధాన కార్యాలయంలో పని చేసే మహిళలు, ఉద్యోగుల పిల్లల సంరక్షణ కోసం 'ఈకో నెస్ట్' పేరుతో క్రెష్ సెంటర్‌ను సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్ గురువారం ప్రారంభించారు. ఉద్యోగుల మధ్య లైంగిక సమానత్వ విధానాలు ఉండేలా.. 50 మంది కంటే ఎక్కువ ఉద్యోగులున్న ప్రతి సంస్థలో క్రెష్ సెంటర్ ఉండాలన్న నిబంధన మేరకు ఈ 'ఈకో నెస్ట్' క్రెష్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు సంస్థ సీఈవో రామారావు తెలిపారు. కాగా రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ పరిధిలోని ఎకో టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా డిప్యూటీ ఫారెస్ట్ కన్జర్వేటర్ నందనీ సలారియాను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కాకినాడ టౌన్-చర్లపల్లి-లింగంపల్లి మధ్య

ప్రత్యేక రైళ్లు



రైల్వే స్టేషన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని పురస్కరించుకుని కాకినాడ టౌన్-చర్లపల్లి, కాకినాడ టౌన్-లింగపల్లి మధ్య ప్రత్యేక వీక్లీ రైళ్లను నడుపుతున్నారు. 07447 కాకినాడ టౌన్-చర్లపల్లి శనివారం నడుస్తుంది. కాకినాడలో రాత్రి 8.10కి బయలుదేరి మరునాడు ఉదయం 8.30కు చర్లపల్లికి చేరుతుంది. జులై 5 నుంచి మార్చి 28 వరకు ఈ రైలు నడుస్తుంది. 07448 చర్లపల్లి-కాకినాడ టౌన్ ఆదివారాలలో నడుస్తుంది. చర్లపల్లిలో రాత్రి 7.30 గంటలకు బయలుదేరి మరునాడు ఉదయం 9 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుతుంది. జులై 6నుంచి మార్చి 29 వరకు ఈరైలు నడుస్తుంది. 07445 కాకినాడ టౌన్-లింగంపల్లి సోమ, బుధ, శుక్రవారాలలో నడుస్తుంది. రాత్రి 8.10కి కాకినాడ టౌన్‌లో బయలుదేరి మరునాడు ఉదయం 8.50గంటలకు లింగంపల్లి చేరుకుంటుంది. జులై 2 నుంచి మార్చి 30 వరకు ఈ రైళ్లు నడుస్తాయి. 07446 లింగంపల్లి-కాకినాడ టౌన్ మంగళవారం, గురువారం, శనివారాల్లో నడుస్తుంది. సాయంత్రం 6.30 గంటలకు లింగంపల్లిలో బయలుదేరి మరునాడు ఉదయం 9 గంటలకు కాకినాడ టౌన్ చేరుతుంది. జులై 3నుంచి మార్చి 31వరకు ఈ రైలు నడుస్తుంది. చర్లపల్లి-కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు సామర్లకోట, రాజమండ్రి, తణుకు, భీమవరం టౌన్, ఆకువీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్‌లలో ఆగుతుంది. వన్‌ఏసీ, టూఏసీ, త్రీఏసీ, త్రీఏసీ ఎకానమీ, స్లీపర్, జనరల్, సెకండ్ క్లాస్ కోచ్‌లు ఇందులో ఉంటాయి. కాకినాడ టౌన్-లింగంపల్లి రైలు సామర్లకోట, రాజమండ్రి, తణుకు, భీమవరం టౌన్, ఆకువీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మిర్యాలగూడ, నల్గొండ, చర్లపల్లి స్టేషన్‌లలో ఆగుతుంది. ఈరైలులో వన్ ఏసీ, టూఏసీ, త్రీఏసీ, త్రీఏసీ ఎకానమీ, స్లీపర్, జనరల్, సెకండ్‌క్లాస్ కోచ్‌లు ఉంటాయి.

గోల్కొండ ఎక్స్‌ప్రెస్ సమయాల్లో మార్పు..

సికింద్రాబాద్-గుంటూరు గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైలు విజయవాడ, కృష్ణాకెనాల్ స్టేషన్‌లలో ఆగే సమయాలలో స్వల్ప మార్పులు చేశారు. 17202 సికింద్రాబాద్, గుంటూరు గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 23 నుంచి విజయవాడ, కృష్ణాకెనాల్ స్టేషన్‌లలో ఆగే సమయాలలో మార్పు చేశారు. నిత్యం నడిచే ఈ రైలు విజయవాడలో ప్రస్తుతం రాత్రి 7 గంటలకు వచ్చి 7.10కి బయలుదేరుతుంది. ఈ సమయంలో మార్పు దృష్ట్యా రాత్రి 7.20కి వచ్చి 7.30కి బయలుదేరుతుంది. కృష్ణాకెనాల్‌లో ప్రస్తుతం ఈరైలు రాత్రి 7.18కి వచ్చి 7.20కి బయలుదేరుతుంది. అయితే దీనిని రాత్రి 7.38కి వచ్చి, 7.40కి బయలుదేరేలా మార్పు చేశారు.

నేటి నుంచి పాలీసెట్ కౌన్సెలింగ్

గుడ్లవల్లేరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ఏపీ పాలీసెట్ - 2025 ధ్రువపత్రాల పరిశీలన హెల్ప్‌లైన్ సెంటర్‌గా గుడ్లవల్లేరు ఎ.ఎ.ఎన్.ఎం అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ పాలిటెక్నిక్‌ను ప్రకటించారు. కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల 20 నుంచి ప్రారంభమవుతుందని ప్రిన్సిపాల్ నిమ్మగడ్డ రాజశేఖర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా పాలీసెట్-2025 ర్యాంకు సాధించి ధ్రువపత్రాలను పరిశీలనకు హాజరయ్యే విద్యార్థులు ముందుగా ఈ నెల 20 నుంచి 27 లోపు ఓసీ, బీసీ విద్యార్థులు రూ. 700లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250 ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ రుసుం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ర్యాంక్ ఆధారంగా ప్రభుత్వం కేటాయించిన తేదీల్లో కళాశాలలో నిర్వహించే ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియలో పాల్గొనాలన్నారు. జూన్ 25 నుంచి వెబ్ ఆప్షన్ ఎంట్రీ చేసుకోవచ్చని, అది పూర్తయిన వారికి జూలై 3న అలాట్మెంట్ నిర్ణయిస్తారని తెలిపారు. విద్యార్థులు పూర్తి వివరాలను హెచ్‌టిటిపిఎస్:పాలీసెట్.ఎపి.జిఓవి.ఐఎన్ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తెచ్చుకోవలసిన ధృవపత్రాలు

ప్రాసెసింగ్ ఫీజ్ పేమెంట్ రశీదు, ఏపీపాలీసెట్-2025 హాల్ టికెట్, ర్యాంక్‌కార్డు, ఎస్ఎస్‌సి మార్కుల మెమో, టీసీ, నాల్గవ తరగతి నుంచి పదోతరగతి వరకూ స్టడీ, బోనఫైడ్ సర్టిఫికెట్, కులధృవీకరణ పత్రాలు (ఎస్సీ, ఎస్టీ, బీసీ)ఆదాయ ధృవీకరణ పత్రాలు, ఓసీ విద్యార్థులు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ ఉన్నవారు తీసుకొనిరావాలి సూచించారు.

ధ్రువపత్రాల పరిశీలన ర్యాంకుల వారీగా..

జూన్ 21వ తేదీన (1-15000), 22న (15001-32000), 24న (32001-50000), 25న (50001-68000), 25న (68001-86000), 26న (86001-104000), 27న (104001-120000), 28న (120000 నుంచి చివరి ర్యాంక్ వరకు).

వెబ్ ఆప్షన్లు : జూన్ 25, 26 తేదీల్లో (01 -50000), 27, 28 తేదీల్లో (50001-90000), 29, 30 తేదీల్లో (90001 నుంచి చివరి ర్యాంక్ వరకు). జూలై 1న వెబ్ ఆప్షన్ మార్పుకొనేందుకు అవకాశం ఉంటుంది.

బఫర్ ఆఫర్

(5వ పేజీ తరువాయి)

అనారోగ్యం పాలయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రజలు కాలుష్య కోరల్లో చిక్కుకునే ప్రమాదం ఉంది. కాలుష్య జోన్‌లో ఉండేచోట నివాసాలకు అనుమతులు ఇవ్వకూడదు. ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టేలా సీఆర్‌డీఏ అధికారులు వ్యవహరించిన తీరు విమర్శలకు దారితీస్తోంది. జనావాసాలు లేనిచోట స్టోన్ మెటల్స్ యూనిట్లకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలి. అప్పుడు స్థానికంగా బిల్డింగ్ మెటల్ అన్నది అందుబాటులో ఉండదు. స్థానికంగా బిల్డింగ్ మెటల్ ఉత్పత్తి అయితే ధరలు అందుబాటులో ఉంటాయి. ఇక్కడ బిల్డింగ్ మెటల్ అందుబాటులో లేకపోతే దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. దిగుమతి కారణంగా అమాంతం బిల్డింగ్ మెటల్ ధరలు పెరిగిపోతాయి.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	106,114, 125
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210
నెక్ కోడిగుడ్డు ధర	(100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 540	

జాతీయ ఐస్ హాకీ స్కేటింగ్‌లో నలందా విద్యార్థులకు పతకాలు

గవర్నర్‌పేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఐస్ హాకీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన 14వ జాతీయ ఐస్ హాకీ స్కేటింగ్ చాంపియన్‌షిప్-2025 పోటీల్లో విజయవాడ నలంద విద్యానికేతన్ విద్యార్థులు రజిత పతకాలు సాధించారు. నలంద విద్యానికేతన్ నుంచి పాల్గొన్న ఆరుగురు విద్యార్థులు విజేతలుగా నిలిచారు. అండర్-18 విభాగంలో ఎస్.యాషస్ షరణ్, ఎం.గోపాల్ కౌషిక్, వి. కిరణ్‌కుమార్, ఏవీ జితేష్, కె. బాంధవ్, కె. శశికర్‌లు రజిత పతకాలు సాధించారు. విజేతలను, కోచ్ ఆనంద్‌ను గురువారం స్కూల్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ అట్లూరి విజయబాబు, ప్రిన్సిపాల్ మాదల పద్మజ అభినందించారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా..

కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన వేముల దుర్గారావు

రాణిగారితోట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు సత్ఫలితాలు అందించడంతో పాటు మహిళల కళ్లల్లో ఆనందాన్ని నింపు తున్నాయి. రాణిగారితోట 18వ డివిజన్ సిమెంట్ గోడౌన్‌లో ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ శిక్షణా కేంద్రంలో గత 40రోజుల నుంచి శిక్షణ పొందుతున్న మహిళలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ కేంద్రాన్ని టీడీపీ డివిజన్ అధ్యక్షుడు వేముల దుర్గారావు గురువారం సందర్శించి శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ మహిళలకు ఆర్థిక భరోసా కల్పించే విధంగా ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణా కేంద్రలో ఇస్తున్న శిక్షణపై మహిళలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రత్యేకంగా దృష్టి సారించి ఈ కేంద్రానికి అవసరమైన అన్ని వసతులు, ఇతర మౌలిక సదుపాయాలు అందిస్తున్నారన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

చాలా చక్కగా శిక్షణ ఇస్తున్నారు



ఈ కేంద్రంలో శిక్షణా చాలా బాగా ఇస్తున్నారు. తమ లాంటి మహిళలు ఎంతో మంది ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. శిక్షణ అనంతరం అందించే కుట్టుమిషన్లతో తమకు ఎంతో ఆర్థిక భరోసా లభిస్తుంది.

-అన్నపూర్ణ (శిక్షణ తీసుకుంటున్న మహిళ)

అక్రమ పార్కింగ్...ట్రాఫిక్‌కు అంతరాయం

- నాగార్జుననగర్ సర్వీస్ రోడ్డులో నిలిపిన వాహనాలు
- ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారిన వైనం



నాగార్జుననగర్ కాలనీ సర్వీస్ రోడ్డులో నిలిపిన వాహనాలు

భారతీనగర్, ఆంధ్రజ్యోతి: నాగార్జున నగర్ కాలనీ సర్వీస్ రోడ్డులోని అక్రమ పార్కింగ్‌తో స్థానికులు, వాహనదారుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సర్వీస్ రోడ్డు మహానాడు రోడ్డు జంక్షన్ నుంచి రామవరప్పాడు రింగ్ సెంటర్ వరకు ఉంది. ఈ రోడ్డు నాగార్జున నగర్, కరెన్సీనగర్, శ్రీ రామచంద్రనగర్ తదితర కాలనీలకు ప్రధాన రహదారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డు వెంబడి పలు ఆసుపత్రులు, ప్రైవేట్ సంస్థలు, భోజన హోటల్స్ ఉన్నాయి. వీటి కోసం వచ్చే ప్రజలు తమ వాహనాలను సర్వీస్‌రోడ్డులో నిలిపివేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. ఈ వాహనాలు గంటల తరబడి ఉండడంతో ప్రజలు రాకపోకలు సాగించడానికి ఇబ్బందిగా ఉందని స్థానిక పెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డులో అడ్డదిడ్డంగా..



దర్శిపేట పార్క్ పక్కన నిలిపిన వాహనాలు



ఎన్ఎస్ఎం స్కూల్ పక్కన..

పటమట, ఆంధ్రజ్యోతి: రామలింగేశ్వర నగర్ నుంచి దర్శిపేట మీదుగా పటమట సెంటర్‌కు వెళ్లే ప్రధాన మార్గంలో దర్శిపేట పార్క్ పక్కన, ఎన్ఎస్ఎం స్కూల్ పక్కన వాహనాలను దర్జాగా నిలిపివేస్తున్నారు.

ప్రతి రోజు వేలాది మంది ఈ రోడ్డులో ప్రయాణం చేస్తుంటారు. ఎన్ఎస్ఎం స్కూల్‌కు తల్లిదండ్రులు వారి పిల్లలను తీసుకువెళ్లి తీసుకువస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఈ రోడ్డులో అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయడం వల్ల తరచూ ట్రాఫిక్ జామ్ అవుతుంది. అధికారులు స్పందించి ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

రాణిగారితోట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం శుక్రవారం ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు 33కేవీ, 11కేవీ పీఎస్ఆర్ ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ సుబ్బరాయ నగర్ ఫీడర్ పరిధిలో సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.రవీంద్రబాబు తెలిపారు.

సుబ్బరాయ నగర్, పోలీసు రామయ్యవీధి, పచ్చమేడ బజార్, గుంటూరు వారి వీధి, రామకృష్ణ వీధి, ఆర్చి రోడ్, బియ్యపుకొట్ల బజార్, రామకృష్ణ వీధి తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. భారతీనగర్ : రింగ్ రోడ్డు సెక్షన్ పరిధిలోని విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 11.30 వరకు భారతీనగర్ కాలనీ మెయిన్ రోడ్డు, నోవాటెల్ ఏరియా, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వహక ఇంజనీర్ పి.హరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

మాచవరం దాసాంజనేయ స్వామి హుండీ ఆదాయం రూ.9.8 లక్షలు



గుణదల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మాచవరం దాసాంజనేయస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.9.8లక్షలు నగదు రూపంలో రాగా 21 అమెరికన్ డాలర్లు వచ్చాయని ఆలయ కార్యనిర్వహణ అధికారిణి పాతూరి లోకేశ్వరి తెలిపారు. మాచవరం దాసాంజనేయ స్వామి ఆలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమం గురువారం జరిగింది. 3నెలల 6 రోజులకు భక్తులు మొక్కుబడుల రూపంలో వేసిన కానుకలను గురువారం లెక్కించినట్లు ఈవో తెలిపారు. దేవదాయ ధర్మదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో హుండీ ఆదాయం లెక్కింపు జరిగిందని చెప్పారు. హుండీల్లో వెండి, బంగారు ఆభరణాలు రాలేదని తెలిపారు.

యోగాపై శిక్షణ

లబ్బీపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమాన్ని పురస్కరించుకొని నలంద డిగ్రీ కళాశాలలో మే 21 నుంచి ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎఫ్ విద్యార్థులు పలు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్స్‌పాల్ ఎం.అనురాధ తెలిపారు. గురువారం కళాశాల విద్యార్థులు స్ఫూర్తి యోగా శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో యోగాసనాలు చేయించారు. యోగాపై శిక్షణ ఇచ్చారు. నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన యోగా



యోగాపై శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు

కార్యక్రమంలో 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. యోగా పట్ల అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా కళాశాలలో యోగాపై పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేసినట్లు తెలిపారు. ఈ నెల 21న స్టేడియంలో నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమంలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆమె కోరారు.



బెజవాడ బార్ అసోసియేషన్‌లో కేక్ కట్ చేసి తినిపించుకుంటున్న న్యాయవాదులు

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

విజయవాడ లీగల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : బెజవాడ బార్ అసోసియేషన్‌లో గురువారం న్యాయవాదులు రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకున్నారు. సీనియర్ న్యాయవాది, ఏపీసీసీ సభ్యులు వి.గురునాథం, బార్ అధ్యక్షుడు భాషా, బార్ కార్యదర్శి కేవీ రంగారావు, న్యాయవాదులు ఎన్.నరసింహారావు, వేముల శ్రీనివాస్, కాళహస్తి పద్మజ, బి.డేవిడ్ రత్నకుమార్, నామాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు లిఫ్టు తెగిపడి ముగ్గురికి గాయాలు



లబ్బీపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు లిఫ్టు తెగిపడి ముగ్గురు గాయపడిన సంఘటన లబ్బీపేటలోని రమా క్లాత్ షోరూంలో గురువారం జరిగింది. రమా క్లాత్ షోరూం 4వ ఫ్లోర్‌కి సరుకు తీసుకువెళ్లేందుకు ఒక లిఫ్టు ఉంది. 4వ అంతస్థులో షెడ్డు వేసేందుకు సంబంధించిన రాడ్లను పెట్టుకొని ఇద్దరు వెల్డింగ్ కార్మికులు, షోరూం ఉద్యోగి లిఫ్టులో వెళుతుండగా చైన్ తెగి కిందపడింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలవగా చికిత్స నిమిత్తం హాస్పటల్‌కి తరలించారు.



పెద్దేశ్వరరావుకు ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

పెద్దేశ్వర్ హెల్త్‌కేర్ సేవలు అభినందనీయం

- మాజీమంత్రి, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

రామలింగేశ్వరనగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సామాన్యులకు మెరుగైన గుండె సంబంధిత వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చిన ఘనత పెద్దేశ్వర్ హెల్త్‌కేర్ సెంటర్ అధినేత పల్లెం పెద్దేశ్వరరావుదేనని కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. గురువారం ఓ ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, పెద్దేశ్వర్ హెల్త్‌కేర్ సెంటర్ అందిస్తున్న అత్యున్నత వైద్యసేవలకు గుర్తింపుగా ఐఎస్‌వో ధ్రువీకరణ లభించడం హర్షణీయమన్నారు. గుండెకు సంబంధించిన వైద్య సేవల నుంచి మల్టీస్పెషాలిటీ వైద్య సేవలను అందిస్తున్న పెద్దేశ్వరరావు ఇంకా పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించే స్థాయికి ఎదగాలకి ఆకాక్షించారు.

ప్రకటన

నా క్లయింటు కృష్ణాజిల్లా,ప్రస్తుతము ఎన్‌టిఆర్ జిల్లా,విజయవాడ,గుణదల నియర్ రాంగోపాల్ థియేటర్,బోర్డింగ్ స్కూల్ ఎదుట,డోర్ నెం.44-1-25/ఏ రు కాపురస్థులు గండు నారాయణ గారి భార్య నాగ వెంకట సరిత గారికి చెందిన ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని గృహ నిర్మాణము నిమిత్తము హామీగా ఉంచి ఏదేని బ్యాంకులలో ఋణమును పొందుటకు ప్రయత్నము చేయుచున్నారు. ఈ దిగువ షెడ్యూలు ఆస్తి చక్రాల శ్రీనివాసరావు గారికి క్రయ దస్తావేజు నెం.116/2001 రుగా సంక్రమించగా తదుపరి వారు ది.31-01-2004 వతేదీన తోట గోపాలకృష్ణ గారికి విక్రయించి వారిపేరున విక్రయ దస్తావేజు నెం.306/2004 రుగా రిజిస్టరు చేయించినారనియు, తదుపరి తోట గోపాలకృష్ణ గారు ది.01-10-2020 వతేదీన పిల్లి శ్రీనివాసరావు గారికి విక్రయించి వారిపేరున స్థిరాస్తి అస్వాధీన విక్రయ అగ్రిమెంట్ కం జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ దస్తావేజు నెం.5394/2020 రుగా రిజిస్టరు చేయించినారనియు,తదుపరి పిల్లి శ్రీనివాసరావు గారు ది.05-12-2020 వతేదీన తోట గోపాలకృష్ణ గారి తరుపున అస్వాధీనపు విక్రయ అగ్రిమెంట్ కం జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ హోదాలో కొలకలూరి శ్రీనివాసరావు గారికి విక్రయించి వారిపేరున నెం.7403/2020 రుగా రిజిస్టరు చేయించినారనియు, తదుపరి కొలకలూరి శ్రీనివాసరావు గారు ది.24-11-2021 వతేదీన గండు నాగ వెంకట సరిత గారికి విక్రయించి వారిపేరున విక్రయ దస్తావేజు నెం.8531/2021 రుగా రిజిస్టరు చేయించినారనియు తెలియచేయుచున్నారు. అయితే ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి చెందిన ఒరిజినల్ లింకు దస్తావేజు నెం.306/2004 రున్ను,116/2001రు గైరుహాజరు (మిస్సింగ్) అని తెలియచేయుచున్నారు. పై తెలిపిన గైరుహాజరు దస్తావేజులు ఎవరికైనను దొరికినయెడల ఈ దిగువ తెలిపిన అడ్రసుకు అందజేయగలరు. కనుక ఈ దిగువ షెడ్యూలు ఆస్తిపై ఎవరికైనను ఏవిధములైన చెల్లదగు అభ్యంతరములు, కోర్టు జప్తులు,ఇంజక్షన్లు, భాగలబ్ధ తగాదాలు వగైరాలు ఏదైనా వున్నచో ఈ ప్రకటన తేదీ నుండి 7 రోజులలోపు ఈ దిగువ తెలిపిన అడ్రస్ నకు రిజిస్టరు పోస్టు తిరుగుటపా ద్వారా పంపవలసినది, లేనిచో అభ్యంతరములు లేవని ఎంచి నా క్లయింటు ఏదేని బ్యాంకులలో ఋణమును పొందగలరు. తదుపరి వచ్చు క్లెయిములు, అభ్యంతరములు నా క్లయింటును ఏ విధముగాను బైండు చేయజాలవు. ఆస్తి షెడ్యూలు: కృష్ణాజిల్లా,ప్రస్తుతము ఎన్ టి ఆర్ జిల్లా,విజయవాడ,గుణదల ప్రశాంతి నగర్ కాలనీ,ఆర్.ఎస్.నెం.137/2 రు ప్లాటు నెం.33 రు ధాఖలా స్థిరాస్తికి హద్దులు తూర్పు:చక్రాల శ్రీనివాసరావు గారి ఆస్తి,దక్షిణము:చిమటా నాగేశ్వరరావు గారి ఆస్తి,పడమర:అ.30.0 లు వెడల్పు గల రోడ్డు,ఉత్తరము:సి హెచ్ శివరామ ప్రసాద్ గారి ఆస్తి. పై నాలుగు హద్దుల మధ్య చ.గ 105.0 ర్లు లేక చ.మీ 87.89 ర్లు స్థిరాస్తి నివేశన స్థలము అందలి ఆర్ సి సి కట్టడములు అందలి యావత్తు ఈజ్ మెంటు హక్కులతో సహా.

పి. రామమోహనరావు, దాసు లక్ష్మణ కుమార్, అడ్వకేట్స్, డోరు నెం.23-2-1, సత్యనారాయణపురం, విజయవాడ-11, సెల్: 9392114922

స్కూళ్ల మార్పుపై తల్లిదండ్రుల ఆగ్రహం

పిల్లల్ని అంతదూరం ఎలా పంపుతామంటూ ఆవేదన ● టీడీపీ నేతలతో కలిసి చిల్లకల్లు ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా

జగ్గయ్యపేట రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలను డీగ్రేడ్ చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా టీడీపీ నేతలు, విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వివరాల్లోకి వెళితే చిల్లకల్లు మండలంలోని ధర్మవరప్పాడు తండ, రావిరాల, వేదాద్రి, కె.అగ్రహారం, అన్నవరం, తక్కెళ్లపాడు గ్రామాల పాఠశాలల్లో ఆరు, ఏడు, ఎనిమిది తరగతులను రద్దు చేసి 226 మంది విద్యార్థులను 4 నుంచి 7 కి.మీ. దూరంలోని జయంతిపురం, బలుసుపాడు, షేర్‌మహ్మద్‌పేట, ముక్త్యాల, అనుమంచిపల్లి జడ్పీ పాఠశాలలకు కేటాయించాలన్న అధికారుల నిర్ణయానికి వ్యతిరేకంగా తల్లిదండ్రులు అధికారంలో ఉన్న టీడీపీ నేతలతో కలిసి గురువారం చిల్లకల్లు ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పాఠశాలల ప్రారంభ రోజు నుంచి గ్రామాల్లో మొదలైన నిరసనలు మండల కార్యాలయం వరకు చేరాయి. నిరుపేద, వ్యవసాయ, కూలీ కుటుంబాల తల్లిదండ్రులు దూర పాఠశాలలకు పిల్లలను పంపడం అసాధ్యమని, విలీనం వల్ల విద్యార్థులు చదువు మానే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తరగతుల రద్దుతో పాఠశాలలు మూతపడితే విద్యార్థులు బాల కార్మికులుగా, బాలికలు బాల్య వివాహాలకు గురయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వెలిబుచ్చారు.





మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న తల్లిదండ్రులు, జీవోను వివరిస్తున్న ఎంఈవో

ప్రభుత్వ నిబంధనలను ఎంఈవో వక్రీకరిస్తూ, ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలతో లాలూచీలో పడి గ్రామీణ పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. జాతీయ రహదారులు, కాల్వలు, నదుల వంటి అడ్డంకులున్న ప్రాంతాల్లో దూర పాఠశాలలకు పిల్లలను పంపడం ఇబ్బందికరమని, ఎమ్మెల్యే, సర్పంచ్‌లు, విద్యా కమిటీలు, తల్లిదండ్రుల అభిప్రాయాలను సేకరించకుండా ఎంఈవో సొంత నిర్ణయాలు తీసుకున్నారని విమర్శించారు. ధర్నాలో టీడీపీ నాయకులు కట్టా నరసింహారావు, గింజుపల్లి రమేష్, వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. 'ఈ ఎంఈవో మాకొద్దు, ఇక్కడి నుంచి పంపించండి' అంటూ నినాదాలు చేసి, ఎంపీడీవో నితిన్‌కు వినతిపత్రం అందజేశారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే పాఠశాలలను డీ గ్రేడ్ చేశామని, ఉన్నతాధికారుల నిర్ణయాన్ని అమలు చేశామని, ఇందులో తమ ప్రమేయం ఏమీ లేదని వివరించారు. దీనికి సంబంధించిన పత్రాలను వారికి చూపించారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పటికీ, టీడీపీ నాయకులు ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ధర్నా చేయడం గమనార్హం. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి, విలీన నిర్ణయాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేస్తామన్నారు. సానుకూల స్పందన లేనట్లైతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిర్ణయం గ్రామీణ విద్యార్థుల విద్యా హక్కును దెబ్బతీస్తుందని, ప్రభుత్వం స్థానిక అవసరాలను పరిగణనలోకి తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

రవాణా సౌకర్యం లేదు..
కస్తూర్తి శ్రీనివాసరావు, సర్పంచ్, తక్కెళ్లపాడు



గ్రామానికి రవాణా సౌకర్యం లేదు. విద్యార్థులను సమీపంలోని షేర్‌మహ్మద్‌పేటకు పంపటం ఇబ్బందిగా ఉంది. 5 కిలోమీటర్ల మేర జాతీయ రహదారిపై ప్రయాణించాలి. పిల్లలను ఎలా పంపుతాం. ఎంఈవో ఏకపక్ష నిర్ణయంతోనే ఇబ్బంది.

వ్యయప్రయాసే.. వసూరాం, విద్యార్థి తండ్రి



వ్యవసాయ కూలీ పనులు చేసుకునే తాము తమ పిల్లలను ఇతర గ్రామాలకు పంపాలంటే ఆర్థికంగా ఇబ్బంది. రవాణా సౌకర్యం సరిగా లేని గ్రామాలకు పిల్లలు పంపటం వ్యయప్రయాసే.

55 మందికి టీసీలిచ్చారు
గుండ్ల కృష్ణారావు, కే అగ్రహారం



తమ గ్రామంలోని 55 మందికి టీసీలిచ్చారు. వారిని 7 కిలోమీటర్ల దూరంలోని ముక్త్యాల కానీ జగ్గయ్యపేటకు కానీ పంపమని చెబుతున్నారు. ఎంఈవో ఏకపక్ష నిర్ణయంతో గ్రామీణ ప్రాంత విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుంది.



ఎన్టీటీపీఎస్

కాటా డ్యూటీ అవినీతిపై
అధికారుల విచారణ

● అదనపు సిబ్బందిని తగ్గించేందుకు చర్యలు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ఇబ్రహీంపట్నం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీటీపీఎస్‌లో యాష్ కాటా డ్యూటీ విషయంలో జరిగిన అవినీతి వ్యవహారాన్ని వెలికి తీసేందుకు ఎన్టీటీపీఎస్ ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించినట్టు తెలిసింది. ఈనెల 18న ఆంధ్రజ్యోతిలో కాసుల కురిపిస్తున్న కాటా డ్యూటీ అనే శీర్షికతో ప్రచురితమైన కథనంలో ప్లాంట్‌లో యాష్ కాటా డ్యూటీల నియామకంలో జరిగిన అవినీతిని, అధికారులు, ఉద్యోగుల చేతివాటంపై సమగ్ర కథనం రావడంతో అధికారుల్లో చలనం కలిగింది. ఈ క్రమంలో అసలు యాష్ కాటా వద్ద ఎంతమంది విధులు నిర్వహిస్తున్నారు. అదనంగా ఎంత మందిని అక్రమంగా అడ్డదారుల్లో నియమించారో విచారణ చేపట్టారు. కొన్నేళ్లుగా యాష్ కాటా డ్యూటీని మొత్తం 15 మంది నిర్వహిస్తున్నారు. అయితే అక్రమార్జన కోసం అదనంగా మరికొందర్ని అవసరం లేకున్నా అడ్డగోలుగా నియమించినట్టు గుర్తించారు. కాటా డ్యూటీలో అక్రమంగా నియమించిన స్థానాలు ఇప్పటికీ ఖాళీగా ఉండటంతో ఎంతో వృత్తి నైపుణ్యం ఉన్నవారినే తిరిగి యథాస్థానాలకు బదిలీ చేసేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. మొత్తం మీద కాసులు కురిపిస్తున్న కథనం ఎన్టీటీపీఎస్‌లో గుట్టు చప్పుడు కాకుండా కాసులకు కక్కుర్తిపడి చేస్తున్న అంతర్గత బదిలీల వ్యవహారం వెలుగులోకి రావడంతో ఎన్టీటీపీఎస్ అధికారులు దిద్దుబాటు చర్యల్లో నిమగ్నమయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు

రెవెన్యూ సేవలు ప్రజలకు
మరింత చేరువ చేయాలి

● ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు

విజయవాడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డేను ప్రతి జిల్లా, మండల హెడ్‌క్వార్టర్‌లో నిర్వహించి రెవెన్యూ సేవలను ప్రజలకు మరింత చేరువచేసేలా అవగాహన కల్పించాలని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మీడియాకు విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ 150 ఏళ్ల కిందటే భూపరిపాలన వ్యవస్థ ద్వారా రెవెన్యూ వ్యవస్థ మూలాలు ఏర్పడ్డాయన్నారు. శుక్రవారం నిర్వహించబోయే రెవెన్యూ దినోత్సవంలో ప్రతి రెవెన్యూ ఉద్యోగి, అధికారి పాల్గొని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. రెవెన్యూశాఖ ఉద్యోగులు ప్రజాభిముఖ పాలనతో పాటు ప్రజాసమస్యలపై సత్వరమే స్పందించి పనిచేయాలన్నారు. ప్రజలకు విశ్వాసం కలిగించేందుకు ప్రతి కార్యాచరణలో పారదర్శకతను పాటించి, పూర్తి బాధ్యతతో సమస్యలను వీలైనంత తొందరగా పరిష్కరించే ప్రయత్నం చేయాలని వెంకటేశ్వర్లు సూచించారు. ప్రజాస్వామ్యవాద పరిపాలనలో ప్రతిస్పందన, నైతికతను కొనసాగిస్తూ రెవెన్యూశాఖ ఔన్నత్యాన్ని ఇనుమడింపజేయడానికి అంకిత భావంతో ముందుకు సాగాలన్నారు. రెవెన్యూ ఉద్యోగ సంఘ నేతలు పాల్గొన్నారు.

పాత భవనంలో పడక కష్టాలు

పాత జీజీహెచ్‌లో కొత్తభవనం పూర్తి చేయాలంటూ విన్నపాలు

● మరో రెండంతస్తులు పెంచితే మరింత సౌలభ్యం ● రక్త పరీక్షలు, స్కానింగ్‌కు వేరే భవనానికి వెళ్లాల్సిన పరిస్థితి

విజయవాడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పాత ప్రభుత్వ జనరల్ గవర్నమెంట్ హాస్పిటల్ (జీజీహెచ్)లో నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనం తుది దశకు చేరుకుంది. ఈ భవనం పూర్తయితే గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు సత్వరమైన, సమగ్ర వైద్య సేవలు ఒకేచోట అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం, బెడ్ల కొరతతో గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఒక్కో బెడ్‌ను ఇద్దరు బాలింతలకు కేటాయిస్తుండటంతో, కుట్లు, నడుము నొప్పులతో బాధపడేవారు మరింత అసౌకర్యానికి గురవుతున్నారు. స్కానింగ్, రక్త పరీక్షల కోసం గర్భిణులు దూరంగా ఉన్న మరో భవనానికి నడవాల్సి రావడం వారికి కష్టతరంగా మారుతోంది.

నిర్మాణంలో సవాళ్లు, పురోగతి

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ భవన నిర్మాణానికి శంకుస్థాపన జరిగినప్పటికీ, బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపివేశారు. దాదాపు మూడేళ్లపాటు పనులు స్తబ్ధంగా ఉన్నాయి. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, కేంద్ర నిధులతో నిర్మాణం పునఃప్రారంభమైంది. అయినప్పటికీ, నిధుల కొరతతో పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. స్థానిక ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఈ సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, నిధుల విడుదల కోసం ప్రయత్నిస్తామని హామీ ఇచ్చినట్టు ఆసుపత్రి వర్గాలు చెబుతున్నాయి.



నిర్మాణదశలో ఉన్న నూతన భవనం

ఇదీ జీజీహెచ్ చరిత్ర

1958లో ఒక తాలూకా ఆసుపత్రిగా స్థాపితమైన జీజీహెచ్, 1986లో ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌తో అనుసంధానమై 412 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ అయింది. 1996లో జిల్లా ఆసుపత్రిగా మారింది. 2017లో నగరంలో మరో జీజీహెచ్ నిర్మితమైనప్పటికీ, పాత జీజీహెచ్ ప్రసూతి, శిశు వైద్యం, మానసిక రోగులకు మాత్రమే సేవలందిస్తోంది. ప్రస్తుతం 400 పడకలలో గైనకాలజీ విభాగంలో 200 పడకలు మాత్రమే ఉన్నాయి. పేద, మధ్యతరగతి గర్భిణులు పెద్ద సంఖ్యలో వస్తుండటంతో పడకల కొరత తీవ్ర సమస్యగా మారింది.

నూతన భవనం పూర్తయినట్టయితే పడకల కొరత తీరడమే కాక, అన్ని వైద్య సేవలు ఒకే చోట అందుబాటులోకి వస్తాయి. మరో రెండంతస్తుల నిర్మాణంతో మరిన్ని సేవలు అందించవచ్చని ఆసుపత్రి వర్గాలు భావిస్తున్నాయి. ఈ భవనం త్వరగా పూర్తయి అందుబాటులోకి వస్తే, గర్భిణులు, బాలింతలకు సౌకర్యవంతమైన, సమర్థవంతమైన వైద్య సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తమవుతోంది.

నేటి నుంచి ఐటీఐలో రెండో విడత అడ్మిషన్లకు దరఖాస్తుల స్వీకరణ

భారతీనగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2025-26/27 విద్యా సంవత్సరానికి రెండో విడత అడ్మిషన్స్ పొందడానికి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తామని ఐటీఐ ప్రధానాధికారి, కన్వీనర్ ఎం.కనకారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా శుక్రవారం నుంచి జూలై 15లోపు దరఖాస్తులను పూర్తి చేసుకోవాలని సూచించారు. 8, 10వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 0866-2475575, 9490639639, 7780429468కు ఫోన్ చేయొచ్చన్నారు.

జగన్ పర్యటనలో కారు ఢీకొని వైసీపీ కార్యకర్త మృతి కేసులో దర్యాప్తు ముమ్మరం

● అదుపులో కారు యజమాని, డ్రైవర్

గుంటూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జగన్ పల్నాడు పర్యటన సందర్భంగా గుంటూరు సమీపంలోని ఏటుకూరు బైపాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంగళాయపాలేనికి చెందిన ప్లంబర్, వైసీపీ కార్యకర్త చీలి సింగయ్య మృతి కేసు దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేశారు. ఇప్పటికే ప్రమాదానికి కారణమైన కారును గుర్తించారు. యజమాని వైసీపీ నేత దేవినేని అవినాష్‌కు అనుచరుడని తేలింది. కారు యజమాని హరీష్ అలియాస్ గోపీకృష్ణ, డ్రైవర్ సాయిబాబాలను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

అమరావతిలో ప్రపంచ, ఆసియా బ్యాంకు బృందం పర్యటన

కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు బృందం గురువారం అమరావతిలో పర్యటించారు. తొలుత బృందం సభ్యులు విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంలోని రాజధాని అమరావతి నిర్మాణంలో అమలు చేయాల్సిన పర్యావరణ, సామాజిక రక్షణ చర్యలు, కార్మికుల ఆరోగ్య భద్రత వంటి అంశాలపై ఓరియంటేషన్ ట్రైనింగ్ ప్రోగ్రాం జరిగింది. ఈ బృంద సభ్యులకు సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ జి.సాయిసూర్య ప్రవీణ్‌చంద్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతి నిర్మాణ కార్యకలాపాల్లో పర్యావరణ పరిరక్షణ, కార్మికుల భద్రత, కార్మికులకు పని ప్రదేశంలో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను వివరించారు. అలాగే అమరావతిలో నివసిస్తున్న ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పన గురించి తెలిపారు. లింగవివక్ష, బాలకార్మికులకు తావులేకుండా నిర్మాణ పనులు చేపట్టినట్టు చెప్పారు. గ్రీవెన్స్ రిడ్రస్సల్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా రైతులు, రాజధాని ప్రాంతవాసుల సమస్యలను ఎప్పటికప్పుడు అర్జీల రూపంలో స్వీకరించి, సత్వరమే పరిష్కరిస్తున్నామన్నారు. బృందంలోని సీనియర్ సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు బాయన వెంకటరావు మాట్లాడుతూ రాజధాని అమరావతి నిర్మాణ ప్రాజెక్టులో భాగంగా ఉన్న పర్యావరణ, సామాజిక వ్యవస్థల అసెస్‌మెంట్ ప్రక్రియపై సూచనలను వివరించారు. రీసెటిల్మెంట్ యాక్షన్ ప్లాన్, పాలసీల గురించి వివరించారు. అనంతరం బృందంలోని సామాజిక రక్షణ కార్యకలాపాల సలహాదారు రంజన్ వర్మ, బాయన వెంకటరావు, అమరావతి నిర్మాణ ప్రాజెక్టులో ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల బాధ్యతలను, పర్యావరణ, సామాజిక సంక్షేమ కార్యకలాపాల ప్రాముఖ్యతను వివరించారు. సీనియర్ ఎన్విరాన్‌మెంటల్ స్పెషలిస్టు జోసెఫ్, పర్యావరణ సంరక్షణ కార్యకలాపాల సలహాదారుల దమన్‌జిత్ సింగ్ మిన్హాస్ మాట్లాడుతూ రాజధాని నిర్మాణంలో పాలుపంచుకొంటున్న గుత్తేదారులు పాటించాల్సిన సామాజిక రక్షణ కార్యకలాపాలు పర్యావరణ పరిరక్షణ, ఏవైనా అవాంఛనీయ ఘటనలు జరిగినప్పుడు పాటించాల్సిన సురక్షిత విధానం, కార్మికుల భద్రత తదితర అంశాల గురించి వివరించారు. మహిళా ప్రతినిధి జయశర్మ మాట్లాడుతూ లైంగికదాడి, హింస తదితర ఘటనలు జరిగినప్పుడు పాటించాల్సిన గోప్యత, బాధితులకు అందించాల్సిన సహాయం వంటి అంశాలను వివరించారు. అనంతరం నిర్మాణ పనులు జరుగుతున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నివాస సముదాయాలు, శాఖమూరు రిజర్వాయర్, ఎల్పీఎస్ జోన్ 2ఏ ప్రాజెక్ట్ సైట్, కార్మికుల క్యాంపులను బృంద సభ్యులు, సీఆర్‌డీఏ, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ అధికారులు, సిబ్బంది పరిశీలించారు. అనంతరం బృంద సభ్యులు ఆయా సైట్లలో పనిచేస్తున్న కార్మికులతో మాట్లాడారు. గుత్తేదారు సంస్థలు క్యాంపుల్లో అందుబాటులో ఉంచిన మౌలిక సదుపాయాలను గురించి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. సీఆర్‌డీఏ, ఏడీసీఎల్‌లోని చీఫ్ ఇంజినీర్లు సీహెచ్ ధనుంజయ, ఎన్ శ్రీనివాసులు, ఎం ప్రభాకరరావు, ఎస్ఈ ఆర్ హనుమంతరెడ్డి, డీఈ పీ వెంకటేశ్వర్లు, ఈఈ కే శ్రీనివాసరావు, ఇతర క్షేత్రస్థాయి అధికారులు, ఇంజినీర్లు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రాజధాని అమరావతిలో పర్యటిస్తున్న ప్రపంచ, ఆసియా అభివృద్ధి బ్యాంకుల బృంద సభ్యులు

అర్జునవీధి దుర్గగుడి స్థలంలో
ఆక్రమణల తొలగింపునకు సిద్ధం!

ఇంద్రకీలాద్రి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అర్జునవీధి నుంచి రథం సెంటర్‌కు వెళ్లే దారిలో దుర్గగుడికి చెందిన స్థలంలో ఆక్రమణలను తొలగించేందుకు రంగం సిద్ధమైంది. గురువారం పశ్చిమ తహసీల్దార్, వీఎంసీ టౌన్ ప్లానింగ్ సర్వేయర్, రెవెన్యూ వీఆర్వోలు దేవస్థానం ఈవో శీనానాయక్‌ను కలిశారు. ఈ సందర్భంగా శీనానాయక్ మాట్లాడుతూ సుధాకర్ హోటల్ యాజమాన్యం నుంచి రూ.1,82,13,902 దేవస్థానం సొమ్మును చెల్లించి కొనుగోలు చేసినట్టు వారికి చూపించారు. అయితే భక్తులకు ఇబ్బంది కలిగించేలా కొంతమంది వ్యాపారులు స్థలాన్ని ఆక్రమించారని వారి వ్యాపారాలతో రాకపోకలకు ట్రాఫిక్ ఎంతో ఇబ్బందికరంగా మారిందన్నారు. రికార్డులు పరిశీలించిన అనంతరం ఆ స్థలాన్ని దుర్గగుడి అసిస్టెంట్ కమిషనర్ రంగారావు ఆధ్వర్యంలో దేవస్థానం సిబ్బంది, రెవెన్యూ, మునిసిపల్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ స్థలానికి సరిహద్దులను రెండు రోజుల్లో నిర్ణయిస్తామని, స్థలంలోని ఆక్రమణలను తొలగిస్తామన్నారు. ఈనెల 12న ఈవో శీనానాయక్ ఆ స్థలాన్ని చూసి అక్కడ సేవా కేంద్రం ఏర్పాటుకు నిర్ణయించారు. అయితే ఆ స్థలం పెద్ద ఎత్తున ఆక్రమణలకు గురికావటంతో కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్, మునిసిపల్ కమిషనర్‌కు లేఖలు రాశారు. దీంతో గురువారం తాజా పరిస్థితి ఏర్పడింది. 2 రోజుల్లో స్థలానికి సరిహద్దులు నిర్ణయించి ఆక్రమణలు తొలగించేందుకు సిద్ధమయ్యారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ వ్యాపారులు స్థలాన్ని ఆక్రమించుకుని యథేశ్ఛగా వ్యవహరిస్తున్నారు. భక్తుల ఇబ్బందులను ఈవో శీనానాయక్ పరిగణనలోకి తీసుకుని ఆ స్థలాన్ని సద్వినియోగం చేసుకోవడానికి నిర్ణయం తీసుకున్నారు.



అర్జునవీధి, రథం సెంటర్ దారిలో ఆక్రమణలు పరిశీలిస్తున్న తహసీల్దార్, టౌన్ ప్లానింగ్ సర్వేయర్, వీఆర్‌వోలు, దుర్గగుడి అధికారులు



సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులతో కలిసి యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

మన జీవిత పుస్తకంలో
ప్రతిపేజీలో యోగా ఉండాలి

సత్యనారాయణపురం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మన జీవిత పుస్తకంలోని ప్రతి పేజీలోనూ యోగా ఉండాలని, ప్రతి ఒక్కరూ కామన్ యోగా ప్రొటోకాల్ యోగాను జీవన విధానంలో భాగం చేసుకోవాలని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. బీఆర్‌టీఎస్‌రోడ్డు యోగా స్ట్రీట్‌లో జిల్లా అధికారులు, వీఎంసీ ఆధ్వర్యంలో గురువారం థీమ్‌యోగా జరిగింది. వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు, యోగా ఔత్సాహికులతో కలిసి కలెక్టర్ యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య ఆనంద ఆంధ్రాకు తొలి అడుగు యోగాంధ్ర అన్నారు. శరీరంలోని అన్ని వ్యవస్థలు నూతన ఉత్తేజాన్ని ఇచ్చే శక్తి యోగాసనాలకు ఉందన్నారు. ఒత్తిడిని మన జీవితంలో అడుగు పెట్టనివ్వకుండా యోగాసనాలు రక్షణ కవచాలుగా పని చేస్తాయని చెప్పారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం సుహాసిని, వీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ డీ చంద్రశేఖర్, ఎన్‌సీసీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ కే రమేష్, యుగంధర్ పాల్గొన్నారు.

హాస్యం పండించడం జంధ్యాలకే సాధ్యం

● నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి

విజయవాడ కల్చరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): హాస్యం గుర్తుండేలా పండించాలంటే అది జంధ్యాలకే సాధ్యమని, మళ్లీ ఆయన జన్మిస్తేనే బాగుంటుందని నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. ఎంసీ దాస్ జంధ్యాలతో ఉన్న సాన్నిహిత్యాన్ని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నటీనట నాట్య వృత్తి కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ సునిశిత హాస్యానికి మరోపేరు జంధ్యాల అని, ఆయన రచించిన నాటికలు పలుమార్లు ప్రదర్శించి అవార్డులు అందుకున్నానని, వారు చిరస్మరణీయులన్నారు. జంధ్యాల 24వ వర్ధంతిని పురస్కరించుకొని కళామంజరి సంస్థ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యదర్శి పీవీఎల్ నరసింహారావు పేద కళాకారులకు చీరలు, నూతన వస్త్రాలు అందచేశారు. మాడుగుల రామకృష్ణ, గంగాధరరావు, మల్లేశ్వర పట్నాయక్, హరగోపాల్, మార్కండేయ రాజు పాల్గొన్నారు.



జంధ్యాల విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న గుమ్మడి గోపాలకృష్ణ, వేముల హజరత్తయ్య గుప్తా తదితరులు

కాల్వలు, చెరువుల వెంబడి
ఆక్రమణల తొలగింపునకు కార్యాచరణ

జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియా

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

విజయవాడ రూరల్, పాయకాపురం జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కాల్వలు, చెరువుల వెంబడి ఆక్రమణలను గుర్తించి తొలగించేందుకు కార్యచరణ రూపొందించాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియా అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని తన కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించిన ఆమె ఆక్రమణల విషయంలో అధికారులకు తగు సూచనలు చేశారు. విజయవాడ రూరల్ మండలం, నగరంలోని పాయకాపురం ప్రాంతాల నడుమ బుడమేరు కరకట్ట వెంబడి కాలువ ఆక్రమణలకు గురౌతున్న విషయమై 'కాల్వ కనుమరుగు' పేరుతో గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఆమె స్పందించారు. ఆ విషయమై తన కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసిన ఆమె జీవోఎంఎస్ నెం 386 ప్రకారం నీటి వనరులు, చెరువుల బెడ్‌లను ఆక్రమణల నుంచి రక్షించేందుకు జిల్లా స్థాయిలో వాచ్‌డాగ్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సదరు కమిటీ ప్రతి నీటి వనరు, చెరువు బెడ్‌ల పరిస్థితిని సమీక్షించి ప్రభుత్వానికి త్రైమాసిక నివేదిక ఇవ్వాల్సి ఉంటుందన్నారు. జిల్లావ్యాప్తంగా ఆక్రమణలు, శాశ్వత, తాత్కాలిక నిర్మాణాలను గుర్తించి జాబితా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సమావేశంలో నిర్ణయించామన్నారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. వీఎంసీ అధికారులు, ఇరిగేషన్, ప్రజారోగ్య శాఖ, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ నియామకాలకు దరఖాస్తుల గడువు పెంపు

అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్, సభ్యుల నియామకాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ నెల 26వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు పొడిగించినట్టు రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఈ నెల 5న జారీ చేసిన నోటిఫికేషన్‌లో విద్యార్హతలను పోస్టు గ్రాడ్యుయేషన్‌గా సూచించామని, దానిని గ్రాడ్యుయేషన్‌కు సడలిస్తున్నామని శుక్రవారం ఓ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు http:/wdcw.ap.gov. వెబ్‌సైట్ చూడాలని సూచించారు.

అంగన్వాడీల్లో జూలై 1 నుంచి ఫేస్ రికగ్నిషన్

▸ ఆదేశాలు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం

అమరావతి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): జూలై 1వ తేదీ నుంచి అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పంపిణీకి లబ్ధిదారుల ఫేషియల్ రికగ్నిషన్ తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా పోషణ ట్రాకర్‌లో ఫేస్ రికగ్నిషన్ ఆధారిత సేవల అమలుకు కేంద్రం చర్యలు తీసుకుంది. ఈ నెల 30 నుంచి లబ్ధిదారుల ప్రొఫైల్‌లో ఫేస్ అథెంటికేషన్ ఫీచర్ అందుబాటులోకి రానున్నట్లు తెలిపింది. దీంతో ఇకపై పౌష్టికాహారం(టీహెచ్‌ఆర్) పంపిణీ సమయంలో ఎఫ్‌ఆర్ఎస్ (ఫోటో క్యాప్చరింగ్, ఈ-కేవైసీ) తప్పనిసరికానుంది. ఈమేరకు దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులకు కేంద్ర మహిళా,శిశు సంక్షేమశాఖ ఆదేశాలు జారీ చేసింది.

ఆర్టీసీకి 1,400 కొత్త బస్సులు

▸ మంత్రి రాంప్రసాద్ రెడ్డి

విశాఖపట్నం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్‌ఆర్టీసీకి 1,400 కొత్త బస్సులు సమకూర్చామని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చెప్పారు. విశాఖలోని ద్వారకా బస్‌స్టేషన్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన రవాణా సేవలను అందించేందుకు అధిక సంఖ్యలో బస్సులను కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. విశాఖకు కేటాయించిన 100 ఎలక్ట్రిక్ బస్సుల్లో 50 సింహపురి (సింహాచలం) డిపోకు, మరో 50 బస్సులు గాజువాక డిపోకు కేటాయించనున్నట్టు చెప్పారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల వల్ల అక్రమ రవాణాకు అడ్డుకట్టపడుతుందన్నారు.

'యోగాంధ్ర'కు సర్వం సిద్ధం

విశాఖలో ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకూ.. 30.16 కి.మీ. పొడవునా యోగా ప్రదర్శనలు

▸ మొత్తం మార్గం 326 కంపార్ట్‌మెంట్లుగా విభజన

▸ ఒక్కోదానిలో వెయ్యి మంది పట్టేలా ఏర్పాట్లు

▸ బీచ్‌రోడ్డుకు అనుసంధానంగా ఉన్న రహదారులు, ఏయూ, విద్యా సంస్థలు, మైదానాల్లోనూ యోగా

▸ నేడు విశాఖకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు



ఆర్కే బీచ్‌రోడ్డులో గురువారం ఉదయం యోగాసనాలు సాధన చేస్తున్న మంత్రులు డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, జనార్దనరెడ్డి, సత్యకుమార్, సవిత, యోగాంధ్ర నోడల్ అధికారి ఎంటీ కృష్ణబాబు

విశాఖపట్నం/న్యూఢిల్లీ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవానికి విశాఖపట్నం సిద్ధమైంది. ఈ నెల 21న ఉదయం 6.30 నుంచి 7.50 గంటల వరకూ నిర్వహించనున్న యోగా ప్రదర్శనలో దాదాపు 5లక్షల మంది పాల్గొంటారని అధికార యంత్రాంగం ప్రకటించింది. ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకూ 30.16 కిలోమీటర్ల పొడవునా 3.6 లక్షల మందికి ఏర్పాట్లు చేసింది. ఒక్కో కంపార్ట్‌మెంట్‌లో సుమారు వెయ్యి మంది చొప్పున పట్టేలా ఈ మార్గాన్ని 326 భాగాలుగా విభజించింది. అలాగే యోగాసనాలు వేసేవారి కోసం పచ్చటి కార్పెట్లు పరిచారు. బీచ్‌రోడ్డుకు అనుసంధానంగా ఉన్న రహదారులు, ఆంధ్ర విశ్వవిద్యాలయం, నగరంలోని విద్యా సంస్థలు, మైదానాల్లో మరో లక్షన్నర మందికిపైగా యోగాసనాలు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. విశాఖ నగరంతోపాటు అనకాపల్లి, అల్లూరి, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి తరలివచ్చే వారికోసం బస్సులు సిద్ధం చేస్తున్నారు. ఏ జిల్లాకు చెందినవారు ఏ కంపార్టుమెంట్లకు రావాలో ఇప్పటికే ఆయా జిల్లాల యంత్రాంగాలకు సమాచారం అందించారు. ప్రతి కంపార్టుమెంట్‌కు అధికారులను, వలంటీర్లను నియమించారు. యోగా వేడుకలో పాల్గొనేందుకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు శుక్రవారం సాయంత్రానికి విశాఖకు రానున్నారు. ప్రధాని, గవర్నర్, సీఎం, ఇతర ప్రముఖుల కోసం ఆర్కే బీచ్‌రోడ్డులోని కాళీమాత ఆలయం సమీపాన ప్రధాన వేదిక ఏర్పాటుచేశారు. ప్రధాన వేదిక వద్ద నుంచి పార్క్ హోటల్ వరకూ 18వేల మంది కార్యక్రమంలో పాల్గొంటారు. వేదిక ముందు భాగంలో నేవీ అధికారులు, ఉద్యోగులకు అవకాశం కల్పిస్తారు. ఆర్కే బీచ్‌రోడ్డులో ప్రధాన వేదికకు ప్రత్యామ్నాయంగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో 15వేల మంది పాల్గొనేందుకు షెడ్లు వేశారు. మంత్రులు, ఉన్నతాధికారులు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

ప్రధాని పర్యటన షెడ్యూల్ ఇదీ...

11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా 21న విశాఖపట్నంలో నిర్వహించే యోగా దినోత్సవ వేడుకలకు ప్రధాని మోదీ హాజరుకానున్నారు. శుక్రవారం సాయంత్రం 5.45 గంటలకు ఆయన భువనేశ్వర్ నుంచి వైమానిక దళానికి చెందిన విమానంలో బయలుదేరి 6.45కు ఐఎన్ఎస్ డేగా (నేవల్ ఎయిర్‌స్టేషన్)కు చేరుకుంటారు. అక్కడినుంచి 7గంటలకు తూర్పు నౌకాదళానికి చెందిన ఆఫీసర్స్ మెస్‌కు వెళ్లి రాత్రి బస చేస్తారు. 21వ తేదీ శనివారం ఉదయం 6.25కు రోడ్డుమార్గాన ఆర్కే బీచ్‌కు చేరుకుంటారు. 6.30 నుంచి 7.50 గంటల వరకూ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొంటారు. అనంతరం ఆఫీసర్స్ మెస్‌కు, అక్కడినుంచి ఐఎన్ఎస్ డేగాకు చేరుకొని విమానంలో ఢిల్లీ బయలుదేరి వెళతారు. కాగా, శనివారం దేశవ్యాప్తంగా 3.5 లక్షలకు పైగా ప్రదేశాల్లో ఏకకాలంలో యోగా సంగమ్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది యోగా దినోత్సవ థీమ్ 'ఒక భూమి, ఒక ఆరోగ్యం కోసం యోగా'. 2015లో ఐక్యరాజ్యసమితి జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా పాటించాలనే భారత్ ప్రతిపాదనను ఆమోదించినప్పటి నుంచి ఢిల్లీ, చండీగఢ్, లఖ్‌నవూ, మైసూరు, న్యూయార్క్, శ్రీనగర్‌తో సహా వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన వేడుకలకు మోదీ నాయకత్వం వహించారు.



యోగాసనాలు వేసే వారికోసం ఆర్కే బీచ్‌రోడ్డులో పరిచిన గ్రీన్ కార్పెట్



ఆచార్య మధుమూర్తి నుంచి బంగారు పతకం అందుకుంటున్న విద్యార్థిని

ఘనంగా వీవీఐటీ స్నాతకోత్సవం

▸ 11 మంది విద్యార్థులకు బంగారు పతకాలు

▸ 1195 మందికి డిగ్రీలు ప్రదానం చేసిన రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ మధుమూర్తి

పెదకాకాని, జూన్ 19(ఆంధ్రజ్యోతి): గుంటూరు సమీపం నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(వీవీఐటీ) కళాశాల స్నాతకోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఉత్తమ ప్రతిభ కనబరచిన 11 మంది విద్యార్థులకు బంగారు బంగారు పతకాలు, 1195 మంది పట్టభద్రులకు డిగ్రీలను రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ఆచార్య కె.మధుమూర్తి ప్రదానం చేశారు. భారతీయ సంస్కృతి ప్రతిబింబించేలా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మధుమూర్తి మాట్లాడుతూ డిగ్రీ అంటే కేవలం పట్టా మాత్రమే కాదని, జ్ఞానాన్ని సముపార్జించడమని తెలిపారు. ఐటీ, హెల్త్‌కేర్, ఆక్వా రంగాల్లో ప్రభుత్వం అనేక అవకాశాలను కల్పిస్తోందన్నారు. స్టార్టప్ కంపెనీలను స్థాపించి ఉద్యోగాలను అందించే స్థాయికి విద్యార్థులు ఎదగాలని సూచించారు. విజన్ 2047లో యువత ముఖ్య భూమిక వహించాలన్నారు. చాన్సలర్ విద్యాసాగర్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్ ప్రపంచంలోకి అడుగుపెడుతున్న క్రమంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఉత్తమ పౌరులుగా ఎదిగి సమాజానికి తమవంతు సహాయం అందించాలని సూచించారు. వీసీ కొడాలి రాంబాబు మాట్లాడుతూ, 2007లో ప్రారంభమైన కళాశాల అనతికాలంలోనే అనేక విజయాలను సొంతం చేసుకుని 2025లో విశ్వవిద్యాలయంగా ఎదిగిందని తెలిపారు. వీవీఐటీ ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జున రెడ్డి కళాశాల వార్షిక ప్రణాళికను భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు. కార్యక్రమంలో వీవీఐటీ వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, సెక్రటరీ ఎస్.బదిరి ప్రసాద్, జాయింట్ సెక్రటరి మామిళ్లపల్లి శ్రీకృష్ణ, డీన్ ఆఫ్ అకడమిక్ కె.గిరిబాబు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తిరుమలలో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

▸ సేవలను ప్రారంభించిన టీటీడీ అదనపు ఈవో

తిరుమల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ఆర్టీసీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణ సేవలను గురువారం నుంచి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆర్టీసీ బస్సుల ఉచిత ట్రిప్పులను తిరుమలలోని అశ్విని ఆస్పత్రి సర్కిల్ వద్ద టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ప్రారంభించారు.



తిరుమలలో ఆర్టీసీలో ఉచిత ట్రిప్పులను ప్రారంభిస్తున్న టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తోతాపురి కిలో రూ.ఐదే!

(మొదటి పేజీ తరువాయి)

ఇస్తున్నాయి. కొన్ని ఫ్యాక్టరీలు రూ.నాలుగే ఇస్తున్నాయి. ర్యాంపులు, మండీల్లో కిలోకు రూ.నాలుగే ఇస్తూ.. అందులోనూ కమీషన్ లాగేస్తున్నారు. దీంతో రైతులు ర్యాంపులకు వెళ్లడం లేదు. ఫ్యాక్టరీల ఎదుట ట్రాక్టర్ల లోడ్లతో రైతులు బారులు తీరి కనిపిస్తున్నారు. ఫ్యాక్టరీలు కూడా రోజుకు వందకు మించి టోకెన్లు ఇవ్వడం లేదు.

మద్దతు ధర అమలుకు యంత్రాంగం కృషి

ప్రభుత్వ ఆదేశాల మేరకు మద్దతు ధర అమలు చేసేందుకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం తీవ్రంగా కృషి చేస్తోంది. ఫ్యాక్టరీల వద్ద అధికారుల బృందాలతో పర్యవేక్షిస్తున్నారు. సబ్సిడీ రూ.4 అందించేందుకు రైతుల వివరాలు నమోదు చేస్తున్నారు. కలెక్టర్ స్వయంగా రోజుకు నాలుగు ఫ్యాక్టరీలు పరిశీలిస్తున్నారు. మాట వినని తవణంపల్లె మండలంలోని ఓ ఫ్యాక్టరీని మూసేయించారు. మరో మూడు ఫ్యాక్టరీలకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నుంచి నోటీసులు ఇప్పించారు. అధికారులు ఎంత కృషి చేసినా కిలోకు రూ.5కు మించి ఇవ్వలేమని ఫ్యాక్టరీలు తెగేసి చెప్తున్నాయి. ఒకట్రెండు మాత్రం రూ.6 ఇస్తున్నాయి.

పొరుగు రాష్ట్రాల్లో రూ.నాలుగే!

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 50 వేల హెక్టార్లలో తోతాపురి రకం మామిడి సాగవుతోంది. ఈ ఏడాది 5.5 లక్షల టన్నుల దిగుబడి వచ్చిందని అంచనా వేస్తున్నారు. అందులో 4.8లక్షల టన్నుల దిగుబడి చిత్తూరు కొత్త జిల్లా నుంచే ఉంది. జిల్లాతోపాటు పొరుగునే ఉన్న తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోనూ దిగుబడి అధికంగా వచ్చింది. దీంతో పొరుగు రాష్ట్రాల్లో కిలో రూ.4కే ఫ్యాక్టరీలు కొంటున్నాయి.

తగ్గిన డిమాండ్

ఉమ్మడి జిల్లాలో 41 పల్ప్ ఫ్యాక్టరీలుండగా.. 35 ఫ్యాక్టరీలు చిత్తూరు జిల్లాలో ఉన్నాయి. 28 ఫ్యాక్టరీలు మామిడి కొనుగోళ్లు ప్రారంభించాయి. అలాగే 39 ర్యాంపుల్లో.. 21చోట్ల కొనుగోళ్లు ప్రారంభించాయి. ప్రస్తుతం మామిడి ఉత్పత్తుల వినియోగం బాగా తగ్గిపోవంతో ఫ్యాక్టరీలు తయారు చేస్తున్న పల్ప్ ఎగుమతి కావడం లేదు. 2023, 2024 సంవత్సరాల్లో తయారుచేసిన పల్ప్ జిల్లాలోని ఫ్యాక్టరీల్లో సుమారు 40వేల టన్నుల వరకూ ఉండిపోయింది.

2018లోనూ ఇదే పరిస్థితి

సీఎం చంద్రబాబుకు జిల్లా పరిస్థితులపై, మామిడి రైతుల కష్టాలపై పూర్తి అవగాహన ఉంది. 2018లోనూ దిగుబడి అధికంగా వచ్చి ధర విషయంలో మామిడి రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొన్నారు. అప్పుడు రైతులకు రూ.2.5 సబ్సిడీ ఇచ్చిన ఆయన, ఇప్పుడు రూ.4 సబ్సిడీ ఇచ్చేందుకు నిర్ణయించారు.

ఐదేళ్లూ.. పట్టించుకోని వైసీపీ

2019లో వాతావరణ పరిస్థితులు అనుకూలించలేదు. 2020, 21లో కరోనా కారణంగా మామిడి ఎగుమతులు లేవు. 2022లో దిగుబడి సరిగా లేదు. 2023లో దిగుబడి బాగున్నా, ఫ్యాక్టరీలు సిండికేట్‌గా మారి రైతులకు మద్దతు ధర ఇవ్వలేదు. ఈ రకంగా వైసీపీ ఐదేళ్ల పాలనలో మామిడి రైతులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చినట్టు కేంద్రంతో మాట్లాడి ఈ ప్రాంతంలో మామిడి బోర్డు ఏర్పాటుచేస్తే చాలా సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉంది.



పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

మార్క్‌ఫెడ్ ద్వారా బర్లీ పొగాకు కొనుగోళ్లు

బాపట్ల, పర్చూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): 'గత పాలకులు చేసిన తప్పిదాల వల్ల ప్రభుత్వం ఎన్నో ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. అయినప్పటికీ బర్లీ పొగాకు రైతులను ఆదుకోవడానికి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు ప్రారంభించాం' అని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. బాపట్ల జిల్లా పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన నల్ల బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. తొలుత స్థానిక వైజంక్షన్ నుంచి ప్రధాన కూడలి వరకు ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో కలిసి మంత్రి ట్రాక్టర్ నడుపుతూ ప్రజలకు అభివాదం చేశారు. నల్లబర్లీ రైతులతో మాట్లాడారు. హెచ్‌డీఆర్, హెచ్‌డీఎం రకం పొగాకు క్వింటా రూ.12వేలు, హెచ్‌డీఎక్స్ రకం క్వింటా రూ.6వేల చొప్పున మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. కేంద్రం వాటా ఎప్పుడు జమ చేస్తే అప్పుడే రాష్ట్రం వాటా విడుదల చేసి అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తామన్నారు. కాగా, దుర్మార్గులకు సంతాపాలు తెలిపే పేరిట రోడ్డు మీద పడి శాంతిభద్రతల సమస్యలు సృష్టించాలని వైసీపీ కుట్ర చేస్తోందని అచ్చెన్నాయుడు ఆరోపించారు. రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

తగ్గిన వర్షాలు... రాష్ట్రంలో లోటు వర్షపాతం

▸ 26 తర్వాత రుతుపవనాల్లో కదలిక.. 27న అల్పపీడనం: నిపుణులు

విశాఖపట్నం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గడచిన వారం, పది రోజుల నుంచి వర్షాలు తగ్గాయి. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే ప్రవేశించినప్పటికీ తర్వాత మందగించాయి. నాలుగు రోజుల క్రితం మరోసారి చురుగ్గా మారి తూర్పు భారతం వైపు పయనించినా రాష్ట్రంలో పెద్దగా వర్షాలు కురవలేదు. రుతుపవనాల్లో మందగమనం కొనసాగుతోందని వాతావరణ నిపుణులు విశ్లేషించారు. గురువారం జంగమహేశ్వరపురంలో 40.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో ఎండ తీవ్రత ఉంటుందని, అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈనెల ఒకటో తేదీ నుంచి గురువారం వరకు రాష్ట్రంలో 48.7 మి.మీ.కుగాను 34.4 మి.మీ. వర్షపాతం(సాధారణం కంటే 29 శాతం తక్కువ) నమోదైంది. ప్రస్తుతం జార్ఖండ్ పరిసరాల్లో ఉన్న తీవ్ర అల్పపీడనం ఒకటి, రెండు రోజుల్లో బలహీనపడుతుందని, ఆ తరువాత ఈనెల 26వ తేదీకల్లా బంగ్లాదేశ్, పశ్చిమబెంగాల్‌కు ఆనుకుని ఉత్తర బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఆవరించే అవకాశం ఉందని, దీని ప్రభావంతో 27వ తేదీకల్లా అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడుతుందని అంచనా వేశారు. దీంతో రుతుపవనాలు మరోసారి చురుగ్గా మారే క్రమంలో రాష్ట్రంలో వర్షాలకు అవకాశం ఉందని వివరించారు.

'పోలవరం'లో డీవాటరింగ్ పనులు ప్రారంభం

పోలవరం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో అతి కీలకమైన ఎర్త్‌కం రాక్‌ఫిల్ డ్యాం పనుల నిర్మాణానికి అనువుగా ఎగువ దిగువ కాఫర్ డ్యాం నడుమ ఉన్న సీపేజీ జలాలను దిగువ కాఫర్ డ్యాం నుంచి దిగువకు తోడి పోసే పనులను జలవనరుల శాఖ అధికారులు, మెగా ఇంజనీరింగ్ అధికారులు గురువారం ప్రారంభించారు. అంతకుముందు ప్రాజెక్టు ఈఈ డి.శ్రీనివాస్, మెగా జీఎం గంగాధర్ పూజలు నిర్వహించారు.

నగల కోసం ఘోరం...

▸ తెనాలిలో దుండగుల చేతిలో బలైన వియ్యపురాళ్లు

▸ తిరుపతి జిల్లాలో ఒంటరి మహిళ..

ముగ్గురు మహిళల దారుణ హత్య



రాజేశ్వరి



అంజమ్మ



కల్పన

తెనాలి/పిచ్చాటూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు మహిళలను దారుణంగా హతమార్చి, వారి ఒంటిపై ఉన్న బంగారు నగలు దోచుకుపోయారు. గుంటూరు జిల్లా తెనాలిలో ఇద్దరు వియ్యపురాళ్లు దుండగుల ఘోరానికి బలికాగా, తిరుపతి జిల్లా పిచ్చాటూరు మండలం అడవికొడియంబేడులో ఒంటరి మహిళ హత్యకు గురైంది. వివరాలు... తెనాలి చినపరిమి డొంకరోడ్డులోని రావిరవీంద్రనాథ్‌కాలనీలో వియ్యపు రాళ్లు దాసరి రాజేశ్వరి(65), పెట్ల అంజమ్మ (70) కలిసి ఉంటున్నారు. గురువారం ఓ ఆటోలో మహిళ, ఇద్దరు యువకులు వారింటికి వచ్చా రు. వియ్యపురాళ్లను హతమార్చి వారి ఒంటిపై ఉన్న బంగారం దోచుకువెళ్లారు. వృద్ధులైన తమ వారి క్షేమ సమాచారం తెలుసుకునేందుకు రాజేశ్వరి కుమార్తె, అల్లుడు ఇంట్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం వీడియోలు రికార్డు కాకపోవడంతో బంధువులకు ఫోన్ చేసి చెప్పారు. వారు వచ్చి పరిశీలించగా వియ్యపురాళ్లు దారుణహత్యకు గురై రక్తపు మడుగులో పడి ఉన్నారు. ఐదు కిలోల తూకం రాయితో ఒకరి తలపైన, కర్రతో మరొకరిపై దాడి చేసి హత్య చేసినట్టు పోలీసులు గుర్తించారు. సీసీ కెమెరాల ఫుటేజ్‌ల ఆధారంగా నిందితుల్లో ఒకరు ప్రైవేట్ జీవిత బీమా కంపెనీలో పని చేసే మహిళగా గుర్తించారు.

గొంతు, చెవులు కోసి....

తిరుపతి జిల్లా పిచ్చాటూరు మండలం అడవికొడియంబేడు అరుంధతివాడకు చెందిన కల్పన(40) అనే మహిళ భర్త చనిపోవడంతో కొడుకుతో కలిసి చెన్నైలో క్యాటరింగ్ పనులు చేస్తున్నారు. వారం క్రితమే గ్రామానికి వచ్చారు. బుధవారం రాత్రి ఇంట్లో ఒంటరిగా నిద్రపోయిన కల్పన తెల్లవారేసరికి రక్తమడుగులో పడి ఉన్నారు. ఆమె గొంతు కోసిన దుండగులు చెవులు కూడా కోసివేశారు. తల్లిని చంపడంతోపాటు నగలు, నగదు కూడా తీసుకుపోయారని మృతురాలి కుమారుడు శివకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

'ప్రకాశం' రామయ్య కన్నుమూత

▸ జర్నలిస్టుగా, ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్‌గా గుర్తింపు

▸ రేపు పీఈసీ ప్రాంగణంలోనే అంత్యక్రియలు



కందుకూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కందుకూరులోని ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్, సీనియర్ జర్నలిస్టుగా సుపరిచితులైన కంచర్ల రామయ్య(76) గురువారం తుదిశ్వాస విడిచారు. నెలరోజులుగా హైదరాబాద్‌లో చికిత్స పొందారు. ఆయన కుమారుడు కంచర్ల శ్రీకాంత్ తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ, కుప్పం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్నారు. కందుకూరు సమీప అత్తంటివారిపాలెం గ్రామంలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన రామయ్య ఓ ప్రముఖ తెలుగు దినపత్రికలో వివిధ స్థాయిలలో పనిచేసి ఉద్యోగ విరమణ తర్వాత కందుకూరులో ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలను నెలకొల్పి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చారు. 'ప్రకాశం' రామయ్యగా గుర్తింపు పొందారు. ఆయనకు భార్య, కుమారులు విజయ్ శ్రీనివాస్, శ్రీకాంత్ ఉన్నారు. అంత్యక్రియలు శనివారం పీఈసీ ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. రామయ్య మృతి పట్ల సీఎం చంద్రబాబు, విద్యామంత్రి లోకేశ్‌తోపాటు పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

సుప్రీం నియమించిన సిట్‌లో మీరు లేరు.. నోటీసు ఇవ్వలేరు

▸ అదనపు ఎస్పీ వెంకట్రావుకు హైకోర్టు స్పష్టీకరణ

అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ తయారీకి నకిలీ నెయ్యి సరఫరా కేసులో సుప్రీంకోర్టు అనుమతి లేకుండా అదనపు ఎస్పీ జె.వెంకట్రావును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)లో దర్యాప్తు అధికారిగా నామినేట్ చేస్తూ సీబీఐ డైరెక్టర్ ప్రొసీడింగ్స్ ఇవ్వడాన్ని హైకోర్టు ఆక్షేపించింది. సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సిట్‌లో ఆయన సభ్యుడిగా లేరని గుర్తు చేసింది. సర్వోన్నత న్యాయస్థానం అనుమతి లేకుండా వెంకట్రావు నోటీసులు ఇచ్చి, దర్యాప్తు చేయడం కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని అభిప్రాయపడింది. ఈ వ్యవహారంలో కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐని ఆదేశించింది. విచారణను జూలై 3కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు.

మా ఆఫీసులపై దాడి చేసినవారి మీద పోలీసులు కేసులు పెట్టడం లేదు

▸ హైకోర్టును ఆశ్రయించిన జగతి పబ్లికేషన్స్ డైరెక్టర్.. పిటిషన్‌కు విచారణార్హత లేదన్న ఏజీ

అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సాక్షి కార్యాలయాలపై దాడి ఘటనలో తాము ఫిర్యాదులు చేసినా పోలీసులు కేసు నమోదు చేయడం లేదంటూ జగతి పబ్లికేషన్స్ లిమిటెడ్ డైరెక్టర్ బి.రాజిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం హైకోర్టు విచారణ జరిపింది. ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ.. వ్యాజ్యానికి విచారణార్హత లేదన్నారు. పోలీసులు కేసు నమోదు చేయకుంటే మేజిస్ట్రేట్ వద్ద ప్రైవేటు ఫిర్యాదు దాఖలు చేసుకోవాలని.. హైకోర్టులో పిటిషన్ వేయడానికి వీల్లేదన్నారు. పిటిషనర్ తరఫు న్యాయవాది మహేశ్వర రెడ్డి వాదనలు వినిపిస్తూ తమ కార్యాలయాలపై దాడులను నిరోధించడంలో అధికారులు విఫలమయ్యారని, జరిగిన నష్టానికి పరిహారం చెల్లించేలా అధికారులను ఆదేశించాలని కోరారు. న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్.. పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని ప్రతివాదులను ఆదేశించారు. విచారణను జూలై 22కి వాయిదా వేశారు.

విశేషం

యోగాకు మతంతో సంబంధం లేదు!

భారత ఉపఖండానికి యోగ విద్య కొత్తదేం కాదు. వేల ఏళ్ల క్రితమే భారతీయులకు యోగ సాధన తెలుసని రుజువుపరిచే పురావస్తు ఆధారాలెన్నో లభించాయి. సామాన్య శక పూర్వం (బీసీఈ) 2500 కాలం నాటి సింధు నాగరికతకు చెందిన కొన్ని మట్టి ముద్రల మీద.. యోగాసన భంగిమలలో కూర్చొని తపస్సు చేస్తున్న సాధకుల బొమ్మలు ఉన్నాయి. ఇవి నేటి పాకిస్తాన్‌లోని లార్కానాలో.. మొహెంజదారో శిథిలాలలో బయటపడ్డాయి. అలాగే బీసీఈ 1500 నాటి ఋగ్వేద మంత్రాల్ని పరిశీలిస్తే నాటి ప్రజలకు అప్పటికే యోగాభ్యాసం గురించి తెలుసునని గ్రహించగలం. వివిధ ఉపనిషత్తులు, భగవద్గీత (ఆత్మ సంయమ యోగం)లో యోగ సాధన ప్రయోజనాలు, మార్గాలు విపులంగా చర్చించారు. ప్రాచీన కాలంలో యోగ సాధనను అందరూ శారీరక, మానసిక ఆరోగ్య ప్రదాయినిగా భావించారు. అయితే.. యోగ సాధన ఫలితాల గురించి భారతీయులలో పలు అశాస్త్రీయ విశ్వాసాలు కూడా క్రమంగా ఏర్పడ్డాయి.

ఇతర మతాల్లోనూ...

కొందరు భావిస్తున్నట్టు యోగా కేవలం సనాతన (హిందూ) ధర్మానికి సంబంధించిన సాధన మాత్రమే కాదు. వైదికేతరమైన జైన, బౌద్ధానుయాయులు, ఇస్లామ్ మతానికి చెందిన సూఫీలు, దర్వేషీలు కూడా యోగ సాధన చేస్తారు. తాంత్రిక బౌద్ధ శాఖ అయిన 'వజ్రయానం'లో యోగాసనాలకు, ప్రాణాయామానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. బౌద్ధ గ్రంథమైన 'దీర్ఘనికాయం'లో వీటి ప్రస్తావనలు ఉన్నాయి. సాంఖ్య సిద్ధాంతం పునాదిగా, బౌద్ధం ద్వారా ప్రభావితుడైన పతంజలి మహర్షి 'యోగ సూత్రములు' అనే గ్రంథం రచించి, యోగను ఎనిమిది అంగాలతో కూడిన సమగ్ర సాధనంగా రూపొందించాడు. వేదాలను ప్రమాణాలుగా భావించే భారతీయ షట్ (ఆరు) ఆస్తిక దర్శనాలలో యోగ దర్శనం ఒకటి. కపిల మహర్షి రూపొందించిన సాంఖ్య దర్శనం... నిరీశ్వర (దైవం ప్రస్తావన లేని) సిద్ధాంతం కాగా... దాని ఆధారంగా పతంజలి రచించిన 'యోగ సూత్రాలు' దానికి దైవం, మోక్షం లాంటి భావనలను జోడించాయి. అందుకే పతంజలి యోగ సిద్ధాంతానికి 'సేశ్వర (స+ఈశ్వర) సాంఖ్యం' అనే పేరు వచ్చింది. 'యోగ' అనే మాటకు 'ఉపాయం, కూర్పు, కలయిక' అనే సాధారణ అర్థాలు ఉన్నాయి. సాంఖ్య సిద్ధాంతం ఆత్మను 'పురుషుడు' అని, పదార్థాన్ని 'ప్రకృతి' అని వ్యవహరిస్తూ... అవి రెండూ అంతిమ సత్యాలని నమ్ముతుంది. శుద్ధ చైతన్య స్వరూపుడైన పురుషుడు (ఆత్మ) పదార్థ జనితమైన చిత్తంతో చెందే సంయోగం కారణంగా వివిధ చిత్తవృత్తుల (మెంటల్ మోడిఫికేషన్స్)కు లోనవుతాడని, తన స్వభావ సిద్ధమైన వివేక జ్ఞానాన్ని కోల్పోతాడని, చిత్తవృత్తులను నిరోధించి, వివేక జ్ఞానం పొందడం ద్వారా మోక్షాన్ని సాధించే మార్గమే యోగమని పతంజలి సిద్ధాంతం.

శాస్త్రీయ దృక్పథంలో...

ఇప్పుడు దీన్ని శాస్త్రీయ దృక్పథంతో పరిశీలిద్దాం. సిద్ధాంతపరంగా మిగిలిన అయిదు ఆస్తిక దర్శనాలు ఎదుర్కొన్న తార్కికమైన, తాత్త్వికమైన చిక్కులనే యోగ దర్శనం కూడా ఎదుర్కొంది. యోగ సాధన ద్వారా దైవ స్వరూపం అవగతమవుతుందని, పలు సిద్ధులు, అతీంద్రియ శక్తులు లభిస్తాయని యోగ సూత్రాలలో పేర్కొన్న విషయాలను కొందరు విశ్వసిస్తారు. అయితే వాటికి శాస్త్రీయ ఆధారాలను మాత్రం చూపలేరు. అయితే మన శారీరక, మానసిక ఆరోగ్యాలకు యోగసాధన ప్రయోజనకరమని మాత్రం శాస్త్రీయంగా రుజువయింది. యోగాసనాల వల్ల పలు శరీరావయవాలకు, మెదడుకూ రక్తప్రసరణ మెరుగుపడుతుందని, అనేక శారీరక, మానసిక రుగ్మతలు తొలగిపోతాయని నిరూపితం అయింది. 'అష్టాంగయోగ' సాధనలో అంతర్భాగమైన ప్రాణాయామం ద్వారా శ్వాసకోశాలు శుభ్రపడి, రక్తశుద్ధి మరింత చక్కగా జరుగుతుంది. గుండె పనితీరు మెరుగుపడుతుంది. ధారణ ద్వారా జ్ఞాపకశక్తి, ఏకాగ్రత మెరుగవుతాయి. ధ్యానం చిత్తశుద్ధినీ, ప్రశాంతతను చేకూరుస్తుంది. యోగ సాధన ప్రయోజనాలు వైద్య విజ్ఞాన శాస్త్రవేత్తల అధ్యయనాల్లో రుజువయ్యాయి. అంతేతప్ప అతీంద్రియ శక్తులు లభిస్తాయని ఎవరూ రుజువు చేయలేదు. అందుకే వాటిని అంధ విశ్వాసాలుగా విజ్ఞులు, శాస్త్రవేత్తలు కొట్టి పారేస్తారు. కాగా... శారీరక, మానసిక ఆరోగ్యాలకు ఎంతో మేలు చేకూర్చే యోగ సాధనను కొందరు మత విశ్వాసాలతో ముడిపెడుతున్నారు. యోగ శిక్షణ తరగతులలో చేసే సాధనను భక్తి, ప్రార్థనలు, భజనలతో మిళితం చేస్తున్నారు. యోగ సాధనకు మత విశ్వాసాలతో ఎలాంటి సంబంధం లేదని, ఏ మతస్థులైనా యోగ సాధన చేసి పొందవచ్చని, ఎందరో అలా పొందుతున్నారని అందరూ గ్రహించాలి.



ముత్తేవి రవీంద్రనాథ్
చరిత్ర పరిశోధకుడు

అష్టాంగ యోగం

చిత్తవృత్తులను నిరోధించడమే యోగమని చెబుతూ... 'యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధి' అనే ఎనిమిది అంగాలను పతంజలి వివరించాడు. ఈ ఎనిమిది అంగాలు కలిగిన యోగ సాధనను 'అష్టాంగ యోగం' అంటారు. వాటిలో మొదటి అయిదు బహిరంగ సాధనాలని, మిగిలిన మూడు అంతరంగ సాధనలని పేర్కొంటారు. యమ, నియమాలు సాధకులకు నైతిక క్రమశిక్షణ చేకూర్చితే... ఆసన ప్రాణాయామాలు సాధకుల శరీరారోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. 'ఆసనం' అంటే శరీరాన్ని ఒకే స్థితిలో నిశ్చలంగా ఉంచగలగడం. 'ప్రాణాయామ సాధన' అంటే మనం పీల్చే ప్రాణవాయువును వివిధ విధాలుగా బిగబట్టి, వదులుతూ చేసే ఆయామం (నియంత్రణ). 'ప్రత్యాహారం' అంటే సాధకులు తమ పంచేంద్రియాలను, మనస్సును విషయ వాంఛలకు దూరంగా ఉంచడం. సాధకులు 'భ్రుకుటి' (కనుబొమల మధ్య ప్రదేశం), 'నాసాగ్రం' (ముక్కు కొన) లాంటి వాటిపై దృష్టి కేంద్రీకరించి... ఏకాగ్ర సాధన చేయడాన్ని 'ధారణ' అంటాం. మనస్సును నిరంతరం ఒకే విషయం మీద లగ్నం చెయ్యడాన్ని 'ధ్యానం' అని పిలుస్తారు. ధ్యానం కూడా ఆగిపోయి... ఆత్మ, మనం ధ్యానం చేసే విషయం... ఈ రెండూ ఒకటై పోయే దశను 'సమాధి స్థితి' అంటారు.

సహజయోగ

విశ్వశాంతి మంత్రం

ప్రస్తుతం ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. దీనికి మతాలు, జాతులు మధ్య వైరాలు, సరిహద్దుల కోసం, ఆధిపత్యం కోసం పోరాటాలు... ఇలా ఎన్నో కారణాలు. ఈ యుద్ధ వాతావరణంలో అమాయకమైన ప్రజలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. విశ్వశాంతికి భంగం కలిగిస్తున్న అనేక సమస్యలకు యోగా చక్కటి పరిష్కారాన్ని చూపిస్తుంది. 'మన కోసం, మన సమాజం కోసం యోగా' అనే నినాదంతో... జూన్ 21వ తేదీని 'అంతర్జాతీయ యోగా దినం'గా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. జీవితానికి శాంతిని, ఆరోగ్యాన్ని, శ్రేయస్సును అందించే ప్రక్రియ యోగా. సహజయోగ ధ్యాన ఆవిష్కర్త శ్రీమాతాజీ నిర్మలాదేవి విశ్వశాంతి స్థాపన ధ్యేయంగా పలు దేశాల్లో పర్యటించినప్పుడు ఇచ్చిన సందేశాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకుందాం.

ఆ కలయికే యోగా...

ఈ రోజుల్లో చాలామంది యోగ అంటే కేవలం ఆసనాలు, సూర్యనమస్కారాలు అనుకుంటున్నారు. నిజానికి ఆ పదానికి అర్థం చాలా విస్తృతమయినది, ఎంతో సూక్ష్మమైనది. సంస్కృత భాషలో 'యోగ' అనే పదానికి 'కలయిక' అనే అర్థం ఉంది. ప్రతి మానవునిలో అంతర్గతంగా ఉండే భగవంతుని శక్తి జాగృతం చెంది, మన చుట్టూ సర్వవ్యాపితమై ఉన్నభగవంతుని శక్తితో కలయిక చెందడాన్నే 'యోగ' అని పిలుస్తారు..

శాంతి మనలో ఉండాలి



వేదికల మీదకు ఎక్కి... 'శాంతి, శాంతి' అని గొంతెత్తి అరచినంతమాత్రాన ప్రపంచంలో శాంతి స్థాపన చేయలేం. మనిషిలోనే ప్రశాంతత లేనప్పుడు శాంతి సాధన కోసం చర్చలు జరపడం వల్ల ఫలితం ఏముంటుంది? ఒక వేళ శాంతికోసం చర్చలు జరిపినా, ఒప్పందం చేసుకున్నా... ఏదో ఒక రూపంలో మళ్ళీ అశాంతి మొదలవుతుంది. మనలోని ఆత్మ ద్వారా శాంతి వ్యక్తం కావాలి. ముందుగా శాంతి అనేది మనలో ఉండాలి. మనం మానసిక ప్రశాంతతతో ఉండాలి. మనలో అశాంతి ఉన్నప్పుడు, అహంకారంతో మన కళ్ళు మూసుకుపోయినప్పుడు 'నేనెంతో ప్రశాంతంగా ఉన్నాను' అని భావిస్తే... అది కేవలం భ్రమ. శాంతి కోసం యుద్ధాలు చేయనవసరం లేదు. దాన్ని ఆత్మ ద్వారా అనుభూతి చెందాలి. అంతర్గతంగా ప్రశాంతతతో ఉన్నవారు ఎల్లప్పుడూ ఆనందంగా ఉంటారు. అందరికీ ఆనందాన్ని పంచుతారు. ప్రతి మనిషిలో నిద్రాణ స్థితిలో ఉన్న దైవ శక్తి అయిన కుండలినీ శక్తిని జాగృతం చేసి, ఆత్మసాక్షాత్కారం పొందినప్పుడు... మన హృదయానికి, మెదడుకు మధ్య ఐక్యత ఏర్పడుతుంది. అదే సహజయోగం. ఆ కాంతి మనలో ప్రవేశించినప్పుడు... మన జీవితం నెమ్మదిగా, స్థిరంగా మారడం, పరివర్తన చెందడం గమనిస్తాం. అప్పుడు మానవులలో అత్యున్నత శ్రేణికి చెందిన కొత్త కోణాన్ని మనం చూస్తాం. రూపాన్ని గురించి చింతించడం, ప్రత్యేకమైన ఇష్టాలు, అయిష్టాలు, అనవసరమైన ఆలోచనలు లాంటివి ఉండవు. మనలో శాంతి క్రమంగా స్థిరపడడం ప్రారంభమవుతుంది. మనలో స్థిరపడిన ఈ అంతర్గత శాంతి మనల్నే కాదు... మన చుట్టూ ఉన్న సమాజాన్ని, మొత్తం ప్రపంచాన్ని ప్రభావితం చేస్తుంది. అలా విశ్వశాంతికి దోహదపడే మంత్రమే యోగా.



డాక్టర్ పి. రాకేష్,
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

సద్గురువాణి

ఆ అద్భుతాన్ని అనుభూతి చెందుదాం

'యోగా' అంటే 'మీ శరీరాన్ని ఎలా వంచాలి? లేదా శ్వాసను ఎలా బిగబట్టాలి?' అనే దాని గురించి కాదు. ఇది మొత్తం మానవ వ్యవస్థను అర్థం చేసుకొనే విజ్ఞాన శాస్త్రం. 'యోగ' అనే పదానికి అర్థం ఐక్యత . ఐక్యత అంటే 'మీరు' అనే దానిలోంచి విశ్వజనీనతను అనుభూతి చెందడం. ఉదాహరణకు... ఈ అస్తిత్వం అంతా వివిధ రూపాల్లో వ్యక్తమవుతున్న ఒకే శక్తి అని ఆధునిక విజ్ఞాన శాస్త్రం నిరూపించింది. ఈ శాస్త్రీయ వాస్తవం మీకు జీవన వాస్తవంగా మారితే... అంటే మీరు ప్రతిదాన్నీ ఒకటిగా అనుభూతి చెందడం ప్రారంభిస్తే... మీరు యోగాలో ఉన్నట్టే.

మీలోపల ఏం జరుగుతోంది?

ఈ అంతర్గత సాంకేతికతను మానవులకు అందించడం చాలా ముఖ్యం. ఎందుకంటే ఈ రోజున ఐక్యరాజ్యసమితిలోని నిపుణులు 'మానసిక అనారోగ్యం' అనే మహమ్మారి గురించి మాట్లాడుతున్నారు. ప్రపంచంలో ఒంటరితనం ఎక్కువైపోతోంది. యునైటెడ్ స్టేట్స్‌లో... సర్జన్ జనరల్ నివేదిక ప్రకారం ప్రతి ఇద్దరిలో ఒకరు ఒంటరితనాన్ని అనుభవిస్తున్నారు. ఒంటరితనంలో గడిపే సమయం... మానసిక అనారోగ్యాలను పొదిగే సమయం. మానసిక అనారోగ్యం కేవలం కొన్ని రకాల వ్యక్తులనే కాదు... ఎవరినైనా ప్రభావితం చేయవచ్చు. మీరు ఆ స్థితికి వెళ్ళకుండా చూసుకోవడం ఉత్తమం. ఎందుకంటే బాధ, ఆనందం, సంతోషం, దుఃఖం, ఆవేదన, పారవశ్యం లాంటి వాటిద్వారా మానవ అనుభవం అనేది అంతర్గతంగా నిర్ణయం అవుతుంది. బాహ్య సంఘటనలు... ఆఖరికి ఒకే కుటుంబంలోని ఇద్దరు సభ్యుల మధ్య కూడా ఎప్పుడూ నూటికి నూరు శాతం మీరు కోరుకున్నట్టు జరగవు. కానీ మీలో అంతర్గతంగా ఏం జరుగుతోందనేది మీరే నిర్ణయించుకోవాల్సి ఉంటుంది.

Miracle of Mind SADHGURU

వారే కర్తలుగా, యజమానులుగా...

ఈ సమస్యను పరిష్కరించడం కోసం... ఈ ఏడాది ఫిబ్రవరిలో మేము 'మిరాకిల్ ఆఫ్ మైండ్' అనే యాప్‌ను ప్రారంభించాం. ఇది ఒకరి జీవితంలో శాంతిని, ఆనందాన్ని, ఉల్లాసాన్ని తీసుకురావడానికి దోహదపడే, ఎక్కడైనా సాధన చేయగలిగే సులభమైన ప్రక్రియను అందిస్తుంది. ఇది తెలుగుతో సహా పలు భాషల్లో ఉంటుంది. ప్రత్యేకించి తెలుగులో ధ్యానం కోసం అందుబాటులోఉన్న మొదటి యాప్ ఇది. ఈ భూమి మీద ఉన్న ప్రతి మానవుడు మనసు చేసే అద్భుతాన్ని అనుభూతి చెందాలనేది నా కోరిక, నా ఆశీస్సు. మానవులందరూ ఏ మినహాయింపు లేకుండా... తమ ఆనందానికి తామే కర్తలుగా, తమ భవితకు తామే యజమానులుగా మారే సామర్థ్యాన్ని కలిగి ఉంటారు. మీరు ఆ విధంగా రూపుదిద్దుకొనే మార్గాన్ని యోగా అందిస్తుంది. భవిష్యత్ తరాల శ్రేయస్సు కోసం ఈ అత్యంత ముఖ్యమైన కార్యానికి సాయం చేయడానికి, నెరవేర్చడానికి అందరికీ సుస్వాగతం. ఎందుకంటే ప్రస్తుతం మనకన్నా మెరుగైన తరం మానవులను లోకానికి అందించి నిష్క్రమించడం మనం విస్మరించలేని బాధ్యత.






సద్గురు జగ్గీవాసుదేవ్

తెలుసుకుందాం

బ్రాహ్మీ ముహూర్తం అంటే...



'బ్రాహ్మీ ముహూర్తం' అనే మాట మనం వింటూనే ఉంటాం. అది తెల్లవారుజాము సమయం అని అందరికీ తెలుసు. కానీ సరైన సమయం మాత్రం చాలామందికి తెలియదు. అలాగే బ్రాహ్మీ ముహూర్తంలో నిద్రలేవాలని, పూజ చేయాలని, పిల్లలు చదువుకోవాలని ఎందుకు సూచిస్తారో తెలుసుకుందాం. సూర్యోదయానికి ముందున్న 48 నిమిషాల సమయాన్ని 'బ్రాహ్మీముహూర్తం' అంటారు. ఇది పూజలకు, జపాలకు, మంత్రసాధనకు విశిష్టమైనదని పూర్వులు చెప్పారు.

ఆరోగ్యానికి, జ్ఞాపకశక్తికి...

మన శరీరంలోని జీవక్రియలన్నీ మన లోపల ఉండే జీవ గడియార సమయం ప్రకారం జరుగుతాయి.
బ్రాహ్మీ ముహూర్తంలో మేలుకొనేవారికి జీవక్రియ సక్రమంగా సాగుతుంది. ఎందుకంటే ఉదయం వేళ మన శరీరంలో కార్టిసోల్ హార్మోన్ ఎక్కువ మోతాదులో విడుదల అవుతుంది.
ఈ హార్మోన్ మనలోని ఒత్తిడిని తగ్గించి, జ్ఞాపకశక్తిపై సానుకూల ప్రభావం చూపిస్తుంది. అందుకే విద్యార్థులు ఆ సమయంలో చదువుకుంటే బాగా గుర్తుంటుందని, వారి జ్ఞాపకశక్తి పెరుగుతుందని విశ్వాసం ఉంది. అలాగే ఆ సమయంలో పరిసరాలు నిశ్శబ్దంగా ఉంటాయి.
కాబట్టి చదివినది నేరుగా మెదడులో నిక్షిప్తం అవుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రాత్రి తొందరగా నిద్రపోయి, సూర్యోదయానికి ముందే లేచేవారికి ఆరోగ్య సమస్యలు ఎక్కువగా రావంటోంది ఆయుర్వేదం. రాత్రంతా చెట్లు విడుదల చేసిన ఆక్సిజన్... వేకువ జామున కాలుష్యం బారిన పడకుండా ఎక్కువ పరిమాణంలో మనకు అందుబాటులో ఉండేది బ్రాహ్మీ ముహూర్త సమయంలోనే. ఉదయం నడకకు వెళ్ళేవారికి ఇది చాలా ఉపయోగంగా ఉంటుంది. ప్రతిరోజూ సూర్యోదయాన్ని చూసే అలవాటు ఉన్నవారి గుండె, మెదడు ప్రశాంతంగా, ఆరోగ్యంగా ఉంటాయి. లేలేత సూర్యకిరణాలు మనపైన ప్రసరించడం వల్ల ఎంతో ఉపయోగం ఉంది. సూర్యరశ్మిలో ఉండే 'విటమిన్-డి' మన ఎముకలు బలంగా ఉండడానికి దోహదం చేస్తుంది.

• సి.ఎస్. మూర్తి,అంబాజీపేట
8328143489

సమాచారం

ఆదిపరాశక్తిని తమ ఇంటి ఆడబిడ్డగా భావించి, అత్తవారి ఇంటి నుంచి పుట్టింటి తీసుకువచ్చి, నైవేద్యాలు సమర్పించి, సారెతో అత్తవారింటికి తిరిగి సాగనంపే సంప్రదాయమే బోనాల పండుగ.

ఆషాఢ జాతర వచ్చేస్తోంది!



ఆషాఢమాసంలోని తొలి ఆదివారం లేదా తొలి గురువారం గోల్కొండలోని జగదాంబిక ఆలయంలో నిర్వహించే ఉత్సవాలతో మొదలై, నెలరోజులపాటు జరిగే ఈ పండుగ ఎన్నో విశేషాల సమాహారం. ఈ ఏడాది జూన్ 26 నుంచి జూలై 26 వరకూ ఈ వేడుకలు కొనసాగుతాయి.

ఎక్కడంటే...

జూన్ 26న: గోల్కొండ బోనాలతో ఉత్సవాలు ప్రారంభం
జూలై 29న: విజయవాడ కనకదుర్గమ్మకు బోనం సమర్పణ
జూలై 13న: సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర
జూలై 14న: రంగం, భవిష్యవాణి
జూలై 20న: భాగ్యనగర్ (లాల్ దర్వాజా) బోనాల జాతర
జూలై 21న : ఉమ్మడి దేవాలయాల ఘటాల ఊరేగింపు
జూలై 24న: బోనాల ఉత్సవాల ముగింపు

వ్యాసపీఠం


హరే శ్రీనివాస!

దాదాపు రెండేళ్ళపాటు టి.టి.డి. ఎగ్జిక్యూటివ్ అధికారిగా... స్వామి వారి ప్రథమ సేవకుడిగా తాను చేసిన విశేష కార్యక్రమాలను వివరిస్తూ డాక్టర్ కె.వి.రమణాచారి రచించిన గ్రంథం 'హరే శ్రీనివాస!'. ఇందులో 'శ్రీనివాసుడు నాకు జవాబిచ్చాడు' మొదలు 'వెంకటాద్రి దిగి వెంకటాద్రి ఎక్కి వరకూ'... ఇరవై రెండు అధ్యాయాలు ఉన్నాయి. ఈ అధ్యాయాల శీర్షికలు వాటిని చదవాలన్న ఉత్సుకతను పాఠకుల్లో రేకెత్తిస్తాయి.

"ఎందుకు ఈ భక్తులందరూ వందలాది కిలోమీటర్ల దూరం రైళ్ళు, బస్సులు, కార్లు, కాలినడక... ఇలా ఇన్ని రకాలుగా ఆపసోపాలు పడుతూ తిరుపతి వస్తున్నారు?..." అనే ప్రశ్నతో ఈ గ్రంథం ప్రారంభం అవుతుంది. "నిన్నే తమ సర్వస్వంగా భావిస్తున్న భక్తులు నిన్ను దర్శించాలని ఇంత కష్టపడి, ఇంత దూరం వస్తే నువ్విచ్చే దర్శనం లిప్తకాలమా?..." అనే ప్రశ్నను... తను టి.టి.డి. ఈవో కాకముందు డాక్టర్ రమణాచారిగారు తనలోతాను అనేకసార్లు వేసుకున్నారట. అలాగే "సర్వశక్తిమంతుడివి కదా! నీ భక్తుల దగ్గరకు నీవే వెళ్ళి, సంతృప్తికరమైన దర్శనంతో వాళ్ళను తరింపజేయవచ్చు కదా! స్వామే భక్తుల దగ్గరకు ఎందుకు వెళ్ళకూడదు?..." ఇది భక్తుడిగా ఆయన స్వామివారికి వేసిన ప్రశ్న. టి.టి.డి. ఈవోగా బాధ్యతలు స్వీకరించాక ఆ ప్రశ్న ఆయనలో మళ్ళీ ఉదయించింది. దానికి స్వామి ఇచ్చిన సమాధానం ఏమిటి? అది ఇచ్చిన పద్ధతి ఏమిటి? 'చతుర్యుగ బంధ భక్తి చైతన్య యాత్ర'కు బీజం ఎలా పడింది? వీటన్నిటికీ జవాబులు ఈ గ్రంథంలో లభిస్తాయి. ఆ సర్వాంతర్యామి సేవకుడిగా తన అనుభవాలను ఆసక్తికరంగా, సభక్తికంగా ఈ పుస్తకంలో డాక్టర్ రమణాచారి నిక్షిప్తం చేశారు.

ఆసక్తి పెంచేలా...

డాక్టర్ రమణాచారి తలపెట్టి విజయవంతం చేసిన చతుర్యుగ బంధ భక్తి చైతన్య యాత్ర, అఖండ హరినామ సంకీర్తన, నిత్యకళ్యాణం, పుస్తక, ప్రసాదం, దివ్య భారతి, ఎస్వీబీసీ, శ్రీ అన్నమాచార్య ఆరువందల జయంతి వేడుక, పాలకమండలి అమృతోత్సవం... ఇలా ఎన్నో కార్యక్రమాలు, ప్రాజెక్టుల గురించి చదువుతూ ఉంటే... ఆయన భక్తి తత్పరత, పాలనానుభవం, కార్యదక్షత ఎంతటివో అర్థమవుతుంది. ఈ గ్రంథం చదవడం ప్రారంభిస్తే... పూర్తి అయ్యేవరకూ ఆగలేం. రచన అటువంటిది. విషయం భగవంతునిది. రచయిత పండిత, సంప్రదాయ కుటుంబానికి చెందినవారు. ఎం.ఏ. తెలుగు చేసి, పిహెచ్.డి. పట్టా పుచ్చుకున్నావారు. వీరి రచనలో చదివించే లక్షణం ఉంది. పఠనాసక్తిని పెంచే విధంగా శీర్షికలు ఉన్నాయి. తన ఆలోచనను చెప్పి, దాన్ని అమలుపరిచే క్రమంలో ఎదురైన సమస్యలను వివ



రిస్తున్న సందర్భంలో... పాఠకుని మనసు మరింత వేగంగా పరిగెడుతుంది. 'సమస్య ఎలా పరిష్కారమవుతుంది? దైవ కార్యం ఎట్లా విరబూసి పరిమళిస్తుంది?' అనే ఆసక్తిని పెంచే విధంగా రచన సాగింది. పుస్తకం ముగించినప్పుడు అనిపిస్తుంది... 'ఇంతలోనే నూట ఎనభై పుటలు చదివేసినామా!' అని. డాక్టర్ కె.వి.రమణాచారిగారి ద్వారా శ్రీవేంకటేశ్వరస్వామి పాఠకులకు అందించిన ప్రసాదం ఈ 'హరే శ్రీనివాస!' గ్రంథం.

• అనూమాండ్ల భూమయ్య

సినిమాకు ప్రత్యేకాకర్షణగా



మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న చిత్రం 'మెగా 157'- (వర్కింగ్ టైటిల్). నయనతార కథానాయిక. సాహు గారపాటి నిర్మిస్తున్నారు. ఇటీవలె ప్రారంభమైన మసూరి షెడ్యూల్‌లో చిరంజీవి, నయనతార కలయికలో కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. తాజాగా, ఈ షెడ్యూల్ ముగిసిందని, ఈ సన్నివేశాలు సినిమాకు ప్రత్యేకాకర్షణగా ఉండనున్నాయని మేకర్స్ తెలిపారు. వచ్చే ఏడాది సంక్రాంతికి సినిమాను ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఎడిటర్: తమ్మిరాజు, డీఓపీ: సమీర్ రెడ్డి

రామ్ బుజ్జి పాత్రలో...



రామ్‌చరణ్ కథానాయకుడిగా రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'పెద్ది'. బుచ్చిబాబు సానా దర్శకుడు. ఇటీవలే విడుదలైన గ్లింప్స్‌లో రామ్‌చరణ్ క్రికెటర్‌గా కనిపించి ఆకట్టుకున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో 'మీర్జాపూర్' సిరీస్ ఫేమ్ బాలీవుడ్ నటుడు దివ్యేందు శర్మ కీలకపాత్రలో నటిస్తున్నారు. గురువారం ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం ఆయన పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ చిత్రంలో రామ్ బుజ్జి అనే పాత్రలో దివ్యేందు శర్మ కనిపించనున్నారు. మాస్ అవతార్‌లో క్రికెట్ బంతిని ఎగరేస్తున్న ఆయన లుక్ ఆకట్టుకుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో నిర్మించిన భారీ సెట్‌లో 'పెద్ది' చిత్రం షూటింగ్ జరుగుతోంది. ఓ భారీ ట్రైన్ యాక్షన్ ఎపిసోడ్‌ను చిత్రబృందం ప్రస్తుతం తెరకెక్కిస్తోంది. ఈ చిత్రంలో రామ్‌చరణ్‌కు జోడీగా జాన్వీకపూర్ కనిపించనున్నారు. శివ రాజ్‌కుమార్, జగపతిబాబు కీలకపాత్రలు పోషిస్తున్నారు. రామ్‌చరణ్ పుట్టిన రోజు సందర్భంగా వచ్చే ఏడాది మార్చి 27న 'పెద్ది' విడుదలవనుంది. ఏ.ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: ఆర్. రత్నవేలు, ఎడిటర్: నవీన్‌నూలి.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ఇలాంటి సినిమా చేయడానికి గట్స్ కావాలి

- అక్కినేని నాగార్జున



"కుబేర' చిత్ర కథ, ఇందులోని క్యారెక్టర్లు, స్క్రీన్‌ప్లే అన్నీ ప్రత్యేకంగా ఉంటాయి. ఇలాంటి సినిమా చేయడానికి గట్స్ కావాలి. ప్రేక్షకులకు మంచి అనుభూతిని ఇచ్చే సినిమా ఇది' అని అన్నారు హీరో అక్కినేని నాగార్జున. ఆయన, ధనుష్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించారు. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్‌రావు నిర్మించారు. నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా నాగార్జున విలేకరులతో మాట్లాడారు.

- మంచి కథ రావాలంటే స్టార్స్ కలసి పనిచేయాలి. ఇంతకుముందు కూడా నేను చాలా సినిమాలు చేశాను. నాన్నగారు, ఎన్టీఆర్ గారు, కృష్ణగారు, శోభన్‌బాబుగారు.. ఇలా అందరూ కలసి ఎన్నో సినిమాలు చేశారు.
- శేఖర్ కమ్ములతో పనిచేయాలని ఎప్పటి నుంచో ఉంది. 'ఆనంద్' దగ్గర నుంచి ఆయన సినిమాలు మనందరికీ తెలుసు. ఆయన సినిమాలంటే నాకు బాగా ఇష్టం. ఆ కథల్లో సామాజిక స్పృహ ఉంటుంది. వాణిజ్య హంగులతో పాటు అద్భుతమైన పాటలూ ఉంటాయి.
- 'కుబేర' చిత్రంలో యూనిక్ పాయింట్ ఉంది. నేటి సమాజానికి ఆ పాయింట్ చాలా రిలెవెంట్.
- శ్రీమంతుడు, మధ్యతరగతి వాడు, బిచ్చగాడు... ఇలా మూడు సొసైటీల మధ్య సంఘర్షణే ఈ చిత్ర కథ.
- ఈ సినిమాలో నాది మధ్యతరగతి మనిషి క్యారెక్టర్. సీబీఐ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తాను. మంచి చేయాలా? చెడు చేయాలా? అనే సంఘర్షణ మధ్య ఆ క్యారెక్టర్ ఉంటుంది. శేఖర్ చాలా అద్భుతంగా రాశారు. నా బాడీ లాంగ్వేజ్, మాట తీరు, రియాక్షన్.. అన్నీ కొత్తగా శేఖర్ కమ్ముల స్టయిల్‌లో ఉంటాయి. సినిమాలో చాలా అద్భుతమైన సన్నివేశాలు ఉన్నాయి.
- అవన్నీ కూడా మన నిజ జీవితాన్ని ప్రతిబింబించేలా ఉంటాయి. ధనుష్ తన పాత్రలో ఒదిగిపోయి చేశారు. రష్మిక చాలా చక్కగా నటించారు. సినిమా చూసి నువ్వే స్టార్ అని ఆమెతో చెప్పాను. దేవిశ్రీ ప్రసాద్ మంచి సంగీతం అందించారు. ఇందులోని పాటలన్నీ సందర్భోచితంగా ఉంటాయి.
- పాన్ ఇండియా సినిమాలు చేయడం చాలా కష్టమైన పని. అన్ని చిత్రాలు పాన్ ఇండియా కాలేవు. 'శివ' సినిమా 4కె వర్క్ పూర్తయింది. ఒక రీల్ చూశాను. చాలా అద్భుతంగా ఉంది. 'కూలీ'లో డిఫరెంట్ క్యారెక్టర్ చేస్తున్నాను. మొదటి సారి ఇలాంటి క్యారెక్టర్ చేస్తున్నాను. లోకేశ్ కనగరాజ్ కంప్లీట్ న్యూ ఏజ్ డైరెక్టర్. నా 100వ సినిమా ప్లానింగ్ చేస్తున్నాం. వర్కింగ్ టైటిల్ 'కింగ్ 100' అని పెట్టాం.

ఏపీలో కుబేర టికెట్ ధరల పెంపు

ఆంధ్రప్రదేశ్‌లో 'కుబేర' చిత్రానికి టికెట్ ధరల పెంపునకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మల్టీప్లెక్స్, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రూ.75 రూపాయలు (జీఎస్టీ అదనం) పెంచుకునే అవకాశం ఇచ్చింది. సినిమా విడుదలైన 10 రోజుల వరకూ పెరిగిన టికెట్ ధరలు అమల్లో ఉండనున్నాయి. మరోవైపు, తెలంగాణలో మాత్రం టికెట్ రేట్లు యథాతథంగా ఉంటాయి. ధరల పెంపు కోసం చిత్రబృందం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోలేదని సమాచారం.

సోలో బాయ్ వినోదం



గౌతమ్ కృష్ణ, రమ్య పసుపులేటి జంటగా నటించిన చిత్రం 'సోలో బాయ్'. శ్వేతా అవస్తి, షఫీ, భద్రం కీలకపాత్రలు పోషించారు. నవీన్‌కుమార్ దర్శకత్వంలో సెవెన్‌హిల్స్ సతీశ్ నిర్మించారు. జూలై 4న ఈ చిత్రం విడుదలవుతోంది. ఇటీవలే చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడుతూ 'మధ్య తరగతి నేపథ్యంలో వస్తున్న పూర్తి వినోదాత్మక చిత్రమిది. భావోద్వేగాలతో పాటు వాణిజ్యహంగుల కలబోతగా తెరకెక్కింది. గౌతమ్‌కృష్ణ అద్భుతంగా నటించాడు' అని చెప్పారు. సెవెన్‌హిల్స్ సతీశ్ మాట్లాడుతూ 'గౌతమ్‌కృష్ణ ఈ చిత్రానికి పారితోషికం తీసుకోలేదు. నిర్మాణంలోనూ పాలు పంచుకున్నాడు. సినిమా హిట్టయ్యాక పారితోషికం తీసుకుంటానని చెప్పాడు. ఈ సినిమాతో ఆయనకు మంచి విజయం దక్కాలి' అని కోరుకున్నారు. ఈ చిత్రానికి కంటెంటే హీరో, అన్ని వర్గాలను అలరించే అంశాలతో దర్శకుడు తీర్చిదిద్దాడు అని గౌతమ్‌కృష్ణ తెలిపారు.

ఉత్కంఠ రేకెత్తించేలా..



అభిజ్ఞ వూతలూరు ప్రధాన పాత్రలో నటించిన ఉత్కంఠ భరిత వెబ్ సిరీస్ 'విరాటపాలెం: పీసీ మీనా రిపోర్టింగ్'. పోలూరు కృష్ణ దర్శకత్వం వహించారు. సౌత్ ఇండియన్ స్క్రీన్స్ బేనర్‌పై కేవీ శ్రీరామ్ నిర్మించారు. ఈనెల 27న జీ5లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేకర్స్ ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. విరాటపాలెం గ్రామానికి ఓ శాపం ఉంటుంది. ఆ ఊర్లో ఏ పెళ్లి జరిగినా సరే మరుసటి రోజు పెళ్లి కూతురు చనిపోతుంది. అలా పదేళ్లుగా ఆ ఊరిని శాపం పట్టి పీడిస్తోందని ప్రజలు నమ్ముతుంటారు. అలాంటి ఊరికి లేడీ కానిస్టేబుల్ మీనా వస్తుంది. ఆ తర్వాత ఏం జరిగిందనే దాని చుట్టూ కథ సాగుతుంది. కథ 1980 కాలానికి చెందినదని ట్రైలర్‌ని చూస్తే అర్థమౌతుంది. చరణ్ లక్కరాజు, లావణ్య సాహుకర, రామరాజు, గౌతమ్‌రాజు, సతీశ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ సిరీస్‌కు సంగీతం: రోహిత్ కుమార్, డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీ: మహేశ్ కె.స్వరూప్.

భారీ టెంపుల్ సెట్



విరాట్ కర్ణ, నభా నటేశ్, ఐశ్వర్యా మీనన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'నాగ బంధం'. అభిషేక్ నామా దర్శకత్వంలో కిశోర్ అన్నపురెడ్డి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. చిత్రీకరణ కోసం కేరళలోని అనంత పద్మనాభ స్వామి టెంపుల్ సెట్‌ను వేశారు. ఇందులో ఓ కీలక సన్నివేశాన్ని, పాటను షూట్ చేస్తున్నారు. గణేశ్ ఆచార్య కొరియోగ్రఫీ అందించే ఈ పాట చిత్రీకరణలో విరాట్ కర్ణతో పాటు దాదాపు 500 మంది నృత్యకారులు పాల్గొంటున్నారు. గుప్త నిధుల నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమా విజువల్ వండర్‌లా ఉంటుందని మేకర్స్ తెలిపారు.

ఆకట్టుకునే హాస్యం



సుహాస్, కీర్తి సురేశ్ జంటగా అని ఐ.వి. శశి తెరకెక్కించిన హాస్య భరిత చిత్రం 'ఉప్పు కప్పురంబు'. రాధిక లావు నిర్మించారు. జూలై 4 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవనుంది. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మేకర్స్ ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కీర్తి సురేశ్ మాట్లాడుతూ 'ఈ సినిమా కథలోని హాస్యం నన్ను బాగా ఆకట్టుకుంది. ఇందులో నా పాత్ర పేరు అపూర్వ. 1990 నాటి గ్రామీణ నేపథ్యంలో సినిమా చిత్రీకరణ జరిగింది' అని తెలిపారు. 'ఇది వరకు నేను చేసిన పాత్రలకు పూర్తి భిన్నంగా ఇందులో నా క్యారెక్టర్ ఉంటుంది' అని చిత్ర కథానాయకుడు సుహాస్ చెప్పారు.

థగ్‌లైఫ్‌కు భద్రత కల్పిస్తాం

● సుప్రీం కోర్టులో కర్ణాటక ప్రభుత్వం



కమల్‌హాసన్ నటించిన 'థగ్‌లైఫ్' సినిమాకు భద్రత కల్పిస్తామని కర్ణాటక ప్రభుత్వం సుప్రీం కోర్టుకు తెలిపింది. ఈ మేరకు గురువారం అఫిడవిట్ దాఖలు చేసింది. సినిమా విడుదలపై ఎటువంటి నిర్బంధం విధించలేదని అందులో పేర్కొంది. కర్ణాటక వ్యాప్తంగా సినిమా విడుదల చేయాలని నిర్మాతలు నిర్ణయించారని, అవసరమైతే ప్రేక్షకులకు భద్రత కల్పిస్తామని తెలిపింది. కన్నడ భాషపట్ల వివాదాస్పద వ్యాఖ్యలు చేసినందుకు క్షమాపణ చెప్పాలని కర్ణాటక చలనచిత్ర వాణిజ్య మండలి నటుడు కమల్‌హాసన్‌ను లేఖ రాసిన విషయాన్ని అఫిడవిట్‌లో ప్రస్తావించింది. కాగా, కన్నడ సంఘాల నేతలకు సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. సినిమా విడుదలను అడ్డుకోవద్దని ఆదేశించింది. ఈ విషయమై కర్ణాటక రక్షణ వేదిక అధ్యక్షుడు ప్రవీణ్ శెట్టి మీడియాతో మాట్లాడుతూ. థగ్‌లైఫ్ సినిమా విడుదలకు తమ సంఘం అభ్యంతరం వ్యక్తం చేయలేదని అన్నారు. కానీ తమిళం నుంచి కన్నడ భాష పుట్టిందంటూ కమల్‌హాసన్ చేసిన వ్యాఖ్యలకు అభ్యంతరం తెలిపామని అన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలను కన్నడ సంఘాలతో పాటు అందరూ పాటించాలని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. చట్టాన్ని ఎవరూ ఉల్లంఘించవద్దని, కర్ణాటక శాంతికి కేంద్రమనే విషయాన్ని మరువరాదని ఆయన అన్నారు.

-బెంగళూరు, (ఆంధ్రజ్యోతి)

ఆలీబాబా 40 దొంగల మాదిరిగా జగన్ తీరు

» ఫోన్ ట్యాపింగ్ ద్వారా నాపై నిఘా పెట్టారు షర్మిల



విజయనగరం/శ్రీకాకుళం, జూన్ 19(ఆంధ్రజ్యోతి), జూన్ 19: మాజీ సీఎం జగన్ తీరు ఆలీబాబా 40 దొంగల మాదిరిగా ఉందని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆరోపించారు. దొంగ ఎక్కడైనా దొంగతనం చేసింది తానేనని ఒప్పుకుంటాడా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా చేపట్టిన జిల్లాల వారీ పర్యటనలో భాగంగా గురువారం ఆమె విజయనగరంలో పర్యటించారు. సాయంత్రం శ్రీకాకుళంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో సమావేశం అనంతరం షర్మిల విలేకరులతో మాట్లాడారు. 'ఫోన్ ట్యాపింగ్ ద్వారా నాపై నిఘా పెట్టారు. నేను ఎవరెవరిని కలుస్తున్నానో ముందే తెలుసుకున్నారు. నాకు మద్దతు ఇవ్వకుండా పెద్ద నాయకులను ఆపేశారు. ఇదంతా ట్యాపింగ్ ద్వారా చేసిన కుట్రే. ఫోన్ ట్యాపింగ్ చేయడం నా వ్యక్తిగత స్వేచ్ఛను ఉల్లంఘించడమే' అంటూ జగన్‌పై షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. 'వైవీ సుబ్బారెడ్డి గతంలో మా ఇంటికి వచ్చారు. ఫోన్ ట్యాప్ చేసిన ఆడియో ఒకటి వినిపించారు. ఇదే రుజువు.. ఇదే నిదర్శనం. మా ఇంట్లో కూర్చుని నాకే వినిపించారు కాబట్టే చెబుతున్నా.. నేనే నా చెవులారా విన్నా.. బైబిల్ పైన, నా బిడ్డల మీద ప్రమాణం చేసి చెబుతున్నా. నా ఫోన్ ట్యాపింగ్ వాయిస్ నేను విన్నా.. ఇదే నిజం. ట్యాపింగ్ చేయాల్సిన అవసరం మాకేంటని ఇప్పుడు పచ్చి అబద్ధాలు చెబుతున్నారు. సుబ్బారెడ్డి చేతిలో ఆ ఆడియో ఎందుకు ఉంది..? ఆయనే సమాధానం చెప్పాలి. ఆనాడు ఆయనతో నాకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. తర్వాత ఆస్తుల విషయంలో కుట్రలు పన్ని ఆయనతో జగన్ అబద్ధాలు చెప్పించారు. అప్పటినుంచి నాకూ, సుబ్బారెడ్డికి మాటలు లేవు. అప్పట్లో కేసీఆర్, జగన్ చేసినవి నీచ రాజకీయాలు. అందుకే నా ఫోన్ ట్యాప్ చేశారు. తండ్రి లాంటి సుబ్బారెడ్డే.. నాకు స్వయంగా వినిపిస్తే నేనెంత బాధపడి ఉంటాను. రెండు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మారిపోయాకే ఈ విషయం వెలుగులోకి వచ్చింది. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో వచ్చింది కాబట్టి ఇప్పుడు విచారణ జరుగుతోంది. ఒకవేళ అక్కడ కేసీఆర్, ఇక్కడ జగన్ వచ్చి ఉంటే ఇదంతా వెలుగులోకి వచ్చేదే కాదు. సీఎం చంద్రబాబుకి అనుకూలంగా మాట్లాడాల్సిన అవసరం, ఆయన స్క్రిప్ట్ చదవాల్సిన అవసరం నాకు లేదు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై విచారణ జరగాలి. ఆ ఆడియో ఎలా వచ్చిందనే దానిపై సుబ్బారెడ్డిని కూడా విచారణకు పిలవాలి. నా ఫోన్ మాత్రమే అనుకున్నా.. ఇప్పుడు తెలుస్తోంది వందలాది మంది ఫోన్‌లు ట్యాప్ అయ్యాయని. వాళ్లందరికీ న్యాయం జరగాలి' అని షర్మిల పేర్కొన్నారు.

కాంగ్రెస్ నేతలకేనా ఆంక్షలు?

'ప్రజా సమస్యలపై పోరాటం చేసే కాంగ్రెస్ పార్టీపై ప్రభుత్వం ఆంక్షలు విధిస్తోంది. ప్రధాని మోదీకి జగన్ దత్తత పుత్రుడు. అందుకే ఆయన రాష్ట్రంలో యథేచ్ఛగా బలప్రదర్శన చేసి ఆంక్షలు ఉల్లంఘిస్తున్నా పట్టించుకోవడం లేదు' అని షర్మిల ఆరోపించారు. తాము రాజధాని మీద పోరాటం చేస్తే గృహనిర్బంధం చేశారని, స్టీల్ ప్లాంటు కోసం దీక్షలు చేస్తే భగ్నం చేశారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఏ పార్టీకి లేని ఆంక్షలు తమకెందుకని ప్రశ్నించారు. ప్రతిపక్ష హోదా కూడా దక్కని వైసీపీ పరామర్శల పేరిట యాత్రలు చేస్తున్నా వారికి ఆంక్షలు వర్తించవా అని ప్రశ్నించారు. జగన్ బలప్రదర్శనలో ఇద్దరు కార్యకర్తలు మరణించారని, దీనికి బాధ్యులెవరని నిలదీశారు. 'సత్తెనపల్లి నియోజకవర్గంలో జగన్ పర్యటనకు వంద మందికి అనుమతి ఇచ్చినా, వేల మంది ఎలా వచ్చారు? జగన్ వద్ద బాగా డబ్బులున్నాయనా? పోలీసులను సైతం కొనుక్కోగలడానా? పోలీసు శాఖ, ఇంటెలిజెన్స్ ఎందుకు చూస్తూ ఉండిపోయాయి. బీజేపీతో వైసీపీకి అక్రమ పొత్తు ఉంది. అందుకే పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారు' అని షర్మిల ధ్వజమెత్తారు. సూపర్ సిక్స్ గురించి.. ప్రత్యేక హోదా గురించి.. రాజధాని, పోలవరం పనుల గురించి ప్రభుత్వాన్ని నిలాదీయాల్సింది పోయి.. బెట్టింగులు వేసి చనిపోయిన వారి విగ్రహాలు కట్టడం, అవిష్కరించడం వంటి కార్యక్రమాల్లో పాల్గొనడం జగన్ నైజానికి నిదర్శనమన్నారు.

షర్మిల ఫోన్ ట్యాప్ చేశారేమో!

» అయినా పొరుగు రాష్ట్రం సంగతి నాకెలా తెలుస్తుంది: జగన్

అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కేసీఆర్ హయాంలో తన చెల్లెలు, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఫోన్ ట్యాప్ చేశారన్న వార్తలపై మాజీ సీఎం వైఎస్ జగన్ స్పందించారు. గురువారం మీడియా ప్రతినిధులు ఈ అంశాన్ని ప్రస్తావించగా.. 'ఫోన్ ట్యాపింగ్ నేను చేశానా? నా ప్రభుత్వ హయాంలో జరిగిందా? ఎవరు చేశారో చెప్పు స్వామీ.. నాకు అర్థం కాలేదు' అని జగన్ ప్రశ్నించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఫోన్ ట్యాపింగ్ జరిగిందంటున్నారని వారు చెప్పగా.. 'తెలంగాణలో అప్పుడు షర్మిల రాజకీయంగా క్రియాశీలంగా ఉన్నందున ట్యాపింగ్ చేశారేమో' అని బదులిచ్చారు. అంతలోనే పొరుగు రాష్ట్రం సంగతి తనకెలా తెలుస్తుందని వ్యాఖ్యానించారు.

బనకచర్లపైనా స్పష్టత లేదు..

పోలవరం-బనకచర్ల పథకంపై తెలంగాణ నేతలు చేస్తున్న విమర్శలను విలేకరులు ప్రస్తావించినప్పుడు జగన్ తన అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించలేదు. వారి వాదనను ఖండించలేదు. గతంలో కేసీఆర్ తెలంగాణ భూభాగం నుంచే గోదావరి జలాలను నాగార్జున సాగర్, శ్రీశైలం జలాశయానికి.. తర్వాత రాయలసీమకు తరలించాలని చేసిన ప్రతిపాదనలను కూడా జగన్ ప్రస్తావించలేదు. ఏకంగా 400 టీఎంసీల గోదావరి జలాలను తరలించాలని నాడు కేసీఆర్ ప్రతిపాదించారు. దీనిపైనా జగన్ దాటేశారు. నాలుగు నెలల పాటు గోదావరి వరద ఉంటుందని.. 3,000 టీఎంసీలు సముద్రంలో కలుస్తుందని.. ఈ వరద జలాలను సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా పోలవరం కుడికాలువను అభివృద్ధి చేయడం.. విస్తరించడం.. బనకచర్లకు ఎత్తిపోయడానికి సమగ్రంగా పనులు చేపట్టాలని చెప్పారు. ఒకేసారి పనులన్నీ చేపట్టకుండా.. ఒకదాని తర్వాత ఒకటిగా చేసుకుంటూ పోవాలన్నారు. అంతలోనే.. అసలు బనకచర్ల పనులు ఎప్పుడు చేస్తారు.. ఎలా చేస్తారని ప్రశ్నించారు.

జగన్ చేతికి స్మార్ట్ హెల్త్ రింగ్: ముఖ్యమంత్రి చంద్రబాబు 76 ఏళ్ల ముసలోడంటూ పదే పదే ఆయన వయసు గురించి మాట్లాడుతున్న జగన్‌కు ఆరోగ్యసమస్యల భయం పట్టుకుందని రాజకీయ వర్గాలు అంటున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి పాలయ్యాక ఆయన జనం మధ్యకు రావడం పూర్తిగా తగ్గించేశారు. ఇటీవల కొన్ని పరామర్శలకు వెళ్లారు. ఆ సమయంలో చేతి వేలికి 'స్మార్ట్ హెల్త్ ఉంగరం' కనిపిస్తోంది. చంద్రబాబు చేతికి కూడా ఈ ఉంగరం ఉంటుంది. దాని విశిష్టత, పనితీరు గురించి ఒకట్రెండు సార్లు ఆయన చెప్పారు కూడా. ఇప్పుడు జగన్ చేతికీ ఈ రింగ్ కనిపిస్తోంది. ఇది ఫోన్ యాప్ ద్వారా పనిచేస్తుంది. ఈ రింగ్ పెట్టుకున్న వారి వద్ద కచ్చితంగా.. యాపిల్ ఐ ఫోన్ లేదా ఆండ్రాయిడ్ ఫోన్ ఉండాలి. అంటే జగన్ వద్ద వీటిలో ఒక ఫోన్ ఉందని స్పష్టమవుతోంది.



కక్ష లేదు.. శిక్ష తప్పదు!

జగన్‌ను జైలుకు పంపాలనుకుంటే చంద్రబాబుకు 2 నిమిషాల పని: లోకేశ్



జగన్ చంద్రబాబును జైలుకు పంపారని.. చంద్రబాబు ఆయన్ను జైలుకు పంపాలని ఎక్కడైనా ఉందా? చంద్రబాబును జైలుకు పంపి, మా కార్యకర్తలను వేధించి ఏం చేయగలిగాడు? మద్యం కేసులో తాను రూపాయి కూడా అక్రమంగా ఆర్జించలేదని జగన్ దేవుడి ముందు ప్రమాణం చేస్తారా..? చిన్నాన్న వివేకా హత్య కేసులో తమ కుటుంబ సభ్యులకు పాత్ర లేదని ప్రమాణం చేస్తారా? డబ్బులిచ్చాం కనుక ఓట్లు తప్పక పడతాయన్న భ్రమలు మాకు లేవు. ప్రజలతో భావోద్వేగ సంబంధాలు ఉన్నప్పుడే వారు మాతో ఉంటారు.
- మంత్రి లోకేశ్

» ప్రజలు మమ్మల్ని ఎన్నుకుంది ఎవరినో బొక్కలో వేసేందుకు కాదు

» కానీ చట్టాన్ని ఉల్లంఘిస్తే వదిలిపెట్టం:లోకేశ్

న్యూఢిల్లీ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వానికి ఎవరిపైనా కక్ష సాధించాలనే ఉద్దేశం లేదని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యా శాఖల మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. సాక్ష్యాధారాలు లభిస్తే ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదని.. తప్పు చేసి ఉంటే జగన్ అయినా.. ఎవరైనా జైలుకు వెళ్తారని తేల్చిచెప్పారు. తమకు హైకమాండ్ లేదని.. తమ ప్రభుత్వంలో అంతిమ నిర్ణయం తమ బాస్ చంద్రబాబుదేనని స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. 'కక్ష సాధించాలంటే జగన్‌ను జైలుకు పంపడం చంద్రబాబుకు రెండు నిమిషాల పని. ఎవరిపైనా కక్ష సాధించే ఉద్దేశం తనకు లేదని ఆయనే చెప్పారు' అని గుర్తు చేశారు. తాము చట్టపరమైన ప్రక్రియనే అనుసరిస్తామని చెప్పారు. జగన్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవడానికి తమకు ఎవరి అనుమతీ అవసరం లేదన్నారు. చట్టాన్ని అమలు చేసేందుకు అనుమతులు అవసరమా అని ప్రశ్నించారు. మద్యం కేసును ప్రారంభించినప్పుడు కూడా రకరకాల ఆరోపణలు వచ్చాయని, డబ్బులు తీసుకున్నామని అన్నారని.. వంశీపై చర్యలు తీసుకోలేదని కూడా అన్నారని, కానీ చట్ట ప్రక్రియలు ఎక్కడా ఆగలేదని తెలిపారు. తమ లీగల్ టీమ్ బలంగా ఉన్నదని, ఒకట్రెండు సందర్భాల్లో తప్ప నేరం చేసినవారెవరూ బెయిల్ మీద బయటకు రావడం లేదని గుర్తు చేశారు. అందరినీ అరెస్టు చేయాలనే అతి అంచనాలు సరికాదన్నారు. ప్రజలు తమను ఎన్నుకుంది ఎవరో ఒకరిని బొక్కలో వేయడానికి కాదని.. పరిపాలించడానికి, సంక్షేమం, అభివృద్ధి చేయడానికే ఎన్నుకున్నారని చెప్పారు. అదే సమయంలో చట్టాన్ని ఎవరు ఉల్లంఘించినా వదిలిపెట్టే ప్రసక్తి లేదన్నారు. రెచ్చగొట్టే విధంగా కొంతమంది ప్రవర్తించారని, శాంతి భద్రతలను చేతుల్లోకి తీసుకున్నారని, వారిని వదిలిపెట్టబోమన్నది తన ఎన్నికల వాగ్దానమని చెప్పారు. 'జగన్మోహన్‌రెడ్డిని జైల్లో పెడతామని మేమేమైనా వాగ్దానం చేశామా? మేనిఫెస్టోలో పెట్టామా.. సూపర్ సిక్స్ వాగ్దానాల్లో చెప్పామా? మమ్మల్ని రప్పా రప్పా నరుకుతామన్న ప్రగల్భాలకు విలువ లేదు. జగన్ చేసిన నేరాలను మేం విస్మరించలేదు. అంత మాత్రాన ఆయన చుట్టూ తిరగాల్సిన పని లేదు. ప్రభుత్వానికి వేరే ప్రాధాన్యాలు లేవా' అని ప్రశ్నించారు. కేసీఆర్ తమ ఫోన్లు ట్యాప్ చేయించారన్న వార్తలపై స్పందిస్తూ.. దానిపై అధ్యయనం చేయాల్సి ఉందన్నారు. "మద్యం కేసుతో పాటు మరిన్ని అక్రమాలపై కేసులు ఉంటాయి. లిక్కర్ కేసులో త్వరలో చార్జిషీటు వేస్తారు. జనం మరణించారన్నది ప్రధాన ఆరోపణ. మనీలాండరింగ్ నేరాలు కూడా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వంపై మేం ఒత్తిడి చేయాల్సిన అవసరం లేదు." అని తెలిపారు. కేవలం ఏడాది పాలనలోనే ఎన్నో సాధించామని, పెట్టుబడులు పెంచడం ద్వారా సంపదను సృష్టించే పథంలో ప్రవేశించామన్నారు. పాఠశాలల్లో ఏపీ సాధించిన విజయంపై తనతో రెండ్రోజులు చర్చిస్తానని కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెప్పారని తెలిపారు. బటన్ నొక్కకుండానే రూ.వేల కోట్ల సొమ్ము ప్రజలకు విడుదల చేశామని, అయినా తమకు పాలాభిషేకాలు అవసరం లేదన్నారు. కార్యకర్తలు పార్టీ నాయకత్వంపై నిరుత్సాహంతో ఉన్నారన్నది సరికాదని చెప్పారు. మొదటి నుంచీ కార్యకర్తలకు, ఉద్యోగుల బదిలీలకు సంబంధం లేదని, టీచర్ల బదిలీల్లో కూడా రాజకీయ ప్రమేయం ఉండదని లోకేశ్ తెలిపారు.

ప్రధానితో గడిపిన సమయం మరువలేను

» 2 గంటలు మాట్లాడుకున్నాం

» 3 కీలకమైన సలహాలిచ్చారు

» నిజాయితీగా పనిచేస్తే ప్రజలు అర్థం చేసుకుంటారని చెప్పారు

» నాన్న ఇచ్చిన అవకాశాలతో స్వతంత్రంగా ఎదగాలన్నారు

» ప్రజా ప్రయోజనాల కోసం నిరంతరం కష్టపడాలన్నారు: లోకేశ్

ఇటీవల ఢిల్లీ వచ్చి ప్రధాని మోదీతో రెండు గంటలు సమావేశం కావడం మరపురానిదని లోకేశ్ అన్నారు. బీజేపీతో ఎన్నికల అవగాహన కుదిరిన తర్వాత ఆయనతో కలిసి రెండు మూడు సభల్లో పాల్గొన్నానని చెప్పారు. 'తొలుత రాజమండ్రి సభలో మోదీ నన్ను కూటమి ఎన్ని ఎంపీ సీట్లు గెలుస్తుందని అడిగారు. మూడు పార్టీలూ కలిసి పనిచేస్తే 22 సీట్లు గెలుస్తామని చెప్పాను. అన్ని వస్తాయా అని ఆయన ఆశ్చర్యపోయారు. ప్రమాణ స్వీకార సభలో కూటమికి 21 ఎంపీ సీట్లు వచ్చాయని గుర్తుచేసినప్పుడు బాగా చేశారని అభినందించారు. ఢిల్లీ వచ్చి తనను కలవాలన్నారు. ఆయనకు నన్ను కలిసేంత సమయం ఉండదని భావించి ఢిల్లీకి వెళ్లలేదు. కానీ విశాఖ సభలో ఆయన మళ్లీ గుర్తు చేయడమే గాక.. మీ అబ్బాయి ఢిల్లీ రమ్మంటే రావడం లేదని చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. మళ్లీ అమరావతిలో రాజధాని పనుల పునఃప్రారంభోత్సవ సభలో.. నువ్వు ఢిల్లీ రానందుకు శిక్షిస్తానని వీపుపై రెండు దెబ్బలు వేశారు. దీంతో ఆయన అపాయింట్‌మెంట్ అడిగి ఢిల్లీ వచ్చాను. గత పాతికేళ్లుగా గుజరాత్‌లోనూ, ఢిల్లీలోనూ అధికారంలో ఉన్న మోదీ వెనుక ఉన్న శక్తి ఏమిటి, ఆయనకంత ఉత్సాహం ఎలా వచ్చిందన్న ఆసక్తితోనే ఆయన్ను కలిశాను. 2 గంటల్లో మొదటి గంటంతా రాష్ట్రంలో ఏం జరుగుతోందో ఆయన వివరంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాకు మూడు కీలక విషయాలు చెప్పారు. నా ఆలోచనలు స్పీడ్‌గా ఉంటాయని అదే సమయంలో తప్పులు కూడా జరుగుతాయని, అందువల్ల నన్ను గైడ్ చేయాలని నేను కోరగా.. పని చేసేవారే తప్పులు చేస్తారు. ఇంట్లో పడుకుంటే చేయం కదా.. మనం నిజాయితీగా, సరిగా పనిచేస్తే ప్రజలు కూడా అర్థం చేసుకుంటారని మోదీ మొదటి సలహాగా చెప్పారు. నువ్వు ఎదిగేందుకు మీ నాన్న ఎన్నో అవకాశాలు కల్పిస్తున్నారు. వాటిని ఉపయోగించుకుని స్వతంత్రంగా నాయకుడిగా ఎదగాలని రెండో సలహా ఇచ్చారు. ఇక దేశ శ్రేయస్సు కోసం ప్రజా ప్రయోజనాలపై దృష్టి సారించి నిరంతరం కష్టపడాలని చివరిగా సూచించారు. ఆయనతో సమావేశం ఇలా జరగడం ఇప్పటికీ నమ్మలేకపోతున్నాను. సమావేశం నుంచి వచ్చాక తెల్లవారుజామున నాలుగింటి వరకూ నిద్రపట్టలేదు' అని లోకేశ్ తెలిపారు. ప్రధాని అంత సమయం ఇచ్చి చెప్పిన విషయాలను సీరియస్‌గా తీసుకోవాలనుకున్నానని చెప్పారు. పహల్గాం ఉగ్రదాడిపై ప్రధాని స్పందించిన తీరు అభినందనీయమన్నారు.

అభివృద్ధి వికేంద్రీకరణే లక్ష్యం

» వెనుకబడ్డ ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే అదనపు ప్రోత్సాహకాలు

» ఎస్ఐపీబీ సమావేశంలో చంద్రబాబు



ఎస్ఐపీబీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు పయ్యావుల కేశవ్, టీజీ భరత్, సుభాష్

అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంతా సమానంగా అభివృద్ధి వికేంద్రీకరణే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. ఆ దిశగా పారిశ్రామికాభివృద్ధిని సాధించేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. వెలగపూడి సచివాలయంలో గురువారం ఆయన అధ్యక్షతన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశం జరిగింది. రూ. 28,546 కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. వీటితో 30,270 మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. వెనుకబడ్డ ప్రాంతాల్లో పరిశ్రమలు పెడితే అదనపు ప్రోత్సాహకాలు ఇవ్వాలని ఆదేశించారు. యువత నైపుణ్యాభివృద్ధే ప్రధానాంశంగా కార్యాచరణను సిద్ధం చేయాలన్నారు. అభివృద్ధికి చోదకాలుగా పర్యాటకం, ఐటీ, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మారతాయని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో స్థాపించబోయే, స్థాపించిన పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి, ఉద్యోగావకాశాల వివరాలతో కూడిన ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రజలతో పాటు ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. 'రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులు అన్ని ప్రాంతాల్లోనూ సమానంగా విస్తరించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. భూములు తీసుకున్న సంస్థలు గడువులోపే కార్యకలాపాలు చేపట్టేలా పర్యవేక్షణ జరగాలి. పర్యాటకం, ఐటీ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయి. తీరప్రాంతాల్లో లగ్జరీ బోట్ క్రూయిజ్ షిప్‌లను ఆపరేట్ చేసేలా సంబంధిత సంస్థలతో టూరిజం శాఖ సంప్రదింపులు జరపాలి. ఆతిథ్యరంగంలో ఒప్పందం చేసుకున్న సంస్థలు త్వరగా నిర్మాణాలు పూర్తిచేసేలా చూడాలి. పారిశ్రామిక పార్కులకు మౌలిక వసతులు కల్పించేలా చర్యలు చేపట్టాలి. ఇకపై ప్రతినెలా రెండు ఎస్ఐపీబీ సమావేశాలు జరగాలి. ఏడాదికి 25 సమావేశాలు జరిగేలా ప్రణాళిక సిద్ధం చేయాలి" అని అధికారులకు స్పష్టం చేశారు. కాగా, ఇప్పటి వరకూ జరిగిన ఏడు ఎస్ఐపీబీ సమావేశాల్లో రూ. 5,34,684 కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించింది. దీని వల్ల 4,73,969 మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి.

ఎస్ఐపీబీ ఆమోదించిన ప్రాజెక్టులు

- రేమండ్ రూ.1201 కోట్ల పెట్టుబడి. 6,571 మందికి ఉద్యోగాలు.
- అనంతపురంలో జి.ఇన్నా రూ.1,150 కోట్లు.. 229 మందికి ఉద్యోగాలు.
- తిరుపతిలో సంగం డెయిరీ ప్రైవేట్ లిమిటెడ్ రూ. 130 కోట్ల పెట్టుబడి. 400 మందికి ఉద్యోగాలు.
- కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ విశాఖపట్నంలో రూ. 1,583 కోట్ల పెట్టుబడితో 8,000 మందికి ఉద్యోగాలు.
- తూర్పుగోదావరిలో 3ఎఫ్ ఆయిల్‌పామ్ ప్రైవేటు లిమిటెడ్ రూ. 224 కోట్లు పెట్టుబడి. 750 మందికి ఉద్యోగాలు.
- చిత్తూరులో ఏబీఐఎస్ ప్రొటీన్స్ 350 కోట్ల పెట్టుబడి. 790మందికి ఉద్యోగాలు.
- రిలయన్స్ కన్స్యూమర్స్ ప్రొడక్ట్స్ ఓర్వకల్లులో రూ.1,622 కోట్ల పెట్టుబడి. 1,200 మందికి ఉద్యోగాలు.
- ఏలూరులో మెల్గాన్ లైజర్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్ఎల్పీ రూ. 225 కోట్లు పెట్టుబడి. 350 మందికి ఉద్యోగాలు.
- తిరుపతిలో పావని హోటల్స్ లెమన్ ట్రీ ప్రీమియర్ రూ. 80 కోట్లు పెట్టుబడి. 300 మందికి ఉద్యోగాలు.
- సత్యసాయి జిల్లా టెర్రీ ఆల్లోస్.. 573 కోట్లు పెట్టుబడి. 120 మందికి ఉపాధి.
- కడపలో చింతా గ్రీన్ ఎనర్జీ రూ. 2,323 కోట్ల పెట్టుబడితో 540 మందికి ఉపాధి.
- కడపలో అదానీ రెన్యువబుల్స్ ఎనర్జీ 8,010 కోట్లు.. 3,500 మందికి ఉపాధి.
- కొప్పర్తిలో ఛానల్ ప్రీ రూ. 80 కోట్లు పెట్టుబడితో 1,100 మందికి ఉపాధి.
- అదానీ హైడ్రో ఎనర్జీ వివిధ జిల్లాల్లో రూ. 10,900 కోట్ల పెట్టుబడితో విద్యుత్తు సంస్థల్లో 7,000 మందికి ఉపాధి.
- బీపీసీఎల్ అండ్ కేఎస్ఎస్ఎల్, ఎల్జీ ఎలక్ట్రానిక్స్ కృష్ణపట్నం పవర్ కార్పొరేషన్‌లో అదనపు పెట్టుబడుల మార్పుల ప్రతిపాదనలకు ఆమోదం.

ఇంటెల్‌లో 10వేల మంది ఉద్యోగుల తొలగింపు

న్యూఢిల్లీ, జూన్ 19: సెమీకండక్టర్ తయారీ దిగ్గజం ఇంటెల్ భారీగా ఉద్యోగులను తొలగించడానికి రంగం సిద్ధం చేస్తోంది. వచ్చే నెలలో ఇంటెల్ ఫౌండ్రీ విభాగంలో 15-20శాతం మంది ఉద్యోగులకు లేఆఫ్ ప్రకటించనుంది. అంటే ప్రపంచవ్యాప్తంగా 10,000 మంది ఉద్యోగులను ఇళ్లకు పంపనుంది. ఎలాంటి పరిహారం, ప్రయోజనాలను ఇవ్వకుండానే ఉద్యోగులను తొలగించనుంది. బాధాకరమే అయినప్పటికీ సంస్థ ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ఇంటెల్ మాన్యుఫ్యాక్చరింగ్ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ నాగ చంద్రశేఖరన్ ఉద్యోగులకు పంపిన ఇంటర్నల్ మెమోలో పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా పదిచోట్ల ఉన్న 15 వేఫర్ ఫ్యాబ్రికేషన్ ప్లాంట్లపై ఈ ప్రభావం ఉంటుంది.

ఎయిరిండియా విమానం బ్లాక్‌బాక్స్ అమెరికాకు!

న్యూఢిల్లీ, జూన్ 19: అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. ఈ విమాన బ్లాక్‌బాక్స్‌లోని డేటా విశ్లేషణకు కేంద్రం దానిని అమెరికాకు పంపనుంది. ప్రమాద సమయంలో రికార్డర్ బయటి భాగం తీవ్రంగా దెబ్బతినడంతో అందులోని సమాచారాన్ని సేకరణ దర్యాప్తు బృందాలకు కష్టంగా మారింది. దీంతో దాన్ని వాషింగ్టన్‌లోని నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్ (ఎన్‌టీఎస్‌బీ)కు చెందిన ప్రయోగశాలకు పంపనున్నారు.

ఎయిరిండియా అంతర్జాతీయ సర్వీసులు తాత్కాలిక తగ్గింపు

అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదంతో తీవ్ర ఒత్తిడిలో ఉన్న ఎయిరిండియా సంస్థ.. తాను నడిపే పలు అంతర్జాతీయ సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేసింది. అలాగే 16 అంతర్జాతీయ మార్గాల్లో సర్వీసులను తగ్గించింది. సుదూర ప్రాంతాలకు వెళ్లే బోయింగ్ 747వంటి భారీ విమానాల వాడకాన్ని జూలై 21దాకా 15శాతం తగ్గిస్తున్నట్టు గురువారం ప్రకటించింది. కాగా 130 మంది ప్రయాణికులతో గురువారం ఢిల్లీ నుంచి వియత్నాం బయలుదేరిన ఎయిరిండియా ఎయిర్‌బస్ ఏ320 నియో విమానం టేకాఫ్ అయిన కాసేపటికే సాంకేతిక సమస్యలతో తిరిగి ఢిల్లీలో ల్యాండయ్యింది. ఢిల్లీ నుంచి లేహ్‌కు బయలుదేరిన ఇండిగో విమానం సాంకేతిక సమస్యలతో ఢిల్లీకి తిరిగివచ్చింది.

ఖలిస్థానీలు తీవ్రవాదులే: కెనడా

ఒట్టావా, జూన్ 19: తమ భూభాగం నుంచి ఖలిస్థానీ తీవ్రవాదులు కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని కెనడాలోని అత్యున్నతస్థాయి నిఘా సంస్థ తొలిసారి అంగీకరించింది. భారత్‌లో వేర్పాటువాదాన్ని ప్రోత్సహించేందుకు, హింసాత్మక కార్యకలాపాలకు కుట్ర పన్నేందుకు, నిధులు సమీకరించేందుకు ఖలిస్థానీలు కెనడా భూభాగాన్ని వాడుకుంటున్నారని భారతదేశం ఎప్పటి నుంచో చెబుతోంది. ఇదే విషయాన్ని తాజాగా కెనడా పార్లమెంటుకు సమర్పించిన వార్షిక నివేదికలో సీఎస్ఐఎస్(కెనడియన్ సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీస్) నిర్ధారించింది. 'భారత్‌లో హింసాత్మక చర్యలకు కుట్రలు పన్నేందుకు, నిధులు సమీకరించేందుకు, వేర్పాటువాదాన్ని ప్రోత్సహించేందుకు ఖలిస్థానీ తీవ్రవాదులు కెనడా భూభాగాన్ని వాడుకుంటూనే ఉన్నారు' అని సీఎస్ఐఎస్ స్పష్టం చేసింది.

పుట్టిన రోజున మారిన రాహుల్ చిరునామా

న్యూఢిల్లీ, జూన్ 19: లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ తన 55వ పుట్టిన రోజున చిరునామా మార్చారు. న్యూఢిల్లీ సునెహ్రీ బాగ్ రోడ్‌లో ప్రభుత్వం ఆయనకు కేటాయించిన బంగ్లా నంబర్5లోకి సామాన్ల తరలింపు ప్రారంభమైంది. ఎంపీగా ఎన్నికైనప్పటినుంచి రాహుల్ 12 తుగ్లక్ లేన్‌లో ఉండేవారు. ఇంతకాలం ఆయన తన తల్లి సోనియాకు చెందిన 10 జన్‌పథ్ నివాసంలో ఉన్నా రు. కొంతకాలం క్రితమే సునెహ్రీ బాగ్ రోడ్‌లోని బంగ్లా నంబర్ 5ను కేటాయించారు. కాగా, పుట్టినరోజు సందర్భంగా రాహుల్‌కు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు.

ఆస్పత్రి నుంచి సోనియా గాంధీ డిశ్చార్జ్

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఆమె ఉదర సంబంధిత సమస్యతో బాధపడుతూ 4 రోజులుగా ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు.

'ఆర్టీఈ' రెండో విడత లాటరీ నేడు

అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం (ఆర్టీఈ) అడ్మిషన్లకు శుక్రవారం రెండో విడత లాటరీ నిర్వహించనున్నట్లు సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్టీఈ కింద ఒకటో తరగతి అడ్మిషన్లకు 37,427 మంది దరఖాస్తు చేసుకుంటే, 28,561 మంది అర్హత సాధించారని పేర్కొన్నారు. తొలి విడత లాటరీలో 23,118 మందికి సీట్లు కేటాయించగా, 15,541 మంది పాఠశాలల్లో చేరారన్నారు. మిగిలిన విద్యార్థులకు రెండో విడత లాటరీ నిర్వహించి సీట్లు కేటాయిస్తామన్నారు. అడ్మిషన్ లభించిన విద్యార్థుల తల్లిదండ్రులకు ఎస్ఎంఎస్ సమాచారం అందుతుందన్నారు. ఈనెల 30లోగా పాఠశాలల్లో అడ్మిషన్లు నిర్ధారించుకోవాలన్నారు.

వెల్డర్లకు ఖతార్‌లో ఉద్యోగావకాశాలు

అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మ్యాట్రిక్స్ ఓవర్సీస్ సంస్థతో కలిసి రాష్ట్రంలోని వెల్డర్లకు ఖతార్‌లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈడీ మనోహర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 24 నుంచి 45 ఏళ్ల వరకు వయస్సు గల ఐటీఐ లేదా ఐటీసీ చేసిన పురుషులు ఈ ఉద్యోగాలకు అర్హులని తెలిపారు. వెల్డింగ్ సర్టిఫికెట్‌తో పాటు కనీసం నాలుగేళ్ల అనుభవం ఉండాలని, నెలకు రూ.51,939 నుంచి రూ.61,365 వరకు జీతం ఉంటుందని పేర్కొన్నారు. వీసా, విమాన టిక్కెట్లు, వైద్య సౌకర్యాలను ఉద్యోగ సంస్థ భరిస్తుందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 29 వరకు ఏపీనైపుణ్యం, స్కిల్‌నేషనల్ వెబ్‌సైట్లలో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

23న ట్రిపుల్‌ఐటీ అడ్మిషన్ల ఫలితాలు

అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నాలుగు ఆర్జీయూకేటీ క్యాంపస్‌లలో అడ్మిషన్ సాధించిన విద్యార్థుల వివరాలను ప్రభుత్వం ఈనెల 23న ప్రకటించనుంది. 50,500 మంది అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ సంవత్సరం పదో తరగతి మూల్యాంకనంలో కొన్ని పొరపాట్లు రావడంతో ఈ నెల 2 నుంచి 10 వరకు దరఖాస్తులకు రెండోసారి అవకాశం కల్పించారు. ఆ సమయంలో 1,021 మంది దరఖాస్తు చేసుకున్నారు. కాగా, ఆర్జీయూకేటీల్లో 4,400 సీట్లు అందుబాటులో ఉన్నాయి. రెండేళ్ల ఇంటర్మీడియట్‌తో కలిపి ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ కోర్సులు ఇక్కడ ఉంటాయి.

పాఠశాలల్లో యోగా దినోత్సవం

అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అన్ని మేనేజ్‌మెంట్ల పాఠశాలల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు ఉత్తర్వులు జారీచేశారు. యోగా నిర్వహణ వివరాలు, ఫొటోలను లీప్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులందరినీ యాప్‌లో నమోదుచేయాలన్నారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ఆర్జేడీలు, డీఈవోలు, ఏపీసీలను ఆదేశించారు.

34 వేల మంది ఎస్జీటీలకు శిక్షణ

అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ టీచర్లకు 60 రోజుల సర్టిఫికెట్ కోర్సులో భాగంగా ఈనెల 23 నుంచి 28 వరకు శిక్షణ ఇచ్చేందుకు సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీచేశారు. 131 కేంద్రాల్లో 34 వేల మంది ఎస్జీటీలకు నాన్-రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు స్పష్టం చేశారు. కాగా, శిక్షణలో పాల్గొనే టీచర్లకు శిక్షణ అలవెన్స్ ఇవ్వాలని ఏపీటీఎఫ్-అమరావతి అధ్యక్షుడు సీవీ ప్రసాద్ కోరారు. సౌకర్యాల లోటు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

బదిలీ టీచర్లకు సకాలంలో జీతాలు ఇవ్వాలి

ఇటీవల బదిలీ అయిన టీచర్లకు సకాలంలో జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం(ఆప్టా) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏజీఎస్ గణపతిరావు, కె.ప్రకాశ్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. గతంలో 117 జీవో వల్ల ఏర్పడిన పోస్టుల్లోకి వెళ్లిన టీచర్లకు కొన్ని నెలలు జీతాలు రాలేదని, ఇప్పుడు సమస్య తలెత్తకుండా చూడాలని కోరారు.

ఎంటీఎస్ టీచర్లను సొంత మండలాల్లో సర్దుబాటు చేయాలి

మరోవైపు మినిమం టైమ్ స్కేలు ప్రాతిపదికగా పనిచేస్తున్న 1998, 2008 డీఎస్సీ టీచర్లను సొంత మండలాల్లో లేదా సమీప మండలాల్లో సర్దుబాటు చేయాలని ఏపీటీఎఫ్-1938 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి కోరారు. వారిని సొంత లేదా సమీప మండలాల్లోనే నియమిస్తామని గతంలో హామీ ఇచ్చారని గుర్తుచేశారు.

స్పేస్ ఎక్స్ స్టార్‌షిప్‌లో పేలుడు

టెక్సాస్, జూన్ 19: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. టెక్సాస్‌లో నిలిపి ఉన్న స్టార్‌షిప్ వాహనం ఇంజన్‌కు బుధవారం రొటీన్‌గా తనిఖీలు చేస్తుండగా అది పేలింది. తనిఖీల్లో భాగంగా ఎప్పుడూ జరిపే ఫైర్ టెస్ట్‌ను నిర్వహించగా అనూహ్యంగా ఇంజన్ పేలింది. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఇందుకుగల కారణాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

ఓఎంసీ కేసులో శ్రీలక్ష్మి పిటిషన్ కొట్టేయండి

» తెలంగాణ హైకోర్టులో సీబీఐ కౌంటర్

హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఓబులాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) తనను నిందితుల జాబితా నుంచి తొలగించాలని ఆరో నిందితురాలు, ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి దాఖలు చేసిన క్రిమినల్ రివిజన్ (డిశ్చార్జి) పిటిషన్‌ను కొట్టేయాలని విజ్ఞప్తి చేస్తూ హైకోర్టులో సీబీఐ కౌంటర్ దాఖలు చేసింది. గతంలో ఇదే అంశంపై ఆమె దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్‌ను సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం కొట్టేసింది. దీంతో శ్రీలక్ష్మి దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్‌ను విచారించిన హైకోర్టు ఆమెకనుకూలంగా తీర్పు చెప్పింది. హైకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు.. ఈ అంశాన్ని మళ్లీ విచారించాలని హైకోర్టును ఆదేశించింది. దీంతో ఆమె దాఖలు చేసిన పిటిషన్.. గురువారం హైకోర్టు జస్టిస్ కె.లక్ష్మణ్ బెంచ్ ముందు విచారణకు రాగా, సీబీఐ కౌంటర్ దాఖలు చేసింది. శ్రీలక్ష్మి గతంలో వేసిన క్వాష్, రిట్ పిటిషన్లను కొట్టేయడంతోపాటు ఆమెపై విచారణ కొనసాగాల్సిందేనని హైకోర్టు పేర్కొన్న సంగతిని ప్రస్తావించింది. వివిధ మార్గాల ద్వారా పిటిషన్లు వేసిన శ్రీలక్ష్మి.. డిశ్చార్జి పిటిషన్‌తో హైకోర్టులో ఉపశమనం పొందినా, సుప్రీంకోర్టు ఆమెకు వ్యతిరేకంగా తీర్పునిచ్చిన సంగతిని గుర్తు చేసింది. రెండు క్వాష్ పిటిషన్లలో తనకు వ్యతిరేకంగా హైకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చినా అదే గ్రౌండ్స్‌లో వక్రమార్గంలో వేసిన క్రిమినల్ రివిజన్ పిటిషన్‌ను కొట్టేయాలని సీబీఐ కోరింది. సీబీఐ కౌంటర్‌పై సమాధానమిచ్చేందుకు శ్రీలక్ష్మి తరఫు న్యాయవాదుల విజ్ఞప్తి మేరకు ఈ కేసు తదుపరి విచారణను ఈ నెల 25కు వాయిదా వేశారు.

రప్పా రప్పా.. వైసీపీ అభిమాని అరెస్టు

- బారికేడ్లు తోసివేసిన అంబటిపై కేసు నమోదు
- గోపిరెడ్డి, సత్తెనపల్లి పార్టీ ఇన్‌చార్జిపైనా..

సత్తెనపల్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలో జగన్ పర్యటన సందర్భంగా వైసీపీ శ్రేణులు ప్రదర్శించిన ప్లకార్డులు వివాదాస్పదంగా మారాయి. 'మళ్లీ అధికారంలోకి వచ్చాక చంపేస్తాం, నరికేస్తాం', 'ఎవడైనా రానీ తొక్కిపడేస్తాం', '2029లో వైసీపీ వచ్చిన వెంటనే గంగమ్మ తల్లి జాతరలో వేత తలలు నరికినట్టు రప్పా రప్పా నరుకుతాం, నా కొడకల్లారా', 'వైఎస్ రాజారెడ్డి రాజ్యాంగం పల్నాడు నుంచి మొదలు', 'అన్న వస్తాడు, అంతు చూస్తాడు' అని వాటిలో హెచ్చరించారు. రప్పా రప్పా నరుకుతామని పెట్టినవారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని వందనాదేవి సత్తెనపల్లి పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ ప్లకార్డు ప్రదర్శించింది క్రోసూరు మండలం 88-తాళ్లూరుకు చెందిన వైసీపీ కార్యకర్త రవితేజగా గుర్తించారు. అతడిని అరెస్టు చేసి నకరికల్లు పోలీసు స్టేషన్‌లో విచారణ జరుపుతున్నారు. అలాగే మాజీ మంత్రి అంబటి రాంబాబు, ఆయన సోదరుడు మురళి.. సత్తెనపల్లి మండలం కంటెపూడి వద్ద బారికేడ్లను తొలగించారు. వారించిన పోలీసులను అంబటి నెట్టివేశారు. తమ విధులకు ఆటంకం కలిగించారని, దురుసుగా ప్రవర్తించారని కానిస్టేబుల్ చిలకా గోపి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అంబటిపై సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వైసీపీ నేత సుధీర్ భార్గవ్‌రెడ్డి, తొర్లకుంట వెంకటేశ్వర్లు, మరికొందరు వైసీపీ కార్యకర్తలపైనా కేసు నమోదైంది.



రప్పా రప్పా నరుకుతానంటే

మంచిదే కదా!

టీడీపీ నుంచి మారి మన అభిమానస్తుడయ్యాడు

- టీడీపీ వాళ్ల తల నరుకుతానంటున్నాడు
- 'పుష్ప' సినిమా డైలాగ్ చెప్పినా తప్పేనా!
- మనం ఏ ప్రపంచంలో ఉన్నాం సామీ!
- 'నరుకుడు భాష'కు జగన్ సమర్థన
- పదేపదే అదే చెప్పించుకుని, చెప్పి ఆనందం



అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): "మన అభిమానస్తుడై... నెక్స్ట్ టీడీపీ ప్రభుత్వంలో టీడీపీ వాళ్లను రప్పా రప్పా.. ఏం జాతరమ్మా అది, ఆ గంగమ్మ జాతరలో! ఏంటమ్మా అది, పొట్టేలు తల నరికినట్టు.. రప్పారప్పా నరుకుతానన్నాడు! మంచిదే కదా!" అని వైసీపీ అధ్యక్షుడు, వైఎస్ జగన్ హర్షం, సంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం ఆయన తాడేపల్లి నివాస ప్రాంగణంలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఎప్పట్లాగే ఎంపిక చేసుకున్న మీడియా ప్రతినిధులతో సుదీర్ఘంగా మాట్లాడారు. తన సత్తెనపల్లి పర్యటనలో వైసీపీ కార్యకర్త ఒకరు '2029లో వైసీపీ వచ్చిన వెంటనే గంగమ్మ జాతరలో పొట్టేలు తల నరికినట్టుగా రప్పారప్పా నరుకుతాం ఒక్కొక్కడిని' అని ప్లకార్డులు ప్రదర్శించడంపై అడిగిన ప్రశ్నకు జగన్ తనదైన శైలిలో స్పందించారు. 'అత్యుత్సాహంతోనో, ఆవేశంతోనో అలాంటి ప్లకార్డులు ప్రదర్శించి ఉండొచ్చు. ఈ ధోరణి సరికాదు' అని జగన్ అంటారేమో అని భావించిన వాళ్లకు షాక్ ఇచ్చారు. అదే మాటను పదేపదే చెప్పించుకుని, ఆసక్తిగా విని, ఆనందంగా ఆస్వాదిస్తూ, 'మంచిదే'గా అని ముక్తాయించారు.

మళ్లీ చెప్పమ్మా... మళ్లీ!

'రప్పా.. రప్పా నరికేస్తాం' అని ప్లకార్డులు పెట్టారంటూ ఒక మహిళా జర్నలిస్టు ప్రస్తావించినప్పుడు... 'ఆ డైలాగ్ మళ్లీ చెప్పమ్మా! ఆ పూర్తి డైలాగ్ చెప్పు!' అని జగన్ రెట్టించారు. మరో మీడియా ప్రతినిధి కల్పించుకుని "గంగమ్మ జాతరలో పొట్టేలు తల" అని అంటుండగానే.. "ఆ మళ్లా చెప్పు. గట్టిగా చెప్పు. వినపడటం లేదు. మైకు తీసుకుని చెప్పు బాగా అర్థమవుతుంది" అని మరీ చెప్పించుకున్నారు. అదేమాట మళ్లీ మళ్లీ విని.. "గంగమ్మ జాతరలో పొట్టేళ్ల తలకాయ కోసినట్టు రప్పారప్పా నరికేస్తాం" అని పోస్టరు ఉందా అని జగన్ అమాయకంగా ప్రశ్నించారు. "అదేదో సినిమా డైలాగ్ అనుకుంటా! యా సినిమా డైలాగ్ అది" అని ఆసక్తిగా అడిగారు. 'పుష్ప-2' అని మీడియా ప్రతినిధి చెప్పడంతో .. "పుష్ప సినిమా డైలాగులా అవి! నువ్వే చెబుతున్నావుకదయ్యా స్వామీ! సినిమా డైలాగులు పెట్టినా తప్పేనా? డెమోక్రసీలో ఉన్నామా? లేమా? అర్థం కావడం లేదు. పుష్ప సినిమా డైలాగులు పెట్టినా తప్పేనా? పుష్ప ఫొటోలు పెట్టినా తప్పేనా? గడ్డం ఇట్లన్నా తప్పేనా.. గడ్డం అట్లన్నా తప్పేనా? ఏంది సామీ ఇది.. ఏ ప్రపంచంలో ఉన్నాం సామీ?" అని జగన్ నాటకీయత ప్రదర్శించారు.

అయితే మంచిదేకదా...

పోస్టర్ పట్టుకున్న కుర్రాడు టీడీపీ కార్యకర్త అని, టీడీపీ సభ్యత్వం కూడా ఉందని ఒక పాత్రికేయుడు అన్నారు. దీనిపై జగన్ ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ... "ఓ టీడీపీ సభ్యుడు కూడానా! మెంబర్ షిప్ కూడా ఉందా?" అని అన్నారు. జగన్ మీడియా జర్నలిస్టు సెల్‌ఫోన్‌లో ఆ వ్యక్తి ఫొటోను చూపించారు. "ఓహోహో బాగా చూడండబ్బా! సభ్యత్వం కూడా ఉందంట! ఏమైనా(పార్టీ) మారినాడబ్బా.. మన దగ్గరికి వచ్చాడు" అని జగన్ వ్యాఖ్యానించారు. "టీడీపీ కార్యకర్త అయికూడా చంద్రబాబు మీద కోపంతో మారినాడని సంతోషపడదాం! నిజంగానే బాధుంటుందేమో కదా వాళ్లకు కూడా! అన్ని పథకాలూ ఎగరగొడుతున్నాడు. టీడీపీ యాక్టివ్ మెంబరైనా.. వైసీపీలో చేరి టీడీపీ వాళ్లమీద ఆక్రోశం చూపిస్తూ... గంగమ్మ జాతరలో పొట్టేళ్ల తలలు నరికినట్లుగా రప్పారప్పా అన్నాడు. టీడీపీ సింపథైజర్ కూడా వైసీపీలో చేరి టీడీపీవాళ్లనే నరికేస్తామని అంటే మంచిదేకదా" అని జగన్ వ్యాఖ్యానించారు.

మరి వీటి మాటేమిటి?

రప్పారప్పా... అనేది పుష్ప సినిమా డైలాగ్, అది చెప్పినా తప్పేనా అని జగన్ ప్రశ్నిస్తున్నారు. మరి... జగన్ పర్యటనల్లో 'ఎవడైనా రానీ తొక్కి పడేస్తాం! అన్న వస్తాడు, అంతు చూస్తాడు. నా కొడకల్లారా. పల్నాడు జిల్లా నుంచే రాజారెడ్డి రాజ్యాంగం అమలు చేస్తాం'... వంటి ప్లకార్డులూ ప్రదర్శించారు. జగన్ వాటినెలా సమర్థిస్తారో?? ఏం చెప్పాలని మనసులో అనుకున్నారో కానీ... బయటికి మాత్రం 'నెక్స్ట్ టీడీపీ ప్రభుత్వంలో' అనేశారు.

ఉన్మాది రవితేజకు టీడీపీతో సంబంధం లేదు

- పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు నలజాల సదాశివరావు


క్రోసూరు: గంగమ్మ జాతరలో నరికినట్లుగా తలలను నరుకుతామంటూ ఫ్లెక్సీ ప్రదర్శించిన బొల్లెద్దు రవితేజకు టీడీపీతో ఎటువంటి సంబంధం లేదని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నలజాల సదాశివరావు స్పష్టం చేశారు. 2024 ఎన్నికలకు ముందు రవితేజ తండ్రి ఏలియా టీడీపీలో చేరినా క్రియాశీలంగా లేరు. తండ్రిని తీవ్రంగా వ్యతిరేకించిన రవితేజ... వైసీపీలో కొనసాగుతున్నాడు. కరుడుకట్టిన వైసీపీ ఉన్మాదిలా వ్యవహరిస్తున్నాడు. గతంలో జగన్ తాళ్లూరుకు వచ్చినప్పుడు కూడా అలాగే ప్రవర్తించాడు. అతను మా పార్టీకి చెందిన వాడిగా నిరూపిస్తే ఎటువంటి సవాల్‌కైనా సిద్ధం. రవితేజ లాంటి ఉన్మాదులను కఠినంగా శిక్షించాలి' అని సదాశివరావు కోరారు.

సినిమాల్లోలాగా బయటా

"సత్తెనపల్లి నియోజకవర్గంలో అసలు జరిగిందేంటి? జగన్ అధికారంలో ఉన్నప్పుడే చనిపోయిన వ్యక్తి కుటుంబాన్ని ఏడాది తర్వాత పరామర్శిస్తానంటూ బయలుదేరడమేంమిటి? పరామర్శకు వెళ్లే సమయంలో వైసీపీ వారి వాహనాలు కిందపడి ఒకరు.. తొక్కిసలాటలో మరొకరు చనిపోతే, వారిని పట్టించుకోరు. పరామర్శించరు. బెట్టింగ్ ప్రాణానికున్న విలువ, మీ చేతిలో చనిపోయినవారి ప్రాణాలకు లేదా..?"

"ఊళ్లో దొంగలు ఉంటే ఆ ఊరి అబ్బాయికికానీ, అమ్మాయికికానీ మన పిల్లలను ఇచ్చి పెళ్లి చేస్తామా? రాష్ట్రం పరిస్థితి కూడా అంతే. గత ఐదేళ్లు రాష్ట్రాన్ని దొంగల రాజ్యంగా చేశారు. పారిశ్రామికవేత్తలు ఇటు వైపు చూడటం మానేశారు. గత ప్రభుత్వ ముద్ర పోగొట్టేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నాం. ఏడాదిలో 5 లక్షల కోట్లు పెట్టుబడులు తీసుకొచ్చాం. గత ప్రభుత్వంలో అరాచకాలకు బాధ్యులైన వారిపై తప్పకుండా చర్యలు తీసుకుని తీరుతాం. ప్రజలు నిలదీస్తే సమాధానం ఇస్తాం. అన్యాయం జరిగితే సరిచేస్తాం. వైసీపీ వారు నిలదీస్తే తాట తీస్తాం." - చంద్రబాబు

చంపేస్తారా?



(మొదటి పేజీ తరువాయి)

భయపడేవాళ్లు. ఇప్పుడు వారితోనే కలిసి రాజకీయం చేస్తున్నారు. చంపేయండి.. పొడిచేయండి.. నరికేయండి.. రప్పా రప్పా నరికేస్తాం.. వార్ డిక్లేర్.. అంటూ ప్లకార్డులు ప్రదర్శించడం.. వంటి పోకడలు ఎప్పుడైనా చూశామా? దేశంలోని ఏ రాజకీయ నాయకుడికీ, రాజకీయ పార్టీకీ ఈ తరహా పోకడలు లేవు. సమాజంలో ఇలాంటి పోకడలు చాలా ప్రమాదకరం." అని చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

బెట్టింగ్‌లు చేసేవాళ్లకు విగ్రహాలా?

"గంజాయి బ్యాచ్.. బెట్టింగ్ బ్యాచ్.. రౌడీయిజం చేసేవారికి విగ్రహాలు పెట్టడం అనేది కొత్త సంస్కృతి. వైసీపీ వాళ్లు ఇలాంటి విధానాలు తీసుకొస్తున్నారు. రౌడీయిజం చేసేవారు హీరోలు.. శాంతిభద్రతలను పరిరక్షించేవారు హీరోలు కాదనే సంస్కృతి తీసుకొస్తున్నారు. ఇది సమాజానికి చాలా ప్రమాదకరం. వైసీపీ హయాంలో గంజాయి బ్యాచ్‌లను పెంచి పోషించారు. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత గంజాయి ఉత్పత్తిపై ఉక్కుపాదం మోపాం. ఎవరైనా సాగు చేస్తుంటే మక్కెలిరగగొడుతున్నాం. ఈగల్ టీంలను పెట్టి గంజాయి బ్యాచ్‌లను లేకుండా చేస్తున్నాం. వెధవ పనులు చేయబట్టే ప్రజలు 11 సీట్లు కట్టబెట్టి జగన్‌కు బుద్ధి చెప్పారు."

చట్టమంటే లెక్కలేనితనమా?

"వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో మమ్మల్ని పోలీసులు అడ్డుకుంటే ఇలాగే వ్యవహరించామా? జగన్ సత్తెనపల్లి పర్యటన సందర్భంగా.. ఇరుకు సందుల్లో ఎక్కువ మంది వెళ్లలేరని, వంద మందికి పోలీసులు అనుమతి ఇచ్చారు. దానిని బేఖాతరు చేసి దౌర్జన్యపూరితంగా వెళ్లి అక్కడ మీటింగ్‌లు పెట్టడమే కాకుండా తొక్కిసలాటకు కారణమయ్యారు. పైగా చట్టమంటే లెక్కలేనితనంగా పోలీసులను తిట్టారు. ఇలాంటివి ఎక్కడైనా జరుగుతాయా? రాజకీయ నాయకుడు అంటే ఓ హుందాతనం ఉండాలి. అది లేకుండా ఇష్టమొచ్చినట్లు చేస్తామంటే ప్రజలు హర్షించరు. పరామర్శలకు వెళుతుంటే మేమేమీ అడ్డుకోవడం లేదు.. వారు ఇష్టమొచ్చినట్లు చేసి, గొడవలు సృష్టించి తిరిగి ప్రభుత్వాన్నే తప్పుబడుతున్నారు. పద్ధతి లేకుండా చట్టాన్ని ఉల్లంఘించేవారిని ఏమనాలి? పరామర్శ యాత్రల్లో వారుచేసే అరాచకాన్ని అడ్డుకుంటే.. మమ్మల్ని చూసి భయపడుతున్నారు అని అంటున్నారు. నాలుగేళ్ల తర్వాత కదా ఆయనను చూసి భయపడాల్సింది."

ముందు ఇంకా భయంకరంగా వ్యవహరిస్తారు

"జగన్ లాంటివారు రోడ్డుమీదకు వస్తే మున్ముందు ఇంకా భయంకరమైన పరిస్థితులు వస్తాయి. అధికారం కోసం ఇంకా భయంకరంగా వ్యవహరిస్తారు. పొదిలిలో 40 వేల మందితో పొగాకు రైతుల పరామర్శకు ఎలావెళతారు?. అంతమందిని ఎందుకు సమీకరించారు? లా అండ్ ఆర్డర్ సమస్య సృష్టించాలనే కదా? అంతమందితో మార్కెట్‌యార్డుకు వెళ్లి పొగాకు తొక్కేస్తే ఏమవుతుంది? ప్రజలకూ వాస్తవాలు తెలియాలనే ఇంతలా మాట్లాడాల్సి వస్తోంది. మన ఇంట్లో పెళ్లి చేయాలనుకుంటే ఎన్నిసార్లు విచారిస్తాం. ఒక నాయకుడిని ఎన్నుకునే సమయంలో కాస్తయినా ఆలోచించమా? గత ప్రభుత్వంలో ఎన్నో అరాచకాలు జరిగాయి. రాజకీయాల్లో ఉన్నాం.. వదిలేయాలంటే అది కరెక్టేనా?. ఈ ఆలోచనాధోరణి మారాలి. లేకుంటే రాష్ట్రానికి రక్షణ లేకుండా పోతుంది. మీరు (వైసీపీ నేతలను ఉద్దేశించి) మారండి. మారితే సమాజం ఆమోదిస్తుంది. తప్పుడు పనులు చేసి సమాజాన్ని అతలాకుతలం చేస్తానంటే కుదరదు. ఉద్దేశపూర్వకంగా ఎవరిపైనా చర్యలు తీసుకోవడం మా విధానం కాదు.. చట్టపరంగానే ఎవరిపైనైనా చర్యలు ఉంటాయి" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

కుప్పంలో జరిగినదానికి సిగ్గుపడుతున్నా: చంద్రబాబు

కుప్పంలో అప్పు తీర్చలేదని మహిళను చెట్టుకు కట్టి హింసించిన ఘటనపై సీఎం చంద్రబాబు మరోసారి ఆవేదన వ్యక్తంచేశారు. "నా సొంత నియోజకవర్గంలో జరిగిన దానికి సిగ్గుపడుతున్నా. డబ్బులు ఇవ్వకపోతే చెట్టుకు కట్టేసి కొడతారా? వైసీపీ నేతలను చూసి అలాంటి వారు స్ఫూర్తి పొందుతున్నారు.. కుప్పంలో గతంలో ఎప్పుడూ ఇలాంటివి జరగలేదు.. వైసీపీ వారు రాజకీయంగా.. సామాజికంగా సమస్యగా తయారవుతున్నారు. ఏం చేసినా చెల్లుతుందని భావిస్తున్నారు. ప్రజలు ఇలాంటివాటి పట్ల అప్రమత్తంగా ఉండాలి. లేకుంటే సమాజానికే నష్టం. ఎవరికీ రక్షణ ఉండదు." అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

ఇక్కడోళ్లకూ చేతులు, కొడవళ్లు ఉంటాయ్..!

- శవాల పునాదులపైనే జగన్ వైసీపీని నిర్మించారు: ఎమ్మెల్యే రాజు



అనంతపురం క్రైం, దుత్తలూరు(ఉదయగిరి), అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): 'శవాల పునాదులపైనే జగన్ వైసీపీని నిర్మించారు. ఆయన బయటకు రావాలంటే ఎవరైనా చావాలి. లేదంటే చంపేందుకు వస్తారు' అని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు విమర్శించారు. అనంతపురంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'అధికారంలోకి వస్తే రప్పా రప్పా నరుకుతాం అంటూ ఫ్లెక్సీలు ప్రదర్శించేలా సైకో బ్యాచ్‌ను జగన్ రెచ్చగొడుతున్నారు. ఒక మాజీ సీఎం ఇదేనా సూచించేది. ఇక్కడున్న వాళ్లకూ చేతులు, కొడవళ్లు ఉంటాయని గుర్తుంచుకోవాలి. కూటమి ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణను చూసి లా అండ్ ఆర్డర్ సమస్య సృష్టించేలా జగన్ వ్యవహరిస్తున్నారు.. రెడ్ బుక్ సామాన్య ప్రజలకు కాదు. మద్యం స్కాంలో చెవిరెడ్డిని అరెస్టు చేసిన పోలీసులు... జగన్ ఇంటి తలుపులు కొట్టడం ఖాయం' అని రాజు హెచ్చరించారు.

పోలీసులు తాటతీస్తారు: ఎమ్మెల్యే సోమిరెడ్డి

'చట్టాలు ఎవరికీ చుట్టాలు కాదు. నువ్వు, నీ రౌడీ మూకలు బరితెగించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే పోలీసు శాఖ చూస్తూ ఊరుకోదు... తాటతీస్తుంది' అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి జగన్‌ను హెచ్చరించారు. 'బెట్టింగ్ ఆడి రూ.కోట్లు నష్టపోయి ఆత్మహత్య చేసుకున్న నాగమల్లేశ్వరరావు కుటుంబ పరామర్శలో బరితెగించి ప్రదర్శన చేయడం సిగ్గుచేటు. బెట్టింగ్‌లు ఆడి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి విగ్రహం ఏర్పాటు చేస్తే అతన్ని ఆదర్శంగా తీసుకోవాలా? నీకు విలువల్లేవా? జగన్ పాలనలో రాష్ట్రం బిహార్‌ను తలపించింది' అని సోమిరెడ్డి విమర్శించారు. కాగా, 'ప్రజాస్వామ్యం, శాంతియుతంగా జీవించడానికి. రప్పా రప్పా నరకడానికి కాదు' అని 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ జగన్‌పై మండిపడ్డారు.

పల్నాడుపై యుద్ధానికి వెళ్లినట్లుంది: కన్నా

సత్తెనపల్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): 'మాజీ సీఎం వైఎస్ జగన్ రెంటపాళ్ల ఓదార్పుకు వెళ్లినట్టుగా లేదు. పల్నాడుపై యుద్ధానికి వెళ్లినట్టుంది' అని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం గుంటూరులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'నాగమల్లేశ్వరరావు ఎందుకు చని పోయాడో జగన్ పర్యటనకు ముందే మేం చెప్పాం. జగన్‌ది రాక్షస పాలన. ఇప్పటికీ ఆయనలో మార్పు రాలేదు. పోలీసుల మాటను బేఖాతరు చేసి, నిబంధనలు ఉల్లంఘించి ఇద్దరు ప్రాణాలు పోవటానికి జగన్ కారకుడయ్యాడు. రెంటపాళ్ల నాగమల్లేశ్వరరావు ఆత్మహత్యకు నూటికి నూరు పాళ్లు జగనే కారణం. అడ్డు వచ్చినవారిని రప్పా రప్పా నరుకుంటూ పోతామంటూ ఫ్లకార్డులతో ర్యాలీలు చేపట్టడం జగన్ క్రిమినల్ ఐడియాలజీకి నిదర్శనం' అని విమర్శించారు. 'జగన్ బెదిరింపులకు భయపడే వారెవ్వరూ లేరు. వైసీపీ నాయకులు బారికేడ్లను తొలగించి నిబంధనలను ఉల్లంఘించారు. జగన్ పర్యటన సందర్భంగా ఇరువురు మృతికి ఆయనే బాధ్యత వహించాలి. ఏడాది క్రితం చనిపోయిన వారిని పరామర్శించారు గానీ ర్యాలీలో చనిపోయిన వారి కుటుంబాలను పలుకరించే సమయం ఆయనకు లేదు' అని మండిపడ్డారు.

'కమ్మ' గురించి మొసలి కన్నీరు

రెంటపాళ్ల పర్యటనకు వచ్చిన వైఎస్ జగన్ కమ్మ సామాజిక వర్గం గురించి మొసలి కన్నీరు కార్చారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. 'అధికారంలో ఉండగా తన ఆనందం కోసం కమ్మ వారిని కమ్మ వారి చేత తిట్టించారు. అసెంబ్లీని కౌరవ సభ చేశారు. కమ్మ ద్వేషంతో అమరావతి ప్రాంతాన్ని సర్వనాశనం చేశారు. వారిపై ద్వేషమే 2024 ఎన్నికల్లో జగన్‌కు శాపమైంది. కమ్మవారిపై ద్వేషంతోనే అమర రాజా కంపెనీని రాష్ట్రం నుంచి తరిమేశారు. జగన్ నాటకాలను, డ్రామాలను ప్రజలు పట్టించుకోరు' అని కన్నా అన్నారు.

నరుకుతామంటే.. సంతోషమంటారా!

- సమాజానికి జగన్ ఏం చెప్పదలుచుకున్నారు?
- సొంత బాబాయి విగ్రహాన్ని పెట్టించలేదేం!
- అరాచకం, విధ్వంసం చేయాలని చూస్తే ఊరుకోం: పయ్యావుల



అమరావతి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): 'జగన్, వైసీపీ ఆలోచనలు చూస్తుంటే.. రాష్ట్రం ప్రశాంతంగా ఉండకూడదు. పెట్టుబడులు రాకూడదు. ప్రజలు ప్రశాంతం ఉండకూడదు' అన్నట్లుందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మండిపడ్డారు. రౌడీలంతా నా వెనుక నడవండి.. నాయకత్వం వహిస్తా అన్నట్లు జగన్ తీరుందని విమర్శించారు. చంద్రబాబు చాలా ఓర్పు, సంయమనంతో ఉన్నారు కదా అని అరాచకం, విధ్వంసం చేయాలని చూస్తే.. చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. గురువారం అమరావతి సచివాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. 'అధికారంలో ఉన్నప్పుడు పోలీస్ వ్యవస్థను ఉపయోగించుకుని హౌస్ అరెస్టులు, తప్పుడు కేసులతో భయపెట్టాడు. అధికారం పోయాక తనంటే భయం పోతోందని పర్యటనల ద్వారా రాష్ట్రంలోని రౌడీల్ని, బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్, బెట్టింగ్ బ్యాచ్‌లను జగన్ సమీకరించే ప్రయత్నం చేస్తున్నాడు. రప్పారప్పా నరుకుతామనటానికి ఇది సినిమా కాదు. తన అరాచక పాలనను ప్రజలు రప్పారప్పా అని నరికేశారు. జగన్ ఓటమి నుంచి పాఠం నేర్చుకోవడం లేదు. ఎందుకు ఓడిపోయామనే ఆలోచన లేదు. నరికేస్తామంటే ఖండించాల్సింది పోయి.. సంతోషిస్తానంటారా? సమాజానికి ఏం చెప్పదలుచుకున్నారు? వార్ డిక్లేర్ అనడం హింసను ప్రేరేపించడం కాదా! ఎవర్ని నరుకుతారు మీరు? ప్రజలనా? ప్రజాస్వామ్యాన్నా? రాజకీయ నాయకుడు ఓటమి తర్వాత సమీక్ష చేసుకోవాలి. మార్పు చెందాలి. కానీ, జగన్‌లో ఏ మార్పూ కనబడటం లేదు. తెనాలి పోయి 10 కేసులున్న రౌడీషీటర్‌ని పరామర్శించారు. ఆ కేసులు వైసీపీ పాలనలో పెట్టినవే. పొదిలిలో రైతుల పరామర్శ పేరుతో అరాచకం చేశారు. బెట్టింగ్‌లతో చనిపోయిన నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించిన జగన్.. తన పర్యటనలో ఇద్దరు చనిపోతే ఏమీ పట్టించుకోలేదు. మరి సొంత బాబాయి చనిపోతే.. విగ్రహాన్ని పెట్టించలేదేం? విగ్రహాలతో రాజకీయం చేసే చరిత్ర జగన్‌ది. మేమూ మీలా చేయాలనుకుంటే బెంగళూరు ప్యాలెస్ నుంచి ఏపీలో అడుగు పెట్టేవారా? పవన్‌కల్యాణ్‌ను హైవే మీద, చంద్రబాబును ఎయిర్‌పోర్టులో అడ్డుకున్న విషయాలు మర్చిపోయారా? చంద్రబాబు ప్రభుత్వం ఉండబట్టే.. జగన్ రాష్ట్రంలో స్వేచ్ఛగా తిరగగలుగుతున్నాడు. సొంత చెల్లిపైనే నిఘా పెట్టిన జగన్.. ప్రభుత్వ ఉద్దేశాన్ని పట్టించుకుంటాడనేది భ్రమే. లక్షల కోట్ల పెట్టుబడులు వస్తుంటే జగన్‌కు కడుపుమంట. ఇలాంటి దుర్మార్గ ఆలోచనలు సరికావు. జగన్ తీరు మారకపోతే వైసీపీకి ఇంకో పదేళ్లైనా పది అంకె దాటదు' అన్నారు. వంశీ, జోగి రమేష్, నాని, ధనుంజయరెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, కొమ్మినేని శ్రీనివాసరావు అమాయకులని జగన్ అంటున్నారని, పోలీస్‌స్టేషన్ ముందే అలజడి సృష్టించిన వీరంతా అమాయకులా? అని పయ్యావుల నిలదీశారు. తెలంగాణలో ఫ్యాన్ ట్యాపింగ్ అంశంలో ప్రభుత్వం సిట్ వేసింది. పూర్తి నివేదిక బయటకు వచ్చాక ఏం చేయాలనేది ఆలోచిస్తాం' అన్నారు.

మనం మనం కొట్టుకుంటే

లాభమేంటి?

బనకచర్ల ప్రాజెక్టుపై చంద్రబాబు వ్యాఖ్యలు

అమరావతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : బనకచర్ల ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "గోదావరిలో నీళ్లు ఉన్నాయి. వాటిని తెలంగాణ, ఏపీ రెండూ ఉపయోగించుకుంటున్నాయి. తెలంగాణ వాళ్లను పైన ఎన్ని ప్రాజెక్టులైనా కట్టుకోమనండి. మనం వారు దిగువకు వదిలేసిన నీటినే ఉపయోగించుకుంటున్నాం. దీనివల్ల ఎవరికీ నష్టం లేదు. దీనిపై మనం మనం కొట్టుకుంటే లాభం లేదు." అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతానికి ఎవరికి కేటాయించిన నీటిని వారు వాడుకుందామని, కొత్త ట్రైబ్యునల్ వచ్చిన తర్వాత దాని ప్రకారం నడుచుకుందామని తెలంగాణ ప్రభుత్వానికి సీఎం సూచించారు. "తెలంగాణలో కాళేశ్వరం కట్టుకున్నప్పుడు నేను అడ్డుచెప్పలేదు. పైనుండే వారు నీటిని వాడుకుంటే నష్టమా లేక కింద ఉండే వారు నీటిని వాడుకుంటే నష్టమా? మీరు నీరు వాడుకోకపోతేనే కదా ఆ నీరు కిందకు వచ్చి సముద్రంలో కలిసేది. దాన్నే మేం వాడుకుంటామని చెబుతున్నా. తెలంగాణ కానీ ఆంధ్రా కానీ అంతా తెలుగువారే ఎందుకు మనకు మనం సమస్యలు సృష్టించుకుంటున్నాం. ఇరుపక్షాలకు ఆమోదయోగ్యంగా ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో సమస్యను పరిష్కరించుకుందాం. చట్టబద్ధత కావాలంటే కేంద్రం వద్ద కూర్చుని చేసుకుందాం." అని సూచించారు.

తెలంగాణపై నేను గొడవ పడ్డానా?

"తెలంగాణపై ఎప్పుడైనా గొడవ పడ్డానా? మనం గొడవ పడటం అంటే ప్రజలను మభ్యపెట్టడమే! దానివల్ల రెండు రాష్ట్రాల ప్రజలకూ లాభం లేదు. పోరాటాలు అవసరం లేదు. కట్టే ప్రాజెక్టులన్నీ కట్టి నీళ్లు తీసుకోమనే తెలంగాణ వారికి చెబుతున్నాం. మిగిలినదే మేం వాడుకుంటాం. మనం మనం తిట్టుకుంటే దాన్ని రాజకీయం చేయాలని చూసేవారు చాలా మంది ఉన్నారు. గోదావరిలో చాలా నీళ్లు ఉన్నాయి. ఎవరి ఓపికను బట్టి వారు వాడుకోవచ్చు. 3వేల టీఎంసీల నీరు ప్రతియేటా సముద్రంలో కలుస్తోంది. తెలంగాణ ఎంత వాడుకున్నా 100 టీఎంసీలు వాడుకుంటుంది.. మనం ఎంత వాడుకున్నా మరో 100 టీఎంసీలు వాడుకోగలం. దీనిపై రాద్ధాంతం ఎందుకు? ఏపీ, తెలంగాణ నంబర్ వన్‌గా ఉండాలన్నదే నా ఆశయం.. అందరం కలిసి తెలుగుజాతిని ప్రపంచమే హద్దుగా అభివృద్ధి పథంలో నడిపిద్దాం. హైదరాబాద్‌లో హైటెక్ సిటీ కట్టినా.. ఇక్కడ అమరావతి కడుతున్నా నా కోసం కడుతున్నానా? భవిష్యత్తు తరాల కోసం కడుతున్నాం. తెలంగాణ ఎకో సిస్టమ్ చాలా మంచిది. దాన్ని ఇక్కడ తీసుకురావాలంటే చాలా కష్టపడాలి."

చాలా ప్రాజెక్టులు మొదలుపెట్టింది నేనే..

"గోదావరి నీళ్లను ఇరు రాష్ట్రాలు వాడుతున్నాయి. పోలవరం తప్ప మిగతావి అనుమతి రాని ప్రాజెక్టులే. విభజన చట్టంలో భాగంగా పోలవరం నిర్మాణం జరుగుతోంది. గోదావరి ప్రవాహంలో చిట్టచివరి రాష్ట్రంగా...వచ్చిన నీటిని వచ్చినట్టు మరో బేసిన్‌కు తరలిస్తున్నాం. గతంలో కృష్ణా బ్యారేజ్‌పై ఇరు రాష్ట్రాల సిబ్బంది గొడవ పడ్డారు. గవర్నర్ వద్ద కూర్చొని పరిష్కరించుకున్నాం. కృష్ణాలో తక్కువగా ఉన్న నీటిపై గొడవ పడితే లాభం లేదు. ఉమ్మడి ఏపీలో నేనే చాలా ప్రాజెక్టులు మొదలుపెట్టాను. దేవాదుల, కల్వకుర్తి ప్రాజెక్టులుమొదలు పెట్టాను. ఎల్లంపల్లి ప్రాజెక్టుపై వివాదం వస్తే అసెంబ్లీలో పోరాడాం."

ఉద్యమ స్ఫూర్తితో యోగాంధ్ర

- భారతీయ వారసత్వ సంపద యోగా
- ప్రజల జీవితంలో భాగస్వామ్యం చేస్తాం
- యోగాంధ్రలో 22 రికార్డులు బ్రేక్ చేస్తున్నాం
- అందులో 2 గిన్నిస్ బుక్ రికార్డులు కూడా...
- యోగాంధ్రపై సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): 'యోగా భారతీయ వారసత్వ సంపద. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడానికి ప్రతి ఒక్కరి జీవితంలో యోగాను భాగస్వామ్యం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది' అని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ నెల 21న విశాఖలో నిర్వహించనున్న యోగాంధ్రపై గురువారం ఆయన సమీక్షించారు. అనంతరం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు. ఉద్యమ స్ఫూర్తితో యోగాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యం కోసం యోగాకు విస్తృత ప్రచారం కల్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. తొమ్మిదో తరగతి, ఆపైన చదివే విద్యార్థులతో రోజూ 10నిమిషాల పాటు యోగా చేయించడం ద్వారా వారికి చదువుపై శ్రద్ధ పెరుగుతుందన్నారు. భవిష్యత్తులో యోగా కోర్సులు ప్రవేశపెడతామని, ప్రతి స్కూల్లో వారానికి రెండు క్లాస్‌లు ఉండేవిధంగా సిలబస్ రూపొందిస్తామని పేర్కొన్నారు. గతంలో ఎన్టీఆర్ యోగా పరిషత్‌ను ఏర్పాటు చేశామని, అది తెలంగాణకు వెళ్లిపోయిందని తెలిపారు. స్వర్ణాంధ్ర తరహాలో యోగా కోసం ఒక నాన్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసి సీఎస్ఆర్ నిధులతో ప్రచారం కల్పించాలని నిర్ణయించామని చెప్పారు. యోగా, నేచురోపతి కోర్సులతో ఒక డీమ్డ్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఏడాదికి లేదా రెండేళ్లకు ఒకసారి జిల్లాల్లో యోగా పోటీలు పెట్టి సర్టిఫికెట్లు జారీ చేస్తామని చంద్రబాబు వెల్లడించారు. యోగాంధ్రలో భాగంగా గత నెల 21 నుంచి ఈ నెల 21 వరకూ అనేక కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా 1.29 లక్షల ప్రాంతాల్లో 2 కోట్ల మందికి పైగా యోగాసనాలు వేయనున్నారని వివరించారు. విశాఖపట్నంలో జరిగే యోగాంధ్ర కార్యక్రమం దేశంలోని 7 లక్షల ప్రదేశాల్లో లైవ్ టెలికాస్ట్ అవుతుందని చెప్పారు.

'యోగిఫై' మ్యాట్‌కు ప్రశంసలు

'యోగిఫై' మ్యాట్‌ను రూపొందించిన సోమిశెట్టి మురళీధర్‌ను చంద్రబాబు ప్రశంసించారు. టెక్నాలజీ, ఏఐని కలిపి మ్యాట్‌ను తయారు చేయడం అద్భుతమని కొనియాడారు. మ్యాట్ తయారీ విధానం, అదెలా పని చేస్తుందన్న విషయాలను మురళీధర్ వివరించారు. ప్రత్యేక యాప్ ద్వారా పనిచేసే ఈ మ్యాట్ ఆసనాలు వేసే సమయంలో మార్గదర్శనం చేస్తుందని, ఒకసారి చార్జింగ్ పెడితే 8గంటల పాటు ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ఈ విషయాలను సీఎం ఆసక్తిగా విన్నారు. మ్యాట్ గురించి మరిన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇలాంటివి ఎవరు తయారు చేసినా తాము ప్రచారం కల్పిస్తామని, మార్కెటింగ్ మాత్రం వాళ్లే చేసుకోవాలని సీఎం నవ్వుతూ అన్నారు.

యోగాకు మతంతో సంబంధం లేదు

యోగాకు మతంతో సంబంధం లేదని, దేశ, విదేశాల్లో క్రైస్తవులు కూడా యోగా చేస్తున్నారని సీఎం తెలిపారు. దీనిని మతంతో ముడిపెట్టడం సరికాదన్నారు. యోగా, ఉపవాసం వంటివి సైన్స్ అని చెప్పారు. తాను చిన్నప్పుడు తిరుపతిలో ఉన్న సమయంలో ప్రతి శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ శ్రీవారి సేవలో ఉండి, మధ్యాహ్నం తర్వాత ఆహారం తీసుకునేవాడినని సీఎం గుర్తుచేసుకున్నారు. యోగాంధ్రలో భాగంగా 22 రికార్డులు బ్రేక్ చేయబోతున్నామని సీఎం తెలిపారు. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డుల్లో 20, గిన్నిస్ బుక్‌కు సంబంధించి రెండు రికార్డులు బ్రేక్ చేయనున్నట్లు చెప్పారు. ఒకేసారి 2కోట్ల మందిపైగా యోగా చేయడం ద్వారా ఒక రికార్డు, ఒకే ప్రదేశంలో 3లక్షల మంది యోగా చేసి మరో రికార్డు సృష్టిస్తామని వివరించారు. శుక్రవారం 25వేల మంది గిరిజన విద్యార్థులతో 1.08 నిమిషాల్లోనే 108 సూర్య నమస్కారాలు చేయిస్తున్నామని సీఎం పేర్కొన్నారు.

వైసీపీ అభ్యర్థులకు లిక్కర్ కిక్కు

(మొదటి పేజీ తరువాయి)

ఆరా తీయగా... గత ఏడాది సెప్టెంబరులో మద్యం స్కామ్‌పై సీఐడీ కేసు నమోదైన తర్వాత వీరంతా ఒక్కొక్కరుగా అమెరికా, దుబాయ్ తదితర దేశాలకు పారిపోయినట్లు గుర్తించింది. దేశంలోనే అతిపెద్ద భారీ మద్యం కేసు కొలిక్కి తెచ్చేందుకు వారిని భారత్‌కు రప్పించాలని... ఇందుకు కేంద్ర దర్యాప్తు సంస్థల సహకారం తీసుకోవాలని 'సిట్' నిర్ణయించుకుంది. ఆ ఎనిమిది మంది ఎవరు.. వారి పాత్ర ఏమిటి?

ఇవీ ఆ వివరాలు...



కిరణ్ కుమార్ రెడ్డి 1

తిరుపతికి చెందిన ఒక హెడ్ కానిస్టేబుల్ కుమారుడైన కిరణ్ కుమార్ రెడ్డి... ఏ1 రాజ్ కసిరెడ్డికి అత్యంత సన్నిహితుడు! రాజ్ సూచనల మేరకు బూనేటి చాణక్య, ముప్పిడి అవినాశ్ రెడ్డి కంపెనీల నుంచి కమీషన్లు వసూలు చేయగా... ఆ సొమ్ము మద్యం మాఫియా ముఠాలో కీలక వ్యక్తులకు చేర్చడంలో కిరణ్ కుమార్ రెడ్డిది కీలక పాత్ర. ఎవరి వాటా వారికి చేర్చిన తర్వాత రాజ్ కసిరెడ్డి వాటాగా మిగిలిన సొమ్మును ఆదాన్ డిస్టిలరీస్, డికార్డ్ లాజిస్టిక్స్ లాంటి కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడం, అవసరం మేరకు హవాలా రూపంలో దేశం దాటించడం వంటి పనులను జాగ్రత్తగా పూర్తి చేసే బాధ్యత ఇతనిదే. కిరణ్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తే అసలు గుట్టు బయట పడుతుందనే... అమెరికాకు పంపించేసినట్లు సిట్ అధికారులు అనుమానిస్తున్నారు.



సైఫ్ అహ్మద్ 2

రాజ్ కసిరెడ్డికి నిత్యం అందుబాటులో ఉండే బూనేటి చాణక్యకు సైఫ్ అహ్మద్ కుడి భుజం. ఆయనది శ్రీకాళహస్తి. ఇద్దరూ బాల్య మిత్రులు. దీంతో మద్యం వ్యాపార లావాదేవీలు సైఫ్‌కు అప్పగించారు. ప్రతి రోజూ ఏ బ్రాండ్ లిక్కర్ ఎంత సేల్ అయిందో అనూష అనే ఉద్యోగి నుంచి డేటా తీసుకుని.. ఎక్సెల్ పట్టికలు వేసి ఏ డిస్టిలరీ నుంచి కమీషన్ రూపంలో ఎన్ని కోట్లు వసూలు చేయాలనే వివరాలు రాజ్ కసిరెడ్డికి పంపేవాడు. అవే వివరాలను చాణక్యకు ఇచ్చి ఆయా లిక్కర్ వ్యాపారులతో డబ్బులు వసూలు చేసే బాధ్యత రాజ్ అప్పగించేవారు. వారాంతంలో కమీషన్ డబ్బులు ఇవ్వని వాళ్ల వివరాలు చాణక్య ద్వారా సైఫ్‌కు.. ఆయన నుంచి సత్య ప్రసాద్(ఎక్సైజ్ అధికారి)కు చేరుతాయి. ముడుపులు ఇవ్వని వారికి మద్యం ఆర్డర్లు వెంటనే ఆపేస్తారు.



వరుణ్ పురుషోత్తం 3

వరుణ్ పురుషోత్తం 2016లో ఇంజనీరింగ్ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో నీరసించి బంజారా హిల్స్‌లోని ఒక కాఫీ షాపులో చేరాడు. జీతం... నెలకు 32వేల రూపాయలు. అమెరికాలో స్థిరపడ్డ డాక్టర్ రమేశ్ రెడ్డి అనే ఎన్ఆర్ఐ పరిచయంతో ఆయన దశ తిరిగింది. ఒక మద్యం కంపెనీలో మంచి ఉద్యోగం ఉందని, భారీగా డబ్బులు సైతం సంపాదించుకోవచ్చని పురుషోత్తంకు ఆ డాక్టర్ ఒక 'దారి' చూపించారు. మద్యం మాఫియాకు కమీషన్లు ఇవ్వలేక, వ్యాపారం సవ్యంగా చేసుకోలేక ఇబ్బంది పడుతున్న లీలా డిస్టిలరీస్‌ను లిక్కర్ స్కామర్లు బలవంతంగా లాగేసుకున్నారు. పాండిచ్చేరిలో లీలా డిస్టిలరీస్ ఉత్పత్తుల వ్యవహారాలు చూసుకునే బాధ్యతనుపురుషోత్తంకు అప్పగించారు. ఆ తర్వాత... ఏపీకి ఇన్‌చార్జిగా నియమించి.. ఆయన పేరుతో వందల కోట్ల మద్యం వ్యాపారం చేశారు. ఐదేళ్లలో 459 కోట్లు సంపాదించగా.. అత్యధికం అప్పటి అధికార పార్టీ పెద్దలకు, మద్యం మాఫియా ముఠాకు చేర్చాడు. మద్యం స్కాంపై విచారణకు ఆదేశిస్తామని చంద్రబాబు ప్రకటించిన వెంటనే పురుషోత్తం దేశం వదిలి పారిపోయాడు. అమెరికాలో ఉన్నట్లు సిట్ అధికారులు గుర్తించారు.



ముప్పిడి అనిరుధ్ రెడ్డి 4

మద్యం వ్యాపారుల నుంచి కమీషన్లు తీసుకుని పెద్దలకు సింహభాగం పంచగా మిగిలే అరకొరతో రాజ్ కసిరెడ్డి సంతృప్తి చెందలేదు. సొంత బ్రాండ్ మద్యం తయారీ, సరఫరా చేస్తే భారీగా డబ్బులు మిగుల్చుకోవచ్చని వైసీపీ మాజీ ఎంపీ విజయసాయి రెడ్డికి ఆయన సలహా ఇచ్చారు. పెట్టుబడి కోసం డబ్బులు ఇప్పిస్తే వాటా ఇస్తానని చెప్పడంతో... అరబిందో శరత్ చంద్రారెడ్డితో సాయిరెడ్డి భారీగా అప్పు ఇప్పించారు. దీంతోనే కసిరెడ్డి ఆదాన్ డిస్టిలరీస్ ద్వారా లిక్కర్ తయారీ వ్యాపారం మొదలు పెట్టారు. అందులో తన తోడల్లుడు ముప్పిడి అవినాశ్‌రెడ్డి తమ్ముడు అనిరుధ్ రెడ్డిని డైరెక్టర్‌గా రాజ్ నియమించారు. ప్రతినెలా వాటాలు పంచే విషయంలో తేడాలు రావడంతో ఆదాన్ వ్యవహారం రచ్చకెక్కింది. ఈ గొడవలు తాను భరించలేనంటూ అనిరుధ్ రెడ్డి ఆదాన్ డైరెక్టర్ పదవికి రాజీనామా చేసి విదేశాలకు వెళ్లిపోయారు.



బొల్లారం శివకుమార్ 5

ఆదాన్ డిస్టిలరీస్ డైరెక్టర్ బాధ్యతల నుంచి అనిరుధ్ రెడ్డి తప్పుకోవడంతో... బొల్లారం శివకుమార్‌ను నియమించారు. ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. సిట్ దర్యాప్తు మొదలు పెట్టగానే ఆయన విదేశాలకు వెళ్లిపోయారు. డిస్టిలరీస్ యజమానుల నుంచి పలుమార్లు డబ్బులు వసూలు చేయడంతోపాటు... ఆదాన్ వాటా కింద అందించిన సొమ్మును తరలించినట్లు 'సిట్' గుర్తించింది.



ముప్పిడి అవినాశ్ రెడ్డి 6

రాజ్ కసిరెడ్డి నడిపిస్తున్న ఆదాన్ డిస్టిలరీస్ వ్యవహారాలన్నీ... ఆయన తోడల్లుడు ముప్పిడి అవినాశ్‌రెడ్డి చూసేవారు. తనను కసిరెడ్డి మోసం చేస్తున్నారని విజయసాయిరెడ్డి తాడేపల్లి పెద్దలకు ఫిర్యాదు చేయగా... 'సాయన్నను చూసుకోండి' అంటూ కసిరెడ్డికి ఆదేశాలొచ్చాయి. 'ఇందులో ఆయన చేసిందేమీ లేదు. ఇప్పుడు ఇస్తున్నది కూడా ఎక్కువే' అని కసిరెడ్డి తక్కువ చేసి మాట్లాడటంతో సాయిరెడ్డి రచ్చ చేశారు. ఆదాన్ పేరు మార్కెట్లో చెడిపోవడంతో... ఎస్ఎన్‌జే యజమాని గోవాలో రిజిస్టర్ చేయించిన లీలా డిస్టిలరీస్‌ను వాసుదేవరెడ్డి ద్వారా బెదిరించి స్వాధీనం చేసుకున్నారు. ఆదాన్‌లో ఉత్పత్తయ్యే మద్యాన్ని లీలా ద్వారా చేయించి ఆర్డర్లు అటు మళ్లించారు.



సైమన్ ప్రసన్ 7

రాజ్ కసిరెడ్డికి సన్నిహితుల్లో ఒకరైన సైమన్ ఐఐటీ గ్రాడ్యుయేట్. మొదట్లో డిస్టిలరీస్ నుంచి కమీషన్లు వసూలు చేసే బృందంలో ఉండేవారు. రాజ్ కసిరెడ్డి సూచనల మేరకు ఆ డబ్బును చేర్చాల్సిన చోటుకు చేర్చేవారు. 'ఫలానా వైసీపీ నేతకు ఇంత ఇవ్వాలి. సిద్ధం సభకు ఇంత పంపండి' అని రాజ్ కసిరెడ్డి నుంచి కిరణ్ కుమార్ రెడ్డి, బూనేటి చాణక్యకు ఆదేశాలు అందేవి. వీరిద్దరూ సైమన్ ద్వారా ఆ ఆదేశాలను అమలు చేసేవారు. 2023 డిసెంబరు నుంచి చెవిరెడ్డి అనుచరులు బాలాజీ, నవీన్, గిరి, మదన్‌కు పద్దెనిమిదిసార్లు డబ్బుల బాక్సులు కార్లలో పెట్టి పంపించినట్లు సిట్ ఆధారాలు సేకరించింది. సైమన్ మూడుసార్లు నేరుగా తాడేపల్లికి వచ్చి చెవిరెడ్డి కోసం డబ్బులు ఇచ్చి వెళ్లినట్లు కూడా తెలుస్తోంది.



ఒంగోలు ప్రద్యుమ్న 8

హైదరాబాద్‌లో ఉంటున్న వెంకటేష్ నాయుడు(ఏ-34) లారీలో విజయవాడకు తరలిస్తున్న రూ.8.37కోట్లు 2024 మే 8న రాష్ట్ర సరిహద్దుల్లోని చిల్లకల్లు వద్ద పోలీసులకు పట్టుబడింది. ఆ సొమ్ము తనదేనని, వ్యవసాయం ద్వారా వచ్చిన ఆదాయం అంటూ కోర్టులో ప్రద్యుమ్న పిటిషన్ వేశారు. నిర్మాణ రంగంలో ఉన్న తాను కూలీలకు ఇచ్చేందుకు విజయవాడకు ఆ డబ్బు తరలిస్తున్నట్లు పిటిషన్లో పేర్కొన్నారు. సిట్ అధికారులు ఆరా తీయగా... వ్యవసాయం ద్వారా ఎనిమిది కోట్లకు పైగా ఆదాయం వచ్చేంత భూమి ప్రద్యుమ్నకు లేదని, ఆయన కన్‌స్ట్రక్షన్ కంపెనీకి కూడా అంత డబ్బు కూలీలకు పంచే శక్తి లేదని తేలింది. సిట్ అధికారులు ఆరా తీస్తున్న విషయాన్ని తెలుసుకున్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి... తనకు ముప్పు రాకుండా ప్రద్యుమ్నను పది రోజుల క్రితం దుబాయ్‌కి పంపించినట్లు సిట్ అధికారులు ఆధారాలు సేకరించారు.

హెడ్‌కానిస్టేబుల్ మదన్ ఆరోపణలపై

పోలీసు శాఖ విచారణ

- సిట్ అధికారులు కొట్టారని డీజీపీకి ఆయన లేఖ
- దీని వెనుక కుట్ర దాగుందన్న అధికారులు
- నిగ్గు తేల్చే బాధ్యత ఐజీ ఆకే రవికృష్ణకు

అమరావతి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో జరిగిన వేల కోట్ల మద్యం కుంభకోణాన్ని వెలికి తీస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) అధికారులు తనను విచారణకు పిలిచి తీవ్రంగా కొట్టారంటూ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మదన్ రెడ్డి చేసిన ఆరోపణలపై పోలీసు శాఖ విచారణకు ఆదేశించింది. సీనియర్ ఐపీఎస్ అధికారి, ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణకు నిజాలు నిగ్గు తేల్చే బాధ్యతను డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా అప్పగించినట్లు తెలిసింది. మరోవైపు ఆరోపణలు ఎదుర్కొంటున్న సిట్ అధికారులు.. ఇది తమపై జరుగుతున్న తప్పుడు ప్రచారమని, దర్యాప్తునకు ఆటంకం కలిగించే కుట్రని, నిజాలు వెలికితీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి లేఖ రాశారు. ఈ నెల 10, 11న విచారణకు వచ్చిన మదన్ రెడ్డి తనకు ఛాతీలో నొప్పి వస్తోందంటూ వెళ్లిపోయారు. మరుసటి రోజు(12న) విచారణకు రాకుండా ఆసుపత్రిలో చేరి 13న డిశ్చార్జి అయ్యారు. తనను సిట్ అధికారులు తీవ్రంగా కొట్టారని, విచారణకు వెళ్లలేనంటూ డీజీపీకి మదన్‌రెడ్డి లేఖ రాశారు. అవాక్కైన సిట్ అధికారులు.. ఈ ఆరోపణల వెనుక కుట్ర దాగుందని, తాము 4సీసీ కెమెరాల మధ్యలో ప్రశ్నించామని, సీనియర్ ఐపీఎస్ అధికారితో విచారణ జరిపించి తమ తప్పు ఉంటే చర్యలు తీసుకోవాలని, లేకుంటే మదన్ రెడ్డిపై తీసుకోవాలని డీజీపీని కోరారు. ఇరువైపుల వినతులను పరిశీలించిన డీజీపీ గుప్తా ఈ వ్యవహారంలో నిజాలు నిగ్గు తేల్చాలంటూ ఐబీ లాంటి సంస్థల్లో పనిచేసిన ఐజీ ర్యాంకు అధికారి ఆకే రవికృష్ణకు బాధ్యత అప్పగించారు.

మీరెవరో నాకు తెలియాలి..!

- మదన్ రాసిన లేఖలో ఉన్న అధికారుల పేర్లు అడిగి అతి చేసిన చెవిరెడ్డి

విజయవాడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): 'శంకర్ అంటే ఎవరు.. సుధాకర్ అంటే నువ్వేనా.. అమీద్ ఎక్కడ..' -ఇదేదో అధికారి సిబ్బందికి వేసిన ప్రశ్నలు కావు. మద్యం కేసులో సిట్ విచారణకు హాజరైన చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అధికారులను నిలదీసిన వైనమిది. వారి అంతు చూస్తానన్నట్లుగా హావభావాలు ప్రదర్శించినట్లు సమాచారం. బెంగళూరు విమానాశ్రయంలో అరెస్టు చేసి మంగళవారం రాత్రి బెజవాడ సిట్ కార్యాలయానికి తీసుకొచ్చిన అధికారులు ఆయన్ను అక్కడ విచారించిన సంగతి తెలిసిందే. కార్యాలయంలోకి అడుగు పెట్టగానే చెవిరెడ్డి అధికారుల వంక చూసి వారి పేర్లు అడిగారు. సిట్ విచారణలో పది మంది అధికారులు తనను చిత్రహింసలు పెట్టారని ఆరోపిస్తూ ఆయన గన్‌మన్ మదన్‌రెడ్డి కొద్దిరోజుల క్రితం డీజీపీకి లేఖ రాసిన సంగతి తెలిసిందే. అందులో ఇన్‌స్పెక్టర్ శంకర్, ఎస్ఐ అమీద్, సుధాకర్ పేర్లు రాశారు. ఆ చాంబర్‌లో ఇన్‌స్పెక్టర్ శంకర్ కూడా ఉండడంతో.. చెవిరెడ్డికి, ఆయనకు మధ్య కొద్దిసేపు వాగ్వివాదం జరిగినట్టు విశ్వసనీయంగా తెలిసింది. మదన్‌పై ఎవరూ చేయి చేసుకోలేదని, తానీ మాటలను ఆత్మసాక్షిగా చెబుతున్నానని.. అలాగే మదన్ కూడా తాము కొట్టామని ఆత్మసాక్షిగా చెప్పగలడా అని శంకర్ ప్రశ్నించడంతో చెవిరెడ్డి నోరెత్తలేదని సమాచారం.

చెవిరెడ్డిని కస్టడీకి ఇవ్వండి

- ఏసీబీ కోర్టులో సిట్ పిటిషన్

మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి రిమాండ్‌పై జైల్లో ఉన్న చెవిరెడ్డిని, ఆయన స్నేహితుడు చెరుకూరి వెంకటేశ్‌నాయుడిని తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ సిట్ అధికారులు విజయవాడ ఏసీబీ కోర్టులో గురువారం పిటిషన్ దాఖలు చేశారు. హైదరాబాద్ నుంచి మద్యం డబ్బును తరలించిన వారిలో కొంత మంది ప్రస్తుతం పరారీలో ఉన్నారని, వారి పాత్రపై ఆరా తీయడానికి ఈ ఇద్దరినీ ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.



51 మంది అమరావతి రైతులపై రెండు కేసుల ఉపసంహరణ

రాష్ట్ర హోం శాఖ ఉత్తర్వులు

విజయవాడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో అమరావతి రైతులపై నమోదు చేసిన రెండు కేసులను ప్రభుత్వం ఎత్తివేసింది. జగన్ హయాంలో వార్షిక కౌలు చెల్లించకపోవడంతో అమరావతి రైతులు విజయవాడ గవర్నరుపేటలోని సీఆర్డీఏ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. దీనిపై గవర్నర్‌పేట పోలీసులు 44 మందిపై ఐపీసీ 143, 188, 341 రెడ్ విత్ 149 సెక్షన్ల కింద కేసు (క్రైం నంబరు 184/2020) నమోదు చేశారు. అలాగే 2023లో ఏడుగురు రైతులపై ఐపీసీ 143, 188, 341, 290 రెడ్ విత్ 149 సెక్షన్ల కింద గవర్నర్‌పేట పోలీసులు కేసు పెట్టారు. వీరిపై ప్రాసిక్యూషన్‌ను ఉపసంహరించుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ అభ్యర్థించడంతో ఈ రెండు కేసుల్లో 51 మందిపై ప్రాసిక్యూషన్‌ను ఉపసంహరిస్తూ రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ గురువారం వేర్వేరుగా ఉత్తర్వులు జారీచేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.